ఆంధ్ర ప్రదేశ్

భారత స్వాతంత్ర్య
రజతోత్సవ సంచిక

ఆగస్టు 1972
వెల 50 పై.



ఆంధ్రప్రదేశ్ గురించి

* **1971** జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో **7.93** శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో **9** శాతానికి సమానం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం **2.75,109** చ. కి. మీటర్లు.

* **1971** లో సేకరించిన లెక్కల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ జనాభా **4,33,94,951** మంది. దేశజనాభా **54,69,55,945**.

* **1971** లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు **24.56** శాతం మంది వున్నారు. **1961** లో **21.19** శాతం. భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం **1971** లో **29.35. 1961**లో **24.03** శాతం.

* మన రాష్ట్రంలో జనాభా సాంద్రత చ. కి. మీ. **1**కి **157** మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ. కి. మీ. **1**కి, **362.** అన్ని జిల్లాల కంటే యిది ఎక్కువ. అదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత **79** మంది. అన్నింటి కంటే యిది తక్కువ.

* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (**1960-61** నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. **281**లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. **306**లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. **333** ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటు ఆదాయం రూ. **430** లకు పెరుగుతుంది.

* రాష్ట్రంలో **1,000** అడుగుల లోతు మేరలో సుమారు **1,000** మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. **2,000** అడుగుల లోతు మేరలో **1,320** మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

* భారతదేశంలో, బారైట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దే అగ్రస్థానం. దేశంలో ఉత్పత్తి అయ్యే బారైట్స్‌లో **90** శాతం మొదలు **95** శాతం వరకు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది.

* అభ్రకం ఉత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాతి స్థానం ఆంధ్రప్రదేశ్ ది.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి : 16 | ఆగస్టు, 1972 | సంచిక : 10
శ్రావణ – భాద్రపద, 1894

ప్రధాన సంపాదకులు : పెండ్యాల వామనరావు
సంపాదకులు : కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

పేజీ

దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

భారత స్వాతంత్ర్య రజతోత్సవ ప్రత్యేక సంచిక

సాలు చందా ఆరు రూపాయలు

వెల : 50 పైసలు

రిజిస్టర్డు నెం : 133

ముఖచిత్రం : శతజయంతి శ్రద్ధాంజలి

మూడవ అట్ట :
అసంపూర్తి కల్యాణమండపం, లేపాక్షి

చివరి అట్ట : ఎత్తిపోతల జలపాతం

ముందుకు.. మునుముందుకు....

భారత స్వాతంత్ర్య రజతోత్సవాలు మన దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం. ఈ సందర్భంగా. 1947 ఆగస్టు 15వ తేదీన దేశం స్వాతంత్ర్యం పొందిన నాటి నుండి నేటి వరకు మనం వివిధ రంగాలలో జరిపిన కృషినీ, సాధించిన విజయాలనూ సమీక్షించుకునే సదవకాశం మనకు కలిగింది. కాల ప్రమాణానికి సైతం అందని గతం గల భారత జాతి విస్తృత చరిత్రలో పాతిక సంవత్సరాల వ్యవధి అతి స్వల్పమే అయినప్పటికీ, మన ఉన్నత ఆశయాలు. ఆదర్శాలు, వాటి ఆచరణ శీలత, విధానాల ధోరణి ఏ మార్గంలో పయనిస్తున్నాయో సూచించడానికి యీ వ్యవధి చాలు. ప్రజాస్వామ్యము, వ్యక్తి స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, ప్రణాళికాబద్ధమైన ప్రజాస్వామ్య ప్రగతి, అగ్ర రాజ్య కూటాల పట్ల అలీన విధానం, మత రహిత వ్యవస్థ, సోషలిజం, జాతీయ సమైక్యత, ప్రపంచ శాంతి అనే ఆదర్శాలకు భారత దేశం కట్టుబడి వున్నదని మనం లోకానికి చాటి చెప్పగలిగాము. గత కొన్ని సంవత్సరాలుగా, వివిధ రంగాలలో మన ప్రధాన మంత్రి తీసుకున్న అనేక చర్యల వల్ల భారత దేశపు బహుముఖ సమస్యలను పరిష్కరించుకోవడంలో, ప్రజలలో సమైక్యత, సమిష్టి కృషి చైతన్యం వృద్ధి పొందాయి. భారత దేశం ప్రపంచ ప్రజాభిప్రాయం ముందు తన వ్యక్తిత్వం నిలబెట్టుకోడానికి అవసరమైన జాతీయ సుస్థిరత్వం ఏర్పడింది. ఏ విధమైన స్వార్ధంలేకుండా సైనిక నియంతృత్వపు రాక్షస పాలన నుండి బంగ్లాదేశ్ ప్రజలకు విముక్తి కలిగించడానికి జోక్యం చేసుకున్న సంఘటన ప్రపంచ చరిత్రలోనే అపూర్వం.

దారిద్ర్య నిర్మూలన, సాంఘిక–ఆర్థిక సమానతా సాధన, బలహీన వర్గాల ప్రజల ఉద్ధరణ మన జాతీయ లక్ష్యాలు. ఆ మార్గంలో పయనిస్తూ నేడు మన దేశం ఆర్థిక రంగంలో అపూర్వ విజయ సాధన సౌధ ప్రాంగణంలో అడుగు పెట్టింది.


కొత్తగా ఏర్పడిన సుస్థిరతతో, ఆత్మ విశ్వాసంతో యీ నాడు దేశం పురోగమిస్తున్నది గత సాధారణ ఎన్నికల్లో మళ్లీ ప్రజల విశ్వాసాన్ని పొందిన శ్రీ పి. వి నరసింహారావుగారి నాయకత్వంలో నూతన మంత్రి వర్గం ఏర్పడి. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోకూడా, దేశంలో వెల్లివిరిసిన ఆ సుస్థిరత, ఆ విశ్వాసం సుప్రతిష్ఠిత మయ్యాయి. నిర్ణీత కాల వ్యవధి కార్యక్రమాల ద్వారా సంఘంలో పేద ప్రజలు తమ స్థితిగతులను మెరుగు పరచుకోవడంలో ఒక నూతన విశ్వాసాన్ని ఏర్పరచుకోడానికి వీలుగా వారి తక్షణ సమస్యలను కొత్త దృక్పథంతో పరిశీలించి, పరిష్కరించడానికీ. మౌలికమైన భూసంస్కరణలను అమలు పరచడానికీ ముఖ్యమంత్రి ప్రతినపూని పని చేస్తున్నారు. ప్రధాని ఆశీస్సులు పుష్కలంగాగల మన రాష్ట్రంలో, ఆమె తీసుకున్న చొరవ, చూపుతున్న ఆసక్తి వల్ల, కొన్ని గడ్డు సమస్యలను ప్రజలకు సంతృప్తికరంగా పరిష్కరించుకో గలిగాము. వివిధ ప్రాంతాల ప్రజల మధ్య సదవగాహన, స్నేహ వాతావరణంతో పటిష్ఠమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందింది. అన్ని ప్రాంతాలకు న్యాయం చేకూర్చబడుతుందనీ, ఏ విధంగానూ ఏ ప్రాంతాన్నీ పక్షపాత దృష్టితో చూడడం జరగదనీ ప్రజలకు నమ్మకం కలిగించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఐకమత్యంతో, దీక్షతో రాష్ట్ర సర్వతోముఖ వికాసానికి తమ శక్తి యుక్తులను కేంద్రీకరించి కృషి చేయడానికి వీలుగా–నాలుగున్నర కోట్ల తెలుగు ప్రజల ప్రగాఢ వాంఛ అయిన సమైక్యతా లక్ష్యం సిద్ధించింది.

'ఆంధ్రప్రదేశ్ జనకుడు' అని ప్రధాని అభివర్ణించిన శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారి శతజయంతి సంవత్సరమూ, మన స్వాతంత్ర్య రజతోత్సవాలు కలసి రావడం హర్షదాయమైన యాదృచ్ఛిక సంఘటన. ఆయన ముఖ్య మంత్రిత్వంలో రాష్ట్ర ప్రగతికి శుభారంభం జరిగింది. ఆయన చూపిన చైతన్య పథంలో తిరిగి వేగాన్ని అందుకుని మన రాష్ట్రం శీఘ్రంగా పురోగమించగలదనడంలో ఎలాటి సందేహమూ లేదు.

—పి. వి. ఆర్.

భూసంస్కరణల సమస్య – ముఖ్యమంత్రి

ఇటీవల మాకొక మిత్రుడు ఒక చాల చక్కని మాటచెప్పాడు. తమిళంలో ఒక రామాయణం వుందట. ఆ రామాయణం రచించిన కవి, ఆ మహానుభావుడు ఒక చక్కని మాట రాశాడట. దశరథుడు ఎంత మంచి రాజో, తన రాజ్యాన్ని ఎంత చక్కగా పరిపాలించాడో, ప్రజలను ఎంత చక్కగా చూచుకొనేవాడో వర్ణిస్తూ ఆయన ఏమన్నాడంటే ఒక చిన్న రైతు తన భూమిని ఎంత బాగా రక్షించుకొంటాడో, చూసుకొంటాడో అట్లాగే దశరథ మహారాజు తన రాజ్యాన్ని చూచుకొనేవాడు అని ఒక ఉపమానం ఇచ్చాడు. అందుకని భూసంస్కరణలకు బీజారోపణ రామాయణ కాలంలోనే జరిగిందని చెప్పడానికి నేను సాహసిస్తున్నాను. ఒక చిన్న రైతు వ్యక్తిగతంగా శ్రద్ధాసక్తులతో తన చిన్న కమతాన్ని ఎంతజాగ్రత్తగా చూచుకోవడానికివీలవుతుంతో జమీందార్లకు, పెద్ద పెద్ద భూస్వాములకు అది వీలుకాదు అనే విషయం అందరికీ అనుభవైకవేద్యం.



ప్రభుత్వంపైన ఒత్తిడి

నేను ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ఆఫీసులోనికి రాగానే మిత్రులెవరో వస్తారు. వచ్చి ఒక దరఖాస్తు ఇస్తారు. ఫలానా కలెక్టరు, ఆర్. డి. ఓ. గారు చేసినటువంటిది బాగాలేదు, న్యాయం చేయలేదు, కాబట్టి మీరు అరికార్డులన్నీ తెప్పించి న్యాయం చేయవలసింది అని ఒక దరఖాస్తులో వుంటుంది. దరఖాస్తు మీద నేను వెంటనే పరిశీలించవలసింది అని రాసిపెట్టి సంతకం పెట్టేలోగానే ఆ మిత్రుడు ఏమంటాడంటే దాని క్రింద ఇంకొక దరఖాస్తు ఉందండి అని అంటాడు. అదేమిటంటే ''స్టే'' అంటాడు. ఇదెందుకయ్యా అంటే, దానికెంతకాలం పడుతుందో ఏమిటో ఆ కలెక్టరు నుంచి కాగితాలు రావడానికి. మధ్యన రెవిన్యూ బోర్డు అంటూ ఒకటి వుంది. ఈ రిపోర్టులన్నీ మీరు తెప్పించేలోగా పుణ్యకాలం అయిపోతుంది. తరువాత మీరు ఏమి చేసినా లాభం లేదండి, అందుకని ఇప్పుడు మాత్రం "స్టే'' ఆర్డరు ఇవ్వండి అని చెబుతాడు. తరువాత జరిగే న్యాయంకన్నా ఇప్పుడు దొరికే''స్టే'' మీద ఇప్పుడు ఎక్కువ ప్రాముఖ్యం వుంటుంది ఆయన మనసులో. మనందరికి తెలిసినటువంటి విషయమే. ఎందుకొస్తారు మంత్రులదగ్గరికి అంటే "స్టే'' కొరకు వస్తున్నామని చెబుతారు. మేము చేసినటువంటి ఆర్డినెన్సు యిటువంటి ''స్టే'' ఆర్డరు అని మనవి చేస్తున్నాను.

భూకమతాల పరిమితి

భూకమతాలు ఎంతెంతవుండాలి? పరిమితి ఎంత వుండాలి? ఎంత ఆదాయం అందులో వచ్చేటువంటిదిగా వుండాలి? దానిపైన మనం ఏయే ఆంక్షలు విధించాలి? ఇంకా ఏమేమి నియమావళి కావాలి? యావదాంధ్రదేశంలో ఈ నాడు ఇంటింటా, ఊరూరా, భూమి ఉన్నవారికి, లేనివారికి, కొద్దిగా ఉన్నవారికి, గొప్పగా ఉన్నవారికి అందరికి ఏదో ఒకరకమైన ఉత్సాహాన్ని, ఒక విధమైన ఆందోళనను రెండింటినీ కలిగిస్తున్న ఈ సమస్య, ఏదో ముఖ్య మంత్రి తన యింట్లో కూర్చుని, తన ఆఫీసులో కూర్చుని, తలుపులు బిగించుకొని తయారు చేసినటువంటి చట్టంవల్ల తేలిపోయేది కాదు. వేలాది లక్షలాది జనానీకాన్ని యింత ఉత్సాహవంతులను చేసినటువంటిది, ఇందరు ఇంటింటా చర్చించుకుంటున్నటువంటి సమస్యపైన ఒక చట్టం చేయాలంటే దానికి ఒక రాష్ట్రవ్యాప్తమయినటువంటి ''డయలాగ్'' అవసరం, ఒక చర్చ అవసరం.

కాలయాపనవల్ల ప్రమాదం

కాని ఇందులో ఒక బాధవుంది మనమందరమూ చర్చించుకుంటూ వుంటే, జాగ్రత్తపడేవాళ్లు జాగ్రత్తపడుతూవున్నారు. పంజాబులో అక్కడి ముఖ్యమంత్రిగారు ఒకమాట చెప్పినారు మొన్న. ఏమంటే అంతా వేరే వేరే పేర్లపైన భూములన్నీ వ్రాసుకుంటే, పంపిణీ ఎన్క్వయిరీ చేయడానికిపోతే కొన్ని పేర్లు దొరికినాయట. ఆ పేర్లుగల వ్యక్తులు ఆ వూరిలోనే లేరు. అరే! ఈ పేరుగలవారు పక్కవూరిలో ఏమైనా వున్నారా? అని బాగా తరచి తరచి పరిశీలిస్తే చివరకు తేలిందేమంటే, ఆ యజమానిగారి పెంపుడు కుక్క పేరు "కల్లూ" అని వుంటే ఆ కల్లూ పేరు వ్రాశారన్న మాట! మనుషుల పట్టాలు పోయినాయి కాని పిల్లులకు, కుక్కలకు పట్టాదారి అనేటువంటిది కల్పించి ఈ విధంగా పంచు

కోవడం జరిగింది. భారతదేశం అంతటా జరిగింది. ఆంధ్ర దేశంలో కూడా జరిగింది. అందులో ఏలాటి సందేహమూ లేదు.

ఇదివరకు జరిగినదానిని ఏమిచేయాలో దాన్ని ఎలా రద్దుచేయడమో అనేదానిని గురించి చట్టంలో వేసుకున్నాముగాని ఈ చట్టాన్ని గురించి మనం ఆలోచించినకొద్దీ ఇదిగండిపెట్టుకొని పోతూవుంటే, మనం గండిబాగుచేసేలోపల చెరువులో నీరు లేకుండా పోతుంది. అందుకని మనం ఏం చేయాలంటే గండిపోయిన తర్వాత, రింగ్ బండ్ అని మొదలేస్తాం. దీన్నే పురికట్ట అంటారు తెలంగాణాలో. కొద్దినీళ్లయినా నిలిపి ఒక పంటయినా దక్కించుకోవడానికి గండిపోతే. మొట్టమొదట రింగ్‌బండ్ వేస్తారు. దాంతో కొంత నీరైనా ఆగుతుంది. కొంతభూమి ఆయినా ఆగాలని వేసినటువంటి పురికట్ట వంటిది ఈ ఆర్డినెన్సు. ఇది అసలు ముఖ్యంగా తరువాత జరుగబోయేటువంటి దానికి మనం ఇచ్చినటువంటి సపోర్టు అని చెబుతున్నాను మీరు ఎన్ని చట్టాలు చేస్తే మాత్రం ఏమిటి? చట్టాలు చేసే లోపల మరి వీళ్లంతా ఎక్కడిదక్కడ సర్దుబాటు చేసుకున్న తర్వాత మనం చట్టం అమలు చేయడానికి ఏమీ దొరక్కపోతే ఎలా?

1961లో మొట్టమొదటిసారిగా భూ కమతాల మీద, గరిష్ట పరిమితి చట్టం వచ్చిననాడు ఎవ్వరికీ చీమకుట్టినట్టుగా కూడా లేదు. అప్పుడు ఆంధ్రప్రదేశంలో సభలు లేవు, సమావేశాలు లేవు చర్చావేదికలు లేవు. ఏమీ లేవు. చల్లగా ఏదోచేసేశారు. అందరూ మరచిపోయారు. దాన్నిగురించి పట్టించుకున్న వాళ్ళులేరు.

ఇప్పుడే ఎవరో అడిగారు, మీకు ఎంతమిగులు భూమి వస్తుంది అని. ఈ ఆర్డినెన్స్ గనక రాకపోతే వెంటనే జవాబు చెప్పివుండే వాణ్ణి, సున్నా అని. ఆర్డినెన్స్ వచ్చింది. కాబట్టి సందేహిస్తున్నాను ఎంతభూమి వస్తుందో లెక్కలు వేసి చెప్పమని అధికారులకు చెప్పినాము. వారు తప్పకుండా చెబుతారు. బహుశా ఏ రాష్ట్రములోనైనా, నీ మిగులు భూమి ఎంత అంటే గుండెమీద చెయ్యివేసుకొని ఖచ్చితంగా చెప్పగలిగిన ముఖ్యమంత్రి వుంటే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రమే చెప్పగలుగుతాడు.

> ఇంతవరకు పలుకుబడిగల భూస్వాములు
> ఎక్కువగా పొందుతున్న పరపతి సౌకర్యాలు
> యికముందు సన్నకారు రైతులకు ఎక్కువగా లభిస్తాయి

అధికారుల కార్యదీక్షా తత్పరత

ఈరోజు అధికారులలో ముఖ్యంగా పై అధికారులలో ఎన్నడూ కనీ వినీ ఎరుగనంత ఉత్సాహం కనపడుతున్నది. మేము చూచిరమ్మంటే వాళ్లు కాల్చివచ్చేట్టు వున్నారు. మే 2వ తారీఖున ఏ యే సబ్ రిజిస్ట్రార్లు ఆఫీసులు తెరిచి తతంగాలు చేశారో, వాటిని వెంటనే అరికట్టేసి ఐదుగురు సబ్ రిజిస్ట్రార్లను తెల్లవారేసరికి సస్పెండు చేయడం జరిగింది. నేను చెప్పిందికాదు, యీ పని నా అనుమతితో చేసిందికాదు యీ పని ఇన్స్పెక్టరు జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ చేసింది. ఆ తరువాత ఇవన్నీ ఆగిపోయినాయి.

ప్రభుత్వ పంపిణీ భూముల అన్యాక్రాంతం రద్దు

అయితే గ్రామస్థాయికి వెళ్లినపుడు, తాలుకాస్థాయికి వెళ్లినపుడు ఈ పరిస్థితి మనం అనుకున్నంతగా నూటికి నూరుపాళ్లు, లేకపోవచ్చు. ఆ లోపాలను సవరించడానికి అధికారులు అధికారేతరులు కలిసి చెయ్యవలసినటువంటి పనిని చేసి లక్ష్యాన్ని సాధిస్తారనే విషయంలో నాకేలాంటి సందేహములేదు.

21 లక్షల యెకరాల భూమి మనం పంచిపెట్టామని ప్రభుత్వ లెక్కల ద్వారా తెలుస్తున్నది. చాలమంది చెబుతున్నారు, ఈ భూములు మాత్రం మీరిచ్చిన వాళ్ల చేతిలో లేవు అని.

నేను మీకు మనవి చేసేదే మంటే, ఆ భూములన్నీ మళ్లీ ప్రభుత్వ వశం అయ్యేటువంటి భూములే. ఇచ్చినటువంటి మనిషికి దక్కనివి కొన్నటువంటి మనిషికి కూడా దక్కవు అసైన్‌మెంటు రూల్సులోనేవుంది, ఇది అన్యాక్రాంతం చేయడానికి వీలులేదు అని అన్యాక్రాంతం చేసినట్లయితే అవి మళ్లీ ప్రభుత్వానికి చెందుతవి. మూడు నాలుగు నెలల్లో మళ్లీ ఈ భూమి ప్రభుత్వానికి తిరిగి రాబోతున్నది. మళ్లీ దాన్ని కూడా సరియైనట్టి విధంలో పంచిపెట్టడం జరుగుతుంది.

ఎవరినో నష్టపెట్టడానికి, ఎవరిమీదనో కక్ష తీసుకోవడానికి చేసేటువంటి కార్యక్రమం కాదిది. ఇది నవసమాజ నిర్మాణానికి దారితీసేటువంటి కార్యక్రమం అని ఈనాడు అందరూ గుర్తించాలి.

నవసమాజ నిర్మాణానికి బీజారోపణ

గ్రామాల్లో ఈనాడు వున్నటువంటి వ్యత్యాసాలు మనకు తెలియనివి కావు. ఈ రోజు భూమి ఎవరికి ఎంత ఎక్కువగా ఉంది అనే దానిమీద ఆ మనిషికి ఎంతసన్మానం. ఎంత గౌరవము అనేది ఆధారపడి వుంది. 500 ఎకరాల పట్టాదారు చాల పెద్దమనిషి, అనేటువంటి ఒక ఆలోచన ఈరోజు మన సంఘంలో ఖచ్చితంగా వుంది. నాలుగు ఎకరాల వాడు ఎంతబాగా పండించినప్పటికీ, కృషి పండితుని తాతలాగ పండించినప్పటికీ వాణ్ణి మాత్రం అడిగేవాడు లేడు. 500 ఎకరాల పట్టాదారు అయితేచాలు. అతనికే బ్రహ్మాండమైన గౌరవము సమాజంలో వుంది. ఈ సంఘంలో మనం సమ సమాజం తీసుకొస్తాము, సమానత్వం తీసుకొస్తామని అన్నపుడు కనీసం మన దృష్టిలో ఎవడు పెద్ద, ఎవడు చిన్న అనే దాంట్లోనైనా సరియైన విలువలు వుండాలి. బాగా పండించినటువంటి చిన్నరైతునేమో మనం ఏమాత్రం చూడకుండా పెద్దవాణ్ణిమాత్రమే మనం గౌరవిస్తాం. కష్టపడేవానికి ఎందుకు గౌరవం లేదు అనే విషయం ఆలోచించుకోవచ్చు కదా !

మన స్తత్వాల మార్పు అవసరం

ఈనాడు మొట్టమొదట మన స్తత్వాలు మారవలసిన పరిస్థితి ఏర్పడింది ఎట్లా మారుతాయి ? పరిస్థితినిబట్టి మన స్తత్వం మారుతుంది. పరిస్థితి ఎట్లామారుతుంది అంటే, మనం మారిస్తే మారుతుంది. 500 ఎకరాల భూమి వున్నటువంటి మనిషి మన స్తత్వం ఆ 500 పోయి నలభైకో లేక ముప్పైకో దిగితే అంతే వుండదు. అది పదోవంతుకు దిగిపోతుంది. భూమి అంతా పదోవంతు అయితే ఆ మన స్తత్వం ఆ బిర్రు, ఆ గౌరవం, ఆ అహంకారం, పదోవంతుకు వస్తుంది ఆస్తి మీద ఆధారపడినటువంటి సంఘంలో ఏమవుతుందంటే, దానిని పట్టే విలువలన్నీ ఏడుతూ వుంటారు. దానిని పట్టే మన స్తత్వం కూడా తయారవుతుంది. దీన్ని లాగేస్తే, నవసమాజం అంటే ఏమిటో అతనికి తెలిసివస్తుంది ఇది రామరాజ్యం నుంచీ జరుగుతున్నటువంటి విషయం. ఈనాటి మాట కాదు.

ఆస్తిమీద ఆధారపడివున్నటువంటి సంఘంలో, ఆస్తిమాత్రమే అసలు విలువలకు కారణంగా వున్నటువంటి సంఘంలో దీనిపైన మనం ఆపరేషన్ చేయకపోతే, మరి విలువలుకూడ వున్నవి వున్నట్టే వుండిపోతాయి. విలువలు మారనిది అసలు నిజమైనటువంటి మార్పురాదు.

ఈనాడు ఒక చిన్నరైతు కొడుకు అంటే వాణ్ణి గురించినటువంటి ఆలోచన ఎవరికీ లేదు. పెద్దమనిషి కొడుకైతే, అతనికి అన్ని సౌకర్యాలు. ఇది న్యాయం కాదని మనవి చేస్తున్నాను. ఇది

> చిన్న భూకమతాలు వుంటే
> రైతులు ఎక్కువ శ్రద్ధగా పనిచేసి
> మంచి లాభాలు పొందవచ్చు
> జపాన్‌లో లాగా.
>
> —ప్రధాన మంత్రి

ప్రభుత్వంలో ఉండి మనవి చేస్తున్నాను, ఎవరినో విమర్శించేటువంటి విషయం కాదు. ఇది ఈనాడు నిజంగా మారవలసిన అవసరం వుంది.

స్వరాజ్యంలో శాసనోల్లంఘన సమాజానికి హాని

చట్టాలు చేసేదేమో శాసనసభ పని దానిని ఉల్లంఘించడం ప్రజల పని అయిపోయింది. ఈ మధ్య దళారీలెవరైతే వుంటారో, ఏ చట్టం ఎప్పుడుచేసినా, వారికి దాన్ని ఎట్లా ఉల్లంఘించాలి అనే ఆలోచనలేవుంటున్నాయి. అందుకనే ఇదికూడా మారాలి అని చెబుతున్నాను. చట్టం మీ కొరకు చేయడం జరుగుతున్నది. మీ కిష్టంలేనటువంటి చట్టంచేయాలని మీకు ప్రాతినిధ్యం వహించేటువంటి మేము ఎన్నడూ కోరడంలేదు. భూసంస్కరణ మా మేనిఫెస్టోలోవుంది. నాకు అదే భగవద్గీత, ఖురానూ, అందులో వున్నది చేయడానికి నేను ఇక్కడికి వచ్చాను. కాని దాంట్లో వున్నది తప్పించుకోవడానికి నేను ఇక్కడికి రాలేదు. నూరు ఆరైనా, ఆరు నూరైనా, నేను చేయాల్సింది చేసితీరుతాను.

"చారిటీ బిగిన్స్ ఎట్ హోం" అని ఒక సామెత వుంది. నన్నునేను ముందు సంస్కరించుకోవాలి. నేను రైతును గ్రామాన్నుంచి వచ్చేటువంటివాణ్ణి. నా శాసన సభ్యులంతా గ్రామాలనుంచి వచ్చేటువంటి వాళ్ళు చాలా కొద్దిమంది మాత్రమే పట్టణవాసులని మనవి చేస్తున్నాను. ఈ శాసనం చేస్తున్నామంటే ఇది ఎవరికో శిక్షవేయడం కాదు. భూ సంస్కరణలు అంటే మనం సగర్వంగా చేసుకొనేటువంటి ఒక కార్యక్రమం. భూ సంస్కరణలు మా దగ్గరినుంచి ప్రారంభించాలి. అంతేకాదు, మాలో ఎవరెవరికి భూమి పోతుందో మొట్టమొదట మేము డిక్లేర్ చేయబోతున్నాము ఈ సంఘంలో మార్పు నాయకత్వం వహించేవాళ్ళతో ప్రారంభమవుతుంది. ఊరికే ఓట్లు తెచ్చుకున్నందుకు కాదు నాయకత్వం. నిజంగా మార్గదర్శకత్వం చేసినవాడికే నాయకత్వం వస్తుంది అనే విషయాన్ని ఈ నాడు మనం ఋజువు చేయాల్సి వుంది.

ఈ భూకమతాల గరిష్ఠ పరిమితి చట్టం రావడం మూలాన ఒక కొత్త భూదానోద్యమం ఆరంభం కాబోతున్నది. షాద్‌నగర్‌లో

భూదాన కార్యకర్తలు ఇరవయ్యో ముప్పయ్యో గ్రామాలు తిరిగితే వాళ్లకు. "ఊరకనే, రేపు ఎలాగూ పోతున్నది. మీరు తీసుకొనండి" అని చెప్పి 1200 ఎకరాలు ఇచ్చినారట. నేనూ మనవి చేస్తున్నాను. నా దగ్గర రెండూ వున్నాయి. దానమిస్తే తీసుకొంటాను. మీ రివ్వకపోతే చట్టంద్వారా తీసుకొంటాను. ఈ రెండూ చేశనవును. కాబట్టి ఈ రోజు తప్పించుకోవడానికి వీలులేదని చెబుతున్నాను. ఎందుకు తప్పించుకోవాలంటున్నాను. ఈ సంస్కరణ రాబోతున్నది. ఇది ప్రజావాహిని కోరుతున్నది ప్రజామానసంలో ఇది వున్నది అని తెలిసిన తరువాత దీని నుంచి తప్పించుకోవడం అనేది సబబు కాదు. తప్పించుకోలేరు అని నాకు తెలుసు

1956 దన్నా క్రితం మన హిందూ సమాజంలో ఒక పురుషుడు ఎన్ని పెళ్లిళ్లు చేసుకున్నా కానీ వద్దనేవాళ్లు లేరు. ఆ నాడు అందరూ చేసుకోవడానికి వీలైంది. చేసుకున్నారు. 1956 తరువాత ఏక భార్యాత్వం వచ్చింది. తరువాత ఎవడూ చేసుకోవడంలేదే! ఎందుకంటే మన సమాజం వాస్తవంగా శాసనాన్ని శిరసావహించే సమాజం ఈ నాడు కాదు. మనుస్మృతి కాలంనుంచి ఈ నాటి వరకు ఎన్నిసార్లు చట్టాలు మారినాయో ప్రజలు ఆ మార్పులకు అనుగుణంగా తమ చర్యలు మార్చుకున్నారు దానికి ఎప్పుడుకూడా ఎదురు నిలువలేదు అందుచేతనే ఈ భారతీయ సంఘం ఈ

రేపు రాబోతున్నది ఒక నూతన శకము అని చెబుతున్నాను పశ్చిమ గోదావరి జిల్లాలో 'ఈ భూములు ఎలాగూపుండవు. మేము పరిశ్రమలు పెట్టదలచినాము. మాదగ్గర వున్నటువంటి మిగులు డబ్బు పరిశ్రమల్లో పెట్టుబడి పెడ్తాము. మాకు ఏ పరిశ్రమలు పెట్టాలో, ఏమి చెయ్యాలో చెప్పండి' అని అడుగుతున్నటువంటి రైతులు చాలా మంది వున్నారని నేను విన్నాను. నేను దీన్ని ఆహ్వానిస్తున్నాను. ఈ మార్పు నేను కూడా అనుకోనటువంటి మార్పు ఈ మార్పులు వచ్చినప్పుడు దాని వెంట అనుసంగంగా ఇది కూడా వస్తుందని నేను భావించ లేదు. కాని నా కన్నా చాలా ముందు ఆలోచించిన పెద్ద రైతులను నేను అభినందిస్తున్నాను.

వాళ్ళకు ప్రభుత్వం వీలైనంతవరకు సహాయం చేస్తుంది సాంకేతిక సహాయం చేస్తుంది ఏ పద్ధతిలో ఏ పరిశ్రమ పెటాలో వాళ్ళకు చెబుతుంది ఇందుకు ఈ నాడు పరిశ్రమల శాఖ వారు సిద్ధంగా వున్నారా లేరా అని ప్రశ్నించుకుంటే, లేరేమో అనిపిస్తుంది. "నెసెసిటీ ఈజ్ ది మదర్ ఆఫ్ ఇన్వెన్షన్" ఇవాళ తయారుగా లేనటువంటి పరిశ్రమలశాఖ 6 నెలల్లో తయారవుతుందనటానికి ఎలాటి సందేహమూ లేదు ఏ శాసనంతో ఈ గరిష్ఠ పరిమితి తెస్తున్నానో, ఏ శాసనంతో నేక మూరొం

భూసంస్కరణలు

భూకమతాల గరిష్ఠ పరిమితి నిర్ణయం కేవలం సాంఘిక సంస్కరణమాత్రమే కాదు, ఆర్థిక వ్యత్యాసాలను తొలగించడానికి, ఉత్పత్తి పెంచడానికి సాధనం కూడా.
— ముఖ్యమంత్రి

సంస్కృతి ఇంతకాలం నిలిచింది అని చెప్పి నేను అనుకుంటున్నాను. పరిస్థితిని అనుసరించి ఏదైతే మారదో ఆ సమాజం నిలవదు.

ఒక నూతన పారిశ్రామిక శకం

ఆంధ్ర దేశంలో ఈనాటి వరకు పారిశ్రామిక వాతావరణం రాకపోవడానికి ఏమిటి కారణం అని నేను అడుగుతున్నాను. భూస్వాములుగా వుండి ఎంత సేపటికీ భూమి పెంచుకోవాలనేటువంటి ఆలోచన. మీరు ఏం పండించినా ఎకరానికి 20 వేలు తెస్తారా 30 వేలు తెస్తారా? 1500 తేగలరు 2000 తేగలరు, అంతకన్నా చెయ్యలేరు కదా! కాని పారిశ్రామిక రంగంలో వున్నటువంటి అవకాశాలు ఉద్యోగావకాశాలు అనుకోండి, ఉత్పత్తి అవకాశాలు అనుకోండి, వ్యవసాయంలో ఎక్కడివి?

1961 లో వచ్చినటువంటిది సరిగా అమలు జరిగి వున్నట్లయితే ఈ పదేండ్లలో పారిశ్రామికంగా భారత దేశంలో ఇంత బలహీన దశలో మన రాష్ట్రం వుండేది కాదు అని చెప్పడానికి నా కెలాంటి సందేహం లేదు.

శాసనంతో ఈ డిపార్టుమెంటును శాసించబోతున్నాను. దీంట్లో గనుక మీరు విఫలమైతే నేను ఊరుకోను అని వాళ్ళకు చెప్పబోతున్నాను.

ప్రజా శ్రేయస్సుకే భూసంస్కరణలు

ఇప్పుడు పరిజాబాహుళ్యం యొక్క కాలం వచ్చింది 'పదుగురాడుమాట పాడియై ధర జెల్లు' అనేమాటవచ్చింది దానిని ఇప్పుడు చేసూవుంటే చేసాము అని సంకల్పిస్తే దానికెంత గంగ వెర్రిలెత్తి పోతున్నారో తెలియడంలేదు ఎందుకు బ్లడ్‌ప్రెషర్ పెంచుకుంటున్నారో తెలియడంలేదు. కొత్త విషయమేమీలేదు. భూములు ఎవ్వరికీ ఏమీ పోకపోతే, ఈ సంస్కరణలు ఎందుకు? చట్టం ఎందుకు? పోతుంది. భూమి ఖచ్చితంగా పోతుంది. పోవాలనే చేస్తున్నాము. పోవడము న్యాయసమ్మతము అని అనుకున్నాము గనుక పొయ్యేట్టుచేస్తున్నాము. కొండనంతా త్రవ్వి త్రవ్వి చివరకు చచ్చిపోయిన ఎలుకను అందులోనుంచితీస్తే ఏమిటి లాభం? భూమియొక్క న్యాయసమ్మతమైనటువంటి పంపిణీ ఎలా జరగాలో అలా జరిగి తీరాల్సిందే. ఇంకొక విధంగా జరగడానికి వీలు లేదు

భూమి ఎవరికీ పోదనేమాటకాదు. అందరికీ పోతుందనేమాట కాదు. పోయేవాళ్ళకు తప్పకుండా పోతుంది అందరికీ పోతుందని

పేచ్చేది పచ్చిబూటకమని చెబుతున్నాను. వట్టి అబద్ధమని చెబుతున్నాను. అందరికీ పోయేసమస్య లేనే లేదు. సన్నకారు రైతులు ఈనాడు బాధపడవలసిన అవసరంలేదు

బ్యాంకుల నుంచి రుణాలు

బ్యాంకులు డబ్బు ఇవ్వలేదంటున్నారు ఆర్డినెన్సువల్ల బ్యాంకులు ఇచ్చేటటువంటి అప్పులు ఇవ్వకుండా పోతున్నాయంటున్నారు. ఈ కారణంచేత అవాంతరము వచ్చిందని చెప్పినటువంటి బ్యాంకరు ఒక్కరు కూడా లేరు.

నాకు ఖచ్చితంగా తెలుసు. ఆర్డినెన్సులో, ఈ బ్యాంకులు కాని, ఇతర సంస్థలుకాని అప్పులు ఇవ్వడానికి, సన్నకారు రైతులకు అప్పులివ్వడానికి అవాంతరమైనటువంటి మాట ఒక్కటికూడాలేదు. ఎవరైనా చెప్పినట్లయితే అది పచ్చి అబద్ధమేకాని, అంతకన్నా ఏమీ లేదు. పరిహాసం కొరకు చెప్పేమాట అది.

ఈ బ్యాంకులకు కొంత టార్గెట్ ఇవ్వడం జరిగింది. ఈ నాలుగు నెలల్లో యిన్నిలక్షలు పంచిపెట్టావాలేదా? పంచిపెట్టకపోతే నీవు అసమర్థుడవు అనే పరిస్థితిలో పైనుంచి ఆర్డర్సువున్నాయి నాకు చాల సంతోషం. ఇప్పుడైనా, క్రిందివాళ్ళకు రుణాలు పంచిపెట్టే అవకాశం వుంటుంది. పైవాళ్ళకు ఇవ్వలేనటువంటి డబ్బు క్రింది వాళ్ళకు దొరకడానికి, సన్నకారు రైతులకు దొరకడానికి నా ఆర్డినెన్సువల్ల మొట్టమొదటి సారి అవకాశం వచ్చినదని మనవి చేస్తున్నాను.

యావద్భారత దేశంలో రిజర్వు బ్యాంకువారు చేసిన సర్వేకాని, ప్లానింగు కమీషనువారు చేసిన సర్వేకాని, ఇతర సంస్థల వాళ్ళు చేసిన సర్వేవల్ల కాని ఒకే ఒక విషయం సర్వేసర్వత్రా తేలిందేమంటే యిదివరకు అప్పులిచ్చేటటువంటి సంస్థలు ఎన్ని వున్నాయో, ఆ అన్ని సంస్థల ద్వారా యింతవరకు ఇవ్వబడినటువంటి అప్పు పైవాళ్ళకే దొరికింది. కాని, లేనివారికి చాల తక్కువ దొరికింది. దీనిని మార్చేదానికైనా, కనీసం ఒక సీజను వరకైనా మార్చడానికి, ఈ ఆర్డినెన్సువల్ల దోహదం జరిగితే నేను సంతోషిస్తాను. సన్నకారు రైతులు సంతోషించవలసినటువంటి విషయం.

ప్రజలలో నూతనోత్సాహం

ఈ రోజు బ్రహ్మాండమైనటువంటి ఉత్సాహం ప్రజల్లో కనబడుతున్నది ఈ ఉత్సాహం నిరుత్సాహంగా మారకుండా కావల్సినటువంటి చర్యలన్నీ సక్రమంగా సకాలంలో చేయవలసిన అవసరం వుంది ఈ రాష్ట్రంలో చివరి ఎకరం కూడా పంచిపెట్టడానికి, లేక మాకు మిగులు ఎంతవస్తుందో అంతా తీసుకొని దానిని వెంటనే ఎట్లా వినియోగించాలి అనే దాంట్లో చివరి చర్య డిసెంబరు ఆఖరులోగా తీసుకోవాలని ఒక నిర్ణయం చేసుకున్నాము. భూసంస్కరణలు పంపిణీ వగైరా కార్యక్రమాలు ఇంకా నిలిచి వుండడానికి వీలులేదు అని మేము ఒక సంకల్పము చేసుకున్నాము. ఇది మా కార్యక్రమం అని ఇందిరాగాంధీ గారికి కూడా చెప్పినాము.

రుణాలమీద మారిటోరియం

ఇప్పుడే మా అప్పుల మాట ఏమిటి అన్నారు. అప్పుల మీద మారిటోరియం అని చెప్పేశారు. మారిటోరియంలో దెబ్బ తినేదెవరంటే, మళ్ళీ ప్రజలే. ప్రజల డబ్బు పోతుంది ముఖ్యంగా బ్యాంకుల ద్వారా తీసుకున్నటువంటిది. అందుకని, అప్పుకు, ఆస్తికీ ఏమిచెయ్యాలి అనేది కూడా ఆలోచిస్తాము. బ్యాంకర్లు 'లా డిపార్టుమెంటు' రైతులతో ఆలోచించి ఏది న్యాయమో అది చేస్తాము. పాత అప్పులనీ తుడుచుకొని పోవడానికి వచ్చినటువంటి భూసంస్కరణలు కావు ఇవి.

ఆర్డినెన్సు స్థానే చట్టం


[illegible] రింగ్ బండ్ అనేది ఏదైతే వేసినామో, దాన్ని మొదట చట్టం చేసి వేస్తున్నాము మొన్నటి ఆర్డినెన్సుకు బదులు ఒక చట్టం వచ్చేస్తున్నది. ఈనాడు, ఈ మహాయజ్ఞంలో మీరంతా ఉత్సాహంతో గర్వంతో పాల్గొనండి. ఆంధ్రప్రదేశ్‌లో మనందరం కలిసి భావిపౌరులకు భావితరాలకు సరియైనటువంటి భవిష్యత్తును కల్పించడానికి ఏర్పాటు చేసుకుంటున్నామనే భావంతో మీరు ముందుకు రావాలి అని మనవి చేస్తున్నాను.

[గుంటూరులో 1972 జూన్ 15వ తేదీన జరిగిన భూసంస్కరణల మహాసభలో ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు భూసంస్కరణలను గురించి ప్రభుత్వం తలపెట్టిన విధానాలను వివరిస్తూ చేసిన ప్రసంగభాగాలు.]

ప్రయోజనకారి

భూకమతాల గరిష్ఠ పరిమితి [illegible],
భూములను ప్రభుత్వం [illegible] నిరుపేదలకిస్తుంది.
నిజానికి దీనివల్ల చిన్నరైతులకు పోయేదేమీ లేదు. భూసంస్కరణలవల్ల
కొంత లాభమే జరుగుతుంది.

— ముఖ్యమంత్రి



విశ్వనాథ సత్యనారాయణ

ఏ దేశంబునుగాని దాని కిదిగా నీకాలమం దుండగా
రాదిచ్చోటను మారణాయుధమహారాజ్యాగ్ని మధ్యంబునన్
గాదచ్చోట నొకళ్ళొకళ్ళకును నేకగ్రీవతల్ లేమి సం
పాదింపంగనునైన నీతిఁ బడి గెల్వన్ వచ్చు మేధా గతిన్.

తన వ్యక్తిత్వము నిల్వ బెట్టికొనగా తానెంత క్లేశం బగున్
తన కాల్నేలను నిల్వఁ దొక్కికొనగా తానెంత క్లేశం బగున్
తనకుం దానొక మారణాయుధ మహా దార్ఢ్యంబు గల్పించుకో
జను నద్దానికి బేద దేశము లిటన్ జాలంగ లేవెంతయున్.

జనములు రోగ సంతతిని జావక యుండగ నెంత వైద్య సా
ధనములు జేసె నాగరకతా మణి పశ్చిమ దేశ మంత మం
దిని నొక నాల్గు నాళ్ళలను నేలకు మట్టము జేయు రాజ్య సా
ధనమునకైన నాగరకతా పటు మార్గము నెల్లెరుంగనొ

దౌర్జన్యమ్మయి భిన్న దేశముల మధ్యన్ వర్తకంబంచు, నం
తర్జాతీయత యంచు నమ్మటలునున్ ద్రవ్యంబులన్ గొందురున్
గర్జల్ సేయుచు మారణాయుధము లీ క్రయ్యమ్ములౌ వస్తువుల్
దుర్జాతుల్ ధర నేడు నాగరక జాతుల్ గాగ దీపించుచున్

తిండికి లేనిదన్న పరదేశమునన్ జనముల్ తిసంగ వే
పండిన పంటలన్ సతము పంచుచు నుందురు గొప్పబుద్ధియై
పండిన పంట నెందుకని పంపుదు రావరదేశ మెప్పుడున్
గొండొక చోటగాక గొనుగోలు స్వదేశమునందె చేయగన్

అంతర్జాతీయతకై
వింతగ పరవళ్ళు ద్రొక్కు వీరులుగానై
అంతర్దేశీయతకై
వింత కవిత వ్రాయగల కవీంద్రులుగానై

ఏడవ నావికాదళము నెచ్చట నిల్చెనో యంద నిల్పి తా
నూడని పాడగా సలుపు నొక్క మహోన్నత నీతి బుద్ధి తా
నాడది చేసె నాతెలివి యాడది యంచనరాదు చూడగా
ఈడది యింతయో తెలివి ఏడది ? ఏ యవతారమో మరిన్

అపకారికి నుపకారము
నెపమెన్నక సేయుటేమొ నేర్పై చనగా
నపకారికి నుపకారము
నెపమెన్నక జేసినాము నేరుపు మీరన్

చనురాజ్యంబు నెరుంగకే మతము పిచ్చున్ జేతులారంగ జే
సిన దుర్మార్గము నంతయున్ పొరుగు దాక్షిణ్యంబు పండించుచున్
వనితామూర్తిగ వానిమీదబడి యేడ్వన్ లాభమే మున్నదో
అనయంబున్ మనుజత్వమేర్పడని సిద్ధాంతంబులౌ దుర్మతుల్

ఇప్పుడున్న మనుజు లేమైననున్ సరే
ముందు వచ్చు జనుల మూక కొరకు
ప్రౌఢయత్నములను పచరించు నీ నాటి
మనుజ జాతి యిట్టె మనును గాక

ఈ పరస్పర భావమ్ము లెసగవలయు
ఎపుడు విప్లవ భావమే యెసగ వలయు
శాంతి యుండగనేరాదు జనములం ద
సాధు నేతల కోసమురా ధరిత్రి
సాధు జనుల కోసము కాదురా ధరిత్రి ।

ఇచ్చట నిత్యము గెలుపులు
తెచ్చెడు మతి యెంతయైన తేజస్విని యో
ఇచ్చట నిన్నాళ్ళకు మరి
తెచ్చిన దొక పెద్దగెలుపు స్త్రీ రత్నంబై

ఒక సింహాచలమందు మంగళగిరిన్ వ్యూహంబు నిర్మించి భ
క్త కదంబంబును బ్రోచు స్వామియు సపత్నంబైన పేరున్నచో
టికి భూమీ ప్రజ ధర్మపుం గెలుపు పండింపంగ నూహించు గా
క కడున్ నాస్తికులాడుచున్నదగు ధిక్కారంబు లెక్కింపకన్.


భారత జాతీయ పతాకం పుట్టు పూర్వోత్తరాలు

బల్లసాని సుబ్బారావు

మహాభారత కాలంనుండి భారతదేశంలో ఆయా రాజ్యాలకు పతాకలు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు గోచరమవుతూంది. అంతకు పూర్వం కృత త్రేతాయుగాలలో పతాక ప్రాధాన్యమంతగా వున్నట్లు లేదు. భారతావనికి జాతీయ పతాకగా కాకపోయినా అర్జునుని కపిధ్వజం ఆనాడు విపుల ప్రఖ్యాతి కలిగి వుండేది. ఆ కాలంలో రాజులందరికీ తమ-తమ జండాలుంటుండేవి. అయితే యీ నాడు మనం భావిస్తున్న జాతీయత నాధారంగా యోచిస్తే చారిత్రిక కాలంలో వ్యాప్తమైన జాతీయ ప్రతిపత్తి గలిగి జాతీయ భావానికి విపుల దోహదం కలిగించిన జండా అశోకుని గేరువా జండాయే. భారతీయ సంస్కృతి కాధారమైన త్యాగభావాని కా జండా ప్రాతినిధ్యం వహించింది. అశోకుని సందేశాన్ని దేశ-దేశాలకు చేర్చి విదేశీయుల కానాడు భారతీయత నవగాహన పర్చిందా పతాకయే.

క్రీస్తు తరువాత వైష్ణవ మతావలంబులైన గుప్తరాజులు గరుడ ధ్వజాన్ని జాతీయ పతాకగా నిలిపారు. రాణాప్రతాప్ సింహం గుర్తుగల ఎర్రజండాను రసపుత్రుల జాతీయ పతాకగా ఎన్నుకొన్నాడు. ఛత్రపతి శివాజీ కత్తి మార్కుగల భగవా జండాను జాతీయ భావానికి, సంస్కృతికి ప్రేరకంగా స్వీకరించాడు. శివాజీ తరువాత షుమారు రెండు శతాబ్దాల వరకు భారతదేశంలో భారతీయతకు ప్రతినిధిగా. జాతీయ భావాన్ని ప్రేరేపిస్తూ మన గలిగిన జాతీయపతాక లేదు. ఆంగ్లేయుల 'యూనియన్ జాక్' జండా క్రింద సంవత్సరాల కొలది భారతీయులు బానిసలుగానే కాలం గడిపారు. 1857 తరువాత ఈ దేశంలో తలెత్తిన నూతన జాతీయభావం 1885లో జాతీయ కాంగ్రెసుగా అవతరించింది. కాని ఆరంభంలో కాంగ్రెసుకు జాతీయపతాక కావలెననుకొనే జాతీయత లేదు. క్రమంగా ఆంగ్లేయుల పరిపాలనలో ప్రవేశించిన దురుసుతనం, దురహంకారం కారణంగా దేశీయులలో జాతీయతా భావం బలపడింది. కాంగ్రెసు ఆ జాతియ భావానికి ప్రతినిధిత్వం వహించినదని చెప్పవచ్చు. ఏమైనా షుమారు 20 సంవత్సరాల వరకు జాతీయ కాంగ్రెసు పెద్దలకు జాతీయజండా అవసరం స్ఫురించ లేదు. ఆనాటి ప్రభుత్వపు జండానే కాంగ్రెసు సమావేశాలకు వినియోగించుకొనే వారట. పోతే ఎటు తిరిగి వంగదేశ విభజన తరువాతనే ఒక జాతీయ స్ఫురణ కొందరు యువక దేశభక్తులకు కలిగినట్లు కనబడుతూంది. ఆ జాతీయపతాక క్రింద విశాలదేశంలో నిద్రాణమైవున్న జాతీయ భావాన్ని జాగృత్త పర్చ వలెననియు, దేశభక్తులను సమీకరించ వలెననియు ఊహ వారికి కలిగింది. తత్ఫలితంగా దేశభక్తులైన బెంగాలీ హిందు, ముస్లింలు కలిసి ఒక జండాను రూపొందించి నట్లును. అది 1906 ఆగస్టు 7తేదీన మొదటి సారిగ కలకత్తాలోని గ్రీన్‌పార్కులో ఒకచిన్న సమావేశ సందర్భంలో ఎగురవేయ బడినట్లును, కొందరు బెంగాలీ ప్రముఖుల వ్రాతలనుబట్టి తెలియ వస్తూంది. అదే నేటి మన త్రివర్ణ పతాకకు మనకు తెలిసినంత వరకు తొలిరూపంగా భావించవచ్చును. ఇటీవల కేంద్ర ప్రభుత్వంవారుకూడా యీ విషయాన్ని ధృవపర్చారు.

గ్రీన్ పార్కులో ఎగిరిన జండాకు పైనుంచి క్రమంగా ఎరుపు, పసుపు, పసరు రంగులుగల మూడు పట్టీలుండేవి. పైనున్న ఎరుపు పట్టీపై వరుసగా 8 పద్మాలు తెలుపురంగులోను. మధ్యనున్న పసుపురంగు పట్టీపై ముదురునీలం రంగులో దేవనాగరి లిపిలో 'వందేమాతరమ్' అనియు, అడుగున వున్న ఆకుపచ్చ పట్టీపై తెలుపురంగులో యిరుప్రక్కల సూర్య-చంద్రుల గుర్తులు ముద్రించబడి వుండేవి. అర్ధచంద్రుని (crescent moon) ప్రక్కన 6 కోణాలు కలిగిన నక్షత్రమొకటి వుండేది.



ఇది యిరువదవ శతాబ్దారంభంలో రూపొందించబడిన మన ప్రథమ జాతీయ పతాక స్వరూపం.

జాతీయపతాక రెండవరూపం మనకు విదేశాలలో దర్శనమిచ్చింది. ఇదికూడ స్వరూపంలో, రంగులలో ప్రథమ జండానే పోలి వుంటుంది. పోతే పైనున్న ఎరుపు పట్టీపై 8 పద్మాలకు బదులు ఒక పద్మం, దీనిముందు వరుసగా 7 నక్షత్రా లుంటాయి. ఈ జండాను 1907 సం లో ఫ్రాన్సు దేశంలో ఉత్సాహవంతులైన కొందరు భారతీయ విప్లవకారులైన యువకులు ఫ్రెంచి విప్లవ కారుల సహాయంతో రూపొందించారట. జండా స్వరూప నిర్మాణంలో మదాం కామా (madame cama) అనునామె విశేషంగా సహకరించిందట. ఈ జండాపై నున్న 7 నక్షత్రాలు సప్త ఋషులకు చిహ్నాలని చెప్పబడింది. ఈ జండా బెర్లిన్ నగరంలో జరిగిన ప్రపంచ సోషలిస్టు మహాసభలో కూడ ప్రదర్శించ బడిందట. పోతే ఫ్రెంచి దేశంలో రూపొందిన యీ జండాయే మనకు ప్రథమ జాతీయ పతాక నమూనా అని కూడా కొందరు పెద్దల అభిప్రాయముంది.

డొమినియన్ పతాక

1917 నాటికి మన పూర్వులైన పెద్దలకు స్వాతంత్ర్యం పట్ల కొన్ని నిర్దిష్ట భావాలేర్పడినాయి. దేశ ప్రజలలో రాజనైతిక చైతన్యం పెరిగింది గాంధీ దక్షిణాఫ్రికానుండి వచ్చి యిచ్చటి రాజకీయాల్లో కాలూనినా అప్పటికి దేశనాయకత్వం లోకమాన్య తిలక్ చేతిలో వుంది. స్వాయత్త శాసనాందోళన (Home rule demand) కాలంలో అనిబిసెంటు సహాయంతో తిలక్ ఒక జండాను రూపొందించాడు. అది అంతకు పూర్వం వచ్చిన రెంటికి పూర్తి విరుద్ధరూపంలో వుంది. ఈ జండాకు మూడు పట్టీలకు బదులు 9 పట్టీలుండేవి వాటిలో 5 ఎర్రరంగులో, 4 ఆకుపచ్చ రంగులో వుండేవి. జండా పైభాగంలో ఎడమ ప్రక్కన జండా కర్రవైపున బ్రిటిష్ పతాక 'యూనియన్ జాక్' ముద్రించబడి వుండేది. పూర్వపు జండాపై నున్న అర్ధచంద్రుడు, 7 నక్షత్రాలు యీ జండా అంతటను ఆవరించి వుండేవి. అయితే యీ జండా ఆనాటి రాజకీయ స్థితిని మాత్రమే సూచిస్తుంది.

వెంకయ్య – గాంధీల జండా

1919 రౌలత్ చట్టం, జలియన్‌వాలాబాగ్ కాల్పులు, భారత దేశపు రాజకీయ జీవితంలో రెండవ మలుపును ప్రవేశపెట్టాయి 1920లో తిలక్ అస్తమించాడు. 1921_22 సహాయ నిరాకరణోద్యమం నిద్రాణమైవున్న జాతిని కదిలించివేసింది. దేశనాయకత్వం గాంధీ చేతులలోకొచ్చింది. 'యూనియన్ జాక్' ముద్రవున్న జాతీయ జండా దేశభక్తులను సంతృప్తి పరచలేక పోయింది. అది జాతీయతకు కళంకంగా గోచరించింది. గాంధీ మహాత్ముడే నిరాపేక్షణీయాదర్శాలు గల సమగ్రమైన. భారత జాతీయ పతాక నొకదానిని నిర్మించ వలసిన అవసరాన్ని గుర్తించాడు.

1921 లో విజయవాడ జాతీయ కాంగ్రెసు కమిటీ సమావేశ సందర్భంలో పింగళి వెంకయ్య అనే ఆంధ్ర యువకుడు ఎరుపు_ఆకుపచ్చ రంగులో ఒక జండా నమూనాను రూపొందించి గాంధీజీ ముందు ప్రవేశ పెట్టాడు. వెంకయ్యను గాంధీజీ అంతకు పూర్వం నుండి ఎరుగును. గాంధీజీకి ఆయన నిస్వార్థసేవా వృత్తిపై పూర్తి నమ్మకముండేది. అసలు ఒకజాతీయ జండా నమూనాను తయారుచేయ వలసినదిగా అంతకు పూర్వమే గాంధీజీ ఆయన కాదేశించి నట్లుగా కూడ చెపుతారు. వెంకయ్య తన జండాపై ఎరుపు_పచ్చరంగులను హిందూ_ముస్లిం మతాలకు ప్రాతినిధ్యం వహించేవిగా చెప్పాడు. అయితే గాంధీజీ మిగతా మతాలవారి ఉనికిని కూడ సూచించు తెలుపు రంగు పట్టీ నొకదానిని జండా పైభాగలో కలుపుతూ ఆ జండాను జాతీయ పతాకంగా వాడవచ్చునని ఆమోదించాడు. జండా మధ్యగా ముదురు నీలం రంగులో ఒక పెద్ద రాట్నం కూడ ప్రవేశపెట్ట బడింది. ఈ రాట్నపు చిహ్నం ఒక పంజాబీ యువకుని ద్వారా ప్రతిపాదించ బడినదని కొందరు పెద్దల అభిప్రాయం. గాంధీజీ రాట్నాన్ని భారతదేశ ఆర్థిక పురోభివృద్ధికి సంకేతంగా స్వీకరించాడు. ఇదే ఆనాటి త్రివర్ణ పతాక.

బైరాగి జండా

ఈ మధ్య కాలంలో సాధికారామోదం (official recognition) పొంద గలిగిన ఒక సమగ్ర జండా నిర్మాణానికై కాంగ్రెసు ఏడుగురి పెద్దలతో కమిటీని నియమించింది. కారణం వెంకయ్య_గాంధీల జండా సాంప్రదాయిక ప్రయోజనాలతో ఆవిర్భవించింది. హిందూ ముస్లిం_మరి యితర మతాలవారి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేజండా దేశాన్ని మతాల రీత్యా చీల దీస్తుందని అనేక మంది అభిప్రాయ పడ్డారు. ఈ ప్రభావంతో ఆ జండా కమిటీ మరియొక నూతన నమూనాను సిఫార్సు చేసింది. ఆ జండామొత్తం కాషాయిరంగులో వుంటుంది. పైభాగంలోఎడమ వైపుగా ఎర్రరంగులో రాట్నంవుంటుంది. కాని త్యాగాన్నే సర్వస్వంగాసూచిస్తున్న యీ జండాను కాంగ్రెసు కేంద్ర కమిటీవారంగీకరించలేదు. దాన్ని బైరాగి జండాగా చాలామంది తిరస్కరించారు.

ఆ జండా నమూనా వినియోగంలోకిరాకుండానే సమసిపోయింది.

త్రివర్ణ పతాకం జాతీయ పతాకమయింది

కాంగ్రెసు సభలలో 1921 నుంచి వెంకయ్య_గాంధీల జండాయే ఎగురుతూ వచ్చింది. కాంగ్రెసు లక్ష్యాదర్శాలలో అనేక

సార్వజనీనత

మన జాతీయ పతాకం ఒక్క మన భారతదేశానికే కాక సర్వమానవ జాతికీ చిహ్నం

— డా. ఎస్. రాధాకృష్ణన్

మార్పులు_కూర్పులు ప్రవేశించాయి. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా చెలరేగిన ఉద్యమంలో కాంగ్రెసు సంస్థ త్రివర్ణ పతాకం నీడనే బలపడింది. భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావలెననే కోర్కె యీ పతాకం నీడనే స్ఫూర్తిని పొందింది. 1929 లో కాంగ్రెసు చరిత్రాత్మకమైన సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని ఆమోదించింది. దీనితో కాంగ్రెసు సంస్థ బాధ్యత పెరిగింది; దాని అంతస్థు మరింతయింది. స్వతంత్ర ప్రతిపత్తి గల జాతీయ పతాక స్వతంత్ర జాతి జీవితంలో ఒక భాగంగా భావించ బడింది. 1931 లో జాతీయ కాంగ్రెసు పతాక (National flag) గా స్వీకరించింది. అదే యీ నాటి త్రివర్ణ పతాక. అయితే పూర్వపు త్రివర్ణ పతాకకు దీనికి ఆదర్శాలలో, స్వరూపంలో కూడ భేదముంది. ఈ త్రివర్ణ పతాకపై పూర్వపు ఎరుపు రంగుకు బదులు కాషాయి రంగు ప్రవేశ పెట్టబడింది. పైనుంచి క్రమంగా కాషాయి (Saffron), తెలుపు, ఆకుపచ్చ రంగులు గల పట్టీలు సమాన వెడల్పు, పొడవులలో ఉంటాయి. మధ్యలో నున్న తెలుపు పట్టీపై ముదురు నీలం రంగులో రాట్నం ముద్రించబడి వుంటుంది. జండా పొడవు_వెడల్పులు 3:2 నిష్పత్తిలో వుంటాయి. ముతక ఖద్దరుగాని లేక ఖాదీ శిల్కు గుడ్డతోగాని ఇది నిర్మించ బడుతుంది.

మతాలకు కాదు, మనో భావాలకు ప్రతీకం

ఈ పరిగణించి జాతీయ పతాక రంగులన్నీ మతాలకు, జాతులకు కాకుండా మానవుని మనోభావాలకు, కాంక్షలకు ప్రాతినిధ్యం వహించడం గమనించదగిన విశేషం. చూడండి_ఆకుపచ్చరంగు వల్ల 1942 క్విట్ ఇండియా ఉద్యమంతో కాంగ్రెసు వారి త్రివర్ణ పతాకకు బలమైన జాతీయ ప్రతిపత్తి సమకూరింది. 1941_45 ల మధ్య యీ జండా నేతాజీ సుభాష్ చంద్రబోసు ద్వారా భారతీయతకు ప్రతినిధిగా విదేశాలకు కూడ వెళ్లింది. అప్పటో జపాను సహాయంతో నేతాజీ ఆధ్వర్యంలో ఆగ్నేయాసియా దేశాలలో యీ త్రివర్ణ పతాకకు పూర్తి ప్రతిష్ఠ లభించింది.

లార్డు మౌంటుబాటను గవర్నరు జనరల్‌గా వుండగా కేంద్రీయ శాసనసభ 15 జూలై 1947 న స్వరాజ్య బిల్లు నామోదించింది. దేశం హిందుస్తాన్-పాకిస్తాన్‌లుగా విడివడేందుకు నిశ్చయించుకొంది. 22 జులై 1947 న శాసన సభ స్వతంత్ర భారత దేశానికి ఒకే ఒక మార్పుతో త్రివర్ణ పతాకను జాతీయ పతాకగా స్వీకరించాలని నిర్ణయించింది. ఆ మార్పు జండాపై రాట్నానికి బదులు అశోక చక్రాన్ని ప్రవేశపెట్టడం. ఈ చక్రాన్ని గురించి కొంచెం తెలిసికొనడం యిక్కడ అప్రస్తుతం కాదు.


అశోక చక్రానికున్న చరిత్రాత్మకత

స్వభావరీత్యా చక్రం ప్రాచీన భారతీయుల మన్నన పొందినదే. అది గతిశీలతకు గుర్తుగా స్వీకరించబడింది. ప్రాచీన బౌద్ధ గుహలలో లభించిన చక్రశిల్పాలను బట్టి చక్రం బుద్ధధర్మంలో, జీవితంలో సంభవిస్తున్న అవశ్యం భావ్యమైన పరివర్తనకు ప్రతీకంగా రూపొందించబడినట్లు గమనించబడినది. ఈ చక్రానికి 24 ఆకులుంటాయి. దీనిని బట్టి బుద్ధునికి పూర్వం ప్రచారితమైన ప్రాచీన సాంఖ్యశాస్త్ర ప్రభావం యీ చక్ర నిర్మాతలపై విశేషంగా ప్రసరించి వుంటుందనేది గమనించదగిన సత్యం. సాంఖ్య శాస్త్రం కూడ పరిణామ నిత్యత్వాన్నంగీకరించింది గదా! హీనయాన బౌద్ధం యీ చక్రాన్ని జడ-జీవ సమన్వితమైన యీ లోకపు మనుగడకే పర్యాయసూచకంగా గుర్తించింది. చక్రపు భ్రమణాత్మికావృత్తి జీవన తత్వాన్ని నిర్వచిస్తుంది. ఈ జీవన తత్వాన్ని అవగాహన చేసికొనడమే మానవధర్మం. హీనయాన బౌద్ధంలో ప్రాణి ధర్మానికి ప్రతీకంగా నిలచిన చక్రం అశోకుని తర్వాత కాలక్రమంలో మహాయాన బౌద్ధంలో బుద్ధరూపమే ధరించింది. అశోకుడు తన ధర్మ నిష్ఠమైన రాజ్య వ్యవస్థకొక ఆదర్శంగా ఆ చక్రాన్ని స్వీకరించాడు. తాను నిర్మించిన శిలా స్తంభాలపై చక్రాన్ని చెక్కించడం మరువలేదు. నాల్గు ఆర్య సాహిత్యాలకు (Four Noble Truths) ప్రాతినిధ్యం వహిస్తున్న 4 సింహాలకు



చక్రం మూలాధార పీఠంగా అమర్చబడింది. ఏమైనా భారత భాగవత కథా కాలంలో ధర్మ రక్షణార్థం వినియోగించబడిన చక్రం బుద్ధయుగంలో స్వతః ధర్మానికే ప్రతీకమైనట్లుగా చరిత్ర చెపుతూంది. భారతీయ సంస్కృతితో యీ చక్రానికున్న సంబంధాన్ని బట్టి స్వతంత్ర భారత దేశం జాతీయ పతాకపై దీనిని అమర్చుకొంది. ఈ చక్రం కర్తవ్య పథంపై నిరంతరం ముందుకు నడుస్తూండమని మనలను ప్రబోధిస్తూందన్నమాట. అధైర్యం, అకర్మవ్యాప్తత, అలసత్వం భారతజాతికేకాదు, మానవజాతికే వినాశకరాలని హెచ్చరిస్తుంది. ఈ విషయంలో డా॥ రాధాకృష్ణన్ అన్న మాటలు గమనార్హం.

Truth or Satya, Dharma or Virtue ought to be the controlling principles of all those who work under the flag. Again the wheel denotes motion. There is death in stagnation. There is life in movement. India should no more resist change, it must move and go forward. The wheel represents the dynamism of a peaceful change and hence this deviation does not revolt against the original idea of having a spinning wheel in the national flag.



రాట్నానికికూడ చక్రమే ప్రధానం

ఈ చక్రానికున్న సుదీర్ఘమైన సాంస్కృతిక ప్రతిపత్తి రాట్నానికిలేదు గనుకను, రాట్నపు ప్రయోజనం పాక్షికం గనుకను, రాట్నం సూచించు ఆర్థిక విధానం యీ సైన్సుయుగంలో అనేక మందికి రుచించక పోవుటవల్లను మొత్తం దేశానికి ప్రాతినిధ్యం వహించవలసిన జాతీయ పతాకపై రాట్నాన్ని తొలగించి చక్రాన్ని రూపొందించడం సంభవించింది. జవహర్లాల్ నెహ్రూ అన్నట్లు రాట్నానికికూడ దాని చక్రమే ప్రధాన భాగం కనుక రాట్నాన్ని సంస్కరించి చక్రంగా వాడుకొంటున్నా మనుకొన్నా దోషంలేదు. కారణం, యీ నాటికీ కోట్లకొలది భారతీయ పేదప్రజలు రాట్నాన్నధిగమించిన జీవితాన్ని పొందలేదు. ఇప్పటికీ అది భారతీయ ప్రజా జీవితానికి ప్రతీకయే. అయితే పతాకం ఎగిరేప్పుడు ఏ దిశగాచూసినా దానిపై గుర్తు ఒకేవిధంగా గోచరించ వలయుననే సాంకేతిక నిబంధనకు లోబడికూడ రాట్నాన్ని సంస్కరించవలసి వచ్చింది. ఈ విషయం నెహ్రూజీ 1947 జులై 22 న స్పష్టపరిచారు.

"On the white band there was previously the charkha which symbolized th common man in India, which symbolized the masses of the people, which symbolized their industry and which come to us from the message which Mahatma Gandhi delivered. Now this particular Charkha symbol has been slightly varied in this flag, not take away at all. why has it been varied ? Normally aking, the symbol on one side of the flag should be exactly the same as on th other side. Other wise, there is a difficulty which goes against th rules."

ఆ నాడు రాట్నానికున్నప్రాముఖ్యాన్ని కాదనలేకపోయాం కనుకనే జాతీయ పతాకనే సంస్కరించి కాంగ్రెసు పార్టీ జండాను మాత్రం యథాతథంగా రాట్నంతోనే వుంచివేయడం జరిగింది. సృష్టి స్థితిని, సంపత్తిని సూచించింది. ముస్లిం దేశాలలో ఆకు పచ్చరంగు నమ్మకానికి, శూరత్వానికి చిహ్నంగా స్వీకరింపబడుతుంది. కాని భారత దేశంలో అది భూతత్వాన్ని (Earth– one of the five elements), సంతుష్టి భావనను (Self-satisfaction) కూడ సూచిస్తుంది. అది మానవుని యీ లోకంలో ఉనికికి, అతని మానసిక– బౌద్ధిక సంపన్నతకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అంటే కేవలం యీ లోకంపట్ల నమ్మకాన్నే (ఆస్థ) కాకుండా ఆ నమ్మకం జడత్వానికి లోను గాకుండా వివేకంతో కర్తవ్యం వైపుకు పురోగమించ వలసినదిగా హెచ్చరిస్తుంది. మానవుని గణనీయమైన యిహ జీవితాన్ని గౌరవ పూర్వకంగా గుర్తు చేస్తుంటుంది. ఈ రంగు సృష్టిస్థితి, మనోగతికి సూచకం గనుక జండాపై పైరంగుల కాధార భూతంగా దిగువన రూపొందించబడింది.

ఆకుపచ్చకు పైనున్న తెలుపురంగు నిష్కపట మనోభావానికి, పరిశుద్ధాచరణకు సింబల్. సంఘజీవితం సుభిక్షంగా వుండాలంటే, సుఖపూర్వకంగా గడవాలంటే వ్యక్తి భావాలలో, ఆలోచనలలో, ఆచరణలో పరిశుద్ధత (purity). స్వార్థరాహిత్యం స్పందిస్తూండాలి. జాతీయ పతాకంపై తెలుపురంగు యీ పరిశుద్ధతనే సూచిస్తుంది. ఇదీగాక యీ దేశంలో ప్రాచీనకాలం నుంచి శ్వేతం జ్ఞానానికి, వివేకానికి సూచకంగా భావించబడుతూ వచ్చింది.

పోతే తెలుపు పట్టీపై నీలంరంగులో నున్న రాట్నం యీ దేశ ఆర్థిక ప్రగతిని సూచిస్తుంది. ఈ దేశపు ప్రజాజీవితాన్నది ప్రతిబింబిస్తుందని గాంధీజీ అభిప్రాయ పడ్డారు. కోట్లకొలది పేద ప్రజలకు కూడు–గుడ్డ సమకూర్చ గలగడంలో యీ రాట్నం ప్రముఖపాత్ర వహించ గలుగుతుంది కాబట్టి భారతీయ ప్రజా జీవితానికది ప్రతినిధిగా జండాపై స్థానం పొందింది. పోతే దాని ముదురునీలం రంగు శాంతికి ప్రతీకం. శాంతిపథంపై ఆర్థిక ప్రగతిని సాధించగలమనే ఆశయం యీ రాట్నం గుర్తుద్వారా వ్యక్తమవుతూంటుంది. రాట్నం తిరుగుతున్నంతవరకు ప్రజలకు అన్న వస్త్రాల లోటుండదనే సత్యం మనకు దీనిద్వారా వ్యక్తమవుతుంది.

జండాపైభాగాన వున్న కాషాయరంగు మనోస్థైర్యానికి, త్యాగనిరతికి ప్రతీకం. లోభ–మోహాలను జయించి త్యాగనిరతిని పెంపొందింప జేయాలనే సందేశాన్ని ఈ రంగు మనకందజేస్తుంది. ప్రాచీన భారతంలో కూడ యీ కాషాయరంగు నిర్లిప్త జీవితానికి ప్రతీకంగా వుండేది. ఋషులు, సన్యాసులు యీ రంగునే గౌరవించేవారు. ఇప్పటికీ యిది సన్యాస ప్రతీకంగానే భావించబడుతూంది. ఈ కాషాయరంగు ఎరుపుకు కొలది తెలుపు + పసుపురంగులు చేర్చితే ఏర్పడుతుంది. దీనివల్లకూడ కాషాయరంగుకే ప్రాముఖ్యం సిద్ధించింది. ఈ రంగు భారతీయులు కేవలం భోగాన్నేకాక యోగాన్ని కూడ కాంక్షిస్తారనే సత్యాన్ని ప్రకటిస్తుంది. భోగలిప్తత నీరంగు గర్హిస్తుంది. యోగవృత్తి ప్రధానంగా గల త్యాగశీలతను గుర్తు చేస్తుంది.

సమగ్ర మానవతకు రూపకల్పన

ఈ విధంగా 1931 లో కాంగ్రెసు సంస్థ రూపొందించిన జాతీయ పతాకకే సంపత్తి, సాహసం, పవిత్రత, వివేకం, త్యాగం,

యోగం, భోగం, కృషి శ్రమ, మొదలగు మానవోచితములైన మహా తత్త్వాలను భారతజాతి ఆదర్శాలుగా రూపొందించుకొని ఇంటా-బైట తదనుకూలమైన జీవితాన్ని సాధించాలనే కాంక్షను చాటుతుంది. జండాపైనున్న రంగులు క్రమం భోగాన్నుండి యోగం వైపుకు, రాగాన్నుండి విరాగం వైపుకు, ఇహంనుండి పరం వైపుకు గృహస్థం నుండి సన్యాసం వైపుకు, యథార్థాన్నుండి ఆదర్శం వైపుకు మనం పయనిస్తున్నాం. అదేమన ఆదర్శం అని లోకానికి చాటి చెబుతూంది. ఆకుపచ్చరంగు యీ జీవితం పట్ల ఆస్తను (faith) ప్రబోధిస్తే తెలుపురంగు సాధనాదర్శాన్ని సూచిస్తుంది. సిద్ధి లేక సాధ్యంకొరకు మనమెన్నుకొను సాధనామార్గాలు (means) కూడ పవిత్రంగానే వుండాలని హెచ్చరిస్తుంది. కాషాయిరంగు సాధ్యాన్ని, నిర్వచిస్తుంది. భారతీయుల జీవనసాధ్యం ముక్తి. ముక్తికి ధర్మం సర్వసంగ పరిత్యాగం. కనుకనే త్యాగసూచకమైన కాషాయరంగు జండా పై భాగంలో అమర్చబడింది అది మనకు లక్ష్యం, సాధ్యం. ఆ సాధ్యం (End) కొరకు మనకుండవలసిన సాధనం (means) స్వార్థరహిత జీవితం. ఇటువంటి జీవితాన్నే తెలుపురంగు ప్రబోధిస్తుంది. అంటే జండా మధ్యభాగంలో నున్న తెలుపుపట్టీ భారతీయుల జీవన పద్ధతిని నిర్వచిస్తుందన్నమాట. బ్రతుకు భుక్తిపై ఆధారపడి వుంటుంది. గనుక భారతజాతికి భుక్తినివ్వ గలిగేది కుటీర పరిశ్రమలని రాట్నం గుర్తు ప్రబోధిస్తుంది. ఇలా త్రివర్ణ పతాక పైయుక్తికంగాను, సామాజికంగాను భారతీయుని సమగ్రతకు రూపకల్పనగా నిర్వచించబడింది.

ప్రతిష్ఠ పెరిగింది, స్వతంత్ర ప్రతిపత్తి లభించింది

జాతీయ పతాకగా గుర్తించబడిన త్రివర్ణపతాక 1931 నుండి అనేక పోరాటాలను నడిపింది. చరిత్రాత్మకమైన ఉప్పు సత్యాగ్రహం, క్విట్ యిండియా ఉద్యమాలను యీ జండాతో నిర్వహించింది. రౌండుటేబుల్ కాన్ఫరెన్సులో యీ జండాయే భారత జాతి ప్రతినిధిగా పాల్గొంది. 1937 శాసనసభల ఎన్నికలు పద కొండు రాష్ట్రాలలోను యీ జండా వెనుకనే జరిగాయి. అప్పటి ప్రాంతీయ కాంగ్రెస్ ప్రభుత్వాలు యీ జండా నీడనే నిర్వహించబడ్డాయి. 8 రాష్ట్రాల ప్రభుత్వ కార్యాలయాలపై 1937 నుంచి 1939 వరకు యీ జండాయే ఎగిరింది. అయినా 1942 వరకు యీ జండా నంగీకరించని వాళ్లు కూడ దేశంలో హెచ్చుగానే వుంటూ వచ్చారు. కొందరు హిందువులు భగవా జండానే ప్రతిష్ఠించాలనే ప్రయత్నంలో వున్నారు. ఆర్యసమాజపు పెద్దలు 'ఓం' మార్కు జండాకొరకు యత్నిస్తున్నారు. అనేకమంది రైతు కూలీలు ఎర్రజండాను ప్రీతిపాత్రంగా భావించారు. సాధువులకు, సన్యాసులకు అసలు జండాపట్ల కాంక్షే లేదు. పోతే ముస్లింలు త్రివర్ణ పతాకను హిందువుల జండాగానే భావించి తమకు వేరే జండా కావాలని కోరుతుండేవారు. వారిలో కొందరు 'యూనియన్ జాక్' కే తలవంచేవారు.

1950 జనవరి 26 న భారతదేశం గణతంత్ర రాజ్యం (Republic State) గా రూపొందింది. ముతక ఖద్దరుగాని, ఖాదీశిల్కులోగాని ఆశోకచక్రం ముద్రించబడివున్న త్రివర్ణ జాతీయ పతాక భారత గణరాజ్య పతాక (Republic flag) గా పరిణతి పొందింది. ఈనాడు ప్రపంచ దేశాలలో భారత దూతావాస కార్యాలయాలపై, అంతర్జాతీయ సమితి కార్యాలయంపై, అంతర్జాతీయ సభావేదికలపై, భారతీయ వైమానిక-సాముద్రిక-ఆరక్షక కార్యాలయాలపై, భారత మండలీయ, ప్రదేశీయ, కేంద్రీయ పరిపాలనా-న్యాయ విభాగీయ కార్యాలయాలపై స్వాతంత్ర్యానికి చిహ్నంగా రెపరెపలాడు చున్నదీ త్రివర్ణ పతాకమే. ★

వందే మాతరం

వందే మాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్య శ్యామలాం మాతరం.....వందే మాతరం
శుభ్ర జ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్ల కుసుమిత ద్రుమ దళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం.... వందే మాతరం

— బంకిం చంద్ర ఛటర్జీ



శకపురుషుడు గాంధీ

మాదల వీరభద్రరావు

గాంధీజీ రాజకీయ ఋషి పుంగవుడు. దేశస్వాతంత్ర్యంకొరకు బ్రిటిష్ సామ్రాజ్య ప్రభుత్వానికి వ్యతిరేకంగా అహింసాయుత స్వరాజ్య సమరాన్ని సాగించారు. వివిధ మతాలు, భాషలు, కులవ్యవస్థగలభారతీయులను కదలించి కార్యరంగంలోకి దించి భారత జాతీయైక్యతను సాధించారు.

ఆయనమాట వేదవాక్కు

పర ప్రభుత్వం అధికార బల దర్పాలతో ఎన్నటికీ ప్రజలను అణచివుంచజాలదని ఆయన గ్రహించారు. మహాత్ముని గొప్పదనం జాతీయులందరి హృదయాలను చూరగొనడంలో వుంది. సహాయ నిరాకరణ, సాత్విక నిరోధ శాసనోల్లంఘన ధ్వజాన్ని ఆయన ఆవిష్కరించి, అయస్కాంత శక్తిలాగా అశేష ప్రజలను ఆకర్షించగలిగారు. పరిజనులను మంత్రముగ్ధులను గావించారు. దేశీయులకు గాంధీజీ మాటలు వేదవాక్కులుగా, శిరోధార్యమైనవి. గాంధీజీ ఆదర్శ జీవితం ఆయన యుగపురుషుడను విశ్వాసం గలిగించింది. ప్రాచీన ఆధ్యాత్మిక జ్ఞానసంపద, భారతీయ సంస్కృతి ఆత్మ ఆయనలో ప్రతిబింబించినదనవచ్చు.

తొలి పోరాటాలు

గాంధీజీ మొదట దక్షిణాఫ్రికాలో శ్వేతజాతీయుల జాతివిచక్షణ విధానానికి ప్రతికూలంగా సాత్విక నిరోధ ఉద్యమం నడిపి విజయం సాధించారు.

ఆ అనుభవంతో భారతదేశానికి తిరిగివచ్చి 1917 లో బీహార్‌లోని చంపారన్ జిల్లాలో బ్రిటిష్ నీలిమందు తోటయజమానుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రైతులను సమైక్యపరిచారు.

1920 లో సహాయ నిరాకరణ, 1930-32 సంవత్సరాలలో ఉప్పు సత్యాగ్రహాలకు నాయకత్వం వహించి నడిపించారు. 1942 ఆగస్టులో 'విజయమో—వీరస్వర్గమో' అను నినాదమిచ్చి క్విట్ ఇండియా తీర్మానంతో దేశప్రజలను స్వరాజ్య యుద్ధానికి సన్నద్ధులను చేశారు.

కాంగ్రెస్ సభలలో, వెలుపలా ఆయా సందర్భాలలో అనేక అంతర్గత చర్చలు జరుగుతున్నప్పటికీ, గాంధీజీ భారత రాజకీయోద్యమంలో అడుగిడినప్పటినుండీ ఆయనదే పైచేయి. మెట్టుమెట్టుగా స్వరాజ్య ఉద్యమాన్ని పెంచుకొంటూ వచ్చారు.

1920 సహాయ నిరాకరణోద్యమ విరమణ తర్వాత, 1924లో హిందూ మహమ్మదీయ ఐక్యతకోసం మహాత్ముడు జరిపిన నిరసన వ్రతం; 1930-32 సత్యాగ్రహానంతరం 1933లో హరిజ

నోద్ధరణకై ఆయన సాగించిన నిరాహార దీక్షలు, యావద్భారత ప్రజలలో అమిత పంచలనాన్ని కలిగించి సత్ఫలితాలను చేకూర్చినవి.

మట్టిలోనుండి మాణిక్యాలు



ఉద్యమ నాయకులను, కార్యకర్తలను త్యాగశీలురుగా తీర్చిదిద్ది అపూర్వ త్యాగాలకు పూనుకొనేటట్లు చేశారు. మట్టిలోనుండి మాణిక్యాలు ఉద్భవించినవి. కష్టాలను, జైళ్ళబాధలను లాఠీచార్జీలను సంతోషంతో, సహనంతో భరించే దేశసేవకుల, సేవికల బృందాన్ని తయారుచేసి ఆయన స్వరాజ్య యజ్ఞాన్ని నిర్విఘ్నంగా కొనసాగించారు.

పూర్వపరాలనన్నిటినీ పరిశీలించి, గాంధీజీ ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత, ఇక అది అప్రతిహతం. దానికిక తిరుగు వుండేది కాదు.

శాసనోల్లంఘన తీర్మానానికి అప్పటి అగ్రనాయకులలోనే భిన్నాభిప్రాయాలు, వ్యతిరేకత ఉన్నప్పటికీ, ఒంటరిగా దానిని ప్రతిపాదించి, కాంగ్రెస్ సంస్థచేత అంగీకరింపజేశారు. ఉద్యమ సందర్భాలలో రాష్ట్రాలనుండి వెళ్ళిన నాయకులు ఉద్యమ ఏర్పాట్లకు కొంత వ్యవధి కావాలని కోరినప్పటికీ, ఒక్కరోజు కూడా కాలహరణం చేయ వీలులేదని ఖండితంగా చెప్పి, కొలది మంది సహచరులతోనే ఆయా ఉద్యమాలను మొదట్లో ప్రారంభించేవారు. తానుచేసే సముచిత నిర్ణయాలపైన, వాటి నమలు జరిపే స్వచ్ఛంద సేవకులమీద, ప్రజలపైన అంతటి అకుంఠిత విశ్వాసం వుండేది.

ప్రజల మనోభావాలు గ్రహించడంలో ఆయనకు ఆయనయే సాటి. సత్యాహింసలను తన వ్యక్తిగత జీవన విధానంలోనే గాక, ప్రజోద్యమాల నిర్వహణలో గూడా ప్రయోగం చేశారు. లక్ష్య సాధనకు సాధన మార్గాలను ఎంచుకోడంలోను, వాటిని ఒడుదుడుకులు లేకుండా అమలు జరపడంలోను గాంధీజీ సిద్ధహస్తుడు.

అహింస

అహింసను ప్రకటించడం అంటే కేవలం దుష్టునికి తలఒగ్గి వుండమని కాదు; నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఆత్మను ప్రతిష్ఠించడం.


—గాంధీజీ

నిర్మాణ కార్యక్రమం

ప్రతి పదేండ్ల కొకసారి, పరప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజోద్యమాలను నిర్వహిస్తూ, ఆయా మధ్య కాలాలలో నిర్మాణ కార్యక్రమాలు అమలు జరుపుటలో గాంధీజీ అత్యంత శ్రద్ధ వహించారు. వీటి మూలంగా దేశ సేవకులను ప్రజలను రాబోవు పోరాటాలకు సిద్ధపరచడమే గాక, ఆయన కలలుగనే నూతనసమాజ నిర్మాణానికి అంకురార్పణ గావిస్తూ వచ్చారని తేటతెల్ల మవుతుంది. అంత వరకు పట్టణ, మధ్య తరగతి మేధావి వర్గాలకు పరిమితమైన కాంగ్రెస్ నాయకత్వాన్ని గ్రామ సీమలలోని సామాన్య ప్రజల పరం చేశారు. నిజమైన భారత హృదయం గ్రామ సీమల్లోనే వుందనే వారు.

అనవరతం సాంఘిక ప్రగతి కోసం పోరాటం సాగించారు. హిందూ మహమ్మదీయ మత కలహాల నుండి దేశీయులను రక్షించుటకు కడపటి క్షణం వరకు కృషిచేశారు.

అస్పృశ్యతను తుడిచి పెట్టాలని, దేవుని బిడ్డలందరూ సమానులేనని, సాంఘిక సమానత్వాన్ని ప్రబోధించారు. మహిళాభ్యున్నతికై అనతి కాలంలోనే ఏ సంస్కర్త చేయజాలని మహత్తర పరివర్తనను గొనివచ్చారు.



శ్రమ జీవనానికే ప్రాధాన్యత యిస్తూ, 'పనిచేస్తూ నేర్చుకోవాలనే ప్రాతిపదిక విద్యా విధానాన్ని రూపొందించి' మెకాలే నాటి లోప భూయిష్ట విద్యావిధానాన్ని సంస్కరించ బూనుకొన్నారు. భావి పౌరులుగా నున్న బాల బాలికల అభ్యున్నతికి శ్రద్ధ తీసుకొన్నారు.

సర్వమానవ సౌభ్రాతృత్వ సామరస్యవాది

వివిధ మతవిశ్వాసాలు గలవారిలో ఐక్యతా భావం కలిగించేందుకు. సర్వమానవ సౌభ్రాతృత్వంకోసం ఆయన యావజ్జీవితం ధారపోశారు.

నిజాయితీతో, నిరాడంబరంతో, సత్ప్రవర్తనగల నిష్కళంక వ్యక్తిగత జీవితం గడుపుతూ, జాతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించు కొంటూ ఆదర్శ మూర్తిగా వెలుగొందారు ఆయన సమాజాన్నుండి ఎన్నడూ వేరుపడివుండలేదు. సమాజంలో జీవిస్తూ నిరంతర సత్యాన్వేషణలో నిమగ్నులై, సమకాలీన ప్రపంచాన్ని ఉత్తేజ పరుస్తూ వచ్చారు.

గాంధీజీ ప్రజా స్వామ్యంలో అధికార వికేంద్రీకరణను కోరారు. కేంద్రీకృత రాజకీయాధికారం ప్రజాతంత్ర పద్ధతికే విచ్ఛేదకరమని నమ్మి పంచాయతీ రాజ్య వ్యవస్థను ప్రతిపాదించారు. స్వరాజ్య సౌధానికి ఆర్థిక సమానత్వం, సాంఘిక సమానత్వ మనే ప్రధాన మూల స్తంభాలు అవసరమని చెప్పారు. స్వయం సంపూర్ణతగల గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, వ్యవసాయాధార, ఖాదీ, కుటీర పరిశ్రమలు మూల పునాదులుగా వుండాలన్నారు. అన్యాయార్జిత విత్తం కూడదని, ధర్మ కర్తృత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

రామ రాజ్యం

అంటరానితనం, కులమత తగాదాలు, భాషా ప్రాంతీయ వైరుధ్యాలు, హెచ్చు తగ్గులు లేని, సర్వులకు సమానావకాశాలు కలిగించే నూతన అహింసాయుత సాంఘిక వ్యవస్థా నిర్మాణాన్ని

గురించి కలలు గన్నారు. దానికి సర్వోదయ సమాజమని, పంచాయతీ రాజ్యమని, రామ రాజ్యమని నామకరణం చేశారు.

గాంధీజీ నాయకత్వం వహించి నడిపిన ఉద్యమాలన్నింటికీ సర్వసమానత్వ మనేది కీలకంగా కనుపిస్తుంది. శ్వేత జాతీయుల జాతిద్వేషానికి వ్యతిరేకంగా నల్లవారి సమాన హక్కుల కోసం జరిగిన పోరాటంగాని, బ్రిటిష్ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన జాతీయ స్వాతంత్ర్యోద్యమాలు గాని: ఆర్థిక అసమానతల తొలగింపుకు, సాంఘిక సమానత్వం కోసం, సర్వమత సామరస్యంకోసం జరిపిన ప్రచార ఆందోళనలుగాని ఈ ప్రధాన విషయాన్నే స్పష్ట పరుస్తున్నాయి.


వివిధ మతాలు, ఉపజాతులు గల సువిశాల భారత దేశంలో, సర్వమత ధర్మాల సమానత్వాన్ని ఆయన ప్రబోధించారు. ఆర్థిక ప్రజాస్వామ్యం, ఆర్థిక సమానత్వం లేకుండా రాజకీయ ప్రజా స్వామ్యం అర్థ రహితమవుతుందని అన్నారు.

ప్రవక్త

వ్యక్తుల సముదాయమే సమాజంగావున్న గాంధీజీ ప్రబోధాలకు వ్యక్తి మూలపురుషుడైనాడు. సత్యఅహింసాను వర్తియైన మానవుడు, చిత్తశుద్ధికి ప్రధాన లక్షణములైన విషయ భోగత్యాగము. సత్యభాషణము, పరోపకార పరాయణత, సదాచారాలను అవలంబించాలని చెప్పారు. నైతిక, ధర్మ ప్రవర్తన వలన అంతఃకరణ పరిశుద్ధత ఏర్పడుతుందని, దానిమూలంగా భగవద్భక్తి అభివృద్ధి అవుతుందని, తద్వారా జీవన్ముక్తి లభిస్తుందని మహాత్ముని విశ్వాసం. అదే గాంధీజీ ఒక రాజ నీతిజ్ఞుడేగాక, బుద్ధుడు, క్రీస్తువలె ఒక ప్రవక్తగా వర్ణించడానికి కారణం.

రవీంద్ర కవీంద్రుడన్నట్లు గాంధీజీ ఎంతటి రాజకీయ ధురంధరుడో అంతటి నిర్మాణ దక్షుడు, ప్రజల నాయకుడు. గొప్ప సంస్కర్త. అన్నిటికంటే అత్యుత్తమ మానవతావాది. నిరంతర సత్యాన్వేషి. ఆధ్యాత్మిక జిజ్ఞాసువు. ఆయన నిర్భయత్వం అచంచలమైనది. ఎట్టి నిర్బంధాలుగాని, జైలుశిక్షలుగాని, మహారాజులు, సామ్రాజ్యాధి పతులుగాని తుదకు మరణంగాని తాను సత్యమని ధర్మమని నమ్మి అనుసరించే మార్గనుండి ఆయనను ఏమాత్రం వైదొలగించ లేక పోయినవి.

మానావ మానాలను, సుఖదుఃఖాలను, గౌరవ అగౌరవాలను, జయాప జయాలను సమానంగాచూడగల స్థితప్రజ్ఞత్వంగల మహోన్నతుడు మహాత్మాగాంధీ.



విజయేందిర

వై. కె. బ్రహ్మానందం



జయమేపార స్వతంత్ర భారత మహా సైన్యంబు పోరాడి వి
శ్వయశోమూలముగాగ ముష్కరగతిన్ జెండాడి జాతీయ రా
జ్యయశోభూతినినిల్పె. జాతి ప్రజ మెచ్చన్. దేశమానంబు ని
శ్చయమైపొల్చె. మహేందిరా సచివ ప్రాశస్త్యంబు జేగీయమై

నీలో గాంచెను దేశ మియ్యెడల యూస్విలక్ష్మి నేతృత్వమున్
ఆలోకించితి మేము నీ మహిత రాజ్యాంగంపు చాణక్యమున్
ధీలాలిత్యము. మంత్ర నీతి. సమరస్థేమాభి చైతన్యమున్
మాలో పొంగిన దేశభక్తి యరిసీమల్ ముంచె శౌర్యోద్ధతిన్

దేశము మొక్కవోని కడు ధీరత పున్నె పుత్రోవటోవ, వి
శ్వాసవిహీనమై యెదురువచ్చిన యుద్ధ పిశాచదౌష్ట్యమున్
కాసె బిగించి జాతియొక కాయముతో, గిరి భూమి నీట నా
కాశమునందు క్రిందుపడ కాలను రాచె ననన్యశక్తి మై


నీలో గాంచెను శత్రుభీకర ప్రధానీదంష్ట్ర మృత్యున్మహా
లీలానాట్యము, కాళికావికట హేలా వైరి సంహారమున్
నీలోగాంచిరి కాందిశీకు లతి శాంతిస్ఫూర్తి వాత్సల్య రే
ఖాలాలిత్యమనంత శీతకరుణా కాశీ మహా పూర్ణమున్

జారినదేశ గౌరవము జాగృతమై వెలుగొంద యుద్ధసం
భారముశాంతి దాంతి పరమార్థముగా నడిపించి, జీవనా
ధారము గోలుపోయిన యనాథ జనావళి జీర్ణమందిర
ద్వారములందు పచ్చవిరిదండలు గట్టితి స్నిగ్ధభావనన్

అంతిమ విజయం

స్వేచ్ఛ గురించి, సౌభ్రాత్ర్వం గురించి చేసే పోరాటం అంతిమంగా
విజయం పొందుతుందన్న ప్రగాఢ విశ్వాసం నాకు వుంది


— ప్రధాని




గాంధీ – నెహ్రూ

గాంధీ – పటేల్


స్వాతంత్ర్య సంగ్రామం





రథ సారథులు

స్వాతంత్ర్య పథంలో...
రాజ్యాంగ నిర్ణయ సభలో నెహ్రూ



కవిగా ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య

కర్ణమాచెము కుటుంబశాస్త్రి

స్వర్గీయ శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు తెనుగు నాటి ప్రముఖ దేశసేవకులలో ఒకరు. ఆదరాభిమానములతో ప్రజలు ఆయనను ''ఆంధ్రరత్నము'' అని అనినారు. ఆయన మహా మేధావి. వేలాది జనులను, సభావేదికలనుండి తన అనర్గళ వాగ్ధాటితో, మంత్రముగ్ధులను గావించిన మహా వక్త. అపర ''రామదాసు''గా ప్రసిద్ధి వడసిన శ్రీరామభక్తుడు. ''చీరాల, పేరాల, వీరుడు''గా పేరొందిన భారత స్వాతంత్ర్య సమర యోధుడు. సంస్కృతాంధ్ర భాషలయందు శ్లోకములు, పద్యములు ఆశువుగా చెప్పిన కవీశుడు. ప్రతిభా, వ్యుత్పత్తులు, ఆయన సొత్తు. ఆవేశము, అభ్యాసము ఆయనకు అలంకారములు. దైవానుగ్రహము గూడ తోడయ్యెను. ఆయన రాజకీయములలో పాలుగొన కున్నను, ఒక మహాకవిగా కీర్తినొందియుండెడివాడు।

నలుబది యేండ్లైన నిండకయే, 1928 లో ఆయన అమరత్వ మొందెను. ఆయన దీర్ఘాయుష్మంతుడై యుండినచో, తన సరస కవితా కాలక్షేపములతో, ''ఆంధ్రావళి మోదముంబొరయు'' నటుల చిరకాలము కవితాసేవ చేసియుండెడివాడేమో! సమకాలిక వ్యక్తులను, సన్నివేశములను, సంఘటనలను, ఆయన, చాటువుల రూపమున వర్ణించి, విమర్శించెడివాడు భక్తిభావములు, చమత్కారము, సమయస్ఫూర్తి, ఆయన కవితలో తొంగిచూచినవి.

గురజాడ అప్పరాయ కవి తెనుగువారికి ప్రసాదించిన ముత్యాల సరము అను ఛందమున, ఆంధ్రరత్నము, నవ్యరీతిలో గేయములు వ్రాసెను.

శ్రీవిభుడు శ్రీరామచంద్రుడు
భూవిభుడు కోదండరాముడు
భువిని వెలసెను రామనగరిని
కవిజనాశ్రయుడై

1926 సంవత్సరమున మంగళగిరిలో ఔషధ సేవచేయుచు కొంతకాలముండి, తన రామనగరికి తిరిగి వెళ్ళుచు ఆయన చెప్పిన ఈ క్రింది వృత్తము తిరుపతి వేంకటకవుల శైలిని జ్ఞప్తికి తెచ్చుచున్నది:

ఎండల కోర్వలేక, యిటులింటికి వచ్చితి నంతెకాని, నీ
యండనువీడలేదు, భవదంఘ్రియుగంబు, సదా, మదీయ హృ
న్మండలి నిల్పినాడ, ననుమానము వీడవె, నాదు జాడ్యమున్
చెండవె, మంగళాద్రి నరసింహా! సుధాలయ! పానకాలయా!!



1924 సంవత్సరమున గాంధీమహాత్ముడు ఢిల్లీ నగరమున ఉపవాస దీక్షబూనగా సమకాలిక సంఘటనలను వివరించిన పూర్వ శతక కవులను ఎరపించుచూ ఆంధ్రరత్నము దానిని యిటుల వర్ణించెను.

''వాదవై ఖరిదోలి, వేదాంత రతిదేలి
స్వారాజ్యపారంబు జేరుకొరకు
హింసాపథాగత ధ్వంసి యౌ ధర్మంపు
వంశం బహింసచే వర్ధిలుటకు
లోక కళ్యాణంబు చేకూర్ప నాత్మార్ప
ణమ్మను నార్షపథమ్ము తుదకు
పూనినాడు మహాత్ముడు భూభరమ్ము
బాపగా నేడు మహదుపవాస వ్రతము
ముక్తి సుముహూర్త వేళలు మూగిన విక
రామనగరీ నరేంద్ర ! శ్రీరామచంద్ర !!''

దేశోద్ధారకులు, విశ్వదాతృకళాప్రపూర్ణులు, ''ఆంధ్రపత్రికా'' ''భారతీ'' సంస్థాపకులు అగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారిని, ఆంధ్రరత్నము ఇటుల కీర్తించెను.

''లక్షలాధిగ డబ్బు దీక్షతో సమకూర్చి,
భిక్షు కోటిని గాచు దక్షు డెవడు
అట్టి కాశీనాథుని నాగ యాహ్వయుందు
పుట్టకుండిన ఆంధ్రంబు పుట్టిమునిగి
గిటకుండునె ఏనాడొ అట్టెనీల్గి
రామనగరీ నరేంద్ర ! శ్రీరామచంద్ర !!

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశము పంతులుగారిని,
ఆంధ్రరత్నము ఇట్లు కొనియాడెను.
''కాలభైరవ భీకరోగ్రానల ప్ర
కాశమూర్తి యై క్రాలు ప్రకాశమూర్తి
కలుగ, దేశాని కింకేమి కలుగు కొఱత
రామనగరీ నరేంద్ర ! శ్రీరామచంద్ర !!

గుంటూరు పుర వర్ణన

ఆంధ్రదేశమునకు, ఒకప్పుడు మకుటాయమానమై, రాజధానీ నగర మగుటకు నర్హతలు గలిగి, వివిధ కళాశాలలతో వెలయుచు, కొంతకాలము విశ్వవిద్యాలయమును, మరికొంతకాలము హైకోర్టును భద్రముగ దాచి యిచ్చినదై, స్వాతంత్ర్య సమరమున ప్రముఖపాత్ర వహించి, నేటికిని నిత్యనూతన చైతన్యముతో కళకళలాడు గుంటూరు పురమును గూర్చి, గోపాలకృష్ణుడు కవితావేశముతో నిట్లు గానముచేసెను.

''సకలోద్యమవ్యాప్తి కళంక నిలయమై
శరణిచ్చు పురము గుంటూరు పురము
తిక్కనాది కవీంద్ర దిగ్గజేంద్రవిహార
సార ధాతలము గుంటూరు పురము
దేశ కళ్యాణ సందేశ నిర్వహణాఖ్య
ఘోరాధ్వ భూమి గుంటూరు పురము
ఆంధ్రావనీ స్వరాజ్యాప్తి యౌ వేళల
మా రాజధాని గుంటూరు పురము.''

ఇక ఆనాటి గుంటూరివారు ఎట్టివారో!

''శ్రీ మదాంధ్రావనీ క్షేమ మీమాంస వి
స్తార పూరితులు గుంటూరివారు
నిఖిలాంధ్ర నేతృత్వ నిరుపమ ప్రజ్ఞా ప్ర
కార ప్రాంగులు గుంటూరివారు
ధర్మ సంగ్రామ సందర్భ నిర్భరవాక్య
పూరా గ్రవరులు గుంటూరివారు.''

సంస్కృత కవిత

ఆంధ్ర రత్నము సంస్కృతమున గూడ, చక్కని శ్లోకములను, అలవుగ, చెప్పిన గొప్పకవి.

తిరుచిరపల్లి చెఱసాల నుండి విడుదలకాగానే, శ్రీరంగ క్షేత్ర స్వామిని దర్శించి ''శ్రీరంగనాథ ప్రబోధము'' అను శ్లోక నవరత్నమాలను చదివెను. సరళశైలిలో ఉన్నది.

''సదావాశ్రీరంగే, భవరస తరంగే, ఫణితలే,
శయానం, స్వారాజ్యాసన ఘనశయానం, హృదిభజన్!
అయే రంగస్వామిన్ తమిళజన సంభావిత విభో!
ప్రసీదేతి క్రోశన్నిమిష మివ నేష్యామి, దివసాన్''

(సంసార సారపు వీచికయైన శ్రీరంగమున, పాముపానుపునందు, స్వరాజ్యము అను సుఖాసనమున, ఘనముగా శయనించియున్న యో రంగస్వామీ! తమిళనాటి జనులు వినుతించు విభుడా! నిన్ను హృదయమున భజించుచు, నీ సాన్నిధ్యమున, దినము నొక నిముసముగా గడుపగలను.)

కేవలము శ్రీరంగనాథుని గీర్తించుటతో నాగలేదు కవి. భారతదేశ పారతంత్ర్యమును గూర్చి, విభునకు విన్నవించుకొనుచున్నాడు, ఆంధ్ర రత్నము.

''ప్రాచీభాగే విరాగే జగతినంపతి జామ సంగ్రామికా భ్యాం
హిందూస్థానే, పరాణే, ధృతభరత సుతప్రాణ హారేకృపాణే
ఆంధ్రాయాం ప్రాద్య విద్యానగర నృపయశశ్శృంగ భంగావసానే
ఆయా తాస్వాంగ్ల జాతావణిజగణమిషేణాత్ర చిత్రార్థ తంత్రాః ॥

(తూర్పు దేశమగు హిందూ స్థానమున, మొదట పఠాణుల వలన, భారతీయులు ప్రాణములను గోలుపోయిరి ఆంధ్ర విజయ నగర రాజులకు సైతము, పరాభవము ఏర్పడనున్న సమయమున, విచిత్ర తంత్రములు గల ఆంగ్లేయులు, వర్తకము నెపమున, భారతావనిలో ప్రవేశించిరి.)

ఆంధ్రరత్నము అంతటితో గూడ నాగలేదు. గాంధీ మహాత్ముని యుద్యమమును గుఱించి, దేవునకెఱుక పరచెను:

"దృష్ట్వా, దౌస్థిత్యమేతద్విధికృత మితిసంశోధ్య కారుణ్యసాంద్రః
న్యా మోహ వ్యూహ దాహ ప్రతితులితగృహీతో గ్ర సత్యాగ్రహోయః
ప్రేమా క్రాంత ప్రశాంత వ్రత ప్రణుత మహీ మోహనాంకో మహాత్మా
గాంధీ, స్వారాజ్యగంధీ ప్రవిచల దధునా సఖ్యమైత్రీ ముఖ్య యోగమ్"

(ఇట్టి దుస్థితినిగని, ఇది దైవకృతమని యెంచి, కరుణామయుడగు "మోహనదాసు గాంధి" ప్రేమపూరిత ప్రశాంత చిత్తముతో, ఆంగ్ల పరిపాలకుల యెడ, స్నేహ, విరోధములను ప్రయోగించి, సత్యాగ్రహోద్యమమును సాగించెను.)

పూర్వము ప్రసిద్ధ పండితుడగు జగన్నాథరాయలు, లవంగి యను లతాంగిని ప్రేమించినవాడై, ఇట్లు శ్లోకమును వ్రాసెను:

"నయాచే గజాళిం నవా వాజిరాజిం
నవిత్తేషు చిత్తం మదీయం కదాపి
ఇయం సుస్తనీ మస్తకన్యస్త హస్తా
లవంగీ కురంగీ దృగంగీ కరోతు॥"

(నేను ఏనుగులను కోరను. గుఱ్ఱములను కోరను. ధనము పయి నామనస్సు పోదు. కాని లేడిచూపులు గల ఈ లవంగీ లలన నన్ను అంగీకరించు గాక.)

పై శ్లోకపు పోకడలోనే, శృంగారాంశమునుగాక, రాజకీయ విషయమును ఎంతయోగంభీరంగా ఆంధ్రరత్నము ఇటులచెప్పెను:

"నయాచే "రిఫారం" నవా "స్టీలు ఫ్రేముం"
న''కౌన్సిల్'' నతు ''ప్రీవీకౌన్సిల్'' పదం వా
స్వరాజ్యార్తి హన్త్రాంగ్ల రాజ్యే నియంతా
ఫరంగీ ఫిరంగీ దృగంగీ కరోతు॥"

(నేను రాజకీయ సంస్కరణములను, కోరను. ''ఉక్కు చట్రము'' అని పేరొందిన ఐ.సి.ఎస్. ఉద్యోగమును కోరను శాసనసభా సభ్యత్వమును కోరను. ప్రీవీ కౌన్సిలులో న్యాయమూర్తి పదవిని కోరను. మన స్వరాజ్య కాంక్షను చంపివేయుచున్న ఆంగ్ల రాజ్య నియంతలును, ఫిరంగీ ఆయుధముల పైననే దృష్టిగల వారును పరదేశీయులు నన్ను అంగీకరించుదురు గాక.)

ఆంధ్రరత్నము సహృదయ విస్ఫూర్తి గల సుధీచక్రవర్తి. ఆయన ఆస్యమున హాస్యము లాస్యము చేయుచుండెడిది. తనను గూర్చి తానే యిటుల చెప్పుకొనెను:

పేదాంతి ఘులతోడ వెక్కిరింతల తోడ
లెక్చర్లు సాగించు. లీల, నెవడు
లక్ష్యమొ ప్పటి లేక, యక్షగానములతో
కాలము వృథ బుచ్చు ఘనుడెవండు
ఆ ధ్ర ర్నము"నంచు సహాయకితో, పెద్ద
పిన్నలంచును, మది నెన్న డెవడు

గీ॥ ఆట్టి గోపాలకృష్ణుని హాస్యనరశి
గోపు ఎృష్ణ గా జేసి, కొఱఁట దీర్చె"

ఆయన వాక్కులు కొన్ని కోపము లిగి చునవిగా నున్నను, వానిలోని చాతుర్యమునను జనులు సంతసించిరే కాని, వాని పారుష్యమును పట్టించు కొనలేదు.

సూక్తులు

ఆయన సూక్తులు కొన్ని ముచ్చటించు కొందము. "Laughter lubricates the Soul" అన్నాడాయన అనగా, నవ్వు ఆత్మను మెత్తపరచి, ఒత్తిడి తగ్గించును అని. "హైదరాబాదు నిజాముగారు భద్రాద్రి రాముడికి ముఖ్యట్రస్టీ కావ టండీ" అన్నాడు ఒకసారి ఆంధ్ర రత్నము అది "హిందూ ముస్లిమ్ సఖ్యతా సూచకము" [illegible] భావన. గుంటూరు క్రైస్తవ కళాశాలలో ఒకనాడు సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు వక్తగాను, ప్రిన్సిపాలు [illegible] గాను ఉండిరి అప్పుడు మన ఆంధ్ర రత్నము "ఇండియా ఉపన్యసించును. అమెరికా అధ్యక్షించును" అని చమత్కరించినాడు.

మోతీలాల్ నెహ్రూ, ఆయన కుమారుడు జవహర్ లాల్ నెహ్రూ, ఆయన భార్య కమలా, ఆయన కూతురు శ్రీమతి ఇందిరాగాంధి (నేటి మన ప్రధానమంత్రిణి), ఆయన తోబుట్టువులు, కృష్ణా, విజయలక్ష్మి, అందరు ముచ్చటగా కూడి యుండుట చూచి, మన గోపాలకృష్ణుడు "వీరందరు [illegible] రాయి దుకాణములోని పంచదార చిలుకల లాగా ఉన్నారే" అన్నాడు. జాతీయోద్యమము నకు సుముఖుడుగా లేని ఆనాటి మదరాసు ముఖ్యమంత్రిని జూచి, "వారి సీటును వారికిచ్చి, సిగ్గుతోడను నీవు పోవోయ్ రాజా" అని పాట పాడించెను. "దేవుడు గుంటూరులో పొగాకుగా వెలసెను" అన్నాడు ఒకసారి ఆంధ్ర రత్నము. అనగా, దానిపైననే ఆధారపడు గుంటూరు మెట్టప్రాంతము [illegible] దేవుడు పొగాకు పంటను జీవనాధారముగ జూపినాడు అని [illegible]. "నా" అంటే "రాజ్యం" "మా" అంటే మన "రాము" [illegible] స్వరాజ్యము ఉన్నది అని [illegible] రామభక్తితో ముడిపెట్టాడు [illegible] గోపాలకృష్ణుడు. "రామ దండు" అను పదము [illegible] శ్రీ ఉమర్ అలీషా కవి గారికి, "అలీషా [illegible] సమానమండీ? అని తిరుగు ప్రశ్న వేశాడు ఆంధ్ర రత్నము. దేశబంధు చిత్తరంజన దాసుగారితో మన గోపాలకృష్ణుడు, నేనూ సి. ఆర్. దాసునే అన్నాడు. అనగా "చీరాల [illegible] దాసు" అని. ఇట్టి చమత్కారోక్తులు ఆయనవి పుట్టలుగా వున్నవి.

ఆంధ్ర రత్నము [illegible] "అనల్పార్థ రచన" [illegible] బిరుదు [illegible], చాటుధాటుల [illegible] పండితుడు, నేతాజీ [illegible] సుభాస్ [illegible] పటేల్ వలె క్రియావాది. [illegible] వలె తాత్త్వికుడు. [illegible] హస్తము, [illegible]

ఆయన వక్తగా "[illegible]" [illegible]. ఉపన్యసించుట [illegible] మన జాతికి తగిన పద్ధతి యని యాయన యభిప్రాయము. ఆయన ప్రసంగములు ఆపాతమధురములు; ఆలోచనామృతములు కూడా. ★

భారత కేతనము

మాచెళ్ళ రామనరసింగ రావు

ఈ పతాకంబును స్థాపింప నెందరో
చెరలందు క్రుంగి కృశించినారు,
ఈ కేతనార్థమై యెందరో యోగ్యులు
కంఠ రక్తంబులు కార్చినారు.

ఈ ధ్వజంబును నిల్ప నెందరో సర్వస్వ
మును వీడి పలు వ్యథల్ పొందినారు
ఈ సిడంబునకునై ఎందరో మానినీ
మణులు కష్టంబుల క్రుగ్గినారు.

వారి త్యాగంబు, స్వాతంత్ర్యవాంఛ, దీక్ష
వారి దేశభక్తియును నిస్స్వార్థ బుద్ధి
మూడు రంగుల జెండాగ నేడు మనకు
కనుల పండువయగుచు సాక్షాత్కరించె.

సత్య ధర్మక్షమా శాంత గుణంబుల
భారతీయుల సాటి లేరటంచు.
మన కార్య సాధన కౌశలంబందున
భారతీయుల సాటి లేరటంచు
శౌర్య ధైర్య స్థైర్య సాహస గుణముల
భారతీయుల సాటి లేరటంచు
లోక కల్యాణంబు చేకూర్చు సత్కృషి
భారతీయుల సాటి లేరటంచు

ఖండ ఖండాంతరముల నుద్దండ లీల
దశదిశలు మారుమ్రోయగ విశదగతిని
పలుకుచుండెను భారత ధ్వజము నేడు;
ఎల్లవారల హృదయంబు లుల్లసిల్ల.

పుట్టినారలు కదా భువన విఖ్యాతమౌ
పరమ పావనమైన భరత భూమి;
నిలిపినారలు కదా నిర్భిద్ర శాంత సం
గ్రామ రంగముల భారతయశంబు.
తలచినారలు కదా దారుణ బాధల
స్వాతంత్ర్యమునకు సోపానములని.
అందినారలు కదా యావత్ప్రపంచ ప్ర
శంస హింసా విసర్జన మొనర్చి.

అట్టి ప్రతిభాసమన్వితులైన జనులు
స్వల్ప విషయమ్ములన్ మదినిల్పి సుహిత
కార్యచింతన విడుట యుక్తంబు గాద
టంచు, మన కేతనంబు వచించుచుండె.

ఒక దేశమందున నుద్భవించిన జనుల్
తారతమ్యము లెట్లు తలుపగలరు ?
ఒక నీరు, ఒక గాలి, ఒక యగ్ని యుండుచో
కులభేదముల నెట్లు తలుపగలరు ?
ఒక జగదీశునే యుల్లంబు నందెంచి
పలుమతంబుల నెట్లు తలుపగలరు?
ఒక మహాత్ముడు స్వేచ్ఛ యొసగె నెల్లరకును
తత్ బోధవిడనెట్లు తలపగలరు ?

భారతము రత్న గర్భ, ఆ భాగ్యములను
అనుభవించుచు హాయిగ నలరలేక
వ్యర్థ వాదంబు లొనరింప పాడిగాద
టంచు మువ్వన్నె జెండా వచించుచుండె.

గౌతము, శంకరు, చైతన్యు, వల్లభు
నానకున్ బెంచిన స్థానమిదియె.
మౌర్య సింహు నశోకు మహనీయు నక్బరు
దిద్దితీర్చిన యట్టి దేశమిదియె.
చాంద్ బీబీ, రుద్రమ, ఝాన్సి లక్ష్మీబాయి
మాంచాల వెలసిన క్ష్మాతలమిది.
రామదాసు, కబీరు, రామకృష్ణుని, వివే
కానందు గనినట్టి యవని యిదియె.

పూర్వ విఖ్యాతినిల్ప, నమోఘకార్య
తతి నొనర్పుడు; ఐకమత్యంబు గలిగి.
భారతీయులటంచును బలుకుచున్న
మన ధ్వజంబున కివియె, నమస్కృతములు.

ఆంధ్రదేశాన్ని ప్రభావితం చేసిన మూర్తిత్రయం

కంచి వాసుదేవరావు

ఆంధ్రదేశ జాతీయ పునరుజ్జీవన చరిత్రలో మచిలీపట్నం నిర్వహించిన పాత్ర అద్వితీయమైనది. అపూర్వమైనది. ఈ బందరుకు ఈ ఘనత దక్కించిన వారు బందరు మూర్తిత్రయంగా వినుతి కెక్కిన స్వర్గీయ పట్టాభి, ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు గార్లు—

ఈ మూర్తిత్రయ స్వరూప స్వభావాలలో ఎన్నో తేడాలున్నాయి. ఐనా వారి ఆశయాలు—ఆలోచనలు ఒక విధంగానే వుండేవి. ఆంధ్రదేశంలో జాతీయ పునరుజ్జీవనానికి మూడుమార్గాలలో వీరు కృషిచేసినా, ఈ మూడింటికి సమన్వయతను సాధించారు.

ఈ శతాబ్దం మొదటి రెండు దశాబ్దాల్లోనే వీరి కీర్తి ఆంధ్ర దేశమంతా విస్తరించింది. అప్పటికే డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు అఖిల భారత జాతీయ కాంగ్రెసు అగ్ర నాయకులలో ఒకరుగా వుంటూవుండేవారు. మహాత్మాగాంధీ నాయకత్వం క్రిందకు కాంగ్రెసు పూర్తిగా వచ్చిన తర్వాత గాంధీజీ సన్నిహితులలో ఒకరుగా, "వైశ్యసూత్ర కారునిగా, బ్రాహ్మణ భాష్యకారుడుగా" కీర్తింపబడారు. ఆయన మహామేధావి — సునిశితమైన జ్ఞాపక శక్తి అద్భుత విషయ పరిజ్ఞానం అందరికీ ఆయనను గౌరవపాత్రుడుగా చేసాయి త్రిపుర కాంగ్రెసులో ఆ రోజుల్లో అత్యంత ప్రతిష్ఠ గల కాంగ్రెసు అధ్యక్ష పదవికి మహాత్మా గాంధీ ఆశీర్వాదాలతో ఆయన సుభాష్ బోసుతో పోటీ చేశారు. అతి తీవ్రంగా జరిగిన పోటీలో డా॥ పట్టాభి పొందిన ఓటమిని మహాత్మాగాంధీ తనదిగానే భావించుకున్నారు.

ఐతే 1948లో జరిగిన జైపూరు కాంగ్రెసు మహాసభలకు శ్రీ పురుషోత్తమ దాసు టాండన్‌తో పోటీచేసి గెలుపొందారు. ఐతే అప్పుడే కాంగ్రెసు పదవికి మునుపటి ప్రతిష్ఠ తొలగి పోయింది— ప్రధానమంత్రి అభీష్టాలకు ఒదిగి నడుచుకోగల వారే కాంగ్రెసు అధ్యక్షునిగా నిలవగల పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెసు అధ్యక్షుడిగా ఆయన సాధించినది చెప్పుకోదగ్గది కాదు.


కాంగ్రెసు అధ్యక్ష పదవినుండి విరమించుకున్న తర్వాత ఆయన ప్రధాని నెహ్రూ ప్రసాదించిన మధ్యప్రదేశ్ గవర్నర్ పదవి స్వీకరించి. రాజకీయాల నుండి విరమించుకున్నారు.

"కాంగ్రెసు చరిత్ర"

ఐతే డా॥పట్టాభిగారు సాధించిన విజయాలు వేరే వున్నాయి—ఆయన వ్రాసిన కాంగ్రెసు చరిత్ర, భారత దేశ చరిత్రలో ఆయన పేరును సుస్థిరం చేస్తుంది. నిజంగా అది వ్రాసినంత వరకు సమగ్రమయిన నిర్దుష్టమయిన చరిత్ర—ద్వితీయభాగం రాకపోవడం దేశం చేసుకున్న దురదృష్టం—దేశ స్వాతంత్ర్య చరిత్రలో, డా॥ పట్టాభి గారు వ్రాసిన కాంగ్రెసు చరిత్ర అద్వితీయమైనదీ, అపూర్వమైనదీ—చరిత్రకారునిగా వారిపేరు సుస్థిరం చేసేది.

డా॥పట్టాభి గొప్ప పత్రికా సంపాదకుడని చాలమందికి తెలియదు. ఆయన కొన్ని సంవత్సరాలు మచిలీపట్నం నుంచి జన్మభూమి అనే ఆంగ్ల వారపత్రికను నడిపారు—ఆ పత్రిక విశిష్టతను సుప్రసిద్ధ పత్రికా రచయిత, సంపాదకులు స్వర్గీయ కుందూరి ఈశ్వరదత్తుగారి మాటల్లోనే చెప్పుకుందాం.

"1919 డిసెంబరు మొదట్లో డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు అప్పుడే మచిలీపట్టణం నుంచి ప్రారంభించిన ఆంగ్ల వార పత్రిక జన్మభూమి రెండవసంచిక చూశాను. దాన్ని చదివాను. మళ్లీ మళ్లీ చదివాను. నాకు ఆ పత్రికను డబ్బుపెట్టి తెప్పించుకునే స్తోమతు లేకపోయినా చందా కట్టాలని నిశ్చయించు కున్నాను. నేను డబ్బుఅప్పు చేసి చందాదారుగా చేరాను. నాలో పత్రికా రచనాభిలాషకు ఒక నిర్దుష్టమైన స్వరూపాన్ని యిచ్చి నాలో యువకత్వపు ఆకాంక్షలు రేకెత్తించింది జన్మభూమి. ఆ పత్రిక ప్రారంభం నుండి 1930 మే లో పత్రికా సంపాదకుని అరెస్టు కారణంగా హఠాత్తుగా ఆగిపోయేవరకు వారం వారం ఆ పత్రిక ఎంతో మానసికోత్తేజం కలిగించేది నేను



పట్టాభి

బుద్ధి పూర్వకంగా ఆ పత్రిక సంచికదేన్నీ చదవకుండా వదలలేదు - నాకిన్న ఆసక్తి గల పాఠకుడిని ఆ పత్రిక చూచి వుండదు."

డా॥ పట్టాభిగారు కొన్నాళ్లు కృష్ణా పత్రిక సంపాదకులుగా వున్నారు. ఆ సంగతి తర్వాత ప్రస్తావిస్తాను.

"ఫెదర్స్ అండ్ స్టోన్స్", "గాంధీయిజం సోషలిజం"_ఈ రెండూ రచయితగా డా॥ పట్టాభిగారికి గొప్పపేరు తెచ్చి పెట్టాయి. విషయంలోనూ శైలిలోనూ అవి రచయిత ప్రతిభకు తార్కాణాలు.

ఆర్థిక రంగంలో

ఇవన్నీ ఒకయెత్తూ ఆర్థిక రంగంలో పట్టాభిగారు చేసిన కృషి మరొక ఎత్తూ. ఆంధ్ర దేశంలో బ్యాకింగ్, ఇన్సూరెన్సు కంపెనీలు [ఆంధ్రులచే స్థాపించబడినవి] లేనప్పుడు డా॥ పట్టాభి సీతారామయ్యగారు ఆంధ్రా బ్యాంకు స్థాపించారు. మచిలీపట్నంలో ఇంపీరియల్ బ్యాంకు ఏజెంటుతో వచ్చిన ఓ మాట పట్టింపు పట్టాభిగారు ఆంధ్రబ్యాంకు స్థాపించడానికి కారణమయిందంటారు. ఏమయితేనేం నూటికి నూరుపాళ్లు ఆంధ్రులు పొదుపుచేస్తున్న డబ్బుతో, ఆంధ్ర ప్రదేశమంతటా విస్తరిల్లిన బ్యాంకు ఆంధ్రాబ్యాంకు అనడంలో ఎట్టిసందేహం లేదు_అంతేకాదు. 'ఇన్సూరెన్సు' చేయడమంటే అశుభకార్యంగానూ, ఇన్సూరెన్సు ఏజంటును యమకింకరుడుగానూ భావించే రోజుల్లో. ఆయన ఆంధ్రా ఇన్సూరెన్సు కంపెనీ స్థాపించి ప్రజలలో ఇన్సూరెన్సు పట్ల సుముఖభావం కలిగించారు. ఆ తర్వాత డా॥ పట్టాభి భారత లక్ష్మీబ్యాంకు స్థాపించారు_హిందుస్థాను ఐడియల్ యిన్సూరెన్సు కంపెనీ స్థాపించారు- వీటన్నిటికీ కేంద్ర కార్యాలయం మచిలీపట్నమే.

ఆయన మరణానంతరం ఆంధ్రాబ్యాంకు భారతలక్ష్మి బ్యాంకు, ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ, హిందూస్థాను ఐడియల్ ఇన్సూరెన్సు కంపెనీలు ఆంధ్రాబ్యాంకు, హిందూస్థాను ఐడియల్ ఇన్సూరెన్సు కంపెనీలుగా విలీనమయ్యాయి. ఐతే యీరెండింటి ప్రధాన కార్యస్థానములు మచిలీపట్నం నుండి హైదరాబాదుకు తరలింపబడ్డాయి.



ముట్నూరి

బ్యాంకింగ్ యిన్సూరెన్సు వ్యాపారం ఆంధ్రదేశంలో విస్తరిల్లిందంటే అందుకు డాక్టరు పట్టాభి కారణం.

మూర్తిత్రయంలో రెండవవారు కృష్ణా పత్రిక సంపాదకులు శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు. రాజర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు బందరు కళాశాలలో పనిచేసినపుడు శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు ఆయనదగ్గర చదువుకున్నారు. సాహిత్యం పట్ల, వేదాంతం, బ్రహ్మసమాజ మతంపట్ల అభిరుచి అప్పుడే వారికి కలిగింది.

1902లో కృష్ణాజిల్లా సంఘంవారు దేశభక్త కొండా వెంకటప్పయ్యగారి సంపాదకత్వ నిర్వహణలో కృష్ణాపత్రికను స్థాపించారు. ఆ తర్వాత బహుకొద్ది కాలానికే కృష్ణాజిల్లా, కృష్ణా గుంటూరు జిల్లాలుగా విభజించబడడంతో వెంకటప్పయ్య గారు కృష్ణాపత్రికను వదిలి గుంటూరు వెళ్ళిపోయారు. తర్వాత శ్రీ అవటపల్లినారాయణ రావుగారు కృష్ణాపత్రిక సంపాదకులయ్యారు. అప్పుడే శ్రీ కృష్ణారావుగారు ఉపసంపాదకులుగా చేరారు. శ్రీ నారాయణరావు గారు మరణించాక శ్రీ కృష్ణారావుగారు సంపాదకులయ్యారు. ఆ రోజుల్లో వందేమాతరం ఉద్యమ నాయకులు శ్రీ బిపిన్ చంద్రపాల్ ప్రభావం ఆయనపై బాగా పడింది.

తీవ్ర వాదిగా.. ముట్నూరి

తీవ్రజాతీయ భావాలుగల శ్రీ కృష్ణారావుగారు "తెల్లవారిని తుపాకులతో కాల్చండు" అనే వ్యాసాన్ని ప్రచురించారు. కాని ఆ వ్యాసం చాలా తీవ్రంగావుందని ఆ సంచిక బయటపడితే ప్రమాదమని గుర్తించి, ఆ ప్రతులన్నీ ధ్వంసం చేశారు. కానీ జరుగవలసినది జరుగనే జరిగింది. ఒకప్రతి చండశాసకుడైన జిల్లా మాజిస్ట్రేటుకు జేరింది. ఆయన బ్రిటిషు జాతీయుడు-రాజద్రోహకరంగా ఆ వ్యాసం ఉన్నదని ఆ పత్రికపైనా ఆ పత్రికా సంపాదకునిపైనా అతికఠిన చర్యలు తీసుకోవాలని తలపోశాడు. ఐతే అదృష్టవశాత్తు అప్పుడు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వేడింబి హనుమంతరావుగారు వుండేవారు. కృష్ణా పత్రిక వ్యవస్థాపకులతో ఆయనకు స్నేహం — జిల్లా మాజిస్ట్రేటుకు ఆయనపట్ల గౌరవం. శ్రీ హనుమంతరావుగారు జోక్యం కలుగజేసుకున్నమీదట, ఆ వ్యాస రచయితను పత్రికనుండి తొలగిస్తే ఏ చర్యా తీసుకోనని ఆ మాజిస్ట్రేటు చెప్పాడు. అప్పుడు కృష్ణా పత్రిక నిర్విఘ్నంగా కొనసాగడానికీన్నీ, శ్రీ ముట్నూరి కృష్ణారావుగారిని జైలు శిక్షనుండి తప్పించడానికీన్నీ డా॥ పట్టాభి సీతారామయ్యగారు పూర్తిగా పత్రికను స్వాధీనపరచుకొని రెండు మూడేళ్ళు కాబోలు సంపాదకులుగా పనిచేశారు. ఆ తర్వాత శ్రీ కృష్ణారావుగారికి తిరిగి పత్రికను అప్పచెప్పారు, కొంత మూలధనంతో సహా!

ఆ నాటినుంచీ కృష్ణాపత్రికకు సంపాదకుడూ, ఉద్ధారకుడూ, యజమాని సర్వమూ శ్రీ కృష్ణారావుగారే. 1945లో ఆయన మరణించేటంతవరకు కృష్ణా పత్రికకు ఆంధ్రపత్రికా లోకంలో అద్వితీయమైన స్థానం సంపాదించి పెట్టారు. ఆయనవంటి సంపాదకుణ్ని ఆంధ్రలోకం యింతవరకు చూడలేదు. బహుశః తక్కిన దేశాల్లో కూడా ఆయన వంటి సంపాదకులు బహు అరుదుగా వుంటారు.

జాతీయోద్యమ కాలంలో కృష్ణాపత్రిక పూర్తిగా దానిలో తాదాత్మ్యం చెందింది కాంగ్రెసు వాణిగా అది ఆంధ్రదేశమంతటా ప్రతి ధ్వనించింది. ప్రతి గ్రామంలోనూ రచ్చబండ దగ్గర ఒకరు పత్రికలోని కృష్ణారావు గారి సంపాదకీయాన్ని చదువు తుంటే పెక్కుమంది శ్రద్ధా సక్తులతో వింటూ వుండేవారట.

ఆ శైలి, ఆ భాషాపటిమ, ఆ విషయ వివరణ అనితరసాధ్యము. ఆంధ్ర పత్రిక న్యూస్ మాగజైనుగా, కృష్ణాపత్రిక న్యూసు మాగజైనుగా ప్రతిష్ఠ సంపాదించుకున్నాయి. కృష్ణాపత్రికను ఆంధ్రా మాంచెస్టర్ గార్డియన్‌గా పేర్కొనేవారు.

1929లో విజయవాడలో ఆంధ్ర, కృష్ణా పత్రికల సంపాదకులకు ఘనంగా పౌరసన్మానం జరిగింది. పత్రికాసంపాదకులకు యింతటి ప్రజాసన్మానం జరగడం బహుశః అదే తొలిసారి, మలిసారి కూడానేమో!

కృష్ణా పత్రికలో రచన ప్రచురింపబడితే రచయితగా ఒకగుర్తింపు లభించేది. తమరచనను ఎప్పుడో ఒకప్పుడు కృష్ణా పత్రికలో ప్రచురించని రచయిత ఆంధ్ర దేశంలో లేడంటే అతిశయోక్తి కాదు.

దర్బారు

ప్రతిరోజు సాయంత్రం కృష్ణాపత్రిక కార్యాలయంలో దర్బారు జరిగేది. అందులో రాజకీయ, సాహిత్య, కళా విషయాలపై చక్కటి చర్చలు జరుగుతూ భువనవిజయం గుర్తుకు వచ్చేది. ఆంధ్రదేశంలోని రచయితలకు సాహితీ ప్రియులకు కృష్ణాపత్రిక కార్యాలయం ఒక యాత్రాస్థలంగా వుండేది. కృష్ణాపత్రికా ప్రభావం కొద్దో గొప్పో పడని తెలుగు పత్రిక ఆ రోజుల్లో వుండేదికాదు.

శ్రీ కృష్ణారావుగారి మరణానంతరం పద మూడేళ్లు కృష్ణాపత్రిక బందరులోనే నడచి, ఆ తర్వాత మద్రాసు, హైదరాబాదు, విజయవాడలకు మార్చబడి ప్రస్తుతం తెనాలి నుండి ప్రచురింపబడ్తుంది.

జాతీయ కళాశాల

మూర్తిత్రయంలో మూడవ వారు శ్రీ కోపల్లె హనుమంతరావుగారు. అప్పటి విద్యావిధానం ఆయనకు నచ్చలేదు, జాతీయ విద్యనేర్పాలనీ, వృత్తి విద్యనేర్పాలనీ, చిత్ర కళలో దేశీయమైన శైలికి ప్రోత్సాహం చేకూర్చవలెనని ఆయన కలలుగన్నారు. దాని ఫలితమే ఈ శతాబ్దపు తొలిదశాబ్దిలో స్థాపించబడిన ఆంధ్రజాతీయ కళాశాల.

శ్రీ హనుమంతరావుగారు అకాల మరణం చెందకుంటే బహుశః ఆంధ్రజాతీయ కళాశాల మరోశాంతి నికేతన్ అయివుండేది. చిత్రకళా రంగంలో ప్రమోద కుమార్ ఛటర్జీ ఆచార్యత్వాన ఎందరో చిత్రకారులు తయారయ్యారు. ఆంధ్ర జాతీయ కళాశాల శైలి అనే ఒక ప్రత్యేక పద్ధతిని ఆ చిత్రకారులు సాధించారు.

ఎందరో ప్రముఖులు కులపతులుగా ఈ కళాశాలను తీర్చిదిద్దారు.

ఇక్కడ విద్యనభ్యసించిన వారు ఎందరో తర్వాత ఉన్నత పదవులు స్వీకరించారు.

ఐతే శ్రీ హనుమంతరావుగారు అకాల మరణం చెందడమూ, ప్రభుత్వ ప్రోత్సాహం లభించకపోవడం, శ్రీమంతుల సహకారం కళాశాల పోషణకు తగినంతగా లభించక పోవడంతో ఆ కళాశాల మూతపడింది.

1949లో ఆంధ్రజాతీయ కళాశాల ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుబంధం చేయబడి మామూలు కాలేజిగా పునః స్థాపించబడింది. ఇప్పుడు శ్రీ కోపల్లె హనుమంతరావుగారు ఆశయాలను ప్రతిబింబించే విభాగం ఏదీ లేదు, కనీసం ఒక ఆర్టుసెక్షను నైనా కళాశాల నిర్వాహకులు నడపలేక పోతున్నారు.

ఇప్పుడు వెనక్కి తిరిగి చూచుకుంటే డా॥ పట్టాభిగారు స్థాపించిన ఆంధ్రాబ్యాంకు, హిందుస్థాను ఐడియల్ ఇన్సూరెన్సుకంపెనీ, బందరును విడిచిపెట్టేశాయి. డా॥ పట్టాభి గారి గృహం జిల్లాసంక్షేమ కేంద్రంవారు కొన్నారు. కృష్ణారావుగారి కృష్ణాపత్రికకూడా తెనాలికి వెళ్ళిపోయింది. ఆంధ్ర జాతీయ కళాశాల ఒక మామూలు కాలేజిగా, నడుస్తోంది. ఇప్పటికీ నిధులకొరత దాన్ని పీడిస్తూనేవుంది.

ఆంధ్రదేశాన్ని పెక్కు సంవత్సరాలు ప్రభావితం చేసిన ఆ మూర్తిత్రయాన్ని స్ఫురింపజేసే నాయకులు బందరులోనే కాదు ఆంధ్రదేశంలోకూడా అరుదుగా వుంటారు.

లాఠీ పోటులు పూల చెండ్లు, చెఱసాలల్ పెండ్లివారిండ్లు ప్రా
కాఠిన్యంబయినన్ సుఖానుభవమే "గాంధీ కళాశాల"లో
పాఠంబుల్ పఠియించు శిష్యులకు తద్బ్రహ్మాస్త్ర సంధానమే
పీఠంబుల్ కదిలించి సీమలకు పంపెన్ శ్వేతసామ్రాజ్యులన్

—కరుణశ్రీ

శ్రీకాకుళం జిల్లా గిరిజనాభివృద్ధికి పైలట్ పథకం

—టి. ప్రకాశరావు

శ్రీకాకుళం జిల్లా గిరిజనుల ఆర్థికాభివృద్ధికి $1\frac{1}{2}$ కోట్ల రూపాయల ఖర్చుతో పైలెట్ పథకాన్ని ప్రభుత్వం అమలు పరుస్తున్నది. గిరిజనులకు ఇది ఒక వరప్రసాదమనవచ్చు. ఇంతవరకు అమలుపరచబడిన అనేక గిరిజన సంక్షేమపథకాలు జిల్లాలో షెడ్యూలు ప్రదేశాలకు మాత్రమే పరిమితములుగా ఉండేవి. ఈ పైలెట్ పథకం జిల్లాలోని అన్ని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేసేదిగా ఉండడం ఇందలి ప్రత్యేకత. జిల్లాలో 2,08,688 మంది గిరిజనులలో 1,09,168 గిరిజనులు షెడ్యూలులో లేని ప్రాంతాలలో ఉన్నారు. షెడ్యూలులో లేని ప్రాంతాలలో ఆర్థిక సాంఘిక పరిస్థితులు షెడ్యూలు ప్రాంతాల గిరిజనుల కంటె ఏమాత్రం మెరుగుగా లేవు. అందువలన ఇంతవరకు అమలు జరుపబడిన గిరిజన సంక్షేమ అభివృద్ధి పథకాలు షెడ్యూలు ప్రాంతాలకు మాత్రమే పరిమితముగా ఉండడం పెద్ద లోపంగా ఉండేది. ఈ పైలెట్ పథకం అమలువల్ల పై లోపం తీరింది.

ఈ పైలెట్ పథకం దేశంలో 6 ప్రాంతాలలోనే అమలులో ఉంది. మన రాష్ట్రములో ఏకైక బృహత్ పథకముగా శ్రీకాకుళం జిల్లాలో మొట్టమొదట అమలు పరచబడుచున్నదిగా ఉండుట పెద్దగా చెప్పుకోదగ్గ విషయం. ఆర్థికంగా అభివృద్ధి సాధించి వ్యవసాయము, పశు పోషణ, కుటీర పరిశ్రమ, రహదారి, నీటి సౌకర్యాలు గిరిజనులకు కలిగించి తద్వారా వారి ఆర్థికాభివృద్ధిని సాధించుట ఈ పథక లక్ష్యం. ఈ జిల్లాలో 24 పంచాయతీ సమితులున్నాయి. అందులో 13 పంచాయతీ సమితులలో గల 43,200 కుటుంబాల అభివృద్ధి ఈ పథకం వల్ల సాధ్యం కాగలదు. 1974 మార్చి మాసాంతం వరకు ఈ పథకం అమలులో ఉంటుంది.

గిరిజనాభివృద్ధి సంస్థ

ఈ పైలెట్ పథకం గిరిజనాభివృద్ధి సంస్థ అను ఒకసంస్థ ద్వారా అమలు జరుపబడుచున్నది. ఈ సంస్థ ఇటీవలనే రిజిస్ట్రేషను చేయబడినది. సామాన్య ప్రజకు అందుబాటులో ఉండి అన్ని వర్గాల మెప్పు పొందుచున్న శ్రీకాకుళం జిల్లా కలెక్టరు శ్రీ కె. పురుషోత్తం నాయుడు ఈ సంస్థకు అధ్యక్షులుగాను, యువకులు, ఉత్సాహవంతులు సమర్థులు అయిన ప్రాజెక్టు ఆఫీసరు శ్రీ సి.ఎస్. రావు కార్యదర్శి-కోశాధికారిగాను ఉండుటవల్ల ఈ సంస్థవల్ల సత్వర ఫలితాలు పొందగలమని గిరిజనులు ఆశతో నుండుట సహజం. జిల్లా కలెక్టరు అధ్యక్షులుగా, ప్రాజెక్టు ఆఫీసరు కార్యదర్శిగాను, ఒక కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి, జిల్లానుండి ఎన్నికైన ఒక గిరిజన సభ్యుడు, ముగ్గురు గిరిజన శాసనసభ్యులు, వ్యవసాయశాఖ డిప్యూటీ డైరక్టరు, జిల్లా పశువైద్య శాఖాధికారి, జిల్లా అటవీ శాఖాధికారి, రహదారి నీటి పారుదల శాఖలకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, మత్స్య పరిశ్రమల శాఖ అసిస్టెంటు డైరెక్టరు, గిరిజన కార్పొరేషను డివిజనల్ మేనేజరు, విశాఖపట్నంలోని ఏజెన్సీ స్కీము ఆఫీసరు ఈ సంస్థలో సభ్యులుగా వ్యవహరిస్తారు.

గిరిజనాభివృద్ధిసంస్థ స్వయంగా గాని, ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సంస్థలచేగాని పైలెట్ పథకం కార్యక్రమాలను అమలు చేయిస్తుంది. 1974 మార్చి మాసాంతం వరకు అమలు జరిగే ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం $1\frac{1}{2}$ కోట్ల రూపాయల నిధులు గ్రాంటుగా మంజూరు చేస్తుంది.

గిరిజనులు – వారి ఆర్థిక పరిస్థితి

రాష్ట్రంలో ఇతర జిల్లాల కంటె శ్రీకాకుళం జిల్లాలో గిరిజనుల సాంద్రత హెచ్చు. సవర, జాతపు, కొండదొర గదబలు ఇక్కడి గిరిజనులలో ముఖ్యమైన తెగలు. జిల్లాలో గిరిజనులందరు ఏదోవిధంగా వ్యవసాయం మీదనే ఆధారపడిన వారైనా, వారి ఆర్థిక పరిస్థితిపై అడవుల ప్రభావం ఎక్కువ ఉంది. గిరిజనులు వారి నిత్య జీవితావసర వస్తువులు, వ్యాపారానికి సరకులు అడవులనుండే సేకరిస్తూ వుంటారు. అయితే వారి జీవన విధానం, ప్రకృతి విలాసం మీద పూర్తిగా ఆధారపడి వుండడమే విచారకరమైన విషయం.

గిరిజనుల భూములు

గిరిజన ప్రాంతాలలో తక్కువగావున్న సేద్యపు భూములు లాభదాయకంగాలేని చిన్న చిన్న భూఖండాలుగా వున్నాయి. సుమారు లక్ష యకరాల వైశాల్యంగల భూమి, 28,466 పొలాలుగా విభజింపబడి ఉంది. ఉన్న కొద్దిపాటి పల్లపు భూమి గిరిజనేతరుల అధీనంలో ఉన్నది. పాపం గిరిజనులు సారవంతం కాని తమ మెరక భూములనుండి ఎక్కువ పంటను పొందలేక పోతున్నారు. వ్యవసాయంపైనా, అడవులపైనా ఆధారపడే గిరిజనుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని షెడ్యూలు, షెడ్యూలేతర ప్రాంతాల గిరిజనాభివృద్ధికి, గిరిజనాభివృద్ధి సంస్థ దిగువ నుదహరించిన కార్యక్రమాలను రూపొందించింది.

వ్యవసాయం

భూములుండి కూడ ఆర్థికంగా వెనుకబడిన గిరిజనులు, ప్రభుత్వం నుండి బంజరు భూములు పొందిన గిరిజనులు వారి పొలాలను సారవంతంచేసే పరిస్థితులలోలేరు. సారవంతములు కాని భూములకు సత్తువ చేయడానికి హెచ్చు నిధులు, పెట్టుబడులు అవసరము. ఆర్థికంగా బలహీనులైన గిరిజనులకు ఆర్థిక వనరులు లేనందున, సారవంతము చేయుటకు తగిన భూములను ఎంచి, వాటిని వ్యవసాయ యోగ్యముగాచేసే బాధ్యత గిరిజనాభ్యుదయ సంస్థ, అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషనుకు అప్పగించదలచింది. సగం అప్పుగాను, సగం గ్రాంటుగాను ఇచ్చే పద్ధతిపై 33.36 లక్షల రూపాయల ఖర్చుతో 6,600 ఎకరాల భూమిని వ్యవసాయ యోగ్యముగా చేసెడి కార్యక్రమాలను గిరిజనాభ్యుదయ సంస్థ రూపొందించింది.

గిరిజనులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు తెలియచేయడానికి ప్రతి గ్రామములోను ప్రయోగాత్మక క్షేత్రాలను నెలకొల్పడానికి పథకం వేయబడింది. 2.25 లక్షల రూపాయల ఖర్చుతో 4,500 ఎకరాలలో ఈ ప్రదర్శన క్షేత్రములు ఏర్పాటు చేయబడతాయి. ఈ పథకం క్రింద ప్రతి ఎకరానికి షుమారు 50 రూపాయలు గ్రాంటుగా యిస్తారు.

గిరిజనుల అధీనంలో ఉన్న 90 వేల యకరాలలో 28,460 ఎకరాల భూమిలో పంటలు పండించడానికి స్వల్పకాలిక ఋణాలు 28.46 లక్షల రూపాయిలు ఇచ్చే ఏర్పాటులు చెయబడుతున్నాయి. ఈ అప్పులో సగం సబ్సిడీగా యిచ్చి, అప్పు మొత్తం భాగం డబ్బురూపంగాకాక వస్తురూపంగా యిచ్చేడి ఏర్పాటులు కూడా చేయబడుతున్నాయి.

గిరిజన ప్రాంతాలలో భూములున్న 3 వేల మంది గిరిజనులకు వ్యవసాయానికి పశువులు లేనందువల్ల గిరిజనాభివృద్ధి సంస్థ కనీసం 1,000 మంది గిరిజన రైతులకు, 4 లక్షల రూపాయల ఖర్చుతో వ్యవసాయ పశువులను సరఫరా చేసే కార్యక్రమము రూపొందించింది. పశువుల కొనుగోలు ఖరీదు సగం ఋణంగాను, సగం సబ్సిడీగాను యిస్తుంది. 50 శాతం అప్పుగా, 50 శాతం సబ్సిడీగా యిచ్చే పద్ధతిలో 500 మంది గిరిజన రైతులకు ఒక లక్ష రూపాయల ఖర్చుతో వ్యవసాయ పరికరాలు సరఫరా చేసే పథకం కూడా రూపొందించింది.

గిరిజన రైతులు తమ పెరళ్ళలో, పొలాలలో కాయగూరలు పండ్లతోటలు వేసి పండించుకొనుటకు 42,300 గిరిజనులకు 2,50,000 రూపాయలు విలువగల విత్తనాలు ఇస్తారు. వాణిజ్య పంటయైన గోగునార పంటను ప్రోత్సహించుటకుగాను 50,000 రూపాయల ఖర్చుతో 10 వేల యకరాలలో గోగునార పండించడానికి విత్తనాలు, ఎరువులు, స్ప్రేయింగు ఉచితంగా చేయిస్తారు.

షెడ్యూలు ప్రాంతాలకు 2.10 లక్షల రూపాయల ఖర్చుతో ఒక భూసార సంరక్షణ విభాగం నెలకొల్పి, దానిద్వారా 3.40 లక్షల రూపాయిల ఖర్చుతో భూసంరక్షణ కార్యక్రమాలు అమలు చేయడానికి పథకాలు తయారు చేసారు.

స్థిరత్వంలేని పోడు వ్యవసాయంనుండి సుస్థిర వ్యవసాయం వైపు గిరిజనరైతులను మరలించడానికి గిరిజన ప్రాంతాలలో 2 వేల యకరాలభూములను వ్యవసాయ యోగ్యముచేసి ఆ భూములను భూములులేని గిరిజనులకు ఉచితంగా సరఫరా చేయుటకును, వారు పండించుకొనుటకు అవసరమైన స్వల్ప, మధ్య కాలిక పెట్టుబడులను ఉచితముగా యిచ్చుటకును పథకాలు తయారు చేస్తారు. 2 వేల ఎకరాల భూమిని వ్యవసాయ యోగ్యము చేయుటకు 10 లక్షల రూపాయలు ఖర్చు కాగలవని 3,600 ఎకరాలు భూమిని సాగు చేయడానికి 3.60 లక్షల రూపాయల స్వల్పకాలిక పెట్టుబడులు కావలసి ఉంటుందని, 1028 గిరిజనులకు 7.02 లక్షల రూపాయల విలువగల మధ్యకాలిక పెట్టుబడులు అవసరం ఉంటుందని అంచనా వేసారు.

1.40 లక్షల రూపాయల ఖర్చుతో గిరిజన గ్రామాలకు అనుకొనియున్న రిజర్వుకాని 100 హెక్టారుల భూమిలో గిరిజనుల సహాయంతో జీడి మామిడి తోటలు వేసి, తోటలను గిరిజనులకు అప్పగించే పథకం కూడా తయారు చేయబడింది.

రిజర్వు అడవులలో పశువుల మేతకు ఉపయోగపడే, నూనె తీయడానికి ఉపయోగపడే లెమన్ గడ్డిని పెంచడానికి 50 వేల రూపాయిలు కేటాయించారు.

పశుగణాభివృద్ధి

గిరిజన ప్రాంతాలలోని పశువులను మేలురకపు పశువులుగా చేయుటకు పశువైద్య సౌకర్యమున్న భద్రగిరి, గుమ్మ, తాడికొండ, కేదాపురం, గొరడ, పాల్లపెదబగ్గ, సీతంపేట, దోనుబాయి, పాచిపెంట, హీరాపురం, కిల్లోయిగ్రామాలలో 12 ఆబోతులను వుంచడానికి వాటి పోషణకు 1.17 లక్షల రూపాయల ఖర్చుచేసే పథకాలు తయారు చేయబడినవి.

గిరిజన ప్రాంతాలలో పాల అభివృద్ధికి నాందిగా, 50 శాతం ఋణంగా, 50 శాతం సబ్సిడీగా పాల అవసరంగల సీతంపేట గ్రామంలో గిరిజనులకు 50 పాడి పశువులను సరఫరా చేయడానికి పథకం రూపొందించేరు. బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరు అధ్యక్షుడుగా, పశువైద్య విస్తరణాధికారి కార్యదర్శిగా, పాడి పశువులు పొందిన గిరిజనులు సభ్యులుగా గల సహకార సంఘాల్ని నెలకొల్పి, వాటిద్వారా పాల అమ్మకంచేబట్టి, అందులో 40 శాతం డబ్బు అప్పుతీర్చడానికి, మిగిలిన 60శాతం డబ్బు ఆయా గిరిజనులకు ఇవ్వడానికి పథకాలు సిద్ధంచేశారు. 50 శాతం అప్పు, 50 శాతం సబ్సిడీ పద్ధతిలో పాడి పశువుల మేతకు మొదటి సంవత్సరానికి మాత్రం పథకాలు ఏర్పాటు చేశారు. పాడిపశువుల కొనుగోలుకు వాటిపోషణకు 35 వేలరూపాయలు ఖర్చుకాగలవని అంచనావేశారు.

3 గిరిజన బ్లాకు కేంద్రాలలో ఒక్కొక్క కేంద్రమునకు 60 మేలురకపు గొర్రెలను సరఫరాచేసి వాటి ద్వారా స్థానికంగా ఉన్న 3 వేల గొర్రెలను అభివృద్ధిపరచడానికిగాను వీటికి వ్యాధులు సోకకుండా తగుజాగ్రత్తలు తీసికొనుటకు పథకాలు ఏర్పాటుచేశారు.

35 వేల రూపాయల ఖర్చుతో 2 వేల మేలు రకపు కోళ్లను సరఫరాచేసి, వాటి ద్వారా స్థానికంగాఉన్న కోళ్లను అభివృద్ధి చేసే పథకం ఏర్పాటు చేశారు. గిరిజన ప్రాంతాలలో కోళ్ల పరిశ్రమ అభివృద్ధి చేయడానికి సగం అప్పు, సగం గ్రాంటుగా డబ్బు సహాయంచేసే పద్ధతిలో 50 కోళ్ల కేంద్రాలను నెలకొల్పడానికి అభివృద్ధికాముకులైన గిరిజనులకు కోళ్ల విషయంలో విశాఖపట్నంలోగల రీజినల్ కోళ్ళ కేంద్రములో శిక్షణ యిచ్చుటకు ఒక పథకాన్ని తయారు చేసారు. కోళ్ల సరఫరా చేసే పద్ధతిలోనే వాటికి మొదటి ఆరు మాసములకు అవసరమయ్యేడి ఆహారము సరఫరా చేయుటకు ఏర్పాట్లు చేసారు. ఈ కోళ్ల కేంద్రాలు ఏర్పరచే కార్యక్రమాల క్రింద 29 వేల రూపాయలు ఖర్చుకాగలవని అంచనా వేశారు. గిరిజన ప్రాంతాలలో కోళ్ల కేంద్రములు నెలకొల్పడానికి, అవసరమైన కోడి పిల్లలు పొదిగే రెండు యంత్రాలను కొనుటకూ విశాఖ కోళ్ళ కేంద్రమునకు 5 వేల రూపాయలు యిచ్చే పథకాన్ని కూడా తయారు చేశారు.

గిరిజనులు ఆధునికమైన పశుగణాభివృద్ధి కార్యక్రమాలు తెలిసికొని వాటిని అమలు చేయాలనే ఉద్దేశంతో విశాఖపట్నంలోని పశుగణాభివృద్ధి కేంద్రములో ఎన్నిక చేయబడిన 25 మంది గిరిజనులకు ఒక నెలకాలం శిక్షణ యిచ్చుటకు 20 వేల రూపాయలు ఖర్చు కాగల ఒక పథకాన్ని రూపొందించేరు.

చిన్న నీటి వనరులు

వ్యవసాయాభివృద్ధికి స్థానికంగా లభ్యమైన నీటి వనరులు భూగర్భ జలాలు వినియోగించుట యెంతైనా అవసరం అందుచే చిన్న నీటివనర్ల కార్యక్రమం క్రింద 32.79 లక్షల రూపాయలు కేటాయించడం జరిగింది. గాలి మిల్లులు నెలకొల్పే పథకం పరిశీలించి వీలైనచోట్ల ఈ యంత్రాలను నెలకొల్పుటకు కూడా పథకం రూపొందించబడింది.

మత్స్య పరిశ్రమ

సీతంపేటలో 2.26 లక్షల ఖర్చుతో చేపల ఉత్పత్తి కి ఒక కేంద్రాన్ని నెలకొల్పుటకునూ, వరి పొలాలలో వేగంగా పెరిగే చేపల పెంపకానికి పదివేల రూపాయిల ఖర్చుకాగల పథకం అమలు చేయడానికీ కార్యక్రమాలు రూపొందించారు. షెడ్యూలు ప్రాంతాలలో 10 చెరువులను ఎన్నిక చేసి, వాటిలో రొయ్యిలు, ఇతర రకాల చేపలను పెంచుటకు 5 వేల రూపాయిలు ఖర్చుకాగల పథకం రచించడం జరిగింది.

రహదారులు, వస్తువిక్రయ సదుపాయాలు

10 లక్షల రూపాయిల ఖర్చుతో మామిడిపల్లి, తోణాం, దుగేరు, కూసేరు, కేదారిపురం, వాండ్రజోల, కొడబారెడు గ్రామాలను అచ్చటకు దగ్గరగావున్న సంతలకు కలిపే సుమారు 25 మైళ్ళ రోడ్ల నిర్మాణానికి పథకాలు సిద్ధం చేశారు. గిరిజన ప్రాంతాలలో గిరిజనుల అటవీ వ్యవసాయపు పంటల కొనుగోలు సంస్థ అయిన గిరిజన కార్పొరేషనుకు గిడ్డంగులు నిర్మించుటకు 8 లక్షల రూపాయలు యిచ్చుటకు ఏర్పాటు జరిగింది.

పరిశ్రమలు

గిరిజన ప్రాంతాలలో అటవీ సంపదను, వ్యవసాయపు పంటలను వినియోగించుటకు కొన్ని పరిశ్రమలు నెలకొల్పడానికి పథక రచన సాగింది. 9 వేల రూపాయల ఖర్చుతో 100 గిరిజన కుటుంబాలకు 6 వందల తేనెటీగల పట్టు పెట్టెలను అందజేస్తారు. 1.24 లక్షల రూపాయల ఖర్చుతో సిల్కు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పుటకు, మండ, వలసబల్లేరు, లంకజోడు, ధర్మలక్ష్మీపురం, రేగులపాడు ప్రాంతాలలో పట్టుపురుగులు పెంచే కార్యక్రమాలు రూపొందించేరు. పట్టుకాయలనుండి దారాన్ని తీయుట, నేయుట మొదలైన విషయాలలో 66 మంది గిరిజనులకు గుమ్మలక్ష్మీపురంలో తగు శిక్షణ యిచ్చుటకు 1.18 లక్షల రూపాయలు ఖర్చు కాగల పథకాన్ని తయారు చేశారు.

పరిపాలనా నిర్వహణ

ఒక ప్రాజెక్టు ఆఫీసరు, ఒక అసిస్టెంటు ప్రాజెక్టు ఆఫీసరు, ముగ్గురు ప్రాజెక్టు వ్యవసాయ శాఖాధికారులు, 12గురు వ్యవసాయ విస్తరణాధికారులు, ఒక పశువైద్య శాఖాధికారి, ఇద్దరు లైవ్ స్టాకు ఇనస్పెక్టర్లు, అట్లే భూసార సంరక్షణశాఖ, పరిశ్రమల శాఖల ఉద్యోగులు, పరిపాలనకు అవసరమైన గుమస్తాలు, ఇతర సిబ్బందితో ఈ పైలెట్ పథకం అమలుజరుప బడుతోంది.

పైలెట్ పథకానికి ప్రారంభోత్సవం

వెనుకబడిన ప్రాంతాల ప్రజల సర్వతోముఖాభివృద్ధికి కంకణం కట్టుకొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పి.వి.నరసింహారావు గారు మే నెల 3వ తేదీన భద్రగిరిలో ఈ పైలెట్ పథకానికి ప్రారంభోత్సవం చేయుట శుభసూచన. గిరిజనులను వారి స్వశక్తిపై ఆధారపడే వారిగా చేసి జాతీయ జీవనంలో వారిని భాగస్వాములుగా చేసే లక్ష్యంతో ఈ పథకం అమలు జరపాలని ముఖ్యమంత్రి గారు ప్రారంభోత్సవ ఉపన్యాసంలో అభిలాషను వ్యక్తం చేసారు. సమీప భవిష్యత్తులో జిల్లా కలెక్టర్ల సమావేశం ఏర్పాటుచేసి, గిరిజనుల సమస్యలను క్షుణ్ణంగా అవగాహనచేసుకొని తగు పరిష్కార మార్గాలను కనుగొన గలనని కూడా ముఖ్యమంత్రి గారు చెప్పారు. అవసరమైతే గిరిజనుల వ్యవహారాలకు సంబంధించి ఆర్డినెన్సు జారీ చేయిస్తామని అన్నారు కూడా.

ఈ ప్రారంభోత్సవ సభకు రాష్ట్ర హోం శాఖామాత్యులు శ్రీ వి. కృష్ణమూర్తి నాయుడు అధ్యక్షత వహించారు. గృహనిర్మాణ శాఖామాత్యులు శ్రీ యల్. లక్ష్మణదాసు అటవీ శాఖామాత్యులు శ్రీ యస్. సూర్యనారాయణరాజు, గిరిజన సంక్షేమ శాఖామాత్యులు శ్రీ కె. భీమ్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పైలెట్ పథకం ప్రారంభోత్సవంతో గిరిజనుల జీవితంలో నూతన శకం ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టరు శ్రీ కె. పురుషోత్తం నాయుడు అభివర్ణించడం సహేతుకమైనది.

రాష్ట్రంలో చిట్టచివరనున్న శ్రీకాకుళం గిరిజన ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మరి నలుగురు రాష్ట్ర మంత్రులు పాల్గొనటవల్ల, గిరిజనుల సమస్యలపట్ల, గిరిజనుల అభివృద్ధిపట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధాసక్తులు విదితమౌతున్నాయి.

రాష్ట్రపతి గిరిగారి ఆకాంక్ష

గత సంవత్సరం నవంబరు నెలలో భారత రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి గారు శ్రీకాకుళంలో 11వ అఖిల భారత గిరిజన మహాసభను ప్రారంభిస్తూ గిరిజనులను సామాన్య ప్రజల స్థాయికి తెచ్చుటకు ఇతోధికంగా కృషి జరగాలని పేర్కొన్నారు. $1\frac{1}{2}$ కోట్ల రూపాయల వ్యయం కాగల ఈ బృహత్ పథకం రాష్ట్రపతి ఆకాంక్షకు అనుగుణమైన పెద్ద కృషిగా చెప్పవచ్చును.

దక్షతగల అధికారులు, సాంకేతిక నిపుణుల కృషి ఫలితంగా గిరిజనులు మైదాన ప్రాంతాల ప్రజల స్థాయికి సమీప భవిష్యత్తులో చేరగలరని ఆశిద్దాం. ★

జాతీయ సమైక్యత

యర్రమిల్లి చలపతి రావు శ్రీవత్సవ

సూక్ష్మంగా పరిశీలిస్తే సమైక్యతా సిద్ధాంతము, భారతీయ సాంప్రదాయ బద్ధమైనదీ ప్రాథమిక విలువలకు అనుగుణమైనదీనూ. ఈ సిద్ధాంత సాఫల్యానికీ, ఐక్యతసాధనకూ భిన్నభిన్నమైన అనేక అంశాలు తోడ్పడ్డాయి.

భారతీయ ఆధ్యాత్మిక సిద్ధాంతం యుగయుగాలుగా మానవ జాతీయ సమైక్యతా సిద్ధాంతంతో ముడి వేయబడి ఉంది. భారతీయ ఆధ్యాత్మిక గ్రంథాలు అనైక్యతనూ, వేర్పాటు ధోరణినీ ఎన్నడూ ప్రచారం చేయలేదు. ఉపనిషత్తులు కులమత భేదాలనూ, వర్గ వైషమ్యాలనూ తీవ్రంగా గర్హించి ఏకత్వాన్ని ప్రబోధించాయి. మానవ సేవే మాధవ సేవ అని భగవద్గీత ఘోషిస్తున్నది. స్వార్థాన్ని త్యజించి సకల మానవ శ్రేయస్సు కోసం శ్రమించాలన్నదే గీతా సందేశం.

ఆపత్కాలంలోనేగాక, ఇతర సమయాలలో గూడ ఐకమత్యంతో వ్యవహరించాలనడమే భారతీయ సంప్రదాయం. సహనం, సుహృద్భావం, ఎప్పటికయినా విజయాన్ని సాధించి తీరగలవన్న ప్రగాఢ విశ్వాసం పునాదిగా భారతదేశం యొక్క సుస్థిరత, ప్రజల సమైక్యత నిర్మించబడ్డాయి. సమైక్యత అంటే అందరూ ఏకాభిప్రాయాన్నే కలిగి వుండాలనీ, భిన్నాభిప్రాయాలకు తావు లేదని అర్థం కాదు. నిరంకుశత్వం, ఏ రంగంలో గానీ భారతీయ సాంప్రదాయానికి విరుద్ధమైన విషయం.

మానవజాతి చరిత్రను పరిశీలిస్తే కొన్ని క్లిష్టసమస్యల విషయంలో ఏకాభిప్రాయం లోపించడంవల్లనే విశేషాభ్యుదయాన్ని సాధించడానికి మార్గం సుగమమైందని చెప్పవచ్చు. సందేహాలూ ఎదురు ప్రశ్నలూ, నిర్ణయాలను యథాతథంగా స్వీకరించాడానికి అయిష్టతా, మానవుడు చర్చల ద్వారా, క్రొత్త విషయాలనూ క్రొంగ్రొత్త ప్రక్రియలనూ రూపకల్పన చేయడానికి దోహదమైనవి.

ఒక క్లిష్ట సమస్యను గురించి పలువురు చర్చించి, ఏకగ్రీవంగా ఒక నిర్ణయం చేస్తే దానిని అమలు పరచడం తప్పించి వేరు ఆలోచనలకు తావుండదు. ఎవరి అభిప్రాయాలను వారు స్వేచ్ఛగా ప్రకటించి మూల విషయం గురించి మంచి నిర్ణయాలు చేయడం జరిగితే. అభ్యుదయ పథంలో మరోఅడుగు ముందుకు వెయ్యడానికి సాధ్యమవుతుంది. అంతేగాని ఏకపక్ష నిర్ణయం, విమర్శకు తావు లేకపోవడం, అనుసరిస్తే క్రమంగా అనైక్యతకు దారితీయగల ప్రమాదం వుంది. ఏకపక్ష నిర్ణయం, ఏ సందర్భంలోనూ అభిలషణీయం కాకూడదు. ప్రజా సామ్యమంటే యిక్కడే సరియైన అర్థం లభిస్తుంది. మూల సమస్యకు పరిష్కారం చర్చ ద్వారా, అఖిల పక్ష ఆమోద యోగ్యంగా నిర్ణయింపబడాలి. అప్పుడే భిన్నత్వాలలో కూడా చెక్కుచెదరని ఏకత్వం, సమస్యా పరిష్కారం గురించి ఆచరణలో సమైక్యతా సిద్ధిస్తాయి.

అనేకత్వంలో ఏకత్వం

భారతీయ జీవన విధానంలోనే ఈ సమైక్యతకు చక్కని పునాది వేయబడి వుంది. మన సంస్కృతి నాణ్యంలో ఏకత్వం. జీవన విధానాన్ని తీర్చిదిద్దిన పెద్దలు, ఎన్నడూ, ఏ విషయంలోనూ ఏ సందర్భంలోనూ, అది రాజకీయ పరమైనదయినా, మతపరమైనదయినా, సరే ఎక్కడా ఏకపక్ష నిర్ణయం గైకొన్నట్లు, కనబడదు నిరంకుశత్వం, హింస యివి రెండూ మన సంస్కృతికి వ్యతిరేకం. ఏ విషయంలోనైనా సరే, ఏ సందర్భంలోనైనా సరే, నిర్ణయాలుగైకొన్నప్పుడు అవి సుదీర్ఘచర్చల అనంతరం అఖిలపక్ష ఆమోదయోగ్యమైన వాటినే అమలు పర్చడం జరిగింది. గాని ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా మన చరిత్రలో నిర్ణయాలు గైకొన్నట్టు కానరాదు అందువల్లనే మన సంస్కృతి యుగయుగాలుగా సమైక్యతతో వర్ధిల్లింది. నదీ నాం సాగరో గతిః అనునట్లు అనేక మతాలు, అనేక సంస్కృతులు, అనేక నాగరికతలు మన భారత జాతిలో విలీనమై పోయాయి. పరస్పరాశ్రయమై మన సంస్కృతి పటిష్ఠమైంది.

రాజకీయ రంగంలో కూడా యీ నాడు భారత దేశం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తోంది. శాసనసభల్లోనూ ఇతరత్రాను




కూడా పలువురు వెలిబుచ్చిన వివిధ అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు జరుగుతున్నాయి. ఏదయినా ఒక బృహత్తర సమస్యను పరిష్కరింప వలసి వచ్చినప్పుడు ప్రధానమంత్రి తనపార్టీ సభ్యుల అభిప్రాయాన్నే గాక ప్రతిపక్షాల అభిప్రాయాన్ని కూడా స్వీకరించి నిర్ణయాలు గైకొనడం జరుగుతోంది. అందుకు ఉదాహరణగా ఇటీవల బంగ్లాదేశ్ సమస్య పరిష్కరించే సందర్భంలో నిర్ణయాలు గైకొనే ప్రతి సందర్భంలోనూ మన ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రతిపక్షాలను ముందుగా సమావేశపరచి తాను గైకొనబోయే నిర్ణయాల ఉచితానుచితాలను ప్రతిఒకసారీ సభవారి ముందుంచి ఎల్లరి ఆమోదాన్ని పొందిన పిమ్మటనే ఆచరణలో పెట్టేది. ఈ విధంగా చేసినందువల్లనే ఆమె గైకొన్న నిర్ణయాలు ప్రతి సందర్భంలోనూ సత్ఫలితాల నిచ్చినవి. తనదేశంలోనేగాక, ఇతర దేశాల్లో కూడా, బహుముఖ ప్రశంసాపాత్రమైనవి. ప్రజాస్వామ్యం యొక్క విజయానికి కారణమైనవి. దేశంలో కనీవినీయెరుగని సమైక్యత యేర్పడి భారతజాతి ఒకఅజేయమైన శక్తిగా రూపొందింది. ఒకేసమస్యను గురించి భిన్నమైన వ్యక్తులు, భిన్నాభిప్రాయాలు ప్రకటించినంత మాత్రాన సమైక్యతకు భంగం కలుగుతుందనడానికి వీల్లేదు. ఆ సమస్యను వివిధ కోణాలనుంచీ, వివిధ దృక్పథాల ననుసరించీ పరిశీలించడమనే దాని అర్థం. ఆ విధంగానే అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం చేయడం సాధ్యమవుతుంది. ప్రాతిపదిక సమైక్యత భారత సాంప్రదాయానికి అమూల్యమైన భూషణం వంటిది.


ఇటీవల మనదేశ సమగ్రతకు భంగంకలిగే విధంగా శత్రు దురాక్రమణ జరిగినప్పుడు, భారత ప్రజలందరూ ఏకజాతిగా ఇటి సమైక్యతనే ప్రదర్శించారు. ఈదురాక్రమణ పిలుపు అందగానే భారత ప్రజలందరూ ఏకోన్ముఖులై మాతృదేశసంరక్షణకు సంసిద్ధులై భారతీయ సాంప్రదాయాలను నిలబెట్టగలిగారు. జాతీయాభిమానంతో కూడిన ఈ సమైక్యతే భారతదేశానికి శ్రీరామరక్ష.

నిర్ణయాలు ప్రజాస్వామ్యబద్ధమైనవి కానప్పుడూ దేశంలో అందరి ప్రయోజనాలనూ ప్రతిబింబించనప్పుడూ ఆదేశంలో అనైక్యతా, వేర్పాటు ధోరణీ పెచ్చు పెరిగి దేశవిచ్ఛిత్తికే దారితీయగల ప్రమాదం వుంది. మధ్యయుగాల మనస్తత్వంతో, పాకిస్తానీ నియంతలు అవలంబించిన ప్రజాస్వామ్య విరుద్ధమైన నిరంకుశత్వం తుదకు దేశవిచ్ఛిత్తికీ వారి పతనానికీ కారణమైంది. దీనికికారణం. వారి సాంప్రదాయంలోనే ప్రజాస్వామ్య దృక్పథం లేకపోవడం. బలంగలవానిదే రాజ్యం అన్న భావం మారుతున్న కాలానికీ, క్రొత్తరంగులు సంతరించుకుంటున్న మానవజాతి చరిత్రకూ సంబంధించిన సిసలైన విజ్ఞానం లేకపోవడం. వారి సంస్కృతి నాగరికత కూడా మానవత్వపు విలువలు లోపించిన మధ్యయుగాల నాటిదికావడం.

మన సంస్కృతీ మననాగరికతా వేరు. మనసంస్కృతి యుగయుగాల నాటిది. ప్రజాస్వామ్య దృక్పథంతో కూడుకొన్నది. మానవునికి ప్రత్యేకమైన విలువయిచ్చినది. మనఋషులు మానవుణ్ణి శృణ్వంతు విశ్వేఅమృతస్యపుత్రా అని సంబోధించారు మానవుణ్ణి అమృతపుత్రునిగా భావించారు మనపూర్వులు. మానవజాతి అభ్యుదయాన్ని కాంక్షించారు. మానవుణ్ణిపాపిగా, బానిసగా, ఎన్నడూ చూడలేదు. మానవజాతి సమైక్యతనే మన ఉపనిషత్తులు ఘోషించాయి. కనుకనే నేటికీ మనజాతీయ సమైక్యత చెక్కుచెదరలేదు.



ఆజాద్ హింద్ ఫౌజ్ నేతాజీ



వి.ఎల్. సుందరరావు

భారత ప్రజల విప్లవ విజృంభణ శక్తిదాయి నేతాజీ సుభాస్ చంద్రబోసు. భారత స్వాతంత్ర్య సమరంలో చిక్కని రుధిర స్రవంతులను ప్రవహింపజేసి బ్రిటిషు సామ్రాజ్య మత్త గజకుంభ స్థలాన్ని బ్రద్దలుచేసిన విప్లవ సింహం నేతాజీ. నేతాజీ నడిపించిన జాతీయ సైన్యాలు మన స్వాతంత్ర్య పోరాట చరిత్రలో సువర్ణాక్షరాలలో లిఖించబడినాయి.

మన స్వాతంత్ర్య సముపార్జన పట్ల జాతీయ సైన్యాలు, అజాద్‌హింద్ ప్రభుత్వ భూమికను, యితర విప్లవోద్యమాల ప్రాశస్త్యాన్ని తెలుసుకొనుట ప్రతి భారతీయుని కర్తవ్యం. వాటిని తెలియజేయుట ముందురానున్న తరాలవారికి అందించుట చరిత్రకారుని విధి. ఈ చరిత్రను వాస్తవిక దృష్టితో విడమరచి చెప్పి యింతవరకు తగు వ్యాయాన్ని చేకూర్చలేదనుటలో ఆశ్చర్యంలేదు.

సుభాస్ చంద్రబోసు విద్యార్థిగా యింగ్లండులో చదువుచున్నప్పుడే దేశ పరిస్థితులు సాకల్యంగా అర్థం చేసుకొన్నాడు. జాతీయ వాదిగా విప్లవ మూర్తిగా తన కర్తవ్యాన్ని నిర్ధారణ చేసుకొన్నాడు. యిండియన్ సివిల్ సర్వీస్‌లో (ఐ. సి. ఎస్.) ప్రథముడుగా ఉత్తీర్ణుడై తాను ప్రభుత్వ సేవకునిగా ఉండుటకు నిరాకరించాడు. సామ్రాజ్య ప్రభుత్వానికి విధేయుడుగా ఉంటానని బాండుపై సంతకం చేయనని తిరస్కరించిన భారతీయులలో నేతాజీ ప్రథముడు.

యావజ్జీవితం దేశసేవ, పేద ప్రజానీకానికి సేవలు చేస్తానని, భోగ భాగ్యాలు అవసరం లేదని, కటిక దారిద్ర్యాన్ని ఆహ్వానిస్తానని, ప్రజలను పీడించే బ్రిటిషు ప్రభుత్వానికి తొత్తుగా ఉండే ఉద్యోగము స్వీకరించనని స్పష్టంచేశాడు. తన ఐ. సి. యస్. ఉద్యోగాన్ని కాలదన్ని పడవయెక్కి నేరుగా బొంబాయి చేరుకొన్నాడు. అది 1921 వ సంవత్సరం. క్రమంగా భారత జాతీయ కాంగ్రెసు, నాయకత్వాన్ని చేపట్టింది. దేశంలో సత్యాగ్రహాలు పోరాటాలు గురించి సుదీర్ఘ చర్చలు జరుగుతున్న రోజులవి. బోసు బొంబాయిలో మహాత్మాగాంధీని కలుసుకొని, దేశ స్వాతంత్ర్య పోరాట విధానాలు, కార్యక్రమాలు గురించి ఒక గంటసేపు చర్చించారు. "మీ సత్యాగ్రహాలు, సహాయ నిరాకరణోద్యమాల ద్వారా ప్రజలలో జాతీయ విప్లవ భావాలు రగిలింపవచ్చు. దేశ భక్తులుగా ప్రజల్ని తయారుచేయవచ్చు, కాని బ్రిటిషువారి పరిపాలన కొనసాగింపుకు మూలాధారమైన ఉద్యోగస్థులు, రక్షకభటులు, భారతసైన్యాలు మన క్యాంపులో చేరనిదే బ్రిటిషుపాలన అంతం కాదు. అందుకు మీ విధానాలు సరిపోవు. మనకు జాతీయ సైన్యాలుకావాలి దెబ్బకు దెబ్బ తీయాలి. అంతకు వినా సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించదు." అని సుభాస్‌బాబు గాంధీజీతో వాదించాడు.

గాంధీజీతో చర్చలు
దెబ్బకు దెబ్బ తీయాలి

గాంధీజీతో యీ ప్రథమ సమావేశంలో జరిగిన సంవాదం, భేదాభిప్రాయాలు "యిండియన్ పిలిగ్రిం" అని వ్రాసిన తన ఆత్మకథలో స్పష్టంగా వివరించాడు.

యిరవై మూడు సంవత్సరాల యువకుడుగా ఉన్న సుభాష్ బాబు ఆలోచనలు, నలుబది మూడు సంవత్సరాల వయస్సు నాటికి రూపురేఖలు దిద్దుకొని, ఆనాడు మయసభలో తొడలు వ్రయ్యలు చేస్తానని శపథం చేసి తర్వాత యుద్ధములో నుంచి బయటకు లాగి దుర్యోధనుని తొడలు విరగగొట్టిన భీమసేనుని మాదిరి, బ్రిటిషు సామ్రాజ్యాన్ని జాతీయ సేనలతోటి తుత్తునియలు చేయ గలిగినాడు సుభాష్‌బోసు.

రెండవ ప్రపంచయుద్ధం 1939 సెప్టెంబరులో ప్రారంభం కానున్నదని, బ్రిటిషు ప్రభుత్వానికి ఆరు నెలల అల్టిమేటం యివ్వాలని, కాంగ్రెసు పోరాటానికి ఆయత్తం కావాలని 1939 మార్చి మాసంలో త్రిపుర కాంగ్రెసు అధ్యక్షస్థానం నుండే శంఖారావాన్ని పూరించాడు, సుభాష్ బాబు. కాంగ్రెసు హైకమాండు అందుకు తయారు కాలేదు. మహాత్మాగాంధీ పోరాటానికి అదనుకాదన్నారు. ఫాసిస్టు హిట్లరుతో పోరాటం జరుపుతున్న సామ్రాజ్యవాద బ్రిటనును పోటు పొడవటం ప్రజాస్వామ్య వాదులకు తగని పని అని నెహ్రూజీ మరికొందరు నాయకులు అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టులు యితర తీవ్రవాదులు ప్రజాయుద్ధమని గంతులు వేయ ప్రారంభించారు.

సామ్రాజ్య వాదంతో దేశంలో పోరాటానికి ఎవరూ తయారుగా లేరని, యిట్టి పరిస్థితులలో దేశం వెలుపల ఉన్న భారతీయులను సమీకరించి, ఆయుధాలు సేకరించి, బయట నుండి పోరాటం జరపటం వినా వేరు కర్తవ్యం లేదని నిర్ణయం చేసుకున్నాడు.

అందుకనే 1941 జనవరి 26 వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ చరిత్రాత్మక సమయంలో సుభాష్ బాబు కనిపించటం లేదని ఆయన స్వగృహమునుండి ప్రకటన వెలువడింది. నలుబది రోజుల క్రితం జైలునుండి విడుదల చేశారు. జైలులో నిరాహారదీక్ష చేసి ఉన్నాడు. దేహం శుష్కించి ఉన్నది. యింటి చుట్టూ 30 మంది సి.ఐ.డి.లు ఉన్నారు. ఆయనపై గృహనిర్బంధపు ఉత్తరువులు ఉన్నాయ్.

మారువేషంలో మూడు రోజులు ప్రయాణం

మారు వేషంలో మూడు రోజులు ప్రయాణంచేసి రైలులో కాబూలు చేరాడు. అక్కడ నుండి లారీ, బస్సు, విమానంలో ప్రయాణం చేసి మాస్కో మీదుగా రోము చేరాడు. అక్కడ నుండి జర్మనీ చేరాడు. కలకత్తాలో ప్రకటన వెలువడిన పది రోజుల క్రితమే ఆయన భారత సరిహద్దులను దాటి వెళ్ళాడు.

ఆనాడు సత్యాన్వేషణకై అర్ధరాత్రి వేళ నిదురించుతున్న భార్యను, పుత్రుని, సామ్రాజ్యాన్ని విసర్జించి గౌతమ బుద్ధుడు యిల్లు వెడలి ఎలా వెళ్ళాడో, యీనాడు నిదురించుతున్న తల్లిని, ప్రజలను, దేశాన్ని విడిచి సుభాస్ చంద్రబోసు, మాతృదేశ స్వాతంత్ర్య సముపార్జనకై కానని సీమలను మెట్టాడు.

1942 జనవరి 26 వ తేదీన ప్రత్యేక సందర్భమున జర్మను నియంత హెర్ హిట్లరు, సుభాస్‌బాబుకు భారత నేతాజీ అనే బిరుదు ప్రదానం చేశాడు. ప్రత్యేక రేడియో కేంద్రం, భారత దేశ ప్రత్యేక సమాఖ్యను ఏర్పాటు చేశారు. అచట ఉన్న 1500 మంది భారత సైన్యాలను నేతాజీకి అప్పగించారు.

సింగపూర్ కు...

ఆరుమాసములు సబ్‌మెరైనులో ప్రయాణం చేసి, ప్రపంచ సముద్రాలన్ని దాటి, జర్మనీ నుండి నేతాజీ సుభాష్ 1943 జూలై 2 వ తేదీ సింగపూర్ చేరాడు. ఆయన వెంట మేజరు అబిద్ హస్సాన్ సఫ్రాని, మేజరు స్వామి వచ్చారు.

నేతాజీ సింగపూరు చేరకముందు నడిచిన గాథ కొంత ముఖ్యమైనది. 1942 లో జపాను సైన్యాలు సింగపూరును బ్రిటిషు సేనల నుండి స్వాధీనం చేసుకొనినప్పుడు అక్కడ 40,000లు భారత సైన్యాలు 50,000 యింగ్లీషు సైన్యాలు ఉన్నాయ్. జనరల్ మోహన్‌సింగు నాయకత్వాన 1942 సెప్టెంబరు మాసంలో ప్రథమ జాతీయ సైన్యాలను ఏర్పాటుచేసినారు. యిండియన్ యిండిపెండెన్సు లీగు అధ్యక్షులైన స్వర్గీయ రాష్ బిహారిబోసు దీనికి మూలపురుషుడు. వీరిలో

కొన్ని కలతలు ఏర్పడి, జపాను ప్రభుత్వం వీరికి తగిన సహకారం యివ్వ నిరాకరించినది. ఆ కారణంగా డిసెంబరు 20వ తేదీ 1942 సంవత్సరంనాడు జనరల్ మోహన్‌సింగును జైలులో ఉంచారు.

నేతాజీ సింగపూరులో కాలూనిన తరువాత గత చరిత్రను విస్మరించి నూతన ఆజాద్ హింద్ చరిత్ర ప్రారంభమైనది. కొందరు చరిత్రకారులు నేతాజీ నిర్మాణంచేసినవి రెండవ ఆజాద్ హింద్ సైన్యాలు అని అభివర్ణిస్తున్నారు. కాని, యీ చరిత్ర పరంపర అంతా ఒకే గొలుసుకు సంబంధించిన గాథ. 1943 జూలై నాల్గవ తారీఖున చరిత్రాత్మకమైన సమావేశంలో స్వర్గీయ రాష్ బిహారిబోసు నేతాజీ సుభాసును ఆజాద్‌హింద్ ఫౌజుకు తన స్థానే అధినేతను చేసినాడు.

ఆజాద్ హింద్ ప్రభుత్వ స్థాపన

దూరప్రాచ్యములో ఉన్న భారతీయులందరినీ సంఘటితపరచి జాతీయసైన్యాలు నిర్మాణం చేశారు. మిలిటరీ తర్ఫీదులన్నీ యిచ్చారు. సుమారు 60,000 సుశిక్షితులైన సైన్యాలను తయారు చేశారు. వారికి సహాయకదళాలను, వాలంటీరు దళాలను తయారుచేశారు. స్త్రీలకుగూడా మిలిటరీ తర్ఫీదులు యిచ్చి, ప్రత్యేకసైన్యాలను తయారుచేశారు. దానికి ఝాన్సీ బ్రిగేడని నామకరణం చేశారు. గాంధీ, బోసు, నెహ్రూ, ఆజాద్ బ్రిగేడులని ప్రత్యేకంగా సైన్యవిభజన చేశారు.

చరిత్రాత్మకమైన ఒక సమావేశంలో 21 అక్టోబరు 1943న తాత్కాలిక స్వాతంత్ర్య ప్రభుత్వాన్ని స్థాపించారు. దీనికి ప్రొవిజినల్ అజాద్‌హింద్ ప్రభుత్వం అని నామకరణం చేశారు. ఈ ప్రభుత్వ అధినేత నేతాజీ సుభాస్‌చంద్రబోసే అజాద్ సైన్యాలకు సర్వసేనాని. అజాద్‌హింద్ ప్రభుత్వం అధ్వర్యాన అజాద్ బ్యాంకును, కరెన్సీని, అన్ని హంగులు ఏర్పాటు చేశారు నవంబరు మాసములో అజాద్ హింద్ ప్రభుత్వానికి అండమాను నికోబార్ దీవులను స్వాధీనం చేశారు జపాన్‌వారు.

అనేకమంది విప్లవవీరులకు కారాగారవాసంగా దీర్ఘకాలం పేరొందిన అండమానుదీవులు మొదటగా స్వాతంత్ర్యవాయువులు పీల్చగలిగినాయి. డిసెంబరు 31వ తేదీ నేతాజీ సుభాస్ యీ దీవులలో కాలూనినారు.

రవి అస్తమించాడు

యింత కాలంగా సింగపూరు కేంద్రంగా ఉన్నది. 1944 జనవరి 6వ తేదీ అజాద్ హింద్ ప్రభుత్వ కేంద్రాన్ని బర్మాకు మార్చారు.

అజాద్ హింద్ సైన్యాలు బర్మా పర్వతశ్రేణుల నుండి భారత సరిహద్దుమీద సమీకరించబడినవి. 1944 సం॥ ఫిబ్రవరి 4వ తేదీ ఆరకాను రంగములో రణభేరి మోగించి శత్రు సైన్యాలపై తారసిల్లినవి. బ్రిటిషు సామ్రాజ్య సైన్యాలను పీనుగుపెంటలుగా చీల్చిచెండాడి భారత భూభాగంపై జాతీయసైన్యాలు కాలూనినవి, రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యం అస్తమించింది. రెండు శతాబ్దాలుగా బానిససంకెళ్ళతో కుగిపోయిన జాతి, సంకెళ్ళు పటాపంచలైనవి.

సింహ గర్జన

1944 న మార్చి 18వ తేదీన భారత భూభాగంపై త్రివర్ణపతాకం స్వేచ్ఛగా ఎగురవేశారు. జైహింద్, ఛలోఢిల్లీ నినాదాలతో ఆకాశం పిక్కటిల్లింది. ఆనాటి భారతీయులు ఆ చరిత్రాత్మక ఘడియలలో పాల్గొన్నవారు పుణ్యపురుషులనే చెప్పాలి.

నేతాజీ ఆనాడు యిచ్చిన యుద్ధనినాదం, సింహగర్జనలు భారత యితిహాసంలో అతి ప్రాముఖ్యమైనవి. "అదిగో, ఆ దూరాన, ఆ కీకారణ్యాలకు, ఆ పర్వతశ్రేణులకు, ఆ నదివొడ్డున ఉన్న భూమి, ఆ పవిత్రభారతభూమి, మా మాతృభూమి, పిలుస్తుంది. పదండి, ఆ తల్లి మాతృభూమి వొడిలోకి పోదాం. విజయమో వీరస్వర్గమో అని ముందుకు సాగండి భగవంతుని ఆశీర్వాదాలు మనకు ఉన్నాయ్. అవసరమైతే వీరమరణాన్ని అలంకరించుదాం." అని నినదించాడు నేతాజీ.

మణిపూరులోని, దిమపూర్, టిడ్డం రంగాలలో మెరుపుయుద్ధంచేసి, సామ్రాజ్య సైన్యాలను తుత్తునియలుచేసి ఆజాద్‌హింద్ సైన్యాలు ఆక్రమించాయి. రంగూను నుండి 600 మైళ్ళు మూడులక్షల విరోధి సైన్యాలను చెల్లాచెదురుచేసి జయభేరి మోగించుకొంటూ ముందుకు సాగిన

చరిత్ర అతి వీరోచితమైనది. జాతీయ సైన్యాలకు పదిరెట్లు సంఖ్యాబలం గలిగిన వీరోధి సైన్యాల మధ్య చొచ్చుకొనివెళ్ళిన సాహసచరిత్ర మరుపురానిది.

మణిపూరు ముఖ్యపట్టణమైన యింఫాల్ పట్టణాన్ని చుట్టుముట్టి విరోధి సైన్యాలను ఏడు రోజులు దిగ్బంధన చేసి అలమటింపజేశారు. ఈ క్షణమో మరో క్షణమో లొంగుబాటుకు ఏర్పాట్లు జరిగాయి. యింతలో మిత్రమండలి రాయలు విమానదళం బాంబుల వర్షం కురిపించ ప్రారంభించాయి. అజాద్‌హింద్ సైన్యాలకు విమానబలంగాని విమానబలాన్ని ఎదుర్కొనగల విమాన విధ్వంసక ఫిరంగులుగాని లేవు. యింతలో అజాద్‌హింద్ సైన్యాలకు ఆహార పదార్థాలు పూర్తిగా మృగ్యమైనాయి. భారీవర్షాలు ప్రారంభించినాయి. అదృష్టదేవత దూరమైంది. అజాద్ హింద్ సైన్యాలు తిరోగమనం చేయకతప్పలేదు.

యింతలో జపాను భూభాగంలో మిత్రమండలి సైన్యాలు హిరోషిమా, నాగసాకిమీద ఆటంబాంబులు కురిపించాయి. ఆ కారణంగా దూరప్రాచ్యంలోని యుద్ధస్వరూపమే తారుమారైంది.

విమాన ప్రమాదం

1945 సం॥ ఏప్రిల్ 24వ తేదీన రంగూను నుండి అజాద్‌హింద్ కేంద్రాన్ని మార్చివేశారు. మే 14 వ తేదీ నేతాజీ బ్యాంకాకు చేరారు. అది వారి సప్లై బేసు. సైనిక తర్ఫీదు నిచ్చే కేంద్రం. చివరకు అందరూ అక్కడ సమాయత్తమైనారు. అచట నుండి సెప్టెంబరు 17 వ తేదీ నేతాజీ సైగాన్ వెళ్ళారు. 18 వ తేదీన తాయిపై దగ్గర విమానప్రమాదం జరిగినదని ప్రకటించబడింది.

నేతాజీ విమాన ప్రమాదం గురించిన సంఘటన, నేతాజీ చివరి ఘడియలు గురించి అనేక సందేహాలు దేశంలో ఉన్నవి. జనరల్ షానవాజ్‌ఖాను అధ్వర్యాన ఒక కమిషను నియమించారు. వారి రిపోర్టు ప్రకారం విమాన ప్రమాదం ఖాయంచేశారు. తరువాత 400 మంది పార్లమెంటు సభ్యులు మరొక కమిషను నియమించి నేతాజీ చివరి ఘడియలు గురించిన దర్యాప్తు చేయవలెనని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిని పురస్కరించుకొని ఖోస్లా కమిషనును నియమించారు. వారు విచారణ జరుపుతున్నారు, ఆ కమిషను యీ సంవత్సరం ఢిల్లీలో సమావేశం కానున్నది. ఈ సమావేశానికి నాకు గూడ తాకీదులు ఇచ్చారు, సాక్ష్యం యివ్వమని.

మన స్వాతంత్ర్య రజతోత్సవ శుభఘడియలలోగూడా నేతాజీని గురించిన అంతిమ రిపోర్టు ప్రజలకు అందించు అవకాశం లేదు.

ఆశయం నెరవేరింది

స్వాతంత్ర్య రజతోత్సవ సందర్భమున భారత స్వాతంత్ర్యం కోసం జాతీయ సైన్యాలు చేసిన వీరోచిత త్యాగాలను, అమరవీరులను సంస్మరించడం మన కనీసధర్మం. ఆర్కాను, మణిపూరు రంగాలలో అజాద్ సైనికులు సుమారు 26000 మంది నేలకొరిగారు. అక్కడి అరణ్యాలు, కొండలోయలు, యీ అమరవీరుల, మాంస కండరాలతో, ఎముకల గూడులతో ఇప్పటికీ ప్రతిధ్వనించుతున్నవి. వారు ఆ నాడు చేసిన హాహాకారాలు, జైహింద్, ఛలో ఢిల్లీ విప్లవ నినాదాలతో ప్రతి భారతీయుని రక్తనాళాలు ప్రతిధ్వనిస్తున్నాయి. విప్లవ పోరాటం ప్రవహింప జేసిన వేడి నెత్తురు వాహినులు రానున్నతరాల వారికి హెచ్చరికలుగా ఉంటాయి.

అందుకనే, అజాద్‌హింద్ సైన్యాల చరిత్ర, నేతాజీ అమరగాథ భారత సైన్యాలలో దేశభక్తిని ప్రకోపింపజేశాయి. తమకర్తవ్య ప్రబోధం జరిగింది. ఆ నాడు అందుకనే నావికులు జైహింద్, ఛలోఢిల్లీ అని తిరుగుబాటు చేశారు. స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. త్రివర్ణ జాతీయ కాంగ్రెసు పతాకాన్ని మిలిటరీ స్థావరాల్లో ఎగురవేశారు. 1946 సం॥ ఫిబ్రవరి మాసంలో, అన్ని మిలిటరీ కేంద్రాలలో జాతీయ నినాదాలు ప్రతిధ్వనించాయి తిరుగుబాటు దారులతో చేతులు కలిపారు. 1921లో నేతాజీ ఏదైతే ఆశించారో, ఆ ఆశయం నేరవేరింది.

యింతకాలంగా బానిస సైన్యాలుగా ఉన్న భారతీయ సైన్యాలు అజాద్ హింద్ పౌజు సైనికుల గొంతుకతో కలిపి జాతీయ నినాదాలు యిచ్చి, జాతీయ సైనికులుగా హృదయ పరివర్తన పొందారు. యిక మన స్వరాజ్యం వాయిదా వేయగలిగిన వారు లేకపోయారు. మనకు స్వరాజ్యం సిద్ధించింది. కనుక నేతాజీ, జాతీయ సైన్యాల కమనీయ గాథలు, సంస్మరణ యీ నాడు ఎంతో అవసరం.

★

స్వాతంత్ర్యోద్యమంలో మహిళల పాత్ర

'సత్రీ స్వాతంత్ర్య మర్హతి' అనే నానుడి పుట్టిన ఈ భారతదేశాన్ని యీనాడొక మహిళామణి పరిపాలిస్తూంది। అంటే కథ ఎంత నడచిందో ఆలోచించండి.

నేడు మనం సర్వసామాన్యం అనుకుని అనుభవిస్తున్న ఈ స్వాతంత్ర్యాన్ని సాధించడాని కెందరెందరు ఎన్ని త్యాగాలు చేశారు అన్నది తలుచుకొంటే ఒళ్ళు పులకరిస్తుంది. స్వాతంత్ర్యం సిద్ధించి పాతికేళ్లు నిండింది. కాని స్వాతంత్ర్య సముపార్జన కెన్నో సంవత్సరాలు పట్టింది. ఎనలేని త్యాగాలు కావలసి వచ్చింది. కార్యదీక్ష చిత్తశుద్ధి, దేశభక్తి లెక్కనుమించి కావలసి వచ్చింది ప్రతియేటా ఆగస్టు పదిహేను స్వాతంత్ర్య దినంగా మనం జరిపేసుకుంటున్నాం. సెలవు అనుభవించేస్తున్నాం. ఈ సంవత్సరం ఆగస్టు పదిహేనుకు ప్రత్యేకత వుంది. ఇది స్వాతంత్ర్య రజతోత్సవ దినం. మనం సాగిన బాట మనం సాధించిన ఘనవిజయంతో పాటు ఈ అమూల్యమైన స్వాతంత్ర్య సముపార్జన కోసం పాటుపడిన అనేకుల పాత్రనుకూడా మననం చేసుకోవడంలో ఆనందం వుంది.


స్వాతంత్ర్యోద్యమం ఒక విధంగా 1905 లో ప్రారంభం అయి 1920 లో గాంధీజీ నాయకత్వం క్రింద ఉద్ధృతం అయి 1947 లో ఫలప్రాప్తికి వచ్చిందని చెప్పుకోవచ్చు.

1857నుంచి స్వాతంత్ర్యాభిలాష కనబరుస్తూ వచ్చినా రాజకీయ చైతన్యం యింకా బీజరూపంలోనే ఉండడం మూలాన్ని అంతగా పెరగలేక పోయింది. కాని కాంగ్రెసు స్థాపనానంతరం (1885) దేశంలో ఐక్యతా భావం అభివృద్ధి చెందింది. దేశం మొత్తం మీద జరిగే కాంగ్రెసు మహాసభలలో ఆంధ్రులుకూడా పాల్గొని తమ స్వాతంత్ర్యేచ్ఛను యితోధికంగా చాటుకున్నారు. రంగయ్య నాయుడు, ఆనందాచార్యులు, న్యాయపతి సుబ్బారావు, కేశవపిళ్ళె, గంజాం వెంకటరత్నం కృత్తివెంటి పేర్రాజు, వరహగిరి జోగయ్య వంటి ప్రముఖులు కాంగ్రెసు సమావేశాలకు హాజరు కావడమే కాకుండా ఆంధ్రలో జాతీయభావం రేకెత్తించారు.

1905లో కర్జన్ నిరంకుశ ప్రవర్తనతో స్వాతంత్ర్యోద్యమం కొంచెం తీవ్రరూపం ధరించింది. వందేమాతరం ఉద్యమంగా పేరుకెక్కిన స్వరాజ్యోద్యమం ప్రారంభం అయింది. అప్పటినుండే జాతీయ గీతంగా బంకించంద్రుని వందేమాతరం పాడడం ప్రారంభం అయింది. చిల్లర సంస్కరణల వల్ల లాభంలేదని స్వరాజ్యమొక్కటే దారన్న భావన గట్టిగా ఏర్పడింది. తిలక్ మహాశయుని స్వరాజ్యం నా జన్మహక్కు అన్న గంభీరమైన నినాదం బయలుదేరింది. ఈ వందేమాతర ఉద్యమం ఆంధ్రలో అంతటా వ్యాపించింది బిపిన్ చంద్రపాల్ మన నాట పర్యటించి అపూర్వమైన రాజకీయ సంచలనం కలిగించారు. అనేకులు అధికార ధిక్కారం చేసి శిక్షల పాలయ్యారు గాడిచెర్ల హరి సర్వోత్తమరావు గారు స్వరాజ్య పత్రికలో ప్రభుత్వ విధానం ఖండించినందుకు మూడు సంవత్సరములు కారాగార వాసం చేశారు. ఈ కొత్త చైతన్యంతో విదేశ వస్తు బహిష్కరణ ప్రారంభం అయింది.

"స్వరాజ్యం నా జన్మ హక్కు"

ఈ బహిష్కరణోద్యమంతో పాటు నిర్మాణ కార్యక్రమం ఆంధ్రలో పునాదులు వేసుకొంది. నూలువడికేవారు. ఖద్దరు ధరించేవారు ఎక్కువ అయ్యారు. తిలక్ నిధి సేకరణకు పట్టణములలోని వారు పల్లెలలోని



వారు అంచనాలు మించి విరాళాలు యిచ్చారు. స్త్రీలు సంతోషంగా తమ ఆభరణాలను యిచ్చారు గాంధీ యిర్విన్ సంధి సంప్రదింపుల కారణంగా ఉద్యమం కొంత ఉధృతం తగ్గినా, తిరిగి 1932 జనవరిలో శాసనోల్లంఘనంతో ముమ్మరంగా ప్రారంభం అయింది.

ఈ ఉద్యమంలో ఆంధ్రులు అమితోత్సాహంతో పాల్గొన్నారు. స్త్రీలు అసంఖ్యాకంగా ముందుకు వచ్చినదీ దశలోనే. పోలీసుల అత్యాచారాలు కూడా ఈ దశలో మితిమీరాయి. అసంఖ్యాకంగా స్త్రీలు ఉద్యమంలో ప్రవేశించడంతో వారిని అణచడానికి అదనపు పోలీసులను పెట్టడమే కాక, కొన్ని చోట్ల రోజు కూలి యిచ్చి ప్రత్యేకంగా స్త్రీలను నియమించారు స్త్రీలను పెట్టుటకు జైళ్లు చాలకపోవడంతో వారిని జైలుకు పంపక యితర ఉపాయాలతో వెనక్కి నెట్టివేయాలని చూశారు. కాపు నీళ్ళను రంగు నీళ్ళను, మురికి నీళ్ళను బకెట్లతోను చిమ్మిన గొట్టములతోను స్త్రీలపై కొట్టి అవమానించారు. కొందరిని లారీలలో ఎక్కించి రాత్రిపూట దూరంగా ఎక్కడో అడవులలో వదలి వచ్చేవారు కాని ఈ బాధలన్నిటిని సహించి ప్రజలు గుంపులు గుంపులుగా ఉద్యమంలోకి ఉరకసాగారు అంతే కాదు జైలు భయం, లారీ దెబ్బల భయం ఆస్తులు పోవునన్న భయం కూడా జనానికి లేకుండా పోయింది. ఈ ఉద్యమంలో పాల్గొని ఆంధ్రకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన ఎందరో మహిళలున్నారు—దుర్గాబాయి, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, కనుపర్తి వరలక్ష్మమ్మ దువ్వూరి సుబ్బమ్మ, కడప రామసుబ్బమ్మ, సంగం లక్ష్మీబాయి మొదలైన వారంతా మనకి దారిచూపిన దీపకళికలే.

రాజకీయ చైతన్యం వెల్లివిరిసిన కాలంలోనే మహిళాలోకం అన్ని రంగాలలోనూ మేల్కొందని చెప్పవచ్చును. ఒక విధంగా చూస్తే ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రస్త్రీల పాలిటి కల్పతరువైంది. అన్ని రంగాలలోనూ చైతన్యవంతులైన నారీమణులక్కడ కూడ ఉన్నా మొత్తంమీద స్త్రీలు వెనుకబడే ఉన్నారు. కాని గాంధీజీ ధర్మమా అంటూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనవలసినదిగా వచ్చిన ఆహ్వానం నారీలోకానికి—ఈయని వరమైంది. పురుషులతో పాటు సమంగా ఉద్యమంలో భుజం భుజం కలిపి పోరాడిన నారీమణులకు పోరాడకనే సమాన హక్కులు వచ్చాయి.

పోరాటం ముమ్మరం తగ్గగానే తిరిగి అణగారిపోని వారిలోని ఉత్సాహం ఉత్తేజం—ఎంతో మహిళోన్నతికి దారి తీయించింది.

ఆంధ్రలోని అనేక సంస్కరణలకి ఉద్యమాలకి నాయకులైన వీరేశలింగం పంతులు గారు ఆంధ్రలో మహిళోన్నతికి మహిళోద్యమాలకీ పితృపాదులయ్యారు. వీరి నిరంతర కృషి ఫలితంగా—సాంఘిక నిర్బంధాలు సడలడమేకాదు అవిద్యకూడా విచ్చిపోవడం ప్రారంభం అయింది, ప్రభుత్వం కూడా స్త్రీ విద్యావశ్యకత గుర్తించడంతో — విద్యావకాశలు పెరిగే అవకాశం ఎక్కువ అయింది. విద్యావంతులైన స్త్రీలు, స్త్రీ సమాజములను నెలకొల్పి వారి విద్యా విజ్ఞానములను పెంపొందించడానికి కృషిచేయడం ప్రారంభించారు. కాకినాడ, రాజమహేంద్రవరం ఏలూరు గుంటూరు మద్రాసు మొదలైన పట్నాలలో యిలాంటి సమాజాలు వెలసాయి. శ్రీమతి భండారు అచ్చమాంబ, కొటికెలపూడి సీతమ్మ మొదలైన వారు రచనా వ్యాసంగంకూడా ప్రారంభించి అభ్యుదయగాములుగా వెల్లివిరిశారు.


స్త్రీ బయట తిరిగితే తెగించినదిగా పరిగణింపబడే ఆరోజుల్లో—చిన్న చిన్న సంస్కరణలకి సహితం ఎక్కువగా పాటుపడవలసి వచ్చేది. అట్లు పాటుపడే ఉత్సాహం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న మహిళామణుల ధర్మమా అంటూ ఆంధ్రలో ఏర్పడింది. అయితే 1913 లో బాపట్లలో ప్రథమాంధ్ర మహిళాసభ జరిగింది ఆ సభలో స్త్రీలకు సంబంధించిన పెక్కు విషయాలు చర్చించడం. తీర్మానించడం జరిగింది. నాటనుండి ప్రతి సభలలోను మహిళాసభ కూడా ఉండడం పరిపాటే అయింది. అదే అఖిలభారత మహిళా సభకునాంది పల్కింది.

గాంధీజీ వేసిన పునాది

ఆంధ్ర మహిళల ఉన్నతికి మైలురాయి వేసినది గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమం. ఇదొక మరపురాని ఘట్టం. భారత స్వాతంత్ర్య సమరసారథియై గాంధీజీ భారత మహిళలను గూడ సమర రంగమునకు ఆహ్వానించి నప్పుడు ఆంధ్ర మహిళలు ముందడుగు వేశారు. సభలు, సమ్మెలు, సత్యాగ్రహాలు శాసనోల్లంఘనలు, పికెటింగులు పూరేగింపులు ఉత్సవములు జరిపి జైళ్ళకు సంతోషంగా నడిచారు. లాఠీ దెబ్బలు తిన్నారు తుపాకి గుండ్లకి ఎదురు నడిచారు ఈ శాంతి సమరంలో విభేదాలు లేక ఆంధ్రమహిళలు ఉత్సాహంతో పాల్గొని ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొని, దిగ్విజయం గాంచి కీర్తి తెచ్చారు ఒక వంక ఆంధ్ర రాష్ట్ర మహిళా సభ స్త్రీ విద్యాభివృద్ధికి సాంఘికాభివృద్ధికి, ఆస్తి హక్కులకు కృషి చేస్తుంటే, యింకో పక్క యీ స్వాతంత్ర్య సంగ్రామం ఆంధ్ర స్త్రీల రాజకీయ చైతన్యమునకు స్వార్థ త్యాగానికి సేవాభిలాషకు ప్రోద్బలం యిచ్చింది. అంతే కాదు ఒక్క దేశ స్వాతంత్ర్యోద్యమమునకే కాక యితర రాజకీయోద్యమాలలో పాల్గొనాలన్న ఉత్సాహాన్ని కూడ కలుగ చేసింది.

ఈ విధంగా సహాయ నిరాకరణోద్యమంతో పాటు విస్తరించిన మహిళోద్యమం స్త్రీల యందు సంఘ సేవాభిలాషను యితోధికంగా ఉదయింప చేసింది. మహాత్ముని ప్రబోధాలవలన కలిగిన ప్రజాహితైక కాంక్ష సేవాభిలాష వీరిలో దేశానికి పనికొచ్చే కార్యక్రమాలు చేపట్టేలా చేశాయి. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కోర్కెలు తీరిన ఆంధ్ర మహిళలు విదేశ వేష భాషా నాగరికతల పట్ల విముఖులై దేశీయ వేష భాషా సంప్రదాయములందు అభిమానము కల్గిన వారై జాతీయ స్త్రీ విద్యా సంస్థలను నెలకొల్పి వాని ద్వారా కృషి సాగించారు. జాతిమత భేదములు పాటించకుండా యీ సంస్థలలో దేశ భాషలను దేశీయ సంప్రదాయాలకు దేశీయ కళలకు ప్రోత్సాహం యిస్తూ దేశాభిమానాన్ని పెంపొందించారు. దేశ సేవికలు కొందరిట్టి విద్యా సంస్థలు నెలకొల్పి స్త్రీలపురోభివృద్ధికి కృషి చేస్తుండగా, కొందరు స్థానిక సంస్థలలోను మరి కొందరు శాసన సభలలోను చేరి ప్రముఖ పదవులను చేపట్టారు. 1947 వచ్చేసరికే

(మిగత 67వ పేజీలో)



7

రాయబారం

కాపయ్య నాయకుడు, వేమారెడ్డి ప్రతాపరుద్ర నగరంలో, తమ కార్యాలయంలో కూర్చుని మాట్లాడు కొంటున్నారు

“ముస్లిం సేనలు దెబ్బతిన్న తరువాత మరలా వారి అలికిడి ఏమీ కనబడడం లేదు.” అన్నాడు వేమారెడ్డి నవ్వుతూ. “బహుశా ముస్లిం సేనాను లదరిపోయారేమో.”

“ఎన్నడూ అలా అనుకోకు. ఢిల్లీ ఇచ్చటికి చాలాదూరంగా వుండడం వల్ల వారికి చిక్కువచ్చి వుంటుంది. కలిగిన అపజయాన్ని గూర్చి వెంటనే సుల్తానుకు తెలియ జేయడానికి అధికారులు జంకివుంటారు: తెలియజేయాలన్నా ఢిల్లీ చాల దవ్వుగా వున్నందువల్ల త్వరగా తెలియజేయలేదు. సుల్తాను ఆనతి లేకుండా యీ సారి వారు మనమీ కి రారు. కాని వారు రావడం మాత్రం నిజం. వస్తే మాత్రం చాల పెద్ద ఎత్తున వస్తారు.”

“ఆ(, ఇకఏమి వస్తారు.”

“ఎన్నడూ అలా అనుకోవద్దు. తప్పనిసరిగా వస్తారు. వారు ఓరుగల్లు మీద కెన్ని మార్లు వచ్చారో గమనమున్నద గదా. ఎన్నిమార్లోడినా వారు దండెత్తుతూనే వుంటారు. అంతిమ విజయమే వారికి కావలసింది. విస్తారమైన సామ్రాజ్యము. లెక్కలేనంత సేన. అందువల్ల వారి బలాన్నిగాని, ధైర్య సాహసాలను గాని తక్కువ అంచనా వేయగూడదు. పైగా యీ మారు మనం చాల గొప్పవాడినే ఎదుర్కోవలసి వుంటుంది. అప్పుడు మనబలం చాలక పోవచ్చు” అన్నాడు కాపయ్య.

ఇంతలో ఒక భటుడు వచ్చి, “ఆనెగొంది నుండి మీకొరకెవరో వచ్చివున్నారు ప్రభూ” అన్నాడు.

“నా కొరకా? ఎవరు?” ప్రశ్నించాడు కాపయ్య.

“నాతో చెప్పనన్నారు వారు.” అన్నాడు భటుడు.

“సరే రమ్మనిచెప్పు.” కాపయ్య అన్నాడు.

“ఎవరై వుంటారు?” వేమారెడ్డి ప్రశ్నించాడు.

“ఎవరో ఊహించ లేకున్నాను. వస్తారుగదా చూదాము” అన్నాడు కాపయ్య.

అన్నమ దేవరాజు లోనికి వచ్చాడు. వస్తూనే కాపయ్యను చూచి ఒకక్షణం అలాగే స్తబ్ధుడయ్యాడు. వెంటనే తేరుకొని అతనికి నమస్కరించాడు.

ఆజానుబాహుడైన కాపయ్య విగ్రహం అన్నమదేవుణ్ణి ఆకర్షించింది అతని రూపం ఆ రాజు హృదయంలో వున్న క్షత్రీత్వాన్ని మేల్కొలిపింది.

“రండి కూర్చోండి” అన్నాడు వేమారెడ్డి.

కాపయ్యకూడ అన్నమదేవుణ్ణి చూచినప్పుడు ఒకవిధంగా అయ్యాడు. ఎందుకలా అయ్యాడో అతనికర్థంగాలేదు. ఎంతో సుకుమారంగా వున్న అన్నమదేవుని ముఖం, ఆ నల్లని కళ్లు అతణ్ణి ఆకర్షించి వుండాలి.

“మీరేనా? కాపయ్య నాయకులు?”

వేమారెడ్డిని ప్రశ్నించాడు అన్నమదేవుడు

“కాదు” అంటూ సమాధాన మిచ్చాడు వేమారెడ్డి.

కూర్చోమన్నట్లు చేయిచూపుతూ, “మీరెవరు?” అని ప్రశ్నించాడు కాపయ్య.

“నన్ను అన్నమదేవుడంటారు. మా యన్నగారు సోమదేవ రాజుగారు.” అన్నాడు అన్నమదేవుడు.

కాపయ్య అన్నమదేవునిదిక్కే చూడసాగాడు. “ఆ తలపాగా, ఆ మూర్తి, ఆ చూపులు, ఆ లేతనవ్వులు,—అతని హృదయంలో ఒక విధమైన భావాన్ని రేపాయి.

అన్నమదేవుడు ఆ చూపు లెదుర్కొనలేక పోయాడు. తన చూపుల్ని క్రిందికి దించివేశాడు.

"మీరు ఆనెగొందినుండి వస్తున్నారా?" ప్రశ్నించాడు వేమారెడ్డి.

"అవును" అన్నాడు అన్నమదేవుడు తలనెత్తి.

"ఏమి పనిగా వచ్చారు?" ఈమారు కాపయ్య ప్రశ్నించాడు. ప్రశ్నించినప్పుడు మరలా ఇరుపురి కళ్ళూ కలిసినవి. ఒకరిచూపులు మరొకరి హృదయంలో దూసుకొని వెళ్ళినవి, ఒక క్షణం వారు అనిర్వచనీయమైన ఆనందాన్ననుభవించారు.

"మీకోసమే వచ్చాను." అన్నాడన్నమదేవుడు కాలితో క్రిందవ్రాస్తూ.

అంతలో తనతప్పు తనకు తెలిసివచ్చింది అన్నమదేవునికి అతని కర్తవ్యం అవగతమయింది. అతని ముఖం గంభీరాకృతిని దాల్చింది.

"నాతో మాట్లాడవలసివున్నదా?" మరలా ప్రశ్నించాడు కాపయ్య.

అన్నమదేవుడు వేమారెడ్డివైపు సందేహ సూచకంగా చూచాడు.

"ఇతడు వేమారెడ్డి. నా సహచరుడు. నా సోదరునివంటివాడు. మా మధ్య సందేహానికి తావులేదు. మీరు చెప్పండి" అన్నాడు కాపయ్య

"మీరు సుల్తానుకు వ్యతిరేకంగా తిరుగుబాటు గావించారని నా సోదరునికి తెలిసింది ముస్లిం సైన్యాలను ఓడించారనిగూడ తెలిసింది మాకు గూడ సుల్తానుకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలని వుంది. మీతో ఆలోచించి ఆ తరువాత చేదామని సోమదేవరాజుగారు నన్ను మీవద్దకు పంపారు"

"మంచిదే." నవ్వుతూ అన్నాడు కాపయ్య. ఆ విషయం మాట్లాడాలంటే ఆంధ్ర భూమండలాధ్యక్షుడైన ప్రోలనీడుగారితో మాట్లాడవలసివుంటుంది." అన్నాడు కాపయ్య.

"అలాగయితే వారితోనే మాట్లాడుదాము." అంటూ నిలబడ్డాడు అన్నమదేవుడు.

"మీరు కూర్చొని వేమారెడ్డితో మాట్లాడుతూ ఉండండి. నేను ప్రోలనీడుగారితో చెప్పి ఓ సమావేశాన్ని ఏర్పాటు గావిస్తాను" అంటూ కాపయ్య వెళ్ళాడు.

శృంగేరినుండి వచ్చిన తరువాత సోమదేవరాజు ఆనెగొంది దుర్గాన్ని బలపరచాడు. ఆ ప్రాంతంలోవున్న దృఢ కాయుల్ని తన సేనలో చేర్చుకొనసాగించాడు. ఆయుధ సేకరణకు, గూడ పూనుకొన్నాడు. కాని ఎంత ప్రయత్నించినా ఐదు వేల సేనకంటె హెచ్చుగా సమకూర్చలేక పోయాడు. అందులో గూడ వేయి మంది అశ్వికులకంటె హెచ్చుమందిలేరు

అంతలో ప్రోలయ్య నాయకుని అధ్వర్యాన తీరాంధ్రులు స్వాతంత్ర్యం ప్రకటించారని, ఆంధ్రసేన ముస్లిం సేనల నెదుర్కొని ఓడించాయని ఆ రాజు తెలిసి అమందానందం చెందాడు. విద్యారణ్య యతీంద్రుని కందిన వార్త సరియైనదేనని నిర్ధారణ అయింది.

సోమదేవరాజు తానే ముందుగా సుల్తాను మీద తిరగబడదామనుకొన్నాడు. పర్యవసానంతో నిమిత్తం లేకుండా పోరుదామనుకొన్నాడు. కాని ప్రోలయ్య నాయకునికే ఆ యదృష్టం కలిగింది. అయినా పరవా లేదు తనతోపాటు నిలవగలిగిన వారు మరొకరు లభించారు. వారి వద్ద హెచ్చుసేన వున్నది. హెచ్చు ఆయుధాలున్నవి. సంపన్నమైన ప్రాంతం వారి ఆధీనంలోవున్నది గనుక ధనధాన్యాలకేమి కొదవవుండదు. గనుక యతీంద్రుడు చెప్పినట్లు వారి సాయం గూడ తీసుకొంటే విజయం సుసాధ్యమనుకొన్నాడు సోమదేవుడు. అందుకనే అన్నమదేవుణ్ణి కాపయ్య వద్దకు పంపాడు. అతని ద్వారా ప్రోలయ్యను కలుసుకొని తమ తిరుగుబాటు కొరకు సమగ్రమైన పథకాన్ని రూపొందించుకొని రమ్మన్నాడు.

మొదట అన్నమదేవుణ్ణి పంపడానికి సోమదేవునికిష్టంలేదు పురుష వేషం వహించి వుండినా అన్నమదేవుడొక స్త్రీ. ఆమెను పంపితే ఏటుపోయి ఏటువచ్చునో అని సందేహం కలిగింది ఆ రాజుకు. కాని తాను ఆనెగొందిని విడి వెళ్ళడానికి వీలులేదు ప్రోలయ్య నాయకునితోగాని, ఇడకు అతని సోదరుడైన కాపయ్య నాయకునితోగాని రాయబారం జరపగలిగినవారు తనవద్ద మరెవరూ లేకపోయారు. ఆంధ్రభూమండలాధ్యక్షునితో రాయబారం నడపాలంటే దానికి తగిన అర్హత వుండాలి. ఎవరినంటే వారి నా పనికి పంపడానికి వీలులేదు. అందుకని అన్నమాంబనే పంపడానికి నిర్ణయించుకొన్నాడు. అందుకామెగూడ సిద్ధమయింది.

అన్నమాంబ స్త్రీ యయినా పురుషునిలాగా ధైర్యవంతురాలు. పైగా చాల కుశాగ్ర బుద్ధిగల మహిళ. ఏ సమస్యనైనా జాగ్రత్తగా ఆలోచించి సరిగా అర్థంచేసుకోగలిగిన ధీశాలిని ఆమెలో సోమదేవునికెంతో విశ్వాసమున్నది.

అంతేగాదు, తాము వహించిన బాధ్యత చాలగొప్పది. చాల అపాయకరమైనది. స్త్రీ యైనా పురుషుడైనా ఆ బాధ్యత తను వహించక తప్పదు. లోకమంతా ఆమెను పురుషుడనే అనుకొంటున్నారు. ఇడకు విద్యారణ్య యతీంద్రులు గూడ అలాగే భావిస్తున్నారు. తన్ను, తన సోదరుడని రామచంద్రునివారన్నారు. అందువల్ల అన్నమాంబ ఆడుబిడ్డయైనప్పటికీ ప్రపంచానికి మాత్రం సోదరుడుగానే వున్నాడు. గనుక అతణ్ణి సోదరుడుగానే భావించి ఈ ప్రధాన కర్తవ్యాన్ని నిర్వహణకు పంపడానికే నిర్ణయించాడు సోమదేవుడు.

సోమదేవుడు నిర్ణయించినట్లే అన్నమదేవరాజు వంద మంది అశ్వికుల్ని తోడుదీసుకొని ప్రతాపరుద్ర నగరానికి వెళి కాపయ్య నాయకుణ్ణి కలుసుకొన్నాడు

కాపయ్య వెళ్ళేసరికి ప్రోలయ్య నాయకుడు అన్నిమంత్రితో ఏదో సమాలోచిస్తున్నాడు. లోనికి వెడుతూనే అతడు వారికి

నమస్కరించి "మిమ్మల్ని చూడడానికి ఆనెగొందినుండి అన్నమ దేవరాజనే ఆతడు వచ్చివున్నాడు" అన్నాడు.

"ఎవరు ?" ప్రశ్నించాడు ప్రోలనీడు. "అన్నమదేవ రాజు" అన్నాడు కాపయ్య.

"ఆనెగొంది నుండి వచ్చాడట" అన్నాడు అన్నమంత్రి.

"ఆనెగొందినుండా ? ఏమైన పనిమీద వచ్చాడా ?" ప్రశ్నించాడు ప్రోలయ్య. అవును అతని సోదరుడైన సోమదేవరాజు వద్దనుండి వచ్చాడు. మనలాగే తిరుగుబాటు చేయాలని, అందు కోసం మన సలహా, మన సాయం కావాలని వచ్చినట్లుంది."

"అయితే అతణ్ణి పిలవమను" అన్నాడు ప్రోలయ్య.

"అన్నమదేవుణ్ణి పిలుచుకొనిరమ్మని ఒకభటుణ్ణి పంపి తానుగూడ అచ్చటే కూర్చున్నాడు కాపయ్య నాయకుడు.

"మన తిరుగుబాటు మంచి ఫలితాన్నే యిచ్చినట్లుంది. ఇతర ప్రాంతాలలో గూడ మనలాగే తిరుగుబాటు రాగలదని విశ్వసించడానికిదొక నిదర్శనం" నవ్వుతూ అన్నాడు అన్నమంత్రి.

"మీ ఆశీస్సుల వల్ల ఇది అఖిలాంధ్రి ఉద్యమమైతే గూడ కావచ్చు. అప్పుడు మన కష్టం కొంత తగ్గుతుంది."

అంతలో అన్నమదేవుడు లోనికి వచ్చాడు. ప్రోలయ్యకు, అన్నమంత్రికి నమస్కరించాడు.

వారతణ్ణి కూర్చోమన్నారు.

"సోమదేవుడంటే ఆనెగొంది ప్రభువా ?" ప్రశ్నించాడు అన్నమంత్రి.

"అవును" అన్నమదేవుడన్నాడు.

"అతడు క్షేమంగా ఉన్నాడా ?" మరలా అడిగాడు అన్నమంత్రి.

"క్షేమంగానే ఉన్నాడు."

"ఏపనిమీద వచ్చారు?" ప్రోలయ్య అడిగాడు.

"రాచకార్యం మీద వచ్చాను."

"చెప్పండి."అంటూ అన్నదేవుని మాటల కెదురుచూచాడు ప్రోలయ్య. అన్నమంత్రిగూడ అతని మాటల్ని వినడానికి కుతూహలాన్ని కనబరచాడు. కాపయ్య అన్నమదేవుణ్ణే చూస్తూ వుండిపోయాడు.

"మీరు సుల్తానుమీద తిరుగుబాటు చేసినట్లే మేముకూడ ఎదురుతిరగాలని అనుకొంటున్నాము. కాని మేము చిన్న రాజాలము. సుల్తాను నెదిరించాలంటే మా సైన్యం చాలదు. ఒకవైపు కంపలి, మరొకవైపు దేవగిరి వున్నవి. అచ్చట ముస్లిం సైన్యాలున్నవి. కనుక మేము సుల్తానుకెదురు తిరగాలంటే యీ రెండు నగరాలలో వున్న సైన్యాలతోను పోరాడవలసి వుంటుంది. " అన్నాడు అన్నమదేవుడు.

"మీరెందుకెదురు తిరిగినట్లుండాలి ? మాలాగా మీరు స్వాతంత్ర్యం ప్రకటించ నక్కరలేదు. కంపలిమీదగాని, దేవగిరి మీదగాని దండెత్త నక్కరలేదు, మీ ప్రాంతంలో నున్న చిన్న చిన్న కోటలను పట్టుకొని మీ బలాన్ని వృద్ధిచేసుకొంటూ వుంటే ఆ మీద చూడవచ్చు." ప్రోలయ్య నాయకుడన్నాడు.

"అలా చేయాలనే మేముకూడ అనుకొంటున్నాము. కాని అవిగూడ సుల్తానుకు అధీనంలోవున్న కోటలే గదా ?"

"కావచ్చు. కాని కంపలిమీద, దేవగిరి మీద దండెత్తినప్పుడున్నంత అక్కసు సుల్తానుకుగాని, అతని వజీరులకుగాని ఆ కోటల్ని పట్టుకొన్నప్పుడుండదు. ఆ విధంగా మీరు మీ శక్తిని పెంపొందించుకోవాలి."

"మీరన్నట్లే చేస్తాము. కాని వారు మా మీద దండెత్తినప్పుడు మేము వారికెదురు నిలువలేక పోవచ్చు.

ప్రోలయ్య నాయకుడు ఆలోచనలో బడ్డాడు.

"అప్పుడు మా సాయం కావాలనా నీవనడం :" ప్రశ్నించాడు అన్నమంత్రి.

"అవును" అన్నాడు అన్నమదేవుడు.

"మా సాయం తప్పనిసరిగా వుండి తీరుతుంది. మీ రచ్చట సులాను బలాన్ని తగ్గించడం మాకుగూడ మేలే. అప్పుడు మాకు దేవగిరినుంచి కొంత ఒత్తిడి తగ్గుతుంది." అన్నాడు ప్రోలయ్య.

"మీరన్నది నిజమే. మన మందరం కలసి పోరాడితేనే విజయం సులభసాధ్యమని మా యన్నగారు భావిస్తున్నారు."

"అలాగే చేదాము" అన్నాడు ప్రోలయ్య.

అంతవరకు ఊరకున్న కాపయ్య "మరొకవిధంగా చేస్తే." అన్నాడు.

అందరూ 'ఏమి ?' అన్నట్లు అతనివైపుచూచారు.

"సోమ దేవరాజు ఒక్కొక్క కోటగా ఆక్రమించు కోవడం కంటె ఒక్కసారిగా కోటల్ని పట్టుకోవడం మంచిదని నా ఉద్దేశం. అవసరమైతే మనంగూడ అందుకొని కొంత సేనను సాయంగా పంపవచ్చు. ఆ విధంగా ఎన్నడైతే సోమదేవరాజు ఒకేకాలంలో ఆ కోటల్ని ముట్టడించి పట్టుకొంటాడో అప్పుడు సుల్తాను తీరాంధ్రం నుండి తనదృష్టిని తుంగభద్రవైపు మరల్చుతాడు. ఆ సమయంలో మనం ఓరుగల్లువైపుకు వెళ్ళవచ్చు

"నీ వన్నదినిజమే. కాని సుల్తాను దాడిని వారెదురొక్కలేరు. అయినప్పటికీ మనం మరొకపని చేయవచ్చు ?" అన్నాడు అన్నమంత్రి.

"ఏమిటి ?" ప్రశ్నించాడు ప్రోలయ్య.

"ద్వారసముద్రాన్ని పరిపాలిస్తున్న హోయసల రాజునుగూడ మనం తిరుగుబాటు చేయిస్తే అప్పుడు సుల్తాను కేమి చేయడానికి

తోచవిస్థితి ఏర్పడుతుంది. ఆ సమయంలో మన మందరం కలిసి సుల్తాను నోడించవచ్చు.

ఈ మాట చక్కగానే వున్నది. ఒకవేళ హోయసల రాజు అమాంతంగా తిరుగుబాటు చేయకపోయినప్పటికీ సోమదేవునికి సాయమైనా చేయగలడు. కాని అతనితో మాట్లాడి రావాలిగదా ?" ప్రోలయ్య అన్నాడు.

"మాట్లాడి రావాలి మరి." అన్నాడు అన్నమంత్రి.

"అవసరమైతే నేను వెళ్ళిమాట్లాడి వస్తాను." కాపయ్య అందుకొన్నాడు.

"అలా చేయడమే మంచిది. ప్రస్తుతానికి వేమారెడ్డిని సోమదేవునికి సాయంగా పంపుదాము. అద్దంకినుండి సేనవటు తీసుకొని వెళ్ళడం సులభం. నీవు బళ్లాళునితో మాట్లాడి వచ్చిన తరువాత తక్కిన కార్యక్రమాన్ని నిర్ణయిద్దాము" అన్నమంత్రి నిర్దేశించాడు.

అతనిమాటల కందరూ అంగీకరించారు.

"శృంగేరి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యులు గూడ యీ విషయంలో మనకండగా నున్నారు" అన్నాడు అన్నమదేవుడు.

"అలాగా. అయితే మనం జయించినట్లే." అన్నాడు ప్రోలయ్య నాయకుడు.

"మహాత్ముల ఆశీర్వచనముంటే ఇక సందేహించవలసిన అవసరమేమున్నది ?" ఆనందంతో పలికాడు అన్నమంత్రి.

"విద్యారణ్యయతీంద్రులే సుల్తానుకు వ్యతిరేకంగాతిరుగుబాటును తీసుకొని రమ్మని మమ్మల్ని ప్రోత్సహించారు. హిందూ ధర్మాన్ని ఉద్ధరించాలంటే సుల్తాను నెదిరించక తప్పదన్నారు. మహమ్మదీయ ప్రాబల్యం పోతేగాని హైదవం నిలవదన్నారు."

"అంతేకాదు. ఎవరో కొలనినుండి వచ్చినవారు మీరు తిరుగుబాటు లేవదీయ నున్నారని ఆ యతీంద్రునితో చెప్పారట. అప్పటికి వారికి కాపయనాయకుని పేరు, వేమారెడ్డి పేరు మాత్రమే తెలిశాయి. అందువల్ల మీతోగూడ సంప్రదించి మిమ్మల్నిగూడ కలుపుకొని ఎదురుతిరగమని చెప్పారు వారు."

"యతీంద్రుడంటే అలావుండాలి. మతం పతనమవుతున్నప్పుడు దాని నుద్ధరించడానికి కావిధంగా పూనుకోవాలి." అన్నాడు అన్నమంత్రి.

"వారి సలహాలు, వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ మనకవసరమే." అన్నాడు ప్రోలయ్య.

"ఇక నేను సెలవుతీసుకొంటాను. మా యన్నగారికి ఏమి చెప్పమంటారు ?" ప్రశ్నించాడు అన్నమదేవుడు.

మా కాపయ్య వస్తున్నాడుగా. అతడే అన్ని విషయాలు చెబుతాడు. అచ్చటి నుండి మీరు ద్వార సముద్రానికి గూడ వెళ్ళిరండి. వెళ్ళివచ్చిన తరువాత మీయన్నగారితో ఆలోచించి ఒక నిర్ణయానికి రండి" అన్నాడు ప్రోలయ్య.

అన్నమ దేవుడు లేచి వారికి నమస్కరించాడు. కాపయ్యకు నమస్కరించబోయాడు.

"నేను గూడ వస్తున్నానుగా. ఇంకా వేమారెడ్డితో మాట్లాడవలసి వున్నది." అంటూ కాపయ్య అన్నమదేవునితో గూడ వెలుపలికి వచ్చాడు.

అన్నమదేవుణ్ణి చూస్తుంటే, అతనితో నడుస్తుంటే కాపయ్యకెంతో ఆనందంగా వుంది. ఎందుకావిధంగా ఉన్నదో అతనికర్థం కాలేదు.

కాపయ్య, అన్నమదేవుడు వేమారెడ్డి వున్న కార్యాలయానికి వచ్చారు.

"చర్చలన్నీ పూర్తి అయినట్లేనా ?" నవ్వుతూ అడిగాడు వేమారెడ్డి.

"ఆ అయినట్లే, కాని నీతో మాట్లాడిన తరువాత ఒక నిర్ణయానికి రావాలనుకొన్నాము" అన్నాడు కాపయ్య.

"ఏమి మాట్లాడాలి ?"

ఏమీలేదు. నేను, అన్నమ దేవుడు ముందుగా ఆనెగొందికి వెడుతాము. అచ్చట నుండి ద్వారసముద్రం వెళ్లి వస్తాము. ఆ తరువాత నేనిక్కడికి వస్తాను. ఈలోగా నీవు అద్దంకికి వెళ్లి సైన్య సమేతంగా సిద్ధంగా వుండలి. అవసరమైతే నీవు ఆ సైన్యాన్ని తీసుకొని ఆనెగొందికి వెళ్లవలసి వుంటుంది.

"అలాగే చేదాము." అన్నాడు వేమారెడ్డి.

ఆ తరువాత కాపయ్య ప్రోలయ్య నాయకునితోను అన్నమంత్రితోను జరిపిన చర్చల్ని గూర్చి వివరించాడు.

వాటి నన్నిటినీ విన్న తరవాత "మంచి ఆలోచనే" అన్నాడు వేమారెడ్డి.

ఆ తరువాత అన్నమదేవుడు తన విడిదికి వెళ్లాడు. కాపయ్య నాయకుడు ప్రయాణానికి సిద్ధం కావడానికి వెళ్లాడు.

8

అర్థంగాని ప్రేమ

కాపయ్య, అన్నమ దేవుడు సోమదేవరాజు వద్దకు వెళ్లి అతనితో మాట్లాడిన తరువాత ద్వార సముద్రం వెళ్లారు. ఆ నగరంలో మూడవ బళ్లాలుణ్ణి కలుసు కొన్నారు. తమ ఆలోచనల్ని అతనికి తెలిపారు. అతని ఉద్దేశాన్ని చెప్పమన్నారు.

మూడవ బళ్లాలుడు గూడ ఢిల్లీ సుల్తాను వల్ల తనకు జరిగిన అవమానానికి తగిన ప్రతీకారం చేయాలనే వున్నాడు. కాని ఒంటరిగా తిరుగుబాటు చేయడానికి తనకి ధైర్యం చాలలేదు.

కనకనే అపడింత వరకు ఊరకున్నాడు. ఇప్పుడు తీరాంధ్ర ప్రాంతము సుల్తానుకు వ్యతిరేకమై వున్నది. తుంగభద్ర ప్రాంతము ఎదురు తిరుగనున్నది. కనుక తనకేమీ భయంలేదను కొన్నాడు బళ్లాలుడు. అదను చూచి సోమదేవ రాజుకు సాయం చేస్తానన్నాడు. అవసరమైతే ఎదురు గూడ తిరుగుతానన్నాడు.

తాము పట్టిన పని సక్రమంగా నెరవేరినందుకు కాపయ్య, అన్నమ దేవులెంతో సంతసించారు. బళ్లాలుని సెలవు తీసుకొని ఆనెగొంది మార్గం పట్టారు.

తామనుకొన్నది నెరవేరినందుకేగాక తామిద్దరూ అంత సన్నిహితంగా వున్నందుకుగూడ వారిద్దరూ ఎంతో సంతసిస్తున్నారు. కాపయ్య అన్నమదేవుని సన్నిధిలో ఎంత ఆనందమందుతున్నాడో, అన్నమదేవుడుగూడ అతని ప్రక్కనున్నందుకు అంత ఆనందమందు తున్నాడు.

వేమారెడ్డికీ కాపయ్యకూ ఎంతో సన్నిహిత సంబంధమున్నది. వారిద్దరు ఒకరినొకరు విడిచివుండాలంటే ఎంతో కష్టపడుతూండేవారు. కాని కాపయ్య కిప్పుడతణ్ణి వీడి వుండడం ఏమంత కష్టమనిపించ లేదు. అన్నమదేవుడు తోడుగా వున్నంతవరకు వేమారెడ్డి అవసరం అతనికి లేనట్లే కనబడింది.

తనలో ఆ మార్పెందుకొచ్చిందో కాపయ్యకే తెలియలేదు. అన్నమదేవుని కళ్ళలో ఒక విధమైన ఆకర్షణ, అతని నవ్వులలో ఒక విధమైన వెలుగు, అతని మాటలలో ఒక విధమైన తీయదనం వున్నట్లతని కనిపించింది. అతడు నవ్వుతూవుంటే చూడాలని, అతడు మాట్లాడుతుంటే వినాలని, అతణ్ణి అలాగే చూస్తూండాలని కాపయ్య ఉబలాటపడజొచ్చాడు.

అన్నమదేవుడుగూడ తన్నుగూర్చి అలాగే ఆదుర్దాపడు తున్నాడు. తాను కొన్ని నిమిషాలు మరుగైతే ఓర్చుకోలే కున్నాడు. తను కొంతసేపు మాట్లాడకుంటే ఏదో పోగొట్టు కొన్నట్లుంటాడు. ఎన్నడూ తన్నుచూస్తూ తనతో మాట్లాడుతూ నవ్వుతూ నలుస్తూ వుండాలంటాడు. అతణ్ణి చూస్తుంటే ఇంకా చూడాలనే అనిపిస్తుంటుంది. అతడు మాట్లాడుతుంటే ఇంకా మాట్లాడాలనిపిస్తుంటుంది. ఎందుకోమరి.

గతజన్మలో తామెవరో. ఆ జన్మలో తామిద్దరూ చాల సన్నిహితంగా ఉండేవారేమో. ఈనాడుగూడ ఆబంధమే తమ్మలా బంధించివుంచిందేమో. ఏమోమరి.

కాపయ్య స్వారీచేస్తూ వస్తున్నాడు. అతని ప్రక్కగానే అన్నమదేవుడు గూడ వస్తున్నాడు. వారికిముందు వంద మంది అశ్వికులు, వెనుక వందమంది అశ్వికులు ప్రయాణంగావిస్తున్నారు.

కాపయ్య నాయకుడు అన్నమదేవుణ్ణి పరికించాడు. ఆ తల పాగా, ఆ ముంగురులు, ఆ కళ్లు, ఆ నాసిక, ఆ చిరునవ్వు, అద్దాలలాటి ఆ చెక్కులు—అతడాలాగే చూస్తూ వుండిపోయాడు. అతడలా చూస్తున్నప్పుడే అన్నమదేవుడు గూడ అలా చూచాడు.

ఇద్దరి చూపులూ కలిశాయి. అన్నమదేవుని చెక్కిలు సిగ్గుతో ఎఱ్ఱవారాయి.

"మీకు అలసటగాలేదా?" ప్రశ్నించాడు కాపయ్య నాయకుడు

"మీరు ప్రక్కన ఉన్నంత వరకు అలసట ఎలా కలుగు తుంది?" అంటూ నవ్వాడు అన్నమదేవుడు. ఆ నవ్వులలో వెన్నెలలు తొణికిసలాడాయి ఆ మాటలు మధుర ముగ్ధమోహ నంగా వున్నాయి.

"మనం వచ్చిన పని నెరవేరినట్లే గదా?" అడిగాడు నాయకుడు.

''నెరవేరలేదా మీరు చెప్పండి?''

''నెరవేరిందనే నేననుకొంటున్నాను.''

''నేను గూడ అలాగే అనుకొంటున్నాను.''

''బళ్లాలుడు గూడ సామాన్యుడుగాడు. అతనికీ సుల్తాను నెదిరించాలనే వుంది. కాని మరొకసారి దెబ్బతింటామేమోనన్న భయం గూడ అతనికుంది.''

''మీరు వచ్చిన తరువాత, మీ మాటలు విన్న తరువాత అతడు ధైర్యం తెచ్చుకొన్నాడు. ఇక తప్పని సరిగా మనకు సాయంగావస్తాడు''

''బళ్లాలుడావైపున తిరుగుబాటు గావించి, మీరిరువురూ తుంగభద్రా ప్రాంతంలో ఎదురు తిరిగితే సులభంగా సుల్తాను ఆట కట్టించడానికి వీలుంటుంది''

''ఆలాగే జరిగి తీరుతుంది.''

అన్నమదేవునితో ఎంత మాట్లాడినప్పటికీ కాపయ్యకు తనివి తీరడంలేదు. ఆలాగే అన్నమదేవునికి గూడ సంతృప్తి కలగడంలేదు. తమలో వచ్చిన ఈ కొత్త మార్పుకు వారిద్దరు అర్థంచేసుకోలేకున్నారు.

కాపయ్య, అన్నమదేవులిద్దరూ ఆనెగొంది చేరుకొంటూనే కొంతసేద తీర్చుకొని సోమదేవరాజును చూడడానికి వెళ్ళారు. కాపయ్యనూ, అన్నమదేవుణ్ణి చూస్తూనే ఆరాజు, '' ఏంతవరకు వచ్చింది మీరు వెళ్లివచ్చినవిషయం ?'' అని అడిగాడు.

'' వారినే అడగండి '' అంటూ కూర్చున్నాడు అన్నమ దేవుడు.

'' సన్నడగమనకిపోతే మీరు చెప్పరాదా ?'' అంటూ నవ్వాడు కాపయ్యనాయకుడు.

కాపయ్య నాయకుణ్ణి మొట్టమొదట చూచినప్పుడే సోమ దేవరాజు కతనిమీద మంచి గౌరవభావం గలిగింది. అతడు చాల ప్రతిభావంతుడని ఆనాడే అనుకున్నాడతడు.

'' మీరే చెప్పండి '' అన్నాడు అన్నమదేవుడు.

" బళ్ళాలుడు మనకు సాయంచేయడానికి, అవసరమైతే మనతో కలిసి పోరాడడానికి అంగీకరించాడు." అన్నాడు కాపయ్యనాయకుడు.

మీరు వెళ్ళినతరువాత అతడు మరొకవిధంగా అనగలడా? మీ ప్రయాణం సుఖవంతంగా గడిచిందిగదా

"అన్నమదేవుడు ప్రక్కన వున్నంతవరకు ఎందుకు గడవదు?" అంటూ నవ్వాడు కాపయ్యనాయకుడు. అన్నమదేవుడుగూడ నవ్వాడు

"అయితే మాకు మీ సలహాఏమిటి?" ప్రశ్నించాడు సోమదేవరాజు.

"సలహాఏమున్నది? మేము తనసైన్యాల నోడించామని సుల్తానుకు తెలుస్తూనే అతడు మాపైకి అదనపు బలాలను పంపుతాడు. దేవగిరినుండి కంపిల మాకు దగ్గరగా వున్నదిగనుక అతడచ్చటనుండే అదనపు బలాలను పంపుతాడు. ఆ సేనలు పూర్తిగా మమ్మల్ని అణచివేయడానికి వస్తాయి. ఆ సమయంలో మీరు తుంగభద్ర, కృష్ణానదుల మధ్యప్రాంతాన్ని పట్టుకోవడానికి ప్రయత్నించండి."

"మరేమైనా సలహా యిస్తారా?"

వేమారెడ్డిని ముందుగానే మీకు తోడుగా పంపుతాను. అతని సైన్యాలుకూడ మీకు సాయపడడానికి వస్తాయి. అలా వచ్చినప్పుడు ఆ విషయం బయటికి పొక్కకుండా చూడాలిమీరు. మామీదికి మహమ్మదీయ సేనలు పడకముందు మీరు విజృంభించకండి. మీరు ఈ రెండునదుల మధ్యప్రాంతాన్ని పట్టుకుంటూ, వీలుంటే తురుష్క సేనల్ని వెన్నాడండి. అప్పుడాసేనలు అడకత్తెరలో చిక్కుకొన్నట్లు చిక్కుకొంటాయి."

"ఈ వ్యూహం బాగానేవుంది, ఆలాగే చేస్తాము. మీరు వేమారెడ్డిగారి నెప్పుడు పంపుతారు?"

"త్వరలోనే పంపుతాను."

"వారు వచ్చునప్పుడు మరేమైనా విశేషాలుంటె చెప్పి పంపండి." అన్నాడు సోమదేవరాజు.

ఆ తరువాత కాపయ్య నాయకుడు సోమదేవరాజు వద్ద సెలవు పుచ్చుకొన్నాడు. మరి రెండు రోజులుండి పొమ్మన్నారు సోదరులిద్దరూ. కాని కాపయ్య నాయకుడంగీకరించలేదు వెంటనే వెళ్ళవలసి వుంటుందని. ఇప్పటికే ఆలస్యముంటుందని. అందువల్ల ఇకపోక తప్పదని అన్నాడతడు.

ఇక ఆ సోదరు లతణ్ణి అడ్డుపెట్టి లాభం లేదనుకొన్నారు. తోడుగా కొంతదూరం వెళ్ళి వెనుదిరిగి వచ్చారు. కాపయ్య నాయకుడు వెళ్ళి పోతున్నప్పుడు అన్నమ దేవుని మనస్సెంతో బాధపడింది కాపయ్య హృదయం గూడ ఆలాగే నొప్పి పడింది. కాని వారిద్దరూ ఏమిచేయగలరు?

కాపయ్యను విడిచి వెడుతున్నప్పుడు అన్నమదేవుడు వెనుదిరిగి చూస్తూ వచ్చాడు కాపయ్యకూడ ఆ విధంగానే చూస్తూ ముందుకు వెళ్లాడు. వారిద్దరూ ఒకరొకరికి కను మరగయ్యారు, గాని వారి మనస్సులు మాత్రం మరింత సన్నిహిత మయినవి.

అన్నమ దేవుడింటికి తిరిగి వచ్చినప్పుడు దీర్ఘంగా నిటూర్పు విడిచాడు.

తాను ప్రతాప రుద్రనగరానికి వెళ్లిన నాటినుండి యీనాటి వరకు జరిగిన విషయమంతా అన్నమ దేవునికొక కలలాగా అగుపడింది. ఆ కల క్షణంలోనే కరిగి పోయినట్లయింది అతని మనస్సు చాల బాధపడింది. అతని కళ్లు చెమ్మగిల్లాయి, కాని సోమదేవరాజు అన్నమ దేవునిలో వచ్చిన మార్పును గమనించలేదు. అతడు సుల్తానుపై ఎదురు తిరగడ మేలాగన్న విషయాన్ని ఆలోచించడంలోనే వున్నాడు, అందువల్ల అతనికి అన్నమదేవునిలో వచ్చిన ఆ మార్పు ఏ మాత్రం గోచరించలేదు.

(సశేషం)

భూసంస్కరణలను అక్షరాలా అమలుపరచాలనీ,
యింతటి బృహత్కార్యానికి కావలసిన దృఢదీక్షతో,
ఉత్సాహంతో పనిచేయాలనీ ప్రభుత్వ సంకల్పం.--ముఖ్యమంత్రి

వందేమాతరం

మదిగొండ వీరభద్రమూర్తి

హైదరాబాద ఖండము

విప్లవ వీరుడు ఫాడ్కేకు పినార

పాణి చెప్పిన కథ

ఆ నైజాం ప్రభు రెడవ
సూనుం శాఖ్యాన్ 'ముబారి జుద్దౌలా' హ
ద్దా! నాస్తి తెగుదలో, గ
ద్దా! నేర్పు బంమ్ము నతని కటు లందఱకున్

గుఱిగనూ్మసు ముల్కి నేయు దణి మీర్గోహారలీఖానునా
నరు నాండె, పులిన్ బరిన్ విడచి కే లుప్పొంగి సాపున్ ధృత
జ్వరమో మెల్లని గుబ్బుతో వెనుకకున్ జార్కొంచు బైరాద యె
వ్వరికేన్ బాణము చే దటే! యది యటే! పంజా యిడున్ బేల యై

ఇత దెవ్వండు పరాయి భాగ్యపురిరా జేనాడు బాకీపడెన్
శత సంఖ్యాధిక రూక లీతనికి, నే సందర్భమున్ జెప్పి భా
రత విశ్వ భంయందు గల్వమున బొతం బట్లు వీడుండు, నీ
కత తేల్చన్ పలె నంచు నాతడను నాంగ్లధ్యాసమై నూపుచున్

న నెఱుంగని మన కీ
నల్లడి యెట్లొదవె! పరుని వల్ల ననుచు సా
రోల్లసిత నభ్యులన్ గని
నల్లాపించు నట దరుణచషూరుచి యై.

రెసిడెన్సీన్ గని జంట్లతోడ గానితేరే రెండు ఘూకమ్ము లిం
డెసగన్ బెంటము వాని సంతునని భాషించున్ నిజాంసేనప్రా
గ్రసరున్ గాగితముం గలమ్ము నిడి సంఖ్యన్ వేసికోవే! యనున్
వసతిన్ జేరును రేయి ఖానుడెపుడో పస్నిన్వ కంఖాణుడై.

వెల్లికిల బడి పై దన్ని కాళ్ల పొర్ల
జాల దయి మూల్గు సింహమ్ము చార్మినారు
అస్వతంత్ర భాగ్యనగర మడవి, గోలు
కొండకిల్లా గుహ తదుక్తి గుంఫనమున.

రాజభవనం బటే! దీని రంగులోని
రవ్వవిలువ సేయ నొక పరంగి విడిది

కనికరింప నిల్పుటయును కా
కూలుటయునదె! యెంతటి గోడు వచ్చె.

అని యతండు మరియు ననుచరులకు జెప్పె
బాణమూన్ దుపాకి డాలు బట్టి
కుచ్చుటోపి హ్యాటుకున్ జేయ దింక షే
ర్వాణి కోటుకున్ సలా మటంచు

ఒక దర్జీ రెసిడెన్సి నుండునత డేదో మాట పట్టింపు మై
బెకలింతున్ భవదంత్ర జాలమును గాపీ! యంచు నా ఖానుసే
వకు దర్జించెను, వచ్చి చెప్పికొనియెన్ వా, డప్పుడే దర్జీవా
నికి బేడీల్ వడి కోట జేర్పబడె, రానేవచ్చె హూణేంద్రుడున్

మొనగాని వచ్చెన్ వెయి మం
దిని, గోటను జుట్టుముట్టె. దెల్పె బభున కా
తని రెండవ కొడుకు దుడుకు
తనమును రెసిడెంటు, మొన శతఘ్నులు నుండెన్.

ఒక బాణము రివ్వున వ
చ్చి కసిమసంగె నపు డాంగ్ల సేనాధ్యక్షున్
సకవచు డొక్కడె యొక డా
ఫ్రికాయతడు పేర్చి మడమ దిప్పించె మొనన్

ఎటులో తండి కొడుకు న
ప్పటికి జెఱన్ గొనియె జెమ్మవాలిన కనులన్
దటుకున దూలెడి యొడలున్
ఘటితగత స్మృతుల శయ్య గదలని మదియై

పాలింపన్ దొడగె న్నిజాంపదవి శోభావంతు డౌ నాసిరు
ద్దౌలా రాజ్యము నన్న తమ్ముని యెడందన్ భారత పాజ్యమై
బాలింపన్ దొడగెన్! బభాత రవితత్వం బే స్వతంత్రత్వ మే
లీలన్ దాను కృతార్థుడో యనువు నల్లెన్ వాడు జైల్ వీడుజెచున్

అన్నకు స్వతంత్రతా బుద్ధి నున్న తానె
యున్నచో బీరమున నదిరన్న ! యనుచు
మీరు గోహారలీఖాను చేర దీసి
కొంద రాఘ్న నరబుల గ్రందు జేసె
గోలకొండన్ స్వతంత్రతా బాల పుట్టి
యాడుకొనుచు జార్మినారు నందు జిక్కె
నాంగ్లునకు, నున్నవారసమర్థులగుట
నవతరించి విడిపింపనను నతండు

ప్రకటించిన జగడమ్మున
వికటించిన ఫలితమునకు వెఱవక యాతం
డాం యేటి విడి ఖయిదు గో
లుకొండకిల్లా నెయిది వెలుపలికి దూకెన్

కలమున్ వాడిసినాను ముంచి యత డాకర్నూలు చాందాన వా
ణులకు న్నెయ్యమునీబిగాబులకు నా భోపాలునాఫ్ఘన్నవా
బులకున్ మూగముహొస్వరాబులకు వే బుత్తెంచె లేఖల్స్వచా
రులతో హూణాలపాలనమ్ము నలుచూర్లుం బట్టి ముట్టింపగా.

ఇకదండ దననేలా! యెందఱున్నా రమీర్లన్
గృత మతులు నవాబుల్ హిందుదేశమ్మునం దా
విత్తివిరతి కెల్లన్ వేగు బంపించె నౌరా!
యతడు, బల మిరాన్ రష్యాలునున్ బంప నొప్పెన్

సరె యనిమాటయిచ్చెను నిజాముపటాలముహూణు దెప్పడేన్
బిరుసున దిట్టినం బడుడు బీరము చూపకు డందునందు రే
యరుగకుడం ఖా నొసంగె నాజ్ఞను వానికి గంటినిండ ని
ద్దురయును బట్టె(దిన్నదియు)దోడనె యొంటికి బట్టెసయ్యెదన్
దాడి కిక రెండురోజులే తడపు కలదు
చారు లిరువురు మూవురు రాక యితను
శీత మా యేట గడు విపరీత మై శ
రీరముల గోసె రాకంప భారములను.

హైదరాబాద నగరమ్ము కాదొ యచిర
కాలమందు ఢిల్లీపురిగా నటంచు
ననుకొనెడివారి కొకకొంత యాశ పెట్టె
శీత మిరుచోట్ల నేకతాస్థిత మగుచు.
చర్మమునకె తగును చర్మము నోదార్చి
యిగముతీపి ననుభవింప జేసు
చెలువతోడ నున్నవిలువ పోలునె గ్రుచ్చి
కొనుట దక్కమధుపు కొంత మేలు.

అని బెగ్గిల్లి నిజాముపై నికుడతండాపొంత మాల్యమ్ము హె
చ్చిన విస్కీ నొకచిన్నెదాని గొన వచ్చెన్ గొట్టు, కద్దానినే
చెనకెన్ వేటొక చేయి యాంగ్ల మొకటే సీసా యన్ దెల్లవా
నిని గామించెను బుడ్డి, యిర్వురును సుస్నీలున్ షియాలై రి
పో!

పట్టజాలక తొలివాడు పల్కె రెండు
నాళ్లె మీ త్రాగుడును మీరు ననుచును మలి
వాడు తత్క్షణమే చెప్పినాడు పోయి
యా యుదంతము రెసిడెంటు కర్ధరాత్రి.

కారన్ ఖానుడు ప్రగ్గునాళ్ళ పిరపక్షం బీవల న్నిల్చెనా
యా రే లన్నియు గృష్టపక్షములు నే డాతం డికారాస్థు దై
మేరన్ మీఱక గాలివానమొదలు న్మీలించు సృష్టిస్థితిన్
గారాడించిన హేతువున్ దెలిపి యాంగ్లత్రాతయోహో!
యనెన్.

ప్రతికించి తీపు మనసం
తతి, నధికోద్యోగ విభవ తరళము నీ జీ
విత మిక హితక్! యని యింకే
మొ తగన్ రెసిడెంటు వలికి పుచ్చెను వానిన్
సన్నపూల రవిక చలువ జేసినది గ్లా
స్కోపలువ ధరించికొని నిదురిల
కా విభావరి సుఖపీవరి తన్నుదా
జూచుకొనుట నెఱుపు మోచె గన్ను.
పల్లిజడల్ వహించు యతివత్కృతవేషజనద్వయమ్ముతో
దెల్లదణాయ డూడిపడి తీసెను వారలనుండి లేఖలన్
డిల్లము నొంది కేటి రెసిడెంటు నిజాంకడ కేగుదెంచి యా
యుల్లిఖితమ్ముజూపి బదు లొప్పుగ జెప్పుమయా! య
టంచచెన్.

ఓ! రాజా! చందూలాల్!
నేరవా నీ వేము దీని నే మందువు నా
నేరను నీ దావిసను హు
జూరూ! యని ముఖ్యమంత్రి చుమ్మలుచుట్టెన్.

ఆమరణమ్మును ఖైదీ
గా మనె దక్కోలుకొటకు గడగి గొహారా
లీ మృథమున గర్నూల్పతి
బాముల బడెనని పినాకపాణి వచించెన్.

ఎంత పని జరిగిన దయా!
ఎంతటి పౌరుషము గలది యీ హైదరబా
దంతయు వినిచిన నీకు న
మింతును జాగరిత నైతి నే ననె బాబా.

నైవేద్యం

జొన్నవాడ రాఘవమ్మ

నా దేశ సౌభాగ్య సంపదలు తిలకించి
నవ్య భావాలతో నాట్యమాడెను మనసు
నా భరత జనయిత్రి చరణాంబుజాలపై
తలవంచి పులకించి పయనించెదను నేను......

అంబరము చుంబించు హిమగిరి శిఖరాలు
అందాలు కురిపించు సుందరపు కాశ్మీరు
బృందావనీ రమ్య రాగ రత్నపు గనులు
అందందు శృంగార చంద్రకాంతపు శిలలు......

కావేరి జలజలలు—గంగమ్మ గలగలలు
బ్రహ్మపుత్రా సింధు నర్మదా నాట్యాలు
తుంగభద్రా కృష్ణ గోదారి పరవళ్ళు......


చిత్ర చిత్రములైన శిల్పకుంచెల కళలు
శాశ్వతంబై వెలిగె సత్కవుల కావ్యాలు
త్యాగశీలము ధర్మవీరయోధుల చరిత
ప్రగతిగాంచిన ధాత్రి పసిడినోముల పంట......

అమరులారాధించు బదరి నారాయణుని
భద్రగిరి శ్రీరాము శ్రీ వేంకటేశ్వరుని
కాశి విశ్వేశ్వరుని, సేతు రామేశ్వరుని
శిఖరాల నీడలో తరియించెదను నేను......





స్వాతంత్ర్యోద్యమము తెలుగు కవిత



దివాకర్ల వేంకటావధాని

స్వీయములయిన దేశరాష్ట్రమతాదులపై నభిమానముండుట మానవులెల్లరికిని సహజమే. వారి మాటలయందు, వ్రాతలయందు ఆ యభిమానము జ్ఞాతముగనో, యజ్ఞాతముగనో వ్యక్తము చేయబడుచునే యుండును. సాధారణసమయము లందుకంటె నా దేశరాష్ట్రమతాదుల యభ్యుదయమున కంతరాయము కలిగించు పరిస్థితు లేర్పడునప్పుడది ద్విగుణీకృతమై యావేశపూరితముగా వెల్లివిరియుచుండును. ఆంగ్లేయులు మనదేశమును బరిపాలించునపుడే పలురాష్ట్రము లేర్పడినవి. ఆంధ్రులెంత యత్నించినను ప్రత్యేకరాష్ట్రమును బడయజాలకపోయిరి. రాష్ట్రాభిమాన మంతకు ముందును ఆంధ్రకవుల హృదయములందు నిండారియుండినను అది బహిర్గతము కాక గూఢముగనే యుండిపోయెను. తమకు ప్రత్యేక రాష్ట్రమేర్పడలేదను వ్యథ కాలక్రమమున వర్ధిల్లి కావ్యరూపమును బొంద నారంభించెను. రాయప్రోలు, విశ్వనాథ, తుమ్మల మున్నగువారి రచనలలో దాని యుజ్జృంభణము మనకు గానిపించును. రాష్ట్రీయభావమును ప్రజాహృదయములందు రేకెత్తించి రాష్ట్ర సంపాదనమునకు నాయకు లొనరించిన యత్నములు, త్యాగములు మున్నగు వాటితోపాటు కవుల యావేశపూరితములయిన రచనలును జాలవరకు దోడ్పడెననుటలో నత్యుక్తి యుండజాలదు. జాతీయభావ మంత విశాలమును ఉదారమును గాకపోయినను రాష్ట్రీయభావము కూడా ప్రశంసింప దగినదే. సమరస భావముతో బరికించినచో జాతీయభావ మంగి యనియు, రాష్ట్రీయభావ మంగమనియు జెప్పవచ్చును

ప్రజలలో స్వాతంత్ర్య పిపాస

క్రీ.శ 14వ శతాబ్ది వఱకును భారతదేశము నందలి పలుభాగములను దేశీయరాజులు పాలించిరి. వారి పాలనమున ప్రజలు స్వాతంత్ర్య సంపత్సౌఖ్యముల ననుభవించుచు నానందమున విలసిల్లిరి. తరువాత దేశమందలి కొంతభాగము మహమ్మదీయ రాజుల యేల్బడి క్రిందికి వచ్చెను. అదృష్టవశమున నంధ్రదేశము మాత్రము రెడ్డి పద్మ నాయకులయు, విజయనగర సార్వభౌములయు పరిపాలనమున నుండి స్వాతంత్ర్యసౌఖ్యము ననుభవించుచునే యుండెను. విజయనగర రాజ్య పతనముతో నాంధ్రుల స్వాతంత్ర్య సౌభాగ్యమును అంతరించెను. తరువాత నాంధ్రదేశము పలువురు రాజులచే పరిపాలితమై తుదకాంగ్లేయ రాజ్యమున నంతర్భవించెను. ఆంగ్లేయులు సుమారు రెండున్నర శతాబ్దుల కాలము భారతదేశము నాక్రమించి దానిని నిరంకుశముగా బరిపాలించిరి. ఆ కాలము నందంతయు దేశము పారతంత్ర్య పంకమగ్నమై, వివిధ రంగములం దభ్యుదయమును గోల్పోయి, యధమ పరిస్థితులనుభవించెను.

పరరాజ పరిపాలనా భారము సోకినకొలది భారతీయులలో స్వాతంత్ర్య పిపాస పెంపొంద సాగెను. వివిధ రాష్ట్రములందు బలువురు నాయకులు ధనమాన ప్రాణములనైన లెక్క సేయక స్వాతంత్ర్య సంపాదన బద్ధకంకణులయి యఖండమైన కృషి గావించిరి. ఆ కృషియే క్రమముగా బెంపొంది, మహాత్ముని నాయకత్వమున ఫలించి, దేశమును మఱల స్వాతంత్ర్య సంపచ్ఛోభిత మొనరింపజాలినది.

చైతన్య పునరుజ్జీవనం

పరరాజ పరిపాలితమై దేశము దాస్యాంధకారమున నల్లాడు సమయమున వివిధ ప్రాంతములందు కవివర్యుల హృదయములు కుమిలి కవితారూపమున ప్రసరించినవి. ఆ కవితయు నప్పటి రచనలును జాతీయభావ బంధురములయి చదువువారి యొడళ్ళు పులకింపజేయును. ఆ రచనలు వివిధ ప్రక్రియలలో నున్నవి. కొన్ని గేయములు, కొన్ని కావ్యములు, కొన్ని నవలలు, కొన్ని జీవితచరిత్రలు, కొన్ని నాటకాదులు. మఱియు రాజకీయనేతల చేతలు, కవి పుంగవుల కైతలు రెండును రెండువిధముల చైతన్యపునరుజ్జీవనమునకు సాధనములయినవి. దేశభాష లన్నింట నప్పుడు జాతీయతోద్బోధకములు, స్వాతంత్ర్యవాంఛా సముద్దీపకములునగు జీవ వంతములయిన రచనలు వెలువడినవి. ప్రత్యక్షముగా గాకపోయినను పరోక్షముగానైన ఆ రచనలు స్వాతంత్ర్య సంపాదనమునకు సాయపడిన వనుటలో సందేహము లేదు.

"మా కొద్దీ తెల్లదొరతనం"

ఆంధ్రదేశమున నాబాలగోపాల విదితమై పండిత పామరులందఱికిని ప్రబోధకరమై స్వాతంత్ర్య వాంఛను రేకెత్తించిన తెలుగు గేయములలో శ్రీ గరిమెళ్ల సత్యనారాయణగారి 'మాకొద్దీ తెల్లదొరతనం' అనునది ప్రథమగణ్యమైనది. ఇది పరదేశీయులయిన యాంగ్లేయులు దేశమును బాలించుచు గావించిన యక్రమముల నధర్మముల నన్నింటిని సులభ సరళమైన భాషలో వెల్లడించి దేశీయులందఱికి తెల్లవారి దొరతనముపై నసహ్యాభావము కలిగించినది. జనుల హృదయాంతరాళము లందడగి వెలువడ వెఱచుచున్న జాతీయభావము నది పొంగిపొరలునట్లు చేసినది. ఆంధ్ర జనులందరిలో జాతీయభావమును రగుల్కొల్పిన యింత శక్తిమంతమైన రచన మఱి యొక్కటి లేదు. తరువాత వెలువడిన జాతీయ రచనలలో శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారి 'స్వరాజ్యరథము' మొదలయినవి పేర్కొనదగినవి.

కాంగ్రెసు చరిత్ర

ఆంధ్రదేశమున భారతీయతా సంధుక్షకములయిన చరిత్రలు, జీవిత చరిత్రలు పెక్కున్నను వానిలో రెండు ముఖ్యముగా బేర్కొన దగియున్నవి. ఒకటి డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి కాంగ్రెసు చరిత్రకు శ్రీ కొడాలి ఆంజనేయులు గారు చేసిన యాంధ్రానువాదము. రెండవది మహాత్ముని స్వీయచరిత్రకు విద్వదగ్రణులు, శతావధానులునైన శ్రీ వేలూరి శివరామ శాస్త్రిగారొనరించిన యాంధ్రీకరణము. రెండురెండే. జాతీయోద్యమ చరిత్రను పరపాలనా పీడనమును బహువిధముల వ్యక్తీకరించి తెలుగు వారిలో జాతీయభావము నిండారునట్లొనరించినవి. అందును మహాత్ముని యాత్మకథ కథవలెనే సాగుచు నొకవంక నహింసా సత్యప్రభావమును వేఱొక వంక స్వాతంత్ర్య సంపాదనాసక్తిని ప్రబోధింపజాలినది. ఇట్లే నెహ్రూ, వినాయక సావర్కార్, బోసుమున్నగు వారి జీవిత చరిత్రలు కూడ జాతీయ స్వభావ సంవర్ధకములై సన్నుతికెక్కినవి.

నవలా రాజము "మాలపల్లి"

ప్రత్యక్షముగనో, పరోక్షముగనో పరితలలో జాతీయభావమును ప్రేరేచిన నవలలును ఖండకావ్యములను బెక్కువెలసినవి. అట్టి నవలలలో శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారి మాలపల్లి ముఖ్యమైనది. స్వాతంత్ర్య సంపాదనము దేశభక్తి మున్నగునవే యిందు ప్రత్యక్ష వస్తువులు కాకపోయినను, అస్పృశ్యతా నివారణాదులగు మహాత్ముని యాదర్శ సిద్ధాంతములకిందు మిక్కలి

ప్రాధాన్య మొసంగఁబడినది. ఇట్లు పరోక్షముగా జాతీయ భావమును బెంపొందించిన రచనలింకను ననేకములున్నవి. ఆ కాలపు కవులు పత్రికలలో ప్రకటించిన ఖండకావ్యములు పెక్కింటిలో దేశభక్తియు స్వాతంత్ర్యానురక్తియు ప్రముఖ స్థానము నాక్రమించియున్నవి. అవి యప్పటి ప్రజల భావ సంచలనమునకు ప్రతినిధులు. భారత మాతృ దాస్యశృంఖలా విచ్ఛేదమునకై వారు పడు నావేదన, యందలి ప్రత్యక్షరమందును ప్రత్యక్షమగుచుండును.

"శివభారతము"
"రాణాప్రతాప చరిత్రము"

మన దేశ చరిత్రలో స్వాతంత్ర్య సంపాదనమునకై సర్వస్వమును సమర్పించి, భారతీయ ధర్మ సంస్కృతి ప్రతిష్ఠాపనార్థము యావజ్జీవితము పాటుపడిన మహనీయు లనేకులున్నారు. అట్టి వారిలో రాణాప్రతాపుఁడు, శివాజీ మున్నగువారు అగ్రగణ్యులు. వారి జీవితమంతయు దేశదాస్య నిర్మూలన పరాయణమై భాసిల్లియుండెను. అట్టివారి జీవిత చరిత్రలను వస్తువులుగా గ్రహించి మహాకావ్యములు నిర్మించుట జాతీయతాభావ ప్రచారమునకెంతయైన తోడ్పడుననుటలో సందేహము లేదు. ఈ విషయమును గ్రహించి శ్రీ రాజశేఖర శతావధానిగారును, శ్రీ గడియారము వేంకట శేషశాస్త్రిగారును, రాణాప్రతాప చరిత్రము, శివభారతము అను రెండు మహాకావ్యము లను నిర్మించిరి. అవి భాషచేతను, భావములచేతను గూడ జాతీయతా నిధానములని చెప్పఁదగిన మహనీయ కావ్యములు. కవు లందుఁ దమ నాయకుల నాదర్శ పురుషులనుగాఁదీర్చి దిద్దుటయేకాక, భారతీయ సంస్కృతి ధర్మవిశేషములను జాలమెలఁకువతో నిరూపించి నిరుత్సాహ నిర్విణ్ణమయిన యాంధ్రజాతికొక యాదర్శమార్గము నందీయఁజాలిరి. ప్రతాపుడును శివాజీయు ధైర్యోత్సాహములు ప్రేరేప ప్రబలులైన శత్రువుల పైకుటికి విజయము సాధింప యత్నించుట పారతంత్ర్య పరాభూతు లయిన పఠితలకు కర్తవ్య నిశ్చయమున పరమోపదేశమై పరిఢవిల్లినది.

"భరతఖండంబు నుద్ధరింపగ జనించు
 ధూర్జటివి నీవు రాజమాత్రుడవుకావు"
"భారత మహాఖండంబు దాస్యాంధకార నిమగ్నంబయి యుండ
 లోకముల దౌర్భాగ్యమ్మనుం దీసెనేఁడని హర్షింప ప్రతాపభానుఁడుదయంబైయుండె"

"అతిభీమంబుగఁబెల్లురేఁగి నిబిడంబై మూగి యీ సర్వ భా
 రత దేశంబును ముంచివైచిన మహోగ్రంబైన దాస్యాంధకా
 రతతిన్ దేవుని దృష్టికూడ నణు మాత్రంబున్ జొరంబోని దు
 స్థితి సంధించెడు పాపికాల మరుదెంచెఁజూచి యెట్లోర్తునో"

మున్నగు పద్యములు చదువునపుడు పఠిత, కథా ప్రకరణమును విస్మరించి కార్యరంగమునకు దుముకు ననుటలో సందియము లేదు పై రెండు కావ్యములను వస్తు సంఘటనము నందును, రచనా పాట వము నందును, భావగాంభీర్యము నందును అద్వితీయములైన యక్షరమక్షర మందును జాతీయతను వెదజిమ్ముచున్నవి.

"విజయశ్రీ" కావ్యము

శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి విజయశ్రీ కావ్యముకూడ నిట్టిదే. ఇందలి శరీరము ప్రాంతదేకాని చైతన్యము మాత్ర మతి నవ్యమైనది. సుపరిచితమైన భారతకథ యందే కవిగా రాధునిక భావముల నెన్నింటినో యిమిడ్చి పఠితల కుత్తేజము కలిగించి యున్నారు. ఇందు కురుక్షేత్ర సంగ్రామమునకును భారత స్వాతంత్ర్య సంగ్రామమునకును బోలిక వ్యంగ్యము చేయఁబడియున్నది. దేశమునందలి వివిధ పక్షములవారి భావములిందుఁజక్కగా వివరింపఁబడి యున్నవి. ఇది నిజము

నకుఁబాండవ కౌరవ సంబంధ గాథయే యైనను, నిశితముగాఁబరికించువారికి మైమఱపు గలిగించి స్వాతంత్ర్య సంగ్రామ భ్రాంతి యొదవించుచున్నది. కావ్యాంతర్గతములయిన స్వతంత్ర భావములకు మృదు మధురశైలి యెంతయో మెఱుఁగు దిద్దఁజాలినది.

"మహాత్మాకథ"

గౌతమ బుద్ధునికిని గాంధీమహాత్మునికి పెక్కు విషయములలో సాదృశ్య మున్నది. సత్యాహింస లా యిరువురికిని ఆరాధ్య లక్షణములు. అందుచేత నా యిరువురిలో నొకరి చరిత్ర రెండవ వారి చరిత్రను స్ఫురింపఁజేసి యానందావహము కాఁజాలు చున్నది. ఈ కారణము చేతనే కాఁబోలు నాకాలమున బుద్ధజీవిత వస్తుకములయిన కావ్యములు పెక్కు బయలుదేలినవి. ప్రత్యక్షముగా వానికిని, భారత జాతీయతకును నంతగా సంబంధము లేకపోయినను గాంధీమహాత్మునకును బుద్ధదేవునికి గల భావసాదృశ్యము వానిని గూడ జాతీయతాభావ బంధురముల నొనరించినది. శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు మహాత్ముని జీవితమును వర్ణించుచు రచించిన పద్య కావ్యము కూడ నిట్టిదే.

స్వాతంత్ర్యము లభించిన పిమ్మట ధర్మచక్రమునకును ప్రాధాన్యము కలిగినది. అది అశోక చక్రవర్తికి సంధించిన దగుటచే కొందరు కవు లా మహారాజు చరిత్రమును గ్రహించి కావ్యములు రచించిరి. అట్టి వానిలో శ్రీ కల్లూరి వేంకటనారాయణరావు గారి అశోకసమ్రాట్టు చరిత్రము పేర్కొనఁదగినది. స్వాతంత్ర్య లాభమునకుఁబూర్వము కవులును, రచయితలును తత్సంపాదనమునకు సాధనములైన రచనలు కావించిరి. స్వాతంత్ర్యము సిద్ధించిన పిమ్మట స్వతంత్రప్రభుత్వము కవులను రచయితలను ప్రోత్సహించుచు దేశమునందలి అన్నిభాషల యభ్యుదయమునకును దోడ్పడుచున్నది.

జాతీయతాభావ సంధుక్షణమునకు దోహదమొనఁగూర్చిన ముఖ్యములయిన రచనలను మాత్రమే యిచ్చట స్పృశించి విడిచితిని. కాల పరిస్థితులను బట్టి యిట్టి రచనలెన్నో యప్పుడు బయలుదేఱి స్వాతంత్ర్య సిద్ధికిఁదోడ్పడఁజాలినవి. రాష్ట్రీయభావ ప్రేరకములయిన కావ్యములు మనభాషలోఁజాలగలవు. అవికూడ నొక విధముగా జాతీయతకుఁబెంపు చేకూర్చినవే.

"నేఁటితో నస్వతంత్రతానియతమైన
యీబ్రదుకు తెల్గువారు భరింపలేరు"

జాతీయభావము, కవిత పరస్పర పోషకములు

మొదలయిన భావములతోఁగూడిన రచనలు రాష్ట్రీయభావ ప్రధానములయిన గ్రంథములలోనివే యైనను జాతీయతా భావమునకుఁగూడ నుత్తేజము గల్పించు నట్టివే. కవుల కావ్యములు ప్రజలలో జాతీయ భావమును చెలరేగినట్లే దేశమున పొంగి పొరలుచున్న జాతీయభావము కూడ కవుల నావేశపూరితులఁగావించి రచనోన్ముఖుల నొనరించినవి. ఈ విధముగా జాతీయ భావమును, కవిత్వమును పరస్పర పోషకములై వర్ధిల్లినవి.

ఆకాంక్ష

నీచపుదాస్య వృత్తి మననేరని భారత మాతృదేశ సే
వా చరణమ్మునం దసువు లర్పణ చేసిన వారి పార్థివ
శ్రీ చెలువారు చోట, తదసృగ్రుచులన్ వికసించి, వాసనల్
వీచుచు రాలిపోవగ వలెం దదుదాత్త సమాధి మృతికన్.

—వేదుల

జాతీయోద్యమ వీర యోధుడు
ఆంధ్ర కేసరి ప్రకాశం



23 ఆగస్టు 1872:

ఆంధ్రప్రదేశ్‌లోని పూర్వపు నెల్లూరు జిల్లా, ఒంగోలు తాలూకా (ప్రస్తుతం ప్రకాశంజిల్లా)లోని [illegible] వినోదరాయునిపాలెంలో జన్మించారు. [illegible]

1886–1904:

ప్రకాశం గారి చదువు [illegible] రాజమండ్రిలో సాగింది. రాజమండ్రిలో [illegible] మద్రాసు [illegible] పట్టా పొందారు.

1896–1899:

రాజమండ్రి పురపాలక సంఘం కౌన్సిల్ ఎన్నికకు పోటీచేసి ఓడిపోయారు.

1900:

శ్రీ టి. సుబ్బారాయుడుగారి మద్దతుతో రాజమండ్రి పురపాలక సంఘం కౌన్సిల్ ఎన్నికకు పోటీచేసి గెలిచారు.

1903:

శ్రీ [illegible] గారిని ఓడించి రాజమండ్రి పురపాలక సంఘం చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

డిసెంబర్, 1904:

చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. న్యాయశాస్త్రం అభ్యసించేనిమిత్తం ఇంగ్లాండు వెళ్లారు. అక్కడ దాదాభాయ్ నౌరోజీ, రమేష్‌చంద్ర దత్తు, శ్యామ్‌జీ కృష్ణవర్మ, లాలా లజపత్‌రాయ్ గార్లతో పరిచయం ఏర్పరచుకున్నారు.

1906:

భారతదేశం తిరిగి వచ్చారు. భారత రాజకీయాలలో ప్రవేశించారు. మద్రాసులో బిపిన్ చంద్రపాల్ ప్రసంగించే బహిరంగ సభకు అధ్యక్షత వహించారు.

అధ్యక్షోపన్యాసంలో ప్రకాశంగారు రాష్ట్రాలను భాషా ప్రాతిపదిక మీద పునర్విభజన చేయవలసిన అవసరాన్ని పేర్కొన్నారు.


జనవరి 1921:

నాగపూర్ కాంగ్రెసు తీర్మానం మేరకు, ఎంతో లాభదాయకంగా వున్న తన న్యాయవాద వృత్తిని వదిలిపెట్టేశారు.

29 అక్టోబరు, 1921:

'స్వరాజ్య' అనే జాతీయ దినపత్రికను ఇంగ్లీషులో ప్రారంభించారు. ఇది 14 సంవత్సరాలపాటు ప్రచురింపబడింది.

ప్రకాశమే ప్రజలు ప్రజలే ప్రకాశం



1907:

మొదటిసారిగా సూరత్ కాంగ్రెస్ సమావేశానికి హాజరయ్యారు. సూరత్ చీలికతో ప్రకాశంగారు తను అభిమానించే తిలక్‌వైపే మొగ్గు చూపారు.

1912:

ప్రకాశంగారు, కొందరు సహ లాయర్లు కలిపి 'మద్రాస్ లైమ్స్' కొన్నారు.

1916:

డా. అనిబిసెంట్ ప్రారంభించిన హోం రూల్ లీగులో చేరారు.

1919:

గాంధీజీ విడుదల చేసిన సత్యాగ్రహ ప్రతిజ్ఞపై సంతకం చేశారు.

ఆత్మకూరులో జరిగిన నెల్లూరు జిల్లా సమావేశానికి అధ్యక్షత వహించారు.

డిసెంబరు: 1919:

భారత జాతీయ కాంగ్రెసు అమృతసర్ సమావేశానికి హాజరయ్యారు.

1920:

కర్నూలు జిల్లాలోని నంద్యాలలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సమావేశం

మార్చి 1922:

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1922 నుంచి 1946 వరకు దీనికి అధ్యక్షులుగా వున్నారు.

జూన్ 1922:

అఖిల భారత కాంగ్రెసు కార్యనిర్వాహక సంఘానికి సభ్యులుగా ఎన్నిక అయ్యారు.

డిసెంబరు 1923:

భారత జాతీయ కాంగ్రెసు కాకినాడ సమావేశానికి హాజరయ్యారు.

కౌన్సిలు ప్రవేశం అంశం మీద ప్రకాశం గారు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు.

3, ఫిబ్రవరి 1928.

సైమన్ కమిషన్ భారతదేశానికి వచ్చింది. సైమన్ కమిషన్ బహిష్కరణలో ప్రకాశం గారు వీరోచితంగా ప్రవర్తించి చరిత్ర సృష్టించారు.

ఈ బహిష్కరణ కార్యక్రమం మూడు సార్లు జరిగింది. ఈ కమిషన్ భారత

ప్రాధాన్య మొసంగఁబడినది. ఇట్లు పరోక్షముగా జాతీయ భావమును బెంపొందించిన రచనలింకను ననేకములున్నవి. ఆ కాలపు కవులు పత్రికలలో ప్రకటించిన ఖండకావ్యములు పెక్కింటిలో దేశభక్తియు స్వాతంత్ర్యానురక్తియు ప్రముఖ స్థానము నాక్రమించియున్నవి. అవి యప్పటి ప్రజల భావ సూచనలమునకు ప్రతినిధులు. భారత మాతృ దాస్యశృంఖలా విచ్ఛేదమునకై వారు పడు నావేదన, యందలి ప్రత్యక్షరమందును ప్రత్యక్షమగుచుండును.

"శివభారతము"
"రాణాప్రతాప చరిత్రము"

మన దేశ చరిత్రలో స్వాతంత్ర్య సంపాదనమునకై సర్వస్వమును సమర్పించి, భారతీయ ధర్మ సంస్కృతి ప్రతిష్ఠాపనార్థము యావజ్జీవితము పాటుపడిన మహనీయు లనేకులున్నారు. అట్టి వారిలో రాణాప్రతాపుఁడు, శివాజీ మున్నగువారు అగ్రగణ్యులు. వారి జీవితమంతయు దేశదాస్య నిర్మూలన పరాయణమై భాసిల్లియుండెను. అట్టివారి జీవిత చరిత్రలను వస్తువులుగా గ్రహించి మహాకావ్యములు నిర్మించుట జాతీయతాభావ ప్రచారమునకెంతయైన తోడ్పడుననుటలో సందేహము లేదు. ఈ విషయమును గ్రహించి శ్రీ రాజశేఖర శతావధానిగారును, శ్రీ గడియారము వేంకట శేషశాస్త్రిగారును, రాణాప్రతాప చరిత్రము, శివభారతము అను రెండు మహాకావ్యము లను నిర్మించిరి. అవి భాషచేతను, భావములచేతను గూడ జాతీయతా నిధానములని చెప్పఁదగిన మహనీయ కావ్యములు. కవు లందుఁ దమ నాయకుల నాదర్శ పురుషులనుగాఁ దీర్చి దిద్దుటయేకాక, భారతీయ సంస్కృతి ధర్మవిశేషములను జాలమెలఁకువతో నిరూపించి నిరుత్సాహ నిర్విణ్ణమయిన యాంధ్రజాతికొక యాదర్శమార్గము నందీయఁజాలిరి. ప్రతాపుడును శివాజీయు ధైర్యోత్సాహములు ప్రేరేప ప్రబలులైన శత్రువుల పైకురికి విజయము సాధింప యత్నించుట పారతంత్ర్య పరాభూతు లయిన పఠితలకు కర్తవ్య నిశ్చయమున పరమోపదేశమై పరిఢవిల్లినది.

"భరతఖండంబు నుద్ధరింపగ జనించు
ధూర్జటివి నీవు రాజమాత్రుడవుకావు"
"భారత మహాఖండంబు దాస్యాంధకార నిమగ్నంబయి యుండ
లోకముల దౌర్భాగ్యమ్మనుం దీటనేఁడని హర్షింప ప్రతాపభానుఁడుదయంబైయుండె"

"అతిభీమంబుగఁబెల్లురేఁగి నిబిడంబై మూగి యీ సర్వ భా
రత దేశంబును ముంచివైచిన మహోగ్రంబైన దాస్యాంధకా
రతతిన్ దేవుని దృష్టికూడ నణుమాత్రంబున్ జొరంబోని దు
స్థితి సంధించెడు పాపికాల మరుదెంచెంజూచి యెట్లోర్తునో"

మున్నగు పద్యములు చదువునపుడు పఠిత, కథా ప్రకరణమును విస్మరించి కార్యరంగమునకు దుముకు ననుటలో సందియము లేదు పై రెండు కావ్యములును వస్తు సంఘటనము నందును, రచనా పాటవము నందును, భావగాంభీర్యము నందును అద్వితీయములైన యక్షరమక్షర మందును జాతీయతను వెదజిమ్ము చున్నవి.

"విజయశ్రీ" కావ్యము

శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి విజయశ్రీ కావ్యముకూడ నిట్టిదే. ఇందలి శరీరము ప్రాఁతదేకాని చైతన్యము మాత్ర మతి నవ్యమైనది. సుపరిచితమైన భారతకథ యందే కవిగా రాధునిక భావముల నెన్నింటినో యిమిడ్చి పఠితల కుత్తేజము కలిగించి యున్నారు. ఇందు కురుక్షేత్ర సంగ్రామమునకును భారత స్వాతంత్ర్య సంగ్రామమునకును బోలిక వ్యంగ్యము చేయఁబడియున్నది. దేశమునందలి వివిధ పక్షములవారి భావములిందుఁజక్కగా విపరింపఁబడి యున్నవి. ఇది నిజము

నకుఁబాండవ కౌరవ సంబంధ గాథయే యైనను, నిశితముగాఁబఠించువారికి మైమఱపు గలిగించి స్వాతంత్ర్య సంగ్రామ భ్రాంతి యొదవించుచున్నది. కావ్యాంతర్గతములయిన స్వతంత్ర భావములకు మృదు మధురశైలి యెంతయో మెఱుఁగు దిద్దఁజాలినది.

"మహాత్మాకథ"

గౌతమ బుద్ధునికిని గాంధీమహాత్మునికి బెక్కు విషయములలో సాదృశ్య మున్నది. సత్యాహింస లా యిరువురికిని ఆరాధ్య లక్షణములు. అందుచేత నా యిరువురిలో నొకరి చరిత్ర రెండవ వారి చరిత్రను స్ఫురింపఁజేసి యానందావహము కాఁజాలు చున్నది. ఈ కారణము చేతనే కాఁబోలు నాకాలమున బుద్ధజీవిత వస్తుకములయిన కావ్యములు పెక్కు బయలుదేఱినవి. ప్రత్యక్షముగా వానికిని, భారత జాతీయతకును నంతగా సంబంధము లేకపోయినను గాంధీమహాత్మునకును బుద్ధదేవునికి గల భావసాదృశ్యము వానిని గూడ జాతీయతాభావ బంధురముల నొనరించినది. శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు మహాత్ముని జీవితమును వర్ణించుచు రచించిన పద్య కావ్యము కూడ నిట్టిదే.

స్వాతంత్ర్యము లభించిన పిమ్మట ధర్మచక్రమునకును ప్రాధాన్యము కలిగినది. అది అశోక చక్రవర్తికి సంధించిన దగుటచే కొందరు కవు లా మహారాజు చరిత్రమును గ్రహించి కావ్యములు రచించిరి. అట్టి వానిలో శ్రీ కల్లూరి వేంకటనారాయణరావు గారి అశోకసమ్రాట్టు చరిత్రము పేర్కొనఁదగినది. స్వాతంత్ర్య లాభమునకుఁబూర్వము కవులును, రచయితలును తత్సంపాదనమునకు సాధనములైన రచనలు కావించిరి. స్వాతంత్ర్యము సిద్ధించిన పిమ్మట స్వతంత్రప్రభుత్వము కవులను రచయితలను ప్రోత్సహించుచు దేశమునందలి అన్నిభాషల యభ్యుదయమునకును దోడ్పడుచున్నది.

జాతీయతాభావ సంధుక్షణమునకు దోహదమొనఁగూర్చిన ముఖ్యములయిన రచనలను మాత్రమే యిచ్చట స్పృశించి విడిచితిని. కాల పరిస్థితులను బట్టి యిట్టి రచనలెన్నో యప్పుడు బయలుదేఱి స్వాతంత్ర్య సిద్ధికిఁదోడ్పడఁజాలినవి. రాష్ట్రీయభావ ప్రేరకములయిన కావ్యములు మనభాషలోఁజాలగలవు. అవికూడ నొక విధముగా జాతీయతకుఁబెంపు చేకూర్చినవే.

"నేఁటితో నస్వతంత్రతానియతమైన
యీ బ్రదుకు తెల్గువారు భరింపలేరు"

మొదలయిన భావములతోఁగూడిన రచనలు రాష్ట్రీయభావ ప్రధానములయిన గ్రంథములలోనివే యైనను జాతీయతా భావమునకుఁగూడ నుత్తేజము గల్పించు నట్టివే.

జాతీయభావము, కవిత పరస్పర పోషకములు

కవుల కావ్యములు ప్రజలలో జాతీయ భావమును చెలరేగినట్లే దేశమున పొంగి పొరలుచున్న జాతీయభావము కూడ కవుల నావేశపూరితులఁగావించి రచనోన్ముఖుల నొనరించినవి. ఈ విధముగా జాతీయ భావమును, కవిత్వమును పరస్పర పోషకములై వర్ధిల్లినవి.

ఆకాంక్ష

నీచపుదాస్య వృత్తి మననేరని భారత మాతృదేశ సే
వా చరణమ్మునం దసువు లర్పణ చేసిన వారి పార్థివ
శ్రీ చెలువారు చోట, తదసృగ్రుచులన్ వికసించి, వాసనల్
వీచుచు రాలిపోవగ వలెం దదుదాత్త సమాధి మృతికన్.

—వేదుల

దేశంలో అడుగుపెట్టిన సందర్భంలో అంటే 3—2—1928న ఒకసారి, ఆ తర్వాత ఈ కమీషన్ మద్రాసు వచ్చినప్పుడు రెండు సార్లు జరిగింది. మొదటిసారి జరిగినప్పుడు పోలీసులు కాల్పులు జరుపగా ఒక వ్యక్తి మరణించాడు. అప్పుడు ప్రకాశంగారు రొమ్ము విప్పి బ్రిటిష్ సిపాయిల తుపాకులకు [illegible]



సైమన్ గుండె జల్లుమంది

ఎదురుచూపి, మద్రాసు హైకోర్టు భవనం వద్దనున్న చనిపోయిన వ్యక్తి వద్దకు నడిచి వెళ్ళారు.

డిసెంబరు, 1929:

ఆగ్నేయాసియాలో సుమారు ఆరు నెలల పాటు పర్యటించి భారత దేశానికి తిరిగి వచ్చారు.

ఏప్రిల్ 1930:

కేంద్ర శాసన సభ సభ్యత్వానికి రాజీనామా యిచ్చారు. మద్రాసులో ఉప్పుసత్యాగ్రహం జరిపించి అరెస్టు అయ్యారు.

1935:

ప్రకాశం గారు జైలులో వుండగా స్వరాజ్య పత్రిక అప్పులవాళ్ళు కోర్టులో దావావేసి దాని ఆస్తులన్నీ స్వాధీనం చేసుకున్నారు స్వరాజ్య మూసివేయబడింది.

1937:

శ్రీ సి. రాజగోపాలాచారి మంత్రివర్గంలో రెవిన్యూ మంత్రి అయ్యారు.

సెప్టెంబరు 1937:

జమీన్‌రైతుల స్థితిగతుల్ని పరిశీలించేందుకు ప్రకాశంగారి అధ్యక్షతన 9గురు సభ్యులతో ఒక సంఘం ఏర్పాటు చేయబడింది.

14 నెలల్లో యీ సంఘం నివేదిక పూర్తయింది. ఈ నివేదిక 6,000 పేజీలు వుంది.

డిసెంబరు 1937:

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం ఆమోదించిన 'శ్రీబాగ్' ఒడంబడికకు ఆమోదం తెలిపారు.

1940:

ప్రకాశంగారు 'వీక్లీ రిపబ్లిక్' వార పత్రికను ప్రారంభించారు. తెలుగు, తమిళ భాషలలో కూడా యీ పత్రికను ప్రచురించారు. 1942 లో దీని ప్రచురణ ఆగిపోయింది.

ఆగస్టు 1942:

క్విట్‌ఇండియా తీర్మానం ఆమోదించిన నాయకులు అరెస్టు అయ్యారు. ప్రకాశంగార్ని కూడా అరెస్టు చేశారు.

ప్రకాశంగారు శాసనసభ కాంగ్రెసు పార్టీ నాయకునిగా ఎన్నికయ్యారు.

1946 :

1946 ఏప్రిల్ 30 వ తేదీన మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు

31 ఆగస్టు, 1947 :

రాజ్యాంగ నిర్ణయ సభలోని ఆంధ్ర సభ్యులతోపాటు ప్రకాశంగారు కేంద్ర హోం శాఖామంత్రి సర్దార్ పటేల్‌కు ఒక విజ్ఞాపన పత్రం సమర్పించారు. దీనిలో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయవలసిందిగ కోరారు.

జమీందారీల రద్దు భూసంస్కరణలకు నాంది

1947–48 :

నిజాం రాజ్యంలోని యూనియన్ గ్రామాల్లో పర్యటించారు.

నవంబరు 1949 :

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం 'జె.వి.పి. నివేదికను' ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ప్రకాశంగారే ప్రవేశ పెట్టారు.

7 డిసెంబరు, 1949 :

మద్రాసు ప్రభుత్వం ఒక 'వేర్పాటు మండలి'ని ఏర్పాటు చేసింది.

3 జనవరి, 1950 :

వేర్పాటు మండలి భారత ప్రభుత్వానికి ఒక నివేదికను సిద్ధంచేసింది. దీనితో విభేదిస్తూ ప్రకాశంగారు ఒక నోటును జత పరిచారు.

—ఆంధ్రరాష్ట్ర తాత్కాలిక రాజధాని మద్రాసులోనే ఉండాలని ఆయన వాదించారు.

మార్చి, 1950 :

మద్రాసు అసెంబ్లీలో ప్రతిపక్ష స్థానంలో తమకు సీట్లు ఏర్పాటు చేయవలసిందని ప్రకాశంగారూ, ఆయన అనుచరులూ కోరారు. కాంగ్రెసునుండి ఆయన విడిపోవడానికి ఇదే నాంది.

నవంబరు, 1950 :

జాతీయ కాంగ్రెసులో ఒకభాగంగా, కాంగ్రెసు డెమోక్రాటిక్ పార్టీని ప్రకాశం గారు, జె. బి. కృపలానీ, రఫీ అహ్మద్ కిద్వాయ్, పి.సి. ఘోషు ప్రభృతులు ఏర్పాటు చేశారు.

జనవరి, 1951 :

కాంగ్రెసు డెమోక్రాటిక్ పార్టీ సమావేశం—తిరుపతిలో.

14 ఏప్రిల్, 1951 :

ప్రజా పార్టీ అవతరించింది.

మే, 1951:

ప్రకాశంగారు, జె. బి. కృపలానీ, పి.సి. ఘోషు, కే. కేలప్పన్ ప్రభృతులు కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ స్థాపించారు. 1951 పాట్నా మహాసభ అనంతరం అధికార ప్రకటన జరిగింది.

మే, 1952 :

శాసనసభ సంయుక్త సమావేశంలో గవర్నరు ప్రసంగాన్ని ఉద్దేశించుకుంటూ ప్రకాశం గారు (యు.డి.యఫ్) ప్రతిఘటించారు. ప్రకాశం గారిని అభిశంసించే తీర్మానాన్ని శాసన సభలో నెగ్గింది, తరువాత ఉపసంహరించుకున్నారు.

12, జూన్, 1952:

'ప్రజాపత్రిక' అనే ఆంగ్ల వారపత్రిక స్థాపన. ఆంధ్ర రాష్ట్రావతరణ ప్రకటన అనంతరం కొద్దికాలానికి 1953లో యీ పత్రిక ఆగిపోయింది.

సెప్టెంబరు, 1952 :

కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ, భారత సోషలిస్టు పార్టీలు సంలీనమై ప్రజాసోషలిస్టు పార్టీ అవతరించింది.

డిసెంబరు, 1952 :

58 రోజుల ఆమరణ దీక్షచేసి శ్రీ పొట్టి శ్రీరాములు పరమపదించారు. ప్రజాపత్రికలో సంపాదకీయం రాస్తూ, ప్రకాశంగారు దీనిని '58 రోజుల కఠోర తపస్సు' అని వర్ణించారు.

19, డిసెంబరు, 1952:

వాంఛూ కమిటీ ఏర్పరిచినట్లు ప్రధాన మంత్రి పార్లమెంటులో ప్రకటించారు. ఈ ప్రకటన కొంచెం ముందుజరిగితే శ్రీ పొట్టి శ్రీరాములు ఆంధ్ర జాతికి దక్కేవాడని ప్రకాశంగారు ప్రకటించారు.

జనవరి, 1953 :

ఆంధ్రరాష్ట్రం గురించి జస్టిస్ వాంఛూకు మద్రాసులో ప్రకాశంగారు ఒక విపులమైన నివేదిక సమర్పించారు.

26, ఫిబ్రవరి, 1953 :

ప్రకాశంగారి సంపాదకత్వాన ప్రజాపత్రిక అనే కొత్త తెలుగు దినపత్రిక వెలువడింది.

25, మార్చి, 1953:

ఆంధ్ర రాష్ట్రానికి 1953 అక్టోబరు 1వ తేదీన ప్రారంభోత్సవం జరుగుతుందని ప్రధాన మంత్రి పార్లమెంటులో ప్రకటించారు.

మే, 1953:

బళ్లారి భవితవ్యం గురించి జస్టిస్ లక్ష్మీ శేఖర్ మిశ్రాకు ప్రకాశంగారు మెమొరాండం అందజేశారు.

జూన్, 1953:

మద్రాసు శాసన సభలోని ఆంధ్ర సభ్యులు ప్రకాశంగారి అధ్యక్షతన సమావేశమై ఆంధ్ర రాజధానిగా కర్నూలు నిర్ణయించారు.

1, అక్టోబరు, 1953:

ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా ప్రకాశం గారి పదవీ స్వీకారం. ఆయన ప్రభుత్వం సాధించిన ముఖ్య విజయాలు

గుంటూరు హైకోర్టు (5–7–54).

శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం (2–9–54).

కృష్ణా బ్యారేజి (13–2–54).

6, నవంబరు, 1954:

ప్రకాశం మంత్రివర్గ పతనం.

1, నవంబరు, 1956:

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రావతరణోత్సవంలో ప్రకాశంగారు పాల్గొన్నారు.

20, మే, 1957:

హైదరాబాదులో ఆంధ్ర కేసరి స్వర్గస్థు లయ్యారు. అప్పుడు ఆయన వయసు: 84 సంవత్సరాలు.

(సేకరణ శ్రీ టి. డి. జగదీశన్)

భారత స్వాతంత్ర్యోద్యమం - రంగస్థలం

గొల్లపూడి మారుతీరావు

ఇప్పటి తరం అనుభవంలోకి రాని రెండు అపూర్వమయిన ఉద్యమాలు, ఈ శతాబ్దపు తొలిరోజుల్లో దేశాన్ని ఉర్రూతలూగించి జారిపోయాయి. అవి—భారత స్వాతంత్ర్యోద్యమం, పౌరాణిక రంగస్థలోద్యమం. ఈ దేశానికి స్వాతంత్ర్యంరావడంతో మొదటి ఉద్యమం హఠాత్తుగానూ, రెండో ఉద్యమం తప్పని సరిగానూ అంతరించి పోయిందనే చెప్పాలి. అప్పటి దేశభక్తి, త్యాగశీలత స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకై ఆర్తి, ఆత్మత్యాగం వీటికి 'మూర్తికట్టిన' మహామహుల కృషి నేడు చరిత్రగా మిగిలినట్టే, ఆనాటి నాటక రంగంలో మహామహులు సాధించిన విజయాలు, ఆ నాటకాలు—బళ్లారీ, మచిలీపట్నం, విశాఖపట్నం, మైలవరం, సురభి వంటి నాటక సంఘాల కథలూ నేటి తరానికి చరిత్రగా మిగిలి పోయాయి. కావడం అంతే సహజంగా జరిగిపోయింది. అయితే—యిందులో చిన్న వైచిత్రి ఉన్నది. సామాజిక చైతన్యం ఒక ఉద్యమాన్ని బలవత్తరం చేస్తే, ప్రేక్షకులను సుళువుగా ఆకర్షించగలిగిన రంగస్థలంలోని thematic popularity ఆ ఉద్యమాన్ని క్రమంగా బలహీనం చేస్తూవచ్చింది. అందుకనే స్వాతంత్ర్యోద్యమం క్రమంగా బలపడి పరివ్యాప్తమయి, పరిపుష్టమయి 1947 నాటికి సంకల్ప సిద్ధిని సాధించగలిగితే, ప్రేక్షకులు కారణంగా, రంగస్థలానికి లభించిన minimum guarantee నటులనూ, నాటకాలనూ మరింత సుసంపన్నం చేయడానికిబదులు వారిని బాధ్యతారహితమయిన స్థితికి వ్యక్తిగత ఆకర్షణలనే ప్రలోభాలకు లోనుచేసి ఒక ఉద్యమాన్ని క్షీణదశకు తీసుకువచ్చింది ఉదాహరణకి ఉద్యోగవిజయాలు చూడాలన్న ఉత్సాహం ప్రేక్షకులలో ఉందని తెలిసి, చూడడానికి ముమ్మరంగా ముందుకు దూకుతున్నారని తెలిసి నటుడు అహంకారి ఆయాడు. ప్రేక్షకుడిని ఆకర్షించాలనే దుగ్ధ, రససిద్ధి కలిగించే అగత్యంలేక ప్రేక్షకుల ఆసక్తిని కేవలం సద్వినియోగ పరుచుకోవాలనే ప్రయత్నం కనిపించింది నటుడిలో. ఈపతనాన్ని గుర్తించిన కంట్రాక్టరు—ప్రేక్షకుల ఆసక్తి చచ్చిపోతుందని భయపడి ఒకరికి యిద్దరు నటుల్ని ఒకొక్కప్పుడు నలుగురు నటుల్ని మిళాయించి, ఉన్నంతలో నాటకాన్ని ఆకర్షణీయంగా చెయ్యాలనే వ్యాపార సూక్ష్మానికి దిగాడు. నలుగురు కృష్ణులు ఇద్దరు దుర్యోధనులు ముగ్గురు ధర్మరాజులతో నాటకాలు సాగాయి. ప్రేక్షకులు నాటకాలు చూస్తూనే వచ్చారు. ఫలితం—నాటకం కళగా బలి అయిపోయి వ్యాపారంగా మిగిలిపోయింది. అందుకనే మహత్తరమయిన ఉద్య

స్వాతంత్ర్యాన్ని సముపార్జించిన తరానికీ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోలేక కకావికలవుతున్న నేటి తరానికీ బొత్తిగా పోలిక లేనట్టే, ఆనాటి నాటక రంగానికీ, యీనాడు కొత్త పుంతలు తొక్కుతున్న నాటక రంగానికీ ఏమీ పోలికలు కనిపించవు.

ఆనాటి సమాజంలో వ్యక్తి స్వేచ్ఛాకాంక్ష జాతిని ఉత్తేజపరిచి స్వాతంత్ర్య ఉద్యమానికి జీవగర్ర అయినిలిస్తే మన ఆధ్యాత్మిక జీవనంలోని భాగమయిన పౌరాణికేతి వృత్తాలు ఆనాటి నాటక రంగానికి ప్రాణం పోశాయి.

'వందేమాతరం' అన్న నినాదం ఉత్తేజాన్ని కలిగించడం ఆనాడు ఎంత సహజమో, మన సామాజిక జీవనంలో భాగమయిన భారత భాగవత చారిత్రికేతివృత్తాలకు ప్రేక్షకులు ఆకర్షితులు

మంగా స్వాతంత్ర్యోద్యమం గుర్తు వచ్చినట్టుగా రంగస్థల ఉద్యమం గుర్తురాదు. కపిలవాయి రామనాథశాస్త్రి, జొన్న విత్తుల శేషగిరిరావు, మాధవపెద్ది, బళ్ళారి రాఘవ, డి.వి. సుబ్బారావు వగయిరా గొట్ట పేర్లు మాత్రమే గుర్తుకొస్తాయి. వ్యవస్థ బలహీనమయిందనడానికి యిలా వ్యక్తి పేర్లు మాత్రమే గుర్తుండడం సాక్ష్యమని చెప్పడంలో అసత్యం లేదనుకుంటాను.*

ఈ రెంటి సంబంధాన్ని పరిశీలించాలనుకున్నప్పుడు ఈ రెండు ఉద్యమాల గతిని, సామ్యాన్ని యిలా పరిశీలించడం అవసరం. పౌరాణిక నాటకరంగాన్ని ప్రత్యేకంగా ఉటంకించడానికి కారణం. ఆనాటి నాటకరంగంలో శక్తినీ, రక్తినీ కలిగివున్న నాటకాలు ఎక్కువగా అవే కనక.

10వ శతాబ్ది ఆఖరి రోజులలో—మొదటిసారిగా సాంఘిక దృక్పథం తత్సంబంధమయిన యితివృత్తాలు నాటకరంగంలో చోటు చేసుకున్నాయి. ఇందుకు కారణాన్ని శ్రీ ఆద్య రంగాచార్య తన Indian Theatre లో చక్కగా వివరించారు.

We have the evidence of languages like Bengali, Marathi, Kannada, and Telugu–that during the last decade of the 19th century, a new political consciousness was being aroused. Political leaders had one common question to ask the audiences. "We are millions of Indians. The english men are handful. And yet they are ruling us. why?" Many an answer was provided by the leaders themselves. One of them was our social life (page 120).

ప్రజలు చాలామట్టుకు ఆచారాలకు, మూఢ విశ్వాసాలకు బానిసలు. ఈ మూఢాచారాలు, మూర్ఖపు పట్టుదలలూ, సంఘంలో స్త్రీకి వారు యిచ్చేస్థానం—యివన్నీ దేశంమీదకు దూక బోతున్న పాశ్చత్య నాగరికతకి పోల్చి చూసుకున్నప్పుడు చాలా హాస్యాస్పదంగా కనిపించాయి. చదువుకొన్న వారందరూ ఒక్కసారి ఆత్మపరీక్ష చేసుకోవడం ప్రారంభించారు. దేశంలో కొందరు తిరగబడ్డారు. అటు బెంగాల్‌లో రాజా రామమోహన్‌రాయ్ మొదలు, యిటు రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగం పంతులు గారి వరకూ యీ దురన్యాయాలను ఎదుర్కోవాలని మొదట మన యింటిని మనం చక్కదిద్దుకోవాలని అత్రుతపడ్డారు.

కన్యాశుల్కం

రాజకీయ చైతన్యం. కొత్త విద్యాధోరణి ప్రాబల్యంతో యితివృత్తాన్ని చెప్పడానికి యిదివరకటి ధోరణికాక మరేదో కొత్తధోరణి అవసరమయింది. పురిటినొప్పులు 1897 నాటికే ప్రారంభమయాయి. ఇక్కడ విజయనగరంలో సాంఘిక దురన్యాయాన్ని ఎదిరించే మహోన్నతమయిన 'కన్యాశుల్కం' వెలువడితే, మరొక గొప్ప రచన ప్రతాపరుద్రీయం అటు బళ్ళారిలో వెలువడింది

1905లో బళ్ళారిలో శ్రీ కోలాచలం శ్రీనివాసరావు గారు ప్రారంభించిన వాణీవిలాస నాటకశాలలో లోకమాన్య బాల గంగాధర తిలక్ ప్రారంభోత్సవం చేశారు. ఈ ఉత్సవంలో కందుకూరి వీరేశలింగం పంతులుగారు 'సంఘసంస్కరణలు' అనే విషయంమీద ప్రసంగించారు. నాటక కళ, రాజకీయ చైతన్యం, సామాజిక దృక్పథం క్రమంగా ఒకటిగా ముడిపడుతున్నా యనడానికి యీ సంఘటన పరోక్షమయిన ఉదాహరణ.

కొత్తగా మేల్కొన్న రాజకీయ చైతన్యం విద్యాధికులలో రెండురకాలయిన ఆకృతిని కలిగించింది. మీదకి తోసుకువస్తున్న అవాంఛితమయిన పాశ్చాత్య నాగరికతని చూసిన కొందరు తమకు గర్వపడగలిగిన గతం ఉన్నదని అప్పటి వారికి చూపడం అవసరమని భావించారు. అంతేకాదు తమకు ఎదురుగా కనిపిస్తున్నదంతా



మహాకవి గురుజాడ

* ఇప్పటికి నా కనిపిస్తుంది చక్కని నాటకాలకంటే మనకి సమర్థులైన నటులే ఎక్కువేమోనని. ఆరోజుల్లో యడవల్లి, సంజీవరావు, సి. యస్. ఆర్. మొదలైన వారు చచ్చునాటకాలకు కూడా ప్రాణం పోశారు. ఎవరేనా ప్రదర్శించినా రక్తికట్టే నాటకాలకంటె దేన్ని ప్రదర్శించినా రక్తి కట్టించే నటీనటులే తెలుగు దేశంలో ఎక్కువగా ఉన్నట్టుగా నాకు తోస్తుంది.—శ్రీశ్రీ

పాశ్చాత్య నాగరికత కింద చెల్లుబడికాదనీ, నిజమైన ఆంగ్లవిద్య నభ్యసించిన పెద్దలు చెప్పాలనీ ఉబలాట పడ్డారు. రెండు ఉద్దేశాల కారణంగా ఆ దశలో శ్రీపాద కామేశ్వరరావు (రాణాప్రతాపసింహ) మాచిరాజు దుర్గా శంకరామాత్యుడు వంగభాష నుంచి చారిత్రిక నాటకాలను అనువదిస్తే, సోమరాజు రామానుజరావు, మల్లాది అచ్యుతశాస్త్రి ప్రభృతులు పౌరాణిక నాటకాలు వ్రాసారు. కొన్ని ప్రముఖ సంస్కృత నాటకాల అనువాదాలు, అనుసరణలు వచ్చాయి. అప్పటి కొన్ని నాటక సమాజాలపేరు చెప్తేనే క్రమంగా దేశంలో చోటు చేసుకొంటున్న జాతీయదృక్పథం నిరూపణ మవుతుంది. రాజమండ్రిలో శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి నాటకాలను ప్రదర్శించే నాటక సమాజంపేరు 'ఆంధ్ర భాషాభిమాని సమాజం'. మైలవరం 'బాలభారతి సమాజం' విశాఖపట్నం 'ఆంధ్రా అమెచ్యూర్', బందరు 'ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ'–విచిత్రంగా ఈ పేర్లలోకూడా స్వదేశాభిమానం, పాశ్చాత్య ప్రభావం రెండూ ద్యోతక మవుతాయి.

విప్లవ చైతన్యం

1920 సెప్టెంబరులో ఈ దేశాన్ని కుదిపి పలుకరించిన దేశాభిమానాన్నే మార్చివేసిన ఒక సంఘటన జరిగింది. మహాత్మా గాంధీ భారత జాతీయకాంగ్రెసుకు నాయకత్వాన్ని స్వీకరించారు అహింసాయుతంగా సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించారు; కేవలం రాజకీయ చైతన్యాన్నే కాకుండా మహాత్ముడు ప్రజలలో వైయక్తిక ఆత్మవిశ్వాసాన్నీ, సాహసాన్నీ, ఆత్మశక్తినీ చిత్తశుద్ధినీ ప్రేరేపించాడు. మొదటి సారిగా మనిషిలోని శాశ్వత మయిన ఆధ్యాత్మిక విలువలకి, నైతికజీవన సూత్రాలకూ అందమైన వారధి నిర్మించి, అటు ఆధ్యాత్మిక జీవనాన్ని నడిపే వారినీ, యిటు నైతిక జీవనంపైన దృష్టి ఉన్నవారినీ ఆకర్షించాడు. అందువలనే మహాత్ముడు సాధించినది కేవలం రాజకీయఉద్యమం మాత్రమే కాక ఒక జాతి సాంస్కృతిక,సాంఘిక నైతికవిప్లవం కూడ అయి భాసించింది ఆరోజుల్లో ప్రతివ్యక్తినీ ఒక విధమైన విప్లవ చైతన్యం ఆవహించింది.



కందుకూరి వీరేశలింగం పంతులు

ఆయితే నాటక రంగంపై దీని ప్రభావం వెంటనే పడలేదు. ఆనాటి నాటక రంగంపై రాజకీయ ఉద్యమ ప్రభావాన్ని శ్రీ పురాణం సూరి శాస్త్రిగారు తమ నాట్యాంబుజంలో కళ్లకు కట్టినట్టు వివరించారు. "పందొమ్మిది వందల యేడవ సంవత్సరమున ఆసేతు హిమాచలము విపులముగ దేశాభిమానము అంకురించినది. మొదట 1919లో గాంధీమహాత్ముని యాచారాలను క్రమముగా నిర్భయభావ ప్రకటనము మొదలిడు వరకును మన తెలుగు కవులనేకులు చారిత్రక రూపకములనేకములు వ్రాసిరి. కొందరు భారత గాథలనను సరించి వీర రసప్రధానముగను, కొందరు రసపుత్ర చరిత్రాంశముల గైకొనియు, కొందరు బొబ్బిలి మున్నగు స్థానిక కథా సందర్భముల నందికొనియు, నాటకములను వ్రాసిరి. దేశధర్మముల ప్రాబల్యమున అంతటి భక్తి, శృంగార రసాత్మకులగు నాటకముల కన్న నీ యైతిహాసికములే వన్నెకెక్కి దేశమంతటను ఆడబడ జొచ్చెను..."

అంగ్లేయుల పరిపాలనారీతులు, వారి సామ్రాజ్య కాంక్ష, నీతిదూరులయి చేసిన అకృత్యాలపట్ల నిజమైన బాధతో వేదనతో వచ్చిన నాటకాలు దామరాజు పుండరీకాక్షుడుగారి "గాంధీవిజయము" పాంచాలి పరాభవము(1920–22)"స్వరాజ్య సోపానము" జాతీయోద్యమాన్ని పురస్కరించుకొని వెలువడిన మరొక నాటకం. ఆంగ్లేయ పాలనపై పెరిగిన ఏహ్యభావాన్ని కొందరు రచయితలు బాహాటంగా వ్యక్తం చేయలేక, తాము రచించే చారిత్రికాలలో మరొక విదేశీ పాలన వ్యవస్థను (మహమ్మదీయులను) దుయ్యబట్టడం ద్వారా తీర్చుకున్నారు. నాటకాలలో నీచపాత్రలను మహమ్మదీయులను చేయడం, మూర్ఖత్వానికీ, క్రౌర్యానికీ, అభిరుచి దారిద్ర్యానికీ ఆపాత్రలను ఆటపట్టుగా చేయడం సాగించారు. ఇలాంటి నాటకాల జోలికి ఆరోజుల్లో ప్రభుత్వం పోలేదు!

కాలం మారింది

మే 1923లో శ్రీకాకుళం అమెచ్యూర్ నాటక సంఘం వార్షికోత్సవాలలో ప్రసంగిస్తూ శ్రీ బుర్రా శేషగిరిరావుగారు ఇలా అన్నారు. ''కాలముమారుచున్నది. స్వాతంత్ర్యాభిలాష సర్వజన సమానత్వము మొదలగు భావములు పెరుగుచున్నవి. నాటకములు విశ్రాంతి జనక మాత్రముల వుత్సాహ జనకములు కావలదా? అని పూర్వపక్షము. కొన్ని సమయములలో నివృత్తి వలనను కొన్నివేళల ప్రవృత్తి వలనను లోకశ్రేయము సాధించవలయును. అందుకు తగినట్టు దేశకాల పాత్రాభిమానము లెరింగి లోకోపదేశ జనకములగు నాటకములాడవలెను '' (ఆంధ్రనాటక సంస్కరణము పేజీ 20).

సమకాలీన రాజకీయచైతన్యం దృష్ట్యా 1909 నాటికే శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు వ్రాసిన 'బొబ్బిలి', *వేదంవారి 'ప్రతాపరుద్రీయం' (1897) వంటి నాటకాలతోపాటు కోలాచలం శ్రీనివాసరావుగారి రామరాజు చరిత్ర, కొప్పరపు సుబ్బారావుగారి 'రోషనార' (1921). పింగళి నాగేంద్రరావు గారి జేబున్నిసా (1923) మొదలయిన నాటకాలు వచ్చాయి. ఇవన్నీ ప్రజల్లోకి దూసుకు వెళ్లాయి. ఇది గ్రహించి అప్పటి ప్రభుత్వం ఈ నాటకాల ప్రదర్శనను బహిష్కరించింది. ఆ నాటకాల కాపీలు అన్నింటినీ స్వాధీనం చేసుకుంది.

అయినా మద్రాసువంటి పట్టణాలలోని విద్యార్థులు ఈ నాటకాలు వెయ్యాలని శతధా సంకల్పించినా వారికి ఎక్కడా నాటకశాలలు దొరకలేదు. వారి ఉద్దేశానికి తగిన ఆటవిడుపు లేక నాటకరంగం ద్వారా రాజకీయ ఉద్యమంలో పాల్గొనే బదులు ఉద్యమంలోనికే సరాసరి దిగిపోయారు. (శ్రీ కె.వి. గోపాలస్వామి గారు "Telugu Drama" పేజి 118)

విశాఖపట్నంలో 1890లో శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రి గారు, శ్రీ సెట్టి లక్ష్మీనరసింహంగారు కలిసి స్థాపించిన కళాభిలాషు నాటక సమాజం కొన్ని దేశభక్తి పూరితమయిన నాటకాలను ప్రదర్శించింది. ఈ సమాజంలో నటులే కాక శాస్త్రిగారు, నరసింహంగారు, ఆకెళ్ల సత్యనారాయణ గారువంటి రచయితలుఉన్న కారణాన వీరి కార్యకలాపాలు ముమ్మరంగా సాగాయి ఆకెళ్ల సత్యనారాయణరావు గారి 'పీష్వా నారాయణరావు వధ' చాలా పేరుపడ్డ నాటకం ఈ సమాజం కేవలం విశాఖపట్నంలోనే కాక–రాజమండ్రి, అనకాపల్లి, విజయనగరం మొదలైన పట్టణాలలో ప్రదర్శనలిచ్చింది 1912 తర్వాత ఈ నాటక సమాజం ప్రదర్శనలు నిలిచిపోయాయి ఇదే సమయంలో ఏర్పడిన హితకారిణీ సమాజం దాని సంస్థాపకులు, కవి, నాటకకర్త అయిన శ్రీ ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణరావుగారి "రసపుత్ర విజయం" ప్రదర్శించింది. ఇది దేశభక్తి పూరితమయిన ప్రసిద్ధ నాటకం.

1911లో శ్రీ పార్థి రామారావుగారు స్థాపించిన కారనేషన్ హిందూ ఎమెచ్యూర్ (తర్వాత 'ఆంధ్ర అమెచ్యూర్' కింద మారింది) రసపుత్ర విజయం వంటి నాటకాలు ప్రదర్శించింది. సుప్రసిద్ధ విప్లవకారుడు శ్రీ అల్లూరి సీతారామరాజు ఈ ఆంధ్రా అమెచ్యూర్స్‌లో సభ్యుడిగావుండి నాటకాలలో పాత్రలు ధరించేవారు. (కళావని. పేజీ. 248)

1931లో శ్రీ రామచంద్రశాస్త్రిగారు. భమిడిపాటి చినయజ్ఞనారాయణశర్మగారు, పురిపండా అప్పలస్వామిగార్ల ఆధ్వర్యంలో ఏర్పడిన నాట్య కళాభిలాషుల సభ. చినయజ్ఞనారాయణశర్మగారు రచించిన 'శూర బొబ్బిలి' మొదలయిన నాటకాలను ప్రదర్శించింది.

1925లో అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్యం కోసం పితూరీచేసి ప్రాణాలర్పించాడు. 1927లో భగత్‌సింగ్ పంజాబులో శాండర్స్‌పై కసితీర్చుకోబోయి మరణ శిక్షకు గురి అయాడు.

సిపాయిల విప్లవ గాథ

మహాత్ముడు స్వాతంత్ర్యోద్యమం నడిపిన 8 సంవత్సరాలు అంటే 1929లో గుంటూరులో యూత్‌లీగ్ ప్రారంభమయింది. ఒకపక్క గాంధీ ఉద్యమాలు, మరొకపక్క విప్లవభావాలు వీరిని ఉర్రూతలూగించేవి. ఆ సంవత్సరంలోనే మద్దూరి అన్నపూర్ణయ్యగారు 'చిచ్చుపిడుగు' అనే ఒక నాటకం వ్రాశారు ఇది 1857 నాటి సిపాయిల విప్లవానికి సంబంధించిన కథ. కథానాయకుడు మంగళ పాండ్యా. బ్రిటిష్ నిరంకుశ పాలనకు ఎదురుతిరిగి యిద్దరు తెల్లవారిని హతమార్చి శత్రువులకు దొరకకుండా తనకుతానే ఆత్మత్యాగం చేసుకుంటాడు. ప్రజలనురెచ్చగొట్టే ఈ నాటకం రాసినందుకు రచయితను 2½ సంవత్సరాలు కఠినశిక్ష బ్రిటిష్ ప్రభుత్వం విధించింది. ఆ నాటకాన్ని వెయ్యాలనే పట్టుదలతో యూత్ లీగ్ సభ్యులు శ్రీకోనపులి సుబ్రహ్మణ్యం, శ్రీ మాడభూషి వెంకటాచారి, శ్రీ ఆమంచర్ల గోపాలరావు రహస్యంగా రిహార్సల్స్ ప్రారంభించారు ఆ రోజుల్లో అటువంటి నాటకాలు ప్రదర్శించడం మాటలు కాదు. యూత్‌లీగ్‌కు అనుబంధంగా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఒకటి ప్రారంభించి, ఏదో విద్యార్థుల వినోద కార్యక్రమంలాగు కనిపించేటట్టు చేసి–ఆ నాటి మునిసిపల్ ఛైర్మెన్‌గారైన శ్రీ నడింపల్లి నరసింహారావుగారి సహాయంతో హాలు సంపాదించారు. అధికారులకు నాటకం వెయ్యబోతున్న వార్త ఎలాగోతెలిసింది.



అల్లూరి సీతారామరాజు

* 1930 ప్రాంతాలలో మాధవపెద్ది వెంకటరామయ్యగారి 'బొబ్బిలిలో' రంగారాయుడు పాత్ర కదలుగా చెప్పుకుంటారు. తెల్లటి అంగరఖా తురాయితో ఆజానుబాహుడయిన రంగారాయుడు రంగస్థలం మీదికి రావడం ప్రేక్షకులను పులకింపజేసేదట చివరి రంగంలో భార్యని, పసివాడిని వదలి యుద్ధరంగానికి వెళుతూ రంగారాయుడు భార్య భుజం తట్టి ధైర్యం చెప్తాడు. ఇంతలో జయభేరీ నినాదాలు వినిపిస్తాయి–ఒక్క క్షణంలో కర్తవ్యం గుర్తుతెచ్చుకు ముందుకు నడుస్తాడు. తెర వరకూ వెళ్లి భార్యని కొడుకుని ఒకసారి చూస్తాడు. ఈ చూపు ప్రేక్షకుల గుండెల్లోంచి దూసుకు పోతుంది. (కళావని పేజి 203) ఇలాంటి దేశభక్తిపూరితమయిన నాటకాలూ, అంతే ఉత్తేజంతో నటించిన నటులూ సామాజికుల్ని తమతోపాటు కర్తవ్యోన్ముఖుల్ని చేశారు.

కాని వివరాలు తెలియలేదు. వెంటనే పోలీసులు సి. ఐ. డి లు ప్రదర్శనకు రావాలని ప్రయత్నించారు. కాని లీగ్ సభ్యులు టికెట్ల పద్ధతి పెట్టారు ఆ టికెట్టు మరొకరికి యిచ్చేవీలులేదు. వాళ్ళురాకపోతే బందుచెయ్యాలే గాని మరెవ్వరికీ చెందరాదు ఆ టికెట్లు విద్యార్థులు, దేశభక్తులయిన పెద్దలకు మాత్రమే అందాయి వారు నిర్ణయించిన ప్రకారం ఒక్క టిక్కెట్టుకూడా బయటికి పోలేదు. ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమంలోని వ్యక్తుల కర్తవ్యదీక్ష అలాంటివి. మొత్తానికి ఆరోజు పోలీసులకు, సి ఐ డి. లకు నాటకానికి ప్రవేశార్హత లభించలేదు.

ఆరోజు ప్రేక్షకులలో ప్రముఖులు, దేశభక్తులు ఎందరో ఉన్నారు శ్రీయుతులు కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, నేతి చలపతి, శీరం సుబ్బారావు, కవుతా చలపతి మున్నగు వారి సమక్షంలో 'చిచ్చులపిడుగు' అపూర్వంగా ప్రదర్శితమయింది. ప్రేక్షకులలో అద్భుతమయిన చైతన్యస్ఫూర్తి కలిగింది ఇంతజరిగినా పోలీసులు ఎవరినీ అరెస్టు చెయ్యలేకపోయారు కారణం సాక్ష్యంయివ్వడానికి గుంటూరులో ఒక్క మనిషికూడా దొరకలేదు. అదే ఆనాటి ఉద్యమంలోని మహనీయత.

1930 మద్రాసు మ్యూజియం థియేటరులో బళ్ళారి రాఘవ అధ్వర్యాన పాకాల రాజమన్నారు గారి 'తప్పెవరిది' నాటిక ప్రదర్శన జరిగింది. ఇబ్సన్ భావ విప్లవ ప్రభావంతో వెలువడిన రచన ఇది. సామాజిక సమస్యలను, వ్యక్తిత్వ విశ్లేషణను సమన్వయ పరిచే రచనా ధోరణికి అది నాంది. మొదటిసారిగా రచయిత మనస్సులోంచి వ్యక్తిత్వంగల పాత్రలు వెలువడ్డాయి. మానసిక సంఘర్షణకు మొదటిసారిగా చోటులభించింది. వ్యక్తిలోని దేశభక్తికీ, పదవీబాధ్యతలకూ మధ్య సంఘర్షణ; రెండు సంస్కృతుల మధ్య



బళ్ళారి రాఘవ

నలిగిపోయే వ్యక్తి మానసిక మథన- యిటువంటి నూతన అంశాలు రచనలో చోటు చేసున్నాయి

'నాటిక' అవతరణం

అంతేకాదు- అమెచ్యూర్ నాటక రంగానికి బలమైన పాదులు పడిన సందర్భమది నానాటికీ ప్రబలమవుతున్న రాజకీయ చైతన్యాన్ని ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా అణగదొక్కలేక పోయింది మొదటిసారిగా 'నాటిక' రంగస్థలంమీద పొడచూపింది తక్కువ వ్యవధిలో సూటిగా, ఘాటుగా సమస్యను ఆవిష్కరించడానికి ఉపయోగపడే ఈ ప్రక్రియ అచిర కాలంలోనే విద్యార్థి సంఘాలను అమెచ్యూర్ సంఘాలను ఆకర్షించింది అమెచ్యూర్ నాటక రంగాన్ని బతికించిన ప్రక్రియ నాటిక.

ఈ సమయంలో వ్యాపార నాటకరంగం అంతరించి కాంట్రాక్టు నాటకాలు ప్రారంభమయాయి. అక్కడితో సమాజ ప్రాముఖ్యం పోయింది నటుల ప్రాముఖ్యం హెచ్చయింది నటులు 'కళ' మీదకాక డబ్బుచేసుకోవడం మీద ఎక్కువగా దృష్టిని సారించారు.

మరొక ప్రక్క సాంఘిక చైతన్యం, రాజకీయ చైతన్యం నాటక రంగంలో ప్రతిఫలిస్తూనేవున్నాయి. అస్పృశ్యతానివారణ సమస్య మీద ధర్మవరం గోపాలాచార్యులుగారి "అస్పృశ్య విజయము" కృష్ణకౌండిన్యుడిగారి "నందనారు" వెలువడ్డాయి. గుళ్ళపల్లి నారాయణమూర్తిగారి 'ఆంధ్రజ్యోతి', సందూరి బంగారయ్యగారి 'ఆంధ్రతేజము' వేదాంతం కవిగారి "తెలుగు తల్లి" అప్పటి రాజకీయ భావావేశాన్ని వ్యక్తం చేశాయి.

వృత్తి నాటక రంగానికి, అమెచ్యూర్ నాటక రంగానికి మధ్య గల సంధికాలంలో ఏర్పడిన అవ్యవస్థని దృష్టిలో ఉంచుకొని అమెచ్యూర్ నాటక రంగాన్ని మరింత సంపన్నం చెయ్యడాని 1928 లో ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఏర్పడింది. అటు బళ్ళారిలో టి రాఘవ నాటక రంగంలో స్టానిస్లావ్‌స్కీ, ఇబ్సన్‌ల Realistic School ని ప్రవేశ పెట్టి అపూర్వమయిన చైతన్యాన్ని కలిగించారు.

అభ్యుదయ ధోరణి

"1930 తర్వాత దేశంలో ఏర్పడిన రాజకీయ చైతన్యం మరొక రకమయిన ధోరణికి దారితీసింది. దానిపేరు 'అభ్యుదయ ధోరణి'. ఈ అభ్యుదయ వాదం రాజకీయంగానే కాక సాంస్కృతిక, సాహిత్య, నాటకరంగాలలో కూడా ప్రతిఫలించింది. శ్రీశ్రీ వంటి కవులు ఒకపక్క సాహిత్యానికి కొత్త పుంతల్ని నిర్ణయిస్తూండగా నాటక రంగంలో మాత్రం యీ వుద్యమం ఫలప్రదయిన నాటిక రచనను ప్రోత్సహించేందుకు తగిన కృషి చేయలేక పోయింది"

(ప్రసిద్ధ నాటికలు 'తొలిపలుకు' శ్రీ కె.వి. గోపాలస్వామి)

అయితే గ్రామీణ దృక్పథంతో స్వభావవాదాన్ని చాటిన సుంకర, వాసిరెడ్డి గార్ల "ముందడుగు" "మాభూమి" వంటి నాటకాలు దేశంలో ఒక విప్లవాన్నే లేవదీశాయని చెప్పాలి. ప్రజా నాట్యమండలి (Indian people's theatre) ద్వారా ప్రదర్శితమయిన ఈ నాటకాలు రాష్ట్రేతరులను కూడా ఆకర్షించాయి. బొంబాయిలో బాలరాజ్ సహానీ ప్రముఖులు 'ముందడుగు' నాటకానికి దర్శకత్వం వహించడమే కాకుండా "మాభూమి" ని రచయితల సహాయంతో హిందీలోనికి అనువదించారు. ఈ రెండింటిని దరిమిలాను ప్రభుత్వం నిషేధించింది

1942లో గాంధీజీ ప్రారంభించిన 'క్విట్ ఇండియా' ఉద్యమం ప్రజల్ని మరీ ఉత్తేజపరిచింది. రెండవ ప్రపంచయుద్ధం నాటికి ప్రజలలో స్వాతంత్ర్య కాంక్ష బలపడడమే కాక, విదేశపాలన పట్ల ఏహ్యత పెరిగి పోయింది ఆ ప్రాంతాలలో వచ్చిన ఆచార్య ఆత్రేయ నాటకాలు విదేశీపాలనలో అన్యాయమయిపోతున్న మధ్యతరగతి ప్రజాజీవనానికి అద్దం పట్టాయి. అశాంతి (శాంతి) కొర్రపాటి ప్రార్థన-యిది Irwin shaw వ్రాసిన Burry-the Dead కి అనుసరణ) మున్నగువారు Anti-warplays వ్రాశారు బోయి భీమన్న (పాలేరు,కూలిరాజు) కొడాలి గోపాలరావు (పేదరైతు, కూలి) నార్ల (క్రొత్తగడ్డ) మున్నగువారు ప్రజాజీవితం వేపు సామాజికుల దృష్టిని మళ్ళించారు.

1939_53 మధ్య కాలంలో వివిధ అంశాలపైన దాదాపు 1800 నాటికలు, నాటకాలు వెలువడ్డాయని కొప్పరపు సుబ్బారావు గారి తెలుగు లిటిల్ థియేటర్ ద్వారా జరిపిన పరిశోధనవల్ల తెలిసింది. దానిని బట్టి తెలుగు నాటక రంగం ఎంతటి ఉత్సాహాన్ని పుంజుకున్నదో అర్థమవుతుంది.

నానాటికీ దేశంలో పెరిగిపోతున్న స్వదేశాభిమానం, విదేశీ పాలన పట్ల విరక్తికి ఆనాటి నాటక రంగం యితోధికమయిన దోహదం చేయడమేకాక స్వాతంత్ర్య సముపార్జనలో గుర్తించుకో గలిగిన పాత్ర ధరించిందని చెప్పక తప్పదు.

1947 ఆగస్టు 14 నాటి అర్ధరాత్రి ఒక గొప్ప యితివృత్తం నాటక రచనా రంగంలో లేకుండాపోయింది ఎందుకంటే—ఆ ముహూర్తాన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.

ఈ వ్యాస రచనకు ఉపయోగపడిన గ్రంథాలు.

The Indian theatre. By Adya Rangacharya

The Indian Drama (Publications Division.)

"ప్రసిద్ధ నాటికలు" తొలిపలుకు [శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి] కళావని.

నాట్యాంబుజము. శ్రీ పురాణం సూరిశాస్త్రి.


ఆంధ్ర నాటక సంస్కరణము—శ్రీ పురాణం సూరిశాస్త్రి

Ten years of Natya Sangham in A.P. Souvenir

Veeresalingam by Sri V.R. Narla

సాహిత్య మీమాంస.—శ్రీ శ్రీపాద కామేశ్వరరావు.]

మతం



మతమన్నది గాంధీ జీవితమైతే
మతమన్నది లోకానికి హితమైతే
హిందువులం ముస్లిములం
హిందువులం క్రైస్తవులం
అందరమూ సోదరులం
అందరమూ మానవులం

— కృష్ణశాస్త్రి

దేవవాణికి తెలుగువారి సేవ

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

సంస్కృత వాఙ్మయాభివృద్ధికి దోహదం చేయని ప్రాంతమంటూ భారత వర్షంలో లేకపోయినా ఆంధ్రప్రాంతానికొక విశిష్టత ఉంది. తెలుగువారు ప్రాగైతిహాసిక కాలం నుంచీ కూడా తమ భాషకన్నా సంస్కృత భాషకే ప్రాధాన్య మిచ్చి, దాని వృద్ధి వికాసాలకు కృషి చేశారు. తెలుగువాని గుణమే అలాటిది. ఇది తనది అని అనుకున్నాడా, ఎక్కడ మెట్టినా, ఏది చేపట్టినా దానిని చతురస్రంగా తీర్చిదిద్ది త్యాగానికి పట్టంకట్టి కీర్తిని గుట్టలు పోస్తాడు. సంస్కృత వాఙ్మయంలో ఏ శాఖ చూచినా తెలుగువారి విశిష్టతను చాటుతుంది. తెలుగుజాతి తెలివి తేటలకు తార్కాణాలు చూపుతుంది.

శాసనాలూ, వేదభాష్యాలూ మొదలు కథాసాహిత్యం వరకూ ఆంధ్రదేశంలో సంస్కృత వాఙ్మయం అభివృద్ధి చెందింది. జాయప సేనాని నృత్తరత్నావళి, విద్యానాథుని ప్రతాపరుద్ర యశోభూషణం, విశ్వేశ్వర పండితుని చమత్కార చంద్రిక, జగన్నాథుని రసగంగాధరం, శ్రీకృష్ణ బ్రహ్మతంత్ర పరకాలస్వామి అలంకార మణిహారం, బందేనవాజ్ రచించిన శృంగార మంజరివంటి అలంకార గ్రంథాలు, అన్న భట్టు రచించిన తర్కసంగ్రహం వంటి తర్కశాస్త్ర గ్రంథాలు, జగన్నాథ పండితుని మనోరమా కుచమర్దనం వంటి వ్యాకరణ శాస్త్రగ్రంథాలు, ఉభయ మీమాంసా, జ్యోతిష, సంగీత మంత్రశాస్త్రాదుల గ్రంథాలు అనేకం.

ఇవిగాక కావ్య నాటకాలు రచించిన ఆంధ్ర పండితులను గురించి చెప్పనక్కర లేదు. వామన భట్టబాణుని వేమభూపాల చరితం, గంగాదేవి మధురా విజయం, అగస్త్యుని బాలరామాయణం, అష్టభాషా బహిరీ గోపాలరావు రచించిన రామచంద్రోదయం వంటి కావ్యాలు, సర్వజ్ఞసింగభూపాలుని రత్నపాంచాలిక, ఆదివణ్ శఠకోపస్వామి వాసంతికా పరిణయం, శ్రీకృష్ణదేవరాయల జాంబవతీ పరిణయం వంటి నాటకాలు తెలుగుదేశంలో వెలసినవి ఎన్నైనా చెప్పవచ్చు.

ఇక వ్యాఖ్యానాల విషయంలో తెలుగుదేశం భారతవర్షంలోని అన్ని ప్రాంతాలనూ మించింది. విశ్వ విఖ్యాతుడయిన మల్లినాథుడు అరుణగిరి నాథుడు మొదలయిన వారు అగ్రగణ్యులు.

ప్రాకృత సాహిత్యానికీ, బౌద్ధ దర్శనానికీ తెలుగువారి సేవ అపారం.

ఇదికాక ధునిక పద్ధతిలో సంస్కృతంలో విజ్ఞాన సర్వస్వం తొలిసారిగా రచించిన కీర్తి తెలుగువారికే దక్కింది. పరవస్తు రంగాచార్యులవారు ఈ శాఖకు ఆచార్యులూ మార్గదర్శకులయారనీ, తర్వాతే వాచస్పత్య శబ్దకల్ప ద్రుమాదులు బయలు దేరాయని పెద్దలు అంటున్నారు.

తెలుగు విద్వాంసులు తెలుగు భాషకు చెందిన ఛందోవ్యాకరణాలంకార గ్రంథాలను కూడ సంస్కృత భాషలో రచించారన్నప్పుడు, వారికి సంస్కృతంపైగల అపార ప్రేమ వ్యక్తమవుతుంది.

వైదిక వాఙ్మయం

వైదిక లౌకిక సంస్కృత వాఙ్మయాలలో ఘోరమైన పరిశ్రమచేసి వివిధ సంస్కృత శాఖలలో రచనలు కొనసాగించి, సంస్కృత శారదను అలంకరించిన వారిలో ఆంధ్రులు ఎందరో ఉండడం పండితులందరికీ తెలిసిన సంగతే. కల్పసూత్ర కర్తఅయిన ఆపస్తంబుడు ఆంధ్రుడని సంస్కృత సాహిత్య చరిత్ర కారులయిన శ్రీకృష్ణమాచార్యులు నిర్ణయించారు. శ్రీ పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు కూడా ఆపస్తంబుడు ఆంధ్రుడని 1930 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో వ్రాశారు. తమ వాదానికి వైదికోదాహరణాలు ఇచ్చారు. ఋగ్వేద పదానుక్రమణిక సిద్ధపరచిన పంజాబు విద్వాంసుడు శ్రీభగవద్దత్ ఆపస్తంబుడు తెలుగువాడంటూ, ఆపస్తంబ సూత్రులు ఆంధ్రదేశంలో ఎక్కువగా నేడు నివసించడం కూడ ఆపస్తంబుడు తెలుగు వాడనడానికి కారణమన్నారు. ఆపస్తంబుడు క్రీస్తుకు పూర్వం ఐదు శతాబ్దులకు ముందున్న వాడని పరిశోధకుల అభిప్రాయం.

క్రీస్తుశకం 14వ శతాబ్దివాడైన భట్టభాస్కరుడు కృష్ణయజుర్వేదాంతర్గతమైన నమకచమకాలకు శతరుద్రీయమనే వ్యాఖ్య చేశాడు. కృష్ణపండితుడనే మరొక ఆంధ్ర విద్వాంసుడు సంధ్యావందన భాష్యం రచించాడు. ఇతని కాలం స్పష్టంగా తెలియదు కాని, ప్రాచీనుడే. 12వ శతాబ్దివాడు, వీర శైవాచార్యులలో ఒకడు అయిన పాలకురికి సోమనాథుడు రుద్ర భాష్యం రచించాడు. దాదాపు ఆకాలంవాడే అయిన శ్రీపతి పండితుడు శ్రీకర భాష్యం అనే పేరున బ్రహ్మసూత్ర

భాష్యానికి వీరశైవ సంప్రదాయ సిద్ధమైన వ్యాఖ్య వ్రాశాడు. పాల్కురికి సోమనాథుడు వీర మాహేశ్వర సారోద్ధారమనే వీరశైవ మత గ్రంథమూ రచించాడు. దీనికి సోమనాథ భాష్యమనేది నామాంతరం.

వేదభాష్యావతారం తుంగభద్ర తీరంలో ఆంధ్ర కర్ణాటక దేశాలనేకాక, దక్షిణాపథాన్నంతా ఏలి వైదిక ధర్మాన్ని పునః ప్రతిష్ఠ చేసిన విజయనగర సమ్రాట్టుల ఆదరంతో విద్యారణ్యులవారి అనుగ్రహంతో జరిగినా, నేడా ప్రాంతం కర్ణాటక దేశంలో లీనమయింది గనుక నేను దానిని ఉట్టంకించ లేదు. కాని, సాయణ సోదరులు ఎవ్వరైనా ఆంధ్ర సార్వభౌముల ఆదరణలో వేద భాష్యావతారం జరిగింది గనుక, తెలుగు వారికి ఆ శ్రేయస్సు దక్కిందనే నా అభిప్రాయం.

వ్యాకరణ శాస్త్రం

వ్యాకరణ శాస్త్రంలో ఆ ధుర్య రచనలు కావ్యనాటకాదులంత విరివిగా కనిపించ పోయినా కొన్ని ప్రముఖ గ్రంథాలేఉన్నాయి. నాగేశభట్టు పూర్వులు తెలుగు వారనే ప్రతీతి ఉన్నది గనుక, అతనిని నేను తెలుగువాడి కిందే పరిగణిస్తున్నాను. ఈయన 17వ శతాబ్దివాడు. లఘు శబ్దేందు శేఖరం, పరిభాషేందు శేఖరం, బృహద్వైయాకరణ సిద్ధాంత మంజూష, లఘు వైయాకరణ సిద్ధాంత మంజూష పరమ లఘుమంజూష మహాభాష్య ప్రదీపోద్యోతం–అనే గ్రంథాలు రచించాడు.

ఆ శతాబ్దివాడే అయిన పండిత జగన్నాథుడు భట్టోజీ దీక్షితుని ప్రౌఢ మనోరమను ఖండిస్తూ మనోరమా కుచమర్దనమనే గ్రంథాన్ని, శబ్దకౌస్తుభ శాణోత్తేజనం అనే గ్రంథాన్ని రచించాడు.

19వ శతాబ్దివాడైన భాగవతుల హరిశాస్త్రి పరిభాషేందు శేఖరానికి వాక్యార్థ చంద్రిక అనే వ్యాఖ్య వ్రాశారు. దీనికి ఈ శతాబ్ది వారయిన మహామహోపాధ్యాయ తాతా సుబ్బారాయశాస్త్రి చిత్ర ప్రభ అనే వ్యాఖ్య వ్రాశారు. ఈ శాస్త్రిగారికి అపరనాగేశభట్టని బిరుదు. దీనికి కారణం ఏమిటంటే, ఈ సుబ్బరాయశాస్త్రిగారు వాక్యార్థ చంద్రికా రావుని మతం ఖండించి నాగేశభట్టు మతాన్ని స్థాపించాడు గనుక. ఈయనే శబ్దేందుశేఖరానికి గురు ప్రసాదమనే వ్యాఖ్య వ్రాశారు. ఈ శతాబ్దివారే అయిన బెల్లంకొండ రామారావుగారు సిద్ధాంత కౌముదికి శరద్రాత్రి అనే వ్యాఖ్య వ్రాశారు. ఈయన శతాధిక గ్రంథ కర్త. వర్తమాన వైయాకరణులలో గొప్పవారైన పేరి వేంకటశాస్త్రిగారు తమ గురుపర్యాయులగు తాతా సుబ్బారాయశాస్త్రిగారి గురుప్రసాద వ్యాఖ్యాన శేషాన్ని గురుప్రసాద శేషమనే పేరుతో పూరించారు. 19వ శతాబ్దివారైన నడిమింటి సర్వమంగళేశ్వర శాస్త్రిగారు విద్యార్థుల ఉపయుక్తి ప్రబోధ కోశం, సమాస కుసుమావళి; విభక్తి విలాసం, శబ్ద మంజరి అనే పుస్తకాలు రచించారు.

ఇక నిఘంటువుల విషయంలో తెలుగువారు రచించిన ప్రాచీన నిఘంటువు అవ్యయ సంగ్రహ నిఘంటువు. దీనిని 12వ శతాబ్దివాడైన శార్ఙ్గ్యాయనుడు రచించాడు

జ్యోతిషం

ఖగోళ జ్యోతిషశాస్త్రాలలోను తెలుగు వారు తీసిపోలేదు. నదీ గ్రంథాలు కరణ గ్రంథాలు ప్రాచీనమయినవి ఎన్నో ఉన్నాయి. వీటిలో గొప్పగా పేర్కొన దగినది భాస్కరాచార్యుల సిద్ధాంత శిరోమణి. ఈయన 12వ శతాబ్దివాడు.

ధర్మశాస్త్రం

ధర్మశాస్త్రంలో కాకతీయుల కాలం నుంచి మహారాష్ట్రుడైన హేమాద్రి రచించిన చతుర్వర్గ చింతామణి, తదితర గ్రంథాలు ప్రమాణాలయినా, తెలుగువారూ రచించకపోలేదు. కంచెర్ల యెల్లయాజి యెల్లయాజీయమనే ధర్మ శాస్త్ర గ్రంథం రచించాడు. ఈయన 16వ శతాబ్దివాడు. 19వ శతాబ్ది చివర, ఈ శతాబ్ది ప్రారంభం లోను ఉటప్రోలు సంస్థానం ఆస్థాన విద్వాంసులుగా ఉన్న మహాపండితులు వెల్లాల సదాశివశాస్త్రిగారు అమానోమ వ్రతమనే గ్రంథం వ్రాశారు. ఇది పేరుకు వ్రత గ్రంథంగా కనిపించినా ధర్మశాస్త్ర జ్యోతిష ఖగోళాది వివిధశాస్త్ర పాండిత్యానికి నికషం.

దర్శనాలు

న్యాయశాస్త్రాన్ని సులభంగా నేర్చుకొన వారికి వీలుగా గరికపాటి అన్నంభట్టు తర్క సంగ్రహం రచించాడు. ఈయన కృష్ణా మండలవాసి, 16వ శతాబ్దివాడు. గత శతాబ్దిలో ఉన్న సంగమేశ్వర శాస్త్రిగారు సువిఖ్యాత న్యాయశాస్త్ర పారంగతులు. సంగమేశ్వరీయం అనే క్రోడపత్రం వ్రాశారు. ఈ శతాబ్దివారయిన బులుసు అప్పన్నశాస్త్రి గారు మహాతార్కికులు. న్యాయ సిద్ధాంత కుసుమావళికి సుబోధిని అనే వ్యాఖ్య వ్రాశారు. ఈయనను ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడెమీ సన్మానించింది. ఈ శతాబ్దివారే. అయిన కొల్లూరి సోమశేఖరశాస్త్రిగారూ న్యాయ సిద్ధాంత కుసుమావళికి వ్యాఖ్య వ్రాశారు.

ఇక పూర్వ మీమాంసా శాస్త్రంలో మన వారి రచనలు పెక్కు ఉన్నాయి. తర్క సంగ్రహకర్త అయిన అన్నంభట్టే న్యాయ సుధకు సుబోధిని అనే వ్యాఖ్య చేశాడు. కరీంనగర్ జిల్లా ధర్మపురివాసి నరసింహ శాస్త్రులు పార్థసారథి మిశ్రుని న్యాయ రత్నమాలకు నాయకరత్నం అనే వ్యాఖ్య రచించాడు. శాస్త్ర దీపిక అనే పూర్వోక్త ఉద్గ్రంథానికి నిరల సోమనాథ దీక్షితుడు మయూఖ మాలిక అనే వ్యాఖ్య వ్రాశాడు; దీనికి సోమనాథీయమనే నామాంతరమూ ఉంది. తిరుపతి వేంకటేశ్వర కళాశాలలో ప్రధానాచార్యులుగా ఉండి ప్రస్తుతం మద్రాసులో ఉన్న శ్రీ ఉత్తమూరు వీర రాఘవాచార్యులు గారు న్యాయప్రకాశానికి వ్యాఖ్య వ్రాశారు.

ఉత్తర మీమాంసలో మనవారి ప్రాచీన రచనలు అంతగా కనిపించడంలేదు, ఎందుకో! కాని సురపురం మొదలయిన సంస్థానాల లోని విద్వాంసులు పెక్కు గ్రంథాలు వ్రాశారు. సురపురం వేంకటాచార్యులవారి గ్రంథాలు, బుక్కపట్టణం అణ్ణయాచార్యుల వారి చంద్రికా ఖండనం మొదలయినవి ఉన్నాయి. వీరు 18వ శతాబ్ది చివర సురపురంలో ఉన్నవారు. 19వ శతాబ్ది వారైన మహావిద్వాంసుడు బెల్లంకొండ రామారావు గారు బ్రహ్మ సూత్రాలకు శాంకరా శంకర భాష్యమనే భాష్యం, భగవద్గీతా వ్యాఖ్య

రచించారు. బులుసు అప్పన్నశాస్త్రి గారు భగవద్గీతకు శాంకరా శాంకరతత్త్వ బోధిని అనే గ్రంథం రచించారు.

సంగీత, నాట్యశాస్త్రాలు

వాస్తు శిల్పకళలకు ఆకరమైన తెలుగు సీమలో సంగీత నాట్యశాస్త్ర గ్రంథాలు వెలువడడంలో ఆశ్చర్యమేముంది? వేయి సంవత్సరాలనుంచి వెలువడుతున్నాయి. కాకతీయ గణపతిదేవుని సేనాపతులలో ఒకడైన జాయపసేనాని నాట్యశాస్త్ర వ్యాఖ్యాన రూపమయిన నృత్తరత్నావళి రచించాడు. కొటికలపూడి నారాయణకవిగారి నాట్య సర్వస్వదీపిక గొప్పగ్రంథం. 11వ శతాబ్దిలో పెక్కు సంగీత గ్రంథాలు వచ్చాయి. వేమ భూపాలుని సంగీత చింతామణి, కుమార గిరిరెడ్డి వసంత రాజీయం, సర్వజ్ఞసింగ భూపాలుని సంగీత సుధాకరం పేర్కొనదగినవి. తర్వాత చెప్పదగినది వీరభల్లట దేవుని నాట్యశేఖరం. రోజుకొక కీర్తనగా 60 సంవత్సరాల పాటు రచించిన అన్నమాచార్యులవారు సంకీర్తన లక్షణం కూడ రచించారు. అప్పటివాడే అయిన బండారు సూర్యనారాయణ సంగీత సూర్యోదయ మనే గ్రంథం రచించాడు 16వ శతాబ్ది వాడయిన రామయ్యామాత్యుని స్వరమేళ కళానిధి, 17వ శతాబ్ది వాడయిన రఘునాథభూపతి సంగీతసుధ ఆధునిక దక్షిణాపథ సంగీత ప్రగతికి దారి తీశాయి. 20వ శతాబ్దిలో జరిగిన గొప్పపని మానవల్లి రామకృష్ణ కవిగారి భరతకోశ రచనం. ఇలాటి సంగీత నాట్యశాస్త్ర విజ్ఞాన సర్వస్వాన్ని రచించి కవిగారు పరమ కీర్తిమూర్తిని ఈ రంగాలలోనూ సుప్రతిష్ఠితం చేశారు.

కామశాస్త్ర గ్రంథాలలో 15వ శతాబ్ది వాడయిన హరిభట్టు రచించిన రతిరహస్యం తర్వాత పెక్కు పుస్తకాలకు మాతృక అయింది

ఆయుర్వేదం

ఆయుర్వేదానికి ఆంధ్రుల సేవ దాదాపు మూడువేల సంవత్సరాల నుంచి ఉంది. గాథా సప్తశతిలో గ్రామీణ ప్రజల వైద్య ప్రసక్తికి ఎన్నో ఉదాహరణలున్నాయి. బహుమూలికా సంపలితమూ, గహనారణ్య పరివృతమూ అయిన శ్రీశైలం సహస్రాబ్దాలుగా ఆయుర్వేద శాస్త్రానికి కేంద్రంగా ఉంది. పెక్కు దేశాలకు మూడవ శతాబ్ది వాడయిన నాగార్జునుని కచ్ఛపుట తంత్రం, 6వ శతాబ్ది వాడయిన నిత్యనాథ సిద్ధుని రస రత్నాకరం విశ్వవిఖ్యాతమైనవి. కృష్ణదేవ రాయల కాలపు పరహిత పండితుని పర హిత సంహిత, ఆ శతాబ్దివాడే అయిన బసవరాజు బసవరాజీయం ప్రజాదరం పొందిన గ్రంథాలు. ఈ శతాబ్దిలో ఆయుర్వేదాన్ని ఒక ఉద్యమం వలె నడిపిన వైద్య రత్న పండిత డి. గోపాలాచార్యులుగారు పెక్కు వైద్య గ్రంథాలకు వ్యాఖ్యలు వ్రాసి దేశమంతటా తామర తంపరగా శిష్య సంతతిని విస్తరింప జేశారు.

అలంకార శాస్త్రం

అలంకార శాస్త్ర విషయంలో కాశ్మీర ప్రాంతం తర్వాత మౌలికమయిన వివిధ ప్రస్థానాలు ప్రదర్శించిన వారూ, ఎక్కువ గ్రంథాలు రచించిన వారూ, వ్యాఖ్యాతలూ తెలుగువారే వీరిలో ముఖ్యులు: 1250 వాడయిన అమృతానందయోగి అలంకార సంగ్రహం రచించారు. కావ్య ప్రకాశం తర్వాత పాఠ్యగ్రంథంగా విశేషవ్యాప్తి పొందిన ప్రతాపరుద్ర యశోభూషణమనే గ్రంథాన్ని అగస్త్య విద్యానాథుడు రచించాడు. ఇతడు కాకతి ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉన్నవాడు. 14 వ శతాబ్దిలో నరసింహశాస్త్రి కావ్యకంటకోద్ధారమనే దాన్ని, విశ్వేశ్వరుడు చమత్కార చంద్రికను, సింగ భూపాలుడు రసార్ణవ సుధాకరాన్ని, బౌబశార్య కృష్ణపండితుడు అలంకార సర్వస్వాన్ని రచించారు. క్షేమేంద్రుని ఔచిత్య విచార చర్చవలె, కుంతకుని వక్రోక్తివలె ఆ శతా చమత్కార చంద్రిక చమత్కారమనే నూతాన ప్రస్థానాన్ని నిర్వచించింది. ఆ శతాబ్దిదే వారణాసి ధర్మసూరి సాహిత్య రత్నాకరం.

ప్రతి శతాబ్దిలోను అలంకార గ్రంథాలు రచిత మయ్యాయి. వ్యాఖ్యలను గురించి చెప్పనక్కరలేదు 13 వ శతాబ్దినాటి బాల చిత్తానురంజని అనే కావ్య ప్రకాశ వ్యాఖ్య, నరహరి సరస్వతీ తీర్థ వ్రాశారు. మహా వ్యాఖ్యాత అయిన మల్లినాథుడు ఏకావళికి తరళ అనే వ్యాఖ్య చేశాడు.

పదహైదవ శతాబ్దినాటి లక్షణ దీపిక, గౌరన, సాహిత్య చింతామణి, వేమ భూపాలుడు వ్రాశారు. పదహారవ శతాబ్ది నాటి కావ్య ప్రకాశ వ్యాఖ్య, యజ్ఞేశ్వర పండితుడు తాళ్లపాక తిరుమలయ్య రచించారు 17 వ శతాబ్దికి చెందిన సాహిత్య సుధ, రఘునాథ భూపతి, రసగంగాధరం, చిత్ర మీమాంసాఖండనం, జగన్నాథ పండితుడు వ్రాశారు. జగన్నాథ పండితుడు మహా మేధావి షాహజహాన్ ఆస్థానం అలంకరించిన సంస్కృత మహాకవి, శాస్త్రజ్ఞుడు. చంద్రాలోక కువలయానంద, చిత్ర మీమాంసాది అలంకార శాస్త్ర గ్రంథాలు రచించిన అప్పయ్య దీక్షితులవారు జన్మతః తమిళవారైనా, పెనుగొండను పాలించిన వేంకటపతి రాయలకు దివానుగా ఉంటూ జీవితమంతా తెలుగునాడులోనే గడిపినవాడు గనుక, ఆయననూ నేను ఆంధ్రుడుగానే పరిగణిస్తున్నాను. దశరూపక వర్మ, కుకవి రామ కవి, రససుధానిధి, శౌంరి మారభట్టారకుడు, అలంకార సుధాసింధువు, అప్పారాయ యశశ్చంద్రిక, రస ప్రపంచం ఆణివిల్లి వేంకటశాస్త్రి, 18వ శతాబ్దివారైన ఆలూరు నరసింహ కవి, నంజ రాజ యశోభూషణం, ఆణివిల్లి నారాయణశాస్త్రి, సాహిత్య కల్పద్రుమం తిరుమల బుక్కపట్నం వేంకటాచార్యులు, రసమంజరి, శ్రీ తిరుమల బుక్కపట్నం శ్రీనివాసాచార్యులు రచించారు 19 వ శతాబ్దివారైన కొల్లూరి రాజశేఖర కవి, సాహిత్య కల్పద్రుమం, అలంకార మకరందం, చావలి రామశాస్త్రి, కువలయామోదం, అలంకార ముక్తావళి, శ్రీ కృష్ణ బ్రహ్మ పరకాల యతీంద్రులు, అలంకార మణిహారం. [ఇది ఆర్యా ఛందస్సులో నడిచినది మనోహరమయినది], చెర్ల వేంకటశాస్త్రి, వేంకటాద్రి గుణ రత్నావళి, సాహిత్య రత్నాకర వ్యాఖ్య నౌక, మల్లాది లక్ష్మణసూరి, సాహిత్య రత్నాకర వ్యాఖ్య మందరం వ్రాశారు ఇలా ఎందరినైనా ఆలంకారికులను పేర్కొనవచ్చు.

వ్యాఖ్యానాలు

కావ్య నాటకాదుల వ్యాఖ్యాతలలో తెలుగువారి సంఖ్య మరీ హెచ్చు. వేద

వ్యాఖ్యాతలు మనమే కదా! పెక్కు కావ్యాలను వ్యాఖ్యానించి "మాఘే మేఘే గతం వయః''అని గర్వంతో చెప్పుకొన్న మల్లినాథుడు వ్యాఖ్యాతలకు అగ్రణి అయ్యాడు. ఈ సంగతి విపశ్చిల్లోకానికి తెలిసిందే. ఈయన హైదరాబాద్ నగర సమీపంలోని కొలచెలమ గ్రామవాసి ఇప్పటికీ ఆ వంశీయులిక్కడ ఉన్నారు. ఈయన కాళిదాస రచిత కావ్యత్రయానికి, శిశుపాలవధ కిరాతార్జునీయ నైషధీయచరిత్ర, భట్టి కావ్యాలకు వ్యాఖ్యానాలు వ్రాసి, అంతకుముందున్న కువ్యాఖ్యానాలను ఖండించాడు.

మల్లినాథుడు ఒరవడిగా పలుకరు వ్యాఖ్యాతలు పుట్టారు. 14వ శతాబ్ది వారయిన కాటమ వేమ భూపాలుడు కాళిదాసు నాటకాలు మూడింటికి, పెదకోమటి వేమభూపాలుడు అమరకానికి శృంగార దీపికా వ్యాఖ్యను, గాథాసప్తశతికి భావదీపికా వ్యాఖ్యను చేశారు. బొమ్మకంటి అప్పయార్యుడు నామలింగానుశాసన. వ్యాఖ్యను, అష్టభాషా చక్రవర్తి వైఖానస శ్రీనివాసాచార్యుడు శాకుంతల వ్యాఖ్య చేశారు.

పదహైదవ శతాబ్దిలో మల్లినాథ కుమారుడైన కుమారస్వామి సోమపీథి ప్రతాపరుద్రయశోభూషణానికి రత్నాపణమనే వ్యాఖ్య వ్రాశాడు. 16వ శతాబ్దివాడు విజయనగర సార్వభౌముడైన కృష్ణదేవరాయల ఆస్థాని అయిన లొల్ల లక్ష్మీధరుడు సౌందర్యలహరీవ్యాఖ్యను, 17వ శతాబ్దివాడైన ఆవంచ రామచంద్ర బుధేంద్రుడు భర్తృహరి సుభాషితాలకు, భోజుని రామాయణ చంపువుకు వ్యాఖ్యలు వ్రాశాడు. 18వ శతాబ్దిలో ఆరె దేచమంత్రి శివ పంచస్తవికి వ్యాఖ్య చేశాడు

16వ శతాబ్దివాడు, కృష్ణరాయల మహామాత్యుడు సాళువతిమ్మరుసు అగస్త్య విద్యానాథుని బాలరామాయణానికి మనోహరీయ మనే వ్యాఖ్య వ్రాయడం విశేషం. నాదెండ్ల గోపమంత్రి ప్రబోధ చంద్రోదయ నాటకానికి చంద్రికా వ్యాఖ్యను, 18వ శతాబ్ది వాడయిన చిలకమర్తి తిరుమలాచార్యుడు ప్రతాపరుద్రీయానికి రత్నశాణమనే వ్యాఖ్యను వ్రాశారు. 19వ శతాబ్ది వాడయిన కృష్ణబ్రహ్మతంత్ర పరకాల మహాదేశికులు నిగమాంత దేశికుల హంస సందేశానికి వ్యాఖ్య వ్రాశారు. 20వ శతాబ్దిలో ఆనెగొంది రాజాస్థానంలోవున్న అంబాళం రామాచార్యుల వారు చంపూ భారతానికి వ్యాఖ్య వ్రాశారు.

కావ్యనాటకాలు

కావ్యనాటకాల రచనా విషయంలో ఆంధ్ర ప్రాంతం భారతవర్షంలోని ఏ ప్రాంతానికీ తీసిపోదు. కొత్త కొత్త ప్రక్రియలనే ప్రవర్తింప జేశారన్నా అబద్ధం కాదు. ఉదాహరణకు ఉదాహరణ వాఙ్మయాన్నే తీసుకోవచ్చు ఈ కావ్య ప్రక్రియకు తొలి ఉదాహరణం పాల్కురికి సోమనాథుని బసవోదాహరణం. దీని తర్వాత ఎన్నో ఉదాహరణలు తెలుగులోను వెలువడినవి. (ఉదాహరణ వాఙ్మయం వివరాలకు శ్రీ నిడదవోలు వేంకటరావుగారి ఉదాహరణ వాఙ్మయ చరిత్ర చూడుడు)

నాటకాలలో ఉన్మత్త రాఘవ, ఉదారరాఘవాలు ప్రసిద్ధాలు. మొదటి దానిని 13వ శతాబ్ది వాడయిన భాస్కరుడు, రెండవ దానిని 1 వ శతాబ్ది వాడయిన శాకల్యమల్లుడు రచించారు. సర్వజ్ఞసింగ భూపాలుడు, 14వ శతాబ్దివాడు రత్న పాంచాలిక నాటికను రచించాడు. 14వ శతాబ్దివాడే అయిన వామనభట్ట బాణుడు పార్వతీ పరిణయము హంససందేశ, బృహత్కథా మంజరీ కనక లేఖలనే నాటకాలను, కృష్ణ దేరాయలు మదాలసాచరిత, సత్యభామా సాంత్వన, ఉషా పరిణయ, జాంబవతీ పరిణయాలనే నాటకాలు రచించారు. పైన పేర్కొనిన వామన భట్టబాణుడు వేమభూపాల చరితమనే గద్య కావ్యమూ వ్రాశాడు. ప్రతాపరుద్ర యశోభూషణం రచించిన విద్యానాథుడు బాల భారతమనే కావ్యమూ రచించాడు. కాకతీయ ప్రతాపరుద్రుడు రచించిన ఉషా రాగోదయ, యయాతి చరితాలనే నాటకాలు కనబడుతున్నాయి. 14వ శతాబ్దిలో అపరవ్యాసుడని విఖ్యాతి పొందిన గంగాధరకవి చంద్రరేఖా విలాసం, రాఘవాభ్యుదయం అనే రెండు కావ్యాలు రచించాడు.

అగస్త్య విద్యానాథుని భాగినేయుడైన నరసింహ కవి కాదంబరీ కల్యాణమనే నాటకాన్ని రచించాడు అగస్త్యుని సోదరుడు విశ్వనాథ కవి సౌగంధికాహరణమనే రూపకం రచించాడు. అగస్త్యుని శిష్యురాలు విజయనగరాధినేత కంపరాయణి రాణి గంగాదేవి మధురా విజయమనే కావ్యం రచించింది ఈ 14వ శతాబ్దివాడయిన వారణాసి ధర్మసూరి, సాహిత్య రత్నాకర మనే అలంకార శాస్త్రము రచించినవాడు బాలభాగవత, హంస సందేశ, నరకాసుర వధలనే కావ్యాలను. కంస వధమనే నాటకాన్ని రచించాడు 16వ శతాబ్దివాడయిన రఘునాథరాయల ధర్మపత్ని రామభద్రాంబ రాఘునాథాభ్యుదయమనే కావ్యం వ్రాసినది. ఆతని ప్రియురాలు మధురవాణి రామాయణ సారమనే కావ్యం రచించింది

15 వ శతాబ్దిలో ఆంధ్రదేశీయుడైన వల్లభాచార్యుడు ఉత్తర భారతానికి వెళ్ళి కృష్ణభక్తి పరమైన ఒకానొక ధర్మం స్థాపించి, బ్రహ్మ సూత్రాలకు కృష్ణభక్తి పరంగా శుద్ధాద్వైత సంప్రదాయమనే పేర భాష్యం రచించి, ఉజ్జయినీ సమీపంలో ఒక మఠం స్థాపించి ధర్మ ప్రచారం చేశాడు. ఈ వల్లభాచార్యులు ప్రేమామృత, మధురా మహాత్మ్యలనే కావ్యాలు రచించాడు.

పండితరాజ జగన్నాథుడు తన రసగంగాధరానికి లక్ష్య ప్రాయాలయిన భామినీ విలాసం, గంగాలహరీ మొదలయిన పెక్కు కావ్యాలను రచించాడు.

వారణాసిలో నివసించిన మానవల్లి వంశీయులు నరసింహ, గంగాధర, లక్ష్మణ, బాలచంద్రులనే వారు మహావిద్వాంసులు. వీరిలో ముగ్గురు మహామహోపాధ్యాయులు. గంగాధరశాస్త్రిగారికి బ్రిటిషు ప్రభుత్వం సి. ఐ. ఇ. బిరుదు ఇచ్చింది. వీరందరూ ఉత్తరాపథంలో గొప్ప శిష్యపరంపర గలవారు. వీరి వంశం వారైన సాహిత్యాచార్యులు జగన్నాథశాస్త్రి విరాజమానులై ఉన్నారు

19 వ శతాబ్దివారయిన కోరాడ రామచంద్రశాస్త్రి గారు మేఘసందేశానంతర కథను మందాక్రాంత వృత్తంలో ఘనవృత్తం అనే పేరుతో రచించారు. ఈయన ఇరవై రెండు సంస్కృత కావ్యాలు వ్రాశారని ప్రతీతి.

19 వ శతాబ్దిలో సంస్కృత వాఙ్మయాకాశంలో సూర్యునివలె వెలుగొందినవారు

బెల్లంకొండ రామరావుగారు. ఈయన శతాధిక గ్రంథకర్త. వీటిలో కొన్ని ముద్రితాలు. అప్రకాశితాలు చాల ఉన్నాయి.

ఈ 19వ శతాబ్దివారే అయిన పరవస్తు రంగాచార్యులవారు సంస్కృత విశ్వకోశం రచించారు. అది ఇంతవరకు ముద్రణ భాగ్యం పొందలేదు. ఈయన మంజుల నైషధమనే కావ్యమూ వ్రాశారు. ఈయనకు సమకాలికుడై చెన్నపట్నంలో ప్రతివాది భయంకరుడై ఉన్న మహామహోపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు గీతమహానటం, అక్షర సాంఖ్య శాస్త్రం, అక్షర సాంఖ్యచర్యామార్గదాయిని అనే కావ్యాలు రచించారు.

20వ శతాబ్దివారైన మేడేపల్లి వెంకట రమణాచార్యులు ద్రావిడ నాలాయిర దివ్య ప్రబంధంలోని మొదటి వేయి పాశురాలను శఠకోప సహస్రం అని సంస్కృతీకరించారు. కావ్యకంఠ గణపతిముని ఉమా సహస్రాది కావ్యాలను రచించారు. ఆదిభట్ల నారాయణ దాసుగారు హరికథామృతం రచించారు. వేమూరి శ్రీ రామశాస్త్రిగారు, పిశుపాటి చిదంబరశాస్త్రిగారు దేశమంతటా సంస్కృతంలో శతావధానాలు జరిపి అపార ఖ్యాతి పొందారు

తెలుగువారు సంస్కృతభాషాభిమానంతో తమలక్షణ గ్రంథాలనూ సంస్కృతంలోనే రచించారని మొదట్లోనే అన్నాను. ఆంధ్ర సాహిత్యం ఎంతగా సంస్కృతభూయిష్ఠమో మనకందరికీ తెలుసు. ఆంధ్ర తవర్ణ మాల పెక్కు ఉచ్చారణలకు సంస్కృత వర్ణ మాల పై ఆధారపడినట్టిది కావడం మనకు తెలిసిన సంగతే.

సంస్కృత సాహిత్యమంతా తెలుగులోకి అనువదించబడింది. ఇతర భారతీయ భాషలు సంస్కృత సాహిత్యాన్ని ఇంతగా ఆత్మీయం చేసుకొన్నవి నాకు కనిపించలేదు. తెలుగు లిపిలో ముద్రితం కానట్టి సంస్కృత గ్రంథమూ లేదు. ఈ శ్రేయస్సు వావిళ్ల వారికి దక్కింది.

ఇంకా వేనవేలు సంస్కృత కృతులు, వేలాది కృతికారులు తెలుగు సీమలో వెలిశారు. నేడు సంస్కృత కవులకు తెలుగు సీమలో కొరతలేదు. సంస్కృతమూల బంధం తెలుగు భాషా సాహిత్యాలకు అవసరమనే విశ్వాసం ప్రబలింది; సంస్కృత భాషాధ్యయనం విస్తరించింది. రచయితలూ ఎక్కువయ్యారు. ఇలాటి వారిలో శ్రీ వేంకటరామాచార్యులు, శ్రీ పులవర్తి శరభాచార్యులు మున్నగు వారిని పేర్కొనవచ్చు.

ఈనాడు మరొక మహోద్యమం ప్రారంభమయింది. అది ఆంధ్ర సాహిత్యంలోని అపూర్వ ప్రబంధాలను, ఇతర గ్రంథాలను, సంస్కృతంలోకి అనువదించి, తెలుగువారి ప్రతిభను యావద్భారతానికి తెలియజేయడం. వసుచరిత్ర విని దిగ్భ్రాంతులయిన సంస్కృత విద్వాంసులు, దానిని సంస్కృతీకరించుకొని ఆనందించారు. అది మూడు శతాబ్దాల క్రింది మాట. నేడు ఆంధ్ర భాషలోని ప్రబంధాలు కొన్ని సంస్కృతీకరించబడి ఇతర రాష్ట్ర విద్వాంసులను తలలూపేటట్లు చేస్తున్నాయి. విఖ్యాత సంస్కృతాంధ్ర విద్వాంసులు శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు స్వతంత్రమైన ఎన్నో గ్రంథాలు సంస్కృతంలో రచించడమేకాక, సంస్కృత భాషామాత్రవేదులయిన ఇతర భాషా విద్వాంసుల కోసం కళాపూర్ణోదయం, శ్రీ వేంకటేశ్వర వచనాలు, పోతన భాగవతం మొదలయిన ఉత్తమ కావ్యాదులను సంస్కృతీకరించారు. మిత్రుడు శ్రీ కుంటిమద్ది శేషశర్మ మనుచరిత్రను మహాప్రతిభతో అనువదించాడు. తెలుగు మత్తేభ, గీత, సీస, మధ్యాక్కరాది వృత్తాలను గ్రహించాడు. శ్రీ మత్తిరుమల గుడిమెళ్ల వరదాచార్యులవారు వేమన పద్యాలను సంస్కృతీకరించారు. ఇంకా ఎందరినో పేర్కొనవచ్చు.

ఈ విధంగా వేద కాలం నుంచీ నేటి వరకూ దేవ భాషాధ్యయన ప్రవాహ మహాధ్వరం అనుస్యూతంగా కొనసాగుతున్నది

స్వాతంత్ర్యోద్యమంలో మహిళల పాత్ర

(39వ పేజీ తరువాయి)

ఒక పరిపూర్ణతకు వచ్చిన ఆంధ్ర మహిళ జీవనం, స్వాతంత్ర్యోదయంతో మరొక మెట్టు పై కెక్కినది. సర్వ హక్కులు లభ్యమైన నేటి ఆంధ్ర మహిళ ప్రపంచ మహిళలలోకెల్ల స్వేచ్ఛాజీవి అంటే అతిశయోక్తి కాదు.

ఇక 1947 నుండి నేటి వరకూ జరిగిన చరిత్ర యిటీవలి కథ. దీనిని నిష్పాక్షికంగా సమీక్షించడం కష్టం.

స్వాతంత్ర్యోదయంతో సమగ్రిత కొరవడింది. భారత దేశం, పాకిస్తాన్‌లు విడివడి స్వతంత్ర ప్రతిపత్తినందాయి. రాజ్యాంగం ఏర్పడి- ఒక విలక్షణమైన పరిపాలనా యంత్రాంగం నెలకొంది. మనం ముఖ్యంగా చెప్పుకొనవలసినదీ కాలంలో స్త్రీలు వేసిన ముందంజ. రాజ్యాంగం ప్రాథమిక హక్కుల విషయంలో స్త్రీలను విడి చేయలేదు. సర్వ హక్కులు ప్రాప్తించిన మహిళా లోకం నవ చైతన్యంతో రాజకీయ రథ సారథ్యంలో ప్రముఖ పాత్ర వహించడం ప్రారంభించింది. అన్ని రంగాలలోనూ, పురుషునితో సమాన ప్రతిపత్తినంది స్త్రీలు రాణిస్తున్నారు. ఇటీవలి కాలం దాకా ఉండిపోయిన ఒకటి అర మినహాయింపులను సహితం యిటీవలే మన ప్రధాని తోసి రాజంది.

స్వాతంత్ర్యమునకు స్త్రీ అనర్హురాలన్న నమ్మకము వమ్ముచేసి ఎక్కడ స్త్రీలు పూజింపబడుదురో ఆక్కడ దేవతలు పరితృప్తులు అన్న నమ్మకము నెలకొల్పారు, మన మహిళలు. ఈ పరిణామము స్వాతంత్ర్యోద్యమ ఫలితమే!

యువకుల సాంఘిక సమస్యలు



జె. వీరాస్వామి

ఏ జాతిలోనైనా నేటి యువకులు రేపటి పౌరులు. యువకులు తమ యౌవ్వనంలో పెంపొందించుకున్న శీల ప్రవృత్తి, వారి భావి జీవితంలో ప్రతిబింబిస్తుంది. మన నాగరికత ప్రపంచ మందలి మిక్కిలి ప్రాచీనమైన నాగరికతలలో ఒకటి 'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అన్నట్లు, మానవ శీల ప్రవృత్తి దిగజారి పోతునప్పుడు, సాంఘిక మత సంస్కర్తలు ఉద్భవిస్తారు ఇది యుగయుగాలుగా, తరతరాలుగా జరుగుతూ వస్తున్న సత్యం అట్టి వారిలో బుద్ధ భగవానుడు మహోన్నత సంఘ సంస్కర్త. ఆయన, మానవ వ్యవహారాల్లోను ప్రవర్తనలోను అన్ని మతాల్లోను పొందుపరచబడిన సమత, సౌభ్రాతృత్వము, స్వేచ్ఛ అను మూడు మౌలిక సూత్రాలను పాటించాలని ప్రబోధించాడు. బౌద్ధమతాన్ని స్వీకరించిన, డా॥ అంబేద్కరుగారు, మన రాజ్యాంగ చట్టముయొక్క ముఖ్య నిర్మాతలలో ఒకరు. అట్టి మహనీయుడు, బౌద్ధమతములోని ఆ మూడు మౌలిక సూత్రాలను మన రాజ్యాంగచట్టమునందు పొందుపరచుటలో ఆశ్చర్యములేదు. పౌరులందరికీ సమాన హోదా, సమానావకాశాలు కలుగజేయాలంటే పేదలకు అణగద్రొక్కబడిన వర్గాలకు ప్రత్యేక సహాయము చేయడం అవసరం అనే సూత్రాన్నిగూడా మన రాజ్యాంగములో పొందుపరచారు. మానవసేవయే మాధవ సేవ. ఇదే అన్ని మతాలయొక్క పరమ రహస్యం, ఎందువల్లననగా, యావత్ విశ్వంలోను, సృష్టిలోను మానవుణ్ని మించిన ప్రాణిలేదు. అందువల్లనే కొన్ని మతాలవారు. దేవుణ్ని కూడ మానవ రూప ధారిగానే ఊహించడం జరుగుతోంది, ప్రజలకు అన్యాయాలు చేసి డబ్బుగడించిన వ్యక్తి దేవుడున్నాడని నమ్మి తన అన్యాయార్జిత విత్తంలో కొంతభాగాన్ని మొక్కుబళ్ల రూపంలో — కాదు లంచం రూపంలో — భగవంతునికి ఇవ్వజూపితే అట్టి వాడిని పచ్చిమోసకారి అని పిలువండి. వాటిని బట్టబయలు చేసి అవమానాలపాలు చేయండి. తోటి మానవుడికిగాని, మానవాళికిగాని ద్రోహాన్ని తలపెట్టే ఏ కారణమైనా భగవంతుడికి సమ్మతమౌతుందా? ఏ మతమైనా దీన్ని హర్షిస్తుందా? అవినీతి, దోపిడి, లంచగొండి తనము, మత మౌఢ్యము, కుల తత్వము, బంధు ప్రీతి, నిర్లక్ష్య స్వభావము ఈ నాటి మన సాంఘిక వ్యవస్థలో కిరడుగట్టుక పోయాయి. మనకు తగినన్ని మతాలు, తగినంతమంది మతప్రచారకులు. సరిపడినన్ని మత ప్రబోధక ప్రతికలు, ఆకాశ వాణినుండి తగినన్ని మత బోధక ప్రసంగాలు, ప్రచారము, కావలసినన్ని ప్రార్థనా మందిరాలు పూజామందిరాలు లేకపోవడం ఈ నాటి మన దుస్థితికి కారణమా? ఇందుకు జవాబు వెదుక్కోనక్కర లేదు. ఈ నాటి సాంఘిక వ్యవస్థలో మనం మతాలలోని మూల సూత్రాలపట్ల సవతి తల్లి ప్రేమను చూపుతున్నాము. వాటిలోని లోపభూయిష్టమైన భావాలకు దాసోహం అంటున్నాం. లేకపోతే మతాలపేర హింసాకాండ ఎలాజరుగుతుందో? విధి లేక కర్మ సిద్ధాంతములందలి విశ్వాసము యువజనుల్లో కార్యాభిలాషను అణచివేస్తుంది వారు తమ విధి, పూర్వ నిర్ణీతం కాదని, అది తమ చేతుల్లోనే తాము చేయు కార్యముల పైనే ఆధారపడి ఉంటుందని ఎల్లపుడు భావించాలి, వరకట్నాలను గుంజుకొని, ఆడపిల్లల తల్లిదండ్రుల సంసారాలను ఆర్థిక బాధలకు గురిచేయడం భావ్యంకాదని మన యువకులకు తెలియదంటారా? మన యువకులు హేతువాద దృక్పథం అలవర్చుకోకపోతే మన సాంఘిక దురాచారాలు అంతం కావడమనేది ఉండదు. ఈ నాడు, వాయువేగ మనోవేగాల్తో పెరిగిపోతున్న జనాభా దృష్ట్యా యువకులు 'వారు ఏ మతస్థులైనా' కుటుంబనియంత్రణయొక్క ఆవశ్యకతను కాదనగలరా? అందరికి ఒకే సివిలు చట్టమును ఉండవలసిన అవసరమును విస్మరింపగలరా? మనకు రాజకీయ స్వాతంత్ర్యము వచ్చినమాట నిజమే కాని, సాంఘికరంగంలో ఆర్థికరంగంలో సమానావకాశాలు సమకూర్చలేని రాజకీయ స్వాతంత్ర్యం మనలను గాని, మన జాతిని గాని ఉద్ధరించ నేరదు. ఇది మనకు స్పష్టంగా తేటతెల్లంగా విస్మరింప వీలులేని రీతిగా గోచరిస్తున్న సత్యం.

మన యువకులయొక్క స్థాయిని వృద్ధి పొందించడమే మనకు మిగిలిన ఆశ. ఈనాడు మనదేశంలో దిగజారిపోతున్న ప్రమాణాలతోపాటు యువజనలోకం అథఃపతం కాకుండా మనం జాగ్రత్తపడాలి. ఏ సంస్కరణకైనా ప్రథమ ఆవశ్యకత యువజన లోకంలో క్రమశిక్షణ. ఇతరులు విధించిన క్రమశిక్షణకంటె ఎవరికివారు అలవరచుకొన్న క్రమశిక్షణ వాంఛనీయమైనది. బస్సు కోసమో, సినిమాటికెట్టుకోసమో వరుసలో నిలబడటం చాల సులభమైనవిషయంగానే గోచరిస్తుంది. కాని మనలో ఎంతమంది దీనిని నిత్యజీవితంలో ఆచరిస్తున్నారు! జీవితంలో ఒకరంగంలో క్రమశిక్షణఉంటే, ఇతర రంగాల్లోను క్రమశిక్షణ అలవడుతుంది.

ఈనాటి విద్యావిధానంలో కాపీకొట్టడం అనే దురాచారం వేళ్లు నాటుకోబోతున్నదా అను భయం కలుగుతుంది. ఈనాడు కాపీ కొట్టే యువకులు తాము పరీక్ష హాల్లో పర్యవేక్షకులను పేపర్లు దిద్దేవారిని వంచించాము కదా అని సంబరపడి పోవచ్చును కాని తుదకు అటువంటి ఆత్మవంచన వల్ల, వారే చింతించ వలసి

వస్తుంది. కష్టపడి యథార్థమైన కృషిచేసి విజ్ఞానాన్ని సంపాదించక పోతే, ఎటువంటి ప్రయత్నములేకుండ వంచనా శిల్పంతో పొందిన డిగ్రీ వాస్తవ జీవితంలో ఏ విధంగాను ఉపయోగ పడదు. జీవితరంగాలన్నిటిలోను ప్రగతిసాధనకు న్యాయమైన పోటీఉండాలి. ప్రపంచదేశాల మధ్య భారతావని అగ్రస్థానము పొందాలంటే, ప్రజలు న్యాయోచితమైన రీతిని ప్రవర్తించాలి, కష్టపడి పని చేయాలి. జపానువంటి ఒక్క చిన్న దేశం పెద్దపెద్ద దేశాలతో సమానమైన ప్రగతిని సాధించడమేకాదు కొన్ని విషయాల్లో వాటినికూడ అధిగమించిపోయిందంటే అచ్చటి ప్రజల స్వచ్ఛంద క్రమశిక్షణ, చిత్తశుద్ధి, కష్టపడి పనిచేయగల శక్తి అందుకు కారణం. పూర్వం భారతదేశము కుటీర పరిశ్రమలకు పేరెన్నికగన్న దేశం. తన కళాకారుల, నైపుణ్యానికి గర్వపడిన దేశం. కాని ఈనాడు శ్రమలోగల గౌరవం మనలో అనేక మందికి తెలియనేతెలియదు. లేక తెలిసినవారు కూడ దానిని ఉపేక్షిస్తున్నారు. శ్రమలోగల గౌరవాన్ని మన యువజనలోకం అవగాహన చేసుకోవాలి. మానవాళికి ఉపయోగకరమైన ఏ పనీ నీచమైనదని కాని, తక్కువదని కాని మనం పరిగణించకూడదు.

ఈ మధ్య కొందరు విద్యార్థులు అన్నిరకాల రాజకీయ వ్యవహారాల్లోను, సంకుచిత కార్యక్రమాల్లోను పాల్గొంటున్నారు. వారు తమ శ్రద్ధను చదువుమీదే కేంద్రీకరించాలి. తమ చుట్టూ ఉండే అందరు వ్యక్తులమీద అన్ని విషయాలమీద విశాల దృక్పథం కనబరచాలి. భాషాసమస్య కొరకుగాని మరియే ఇతర సంకుచిత విషయం కొరకుగాని విద్యార్థులు తమలో తాము హింసాత్మక పోట్లాటలకు, కొట్లాటలకు దిగకూడదు. దోపిడీలు లాంటి పనులకు పాల్పడకూడదు. ప్రాణహానిని, ఆస్తుల వినాశమును, విద్యా సంస్థలను విశ్వవిద్యాలయాలను తాత్కాలికంగా మూయవలసిన పరిస్థితిని కలుగజేసెడి చర్యలతో ప్రమేయం పెట్టుకోరాదు. ఒకరి నోటినుండి వెలువడే మాటలు, ఒకరు లిఖితపూర్వకముగా వ్రాసిన వ్రాతలు, వారు అనుకొన్న విధంగా వేరొకరికి స్ఫురింపజేయడం భాషయొక్క ముఖ్యోద్దేశము. భాషలన్నిటి ఉద్దేశం అదే అయినప్పుడు, మతాలన్నిటి ఉద్దేశం, మానవశ్రేయస్సే అయినప్పుడు భాషపేర, మతంపేర, ఎందుకీ రగడ? మనం మొట్టమొదట భారతీయ పౌరులం అనే యథార్థాన్ని, ఒకరి దృక్పథాన్ని ఒకరు సహృదయతతో అర్థంచేసుకుంటూ మనలోగల భేదాలను స్నేహ పూర్వకంగా శాంతియుతంగా సర్దుకోవాలనే సత్యాన్ని మరచి పోతున్నాం. పరస్పర సహకారం, సద్భావన, అవగాహనలవల్ల పరిష్కారం కాని సమస్య అంటూ ఏదీ ఉండదు. స్నేహయుత సహజీవనమనేదాన్ని మనం అలవర్చుకోవాలి. దురదృష్టవశాత్తు కొందరు అమాంతంగా నాయకులమైపోదామని అనుకుంటారు. మతంపేర, భాషపేర, తదితర సంకుచిత దృక్పథాలపేర ఉద్రేకాలను రేకెత్తించడానికి, వారు నీచమైన పన్నాగాలు పన్నుతారు. ఇటువంటి సాంఘిక వ్యతిరేకశక్తులకు చెప్పవలసిన విధంగా బుద్ధి చెప్పాలి. ఇటువంటి వారు చూపిన మార్గాన్ని మన యువజనులు అనుసరించడం చాలా ప్రమాదకరం.

సంఘంలో దురాచారాలు పెరిగిపోతుంటే యువకులు చూస్తూ ఊరుకోకూడదు. అరికట్టడానికి శాయశక్తులా ప్రయత్నించాలి. ఉదాహరణకు కంట్రోలు ధరకంటే ఎక్కువ ఇచ్చి ఏ వస్తువును కొనకూడదు. కొరతగా ఉన్న వస్తువుల వాడకము తగ్గించుకోవాలి. అది వీలుకాకుంటే కనీసం వారి అవసరాలకు మించి అటువంటి వస్తువును నిలువ చేయకూడదు. మనకంటె ఎక్కువ అర్హత సమర్థత కలవారికన్న, ప్రాధాన్యత పొందేందుకై మామూళ్లు, లంచాలు ఇవ్వకూడదు. అటువంటి అత్యాచారాలు వారి దృష్టికివస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి, సాక్ష్యము ఇవ్వడానికి సంసిద్ధులు కావాలి. చట్ట రీత్యా నేరాలు ప్రకటింపబడిన చర్యల విషయంలో కూడ అదే రకమైన సహకార దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. మన యువజన లోకంలో ఇటువంటి అలవాటు పెంపొందకపోతే చట్టాలు, నియమాలు, నిబంధనలయొక్క లక్ష్యాలు నెరవేరడం కాని, వాటి ద్వారా సంఘసంస్కరణ జరగడం కాని సాధ్యంకాదు. సామ్యవాద వ్యవస్థానిర్మాణానికి రూపొందించబడుతున్న భూసంస్కరణ చర్యల విషయంలోను, ముమ్ముందు రూపొందించబడనున్న ఇతర చట్టాల విషయంలోను కూడ ఈ మాటే వర్తిస్తుంది. మన నాయకులు కూడా తామేది ప్రబోధిస్తున్నారో, దానినే ఆచరించి, యువకులకు మార్గదర్శకులు అవుతారని ఆశిద్దాం.

ఆదర్శ దీక్ష

ఆదర్శంకోసం కృషిచేస్తూ మరణించడంకన్న మహాభాగ్యం మరొకటిలేదు

— గాంధీజీ

గత సంచిక తరువాయి

సమ్మె ఎందుకు

పువ్వుల చలపతిరావు

మూడవ రంగము

[తెరలేచేటప్పటికి, సమ్మెనాయకుల ఆఫీసు. ఒక టేబిలు, దానికి చుట్టూ నాలుగు కుర్చీలు. కుర్చీలో లావుపాటి, సన్నపాటి నాయకులు నలుగురు కూర్చొని ఉంటారు. టేబిలు మీద మంచి నీళ్ళ గ్లాసులు ఆవిర్లు క్రక్కుతున్న వేడి వేడి టీ కప్పులు నలుగురి ముందు—పళ్లాల్లో ఫలహారాలుంటాయి. మరొక నాయకుడికి కుర్చీ లేక నిలబడేఉండి టేబిల్ పైనున్న ఫలహారాలు పూర్తిచేస్తుంటాడు.

వీరి పేర్లు :— (1) శ్యామలరావు (2) సుబ్బారెడ్డి (3) కిష్టయ్య (4) రాజా చౌదరి (5) వెంకయ్యనాయుడు

కిష్టయ్య :—(ఇడ్లీనంతా చట్నీలో బాగా ముంచుతూ) చెట్నీ బాగుందయ్యా- ఇవ్వాళ. (అమాంతంగా నోట్లో వేసికొని మ్రింగుతాడు.)

సుబ్బారెడ్డి :— దీనిలోకి అలుగడ్డ కూర కూడా బాగానే ఉంది.

శ్యామలరావు :— ఉప్మాలో నెయ్యి కొంచెం యెక్కువగా వేస్తే బాగుండేది. తగలేశాడు ఇవ్వాళ

వెంకయ్య:—ఎప్పుడూ తినడమేనా—సమ్మెగురించి చర్చించేదేమన్నా వుందా ?

కిష్టయ్య ;—తినడమంటావేమిట్రా ! తిండి కలిగితె కండ గలదోయ్ కండగలవాడేను మనిషోయ్ అని గురుజాడవారు చెప్పలేదట్రా ?

వెంకయ్య :—కండ నీకు కాదోయ్—కావలసినది కష్టజీవికి.

రాజాచౌదరి :—చట్నీరుచి పూర్తయితే గాని చర్చలోకి దిగడం అసాధ్యం వెంకయ్య నాయుడూ.

కిష్టయ్య :—అప్పడాల పిండిలాగ సమ్మె సాగుతూనే ఉంది. తిండి సాగుద్దా ? అందినప్పుడు కలిసి కొట్టెయ్యడమే (అటు ప్రక్కగా చూచి) యెవరక్కడ ? (మూర్తి ప్రవేశం)

మూర్తి : ఏం సార్ ?

కిష్టయ్య :—చెట్నీ అయిపోయిందిరా మూర్తీ ? నువ్వు అర్జెంటుగా హోటలుకు వెళ్ళి ఇంకోనాలుగు యిడ్లెన్లు చెట్నీ వేసి— ఎలాగు పట్టుకొస్తావు ? చెట్నీ కోపానిండా వేయించి పట్టుకురా ! (మూర్తి నిష్క్రమించబోతే మళ్లీ వెనక్కి పిలచి) ఇదిగో మూర్తీ ! వుప్మావుంటే అదైనా వేడివేడిగా వుంటే—రెండు ప్లేట్లు పట్టించుకురా.

మూర్తి :—మంచిది సార్

కిష్టయ్య : .మాట, వెళ్లిపోకూ ! ఒక గ్లాసునిండా సాంబారు కూడా పోయించుకొనిరా.

మూర్తి :. హోటలువాడు ఇవన్నీ యివ్వడానికి గొణుక్కుంటున్నాడు సార్

కిష్టయ్య :—(కోపంగా) ఆయ్ ? ఇవ్వనంటే హోటలు—తెల్లవారేటప్పటికల్లా పీకించేస్తానన్నాడని చెప్పు.

మూర్తి :—అలాగే సార్ (నిష్క్రమించబోతే)

కిష్టయ్య :—మాట మాట, వచ్చేటప్పుడు నాలుగు సిగరెట్టు పెట్లు, 5 పాన్లు కట్టించుకొనిరా.

మూర్తి :—మీరేమో యిక్కడ ఘరానాగా చెప్పేస్తారు. అక్కడకు వెళ్ళి అడిగితే, వాళ్ళు లబో్బ అని ఏడుస్తున్నారు సార్

కిష్టయ్య :—ఎందుకురా ఏడ్వడం ?

మూర్తి :—మూడు మాసాల నుంచి వాడుకుంటున్నారట. ఇంత వరకు ఒక్క నయాపైస ఇవ్వలేదని.

కిష్టయ్య :-ఇక్కడ బ్రతకడం ఉద్దేశంలేదా వాడికి ? ఆ సంగతి కనుక్కో ?

శ్యామలరావు :—ఆ గొడవంతా ఎందుక్కాని రేపు సాయంత్రం అణా పైసలతో ఇచ్చేస్తారని చెప్పి ఇప్పుడవన్నీ తీసుకురా. ఆ చేత్తోటే 5 బర్కిలీ పేకెట్లు, రెండు అగ్గిపెట్టెలు కూడ పట్టుకురా.

(రామయ్య కోపంతో ఆవేశ పడుతూ ప్రవేశించి వాళ్లందర్నీ చూస్తూ చట్టున కొద్ది దూరంలో ఆగిపోతాడు)

రాజాచౌదరి :—(తాపీగా) ఎమోయ్ రామయ్యా—అంత అలాగ ఆయాసపడుతున్నావేం ?

రామయ్య ;—ఆయాసంకాదు చౌదరి గారూ ఆవేశం

కిష్టయ్య :—నీకు ఆవేశమా? అదేమిటోయ్! ఉండు ఈ టిఫిన్ కాస్త కానీయ్—తీరుబడిగా కూర్చొని ఆలోచిద్దాం

రామయ్య :—కార్మికుల పొట్టలు లొట్టలవుతూంటే మీ పొట్టలు పెద్దవవుతున్నాయి కదూ? అందుకనే కార్మికుల కష్టాలు కనుపించకుండా పోయాయి.

శ్యామలరావు :—ఇంతకీ మేం తినడం నీకు బాధగా వుందన్నమాట?

రామయ్య :—బాధలనేవి, బాధలను భరించేవాళ్లకు తెలుస్తాయి. భోగాలు అనుభవించే వాళ్లకేం తెలుస్తాయి?

కిష్టయ్య :— ఇదెన్లో వచ్చుడీ ఒక భాగమేనా?

రామయ్య :—లేకపోతే ఏమిటి? దీర్ఘకాల సమ్మె ఫలితంగా కార్మికులు మలమల మాడి నానా బాధలకు గురి అవుతూంటే, ఇక్కడ మీరు సమ్మె ఫండులన్నీ ఖర్చుచేస్తూ కూర్చుంటే, వాళ్ళందరి గతీ ఏం కావాలి?

వెంకయ్య : ఏం కావాలి? ప్రస్తుతం బాధగావున్నా—సమ్మె జయప్రదమైన తరువాత, దాని ఫలితం యావజ్జీవితమూ మీకే కనుపిస్తుంది—రామయ్యా!

రామయ్య :—జయప్రదమవుతుందని భ్రమిస్తున్నారు. అది యెంత మాత్రమూకాదు. దరిద్రదశను దాటి, మరణదశకు వచ్చింది వెంకయ్యగారూ.

కిష్టయ్య :— ఒరేయ్ రామయ్యా! నువ్వే ఇలా దిగజారి పోతున్నా వేమిట్రా? అసలు రామయ్య నీవేనా?

రామయ్య :—ఆ రామయ్య చచ్చిపోయాడు. యీ రామయ్య మరొకడు. సమ్మెను విరమింపజేసి, కార్మికులను ఇప్పటికైనా, బ్రతికి బైట పడేలాగ చేయాలని కంకణం కట్టుకున్నా రామయ్య.

శ్యామలరావు :—ఏమిటేమిటీ? సమ్మె భగ్నం చేసే విషబోధ నీ కెవరు చేశారు బాబూ?

రామయ్య :—విషమ పరిస్థితులే నిజవిషయాలను బోధ చేస్తాయి. ఒకళ్లు బోధ చేయడమెందుకు?

శ్యామలరావు :—ఇంతకీ ఏమంటావు?

రామయ్య:—సమ్మె విరమింప జేయమంటాను.

కిష్టయ్య :—అంత ప్రమాదమేమొచ్చింది?

రామయ్య :—కార్మికులు ఊరు విడిచి చాలా మంది పోతున్నారు మిగిలిన వాళ్ళు చావుకి సిద్ధమవుతున్నారు. దాన్ని తట్టుకోవడం కోసం దోపిడీలకు సిద్ధమౌతున్నారు.

శ్యామలరావు :— నీ మాటలను బట్టి వీటన్నిటికీ, నీవే నాయకత్వం వహిస్తున్నట్టు కనుపిస్తుందే?

రామయ్య :—శ్యామలరావుగారూ? నాయకులమనే అహంభావమే కాని—నిజపరిస్థితులను గమనించే శక్తిలేని వాళ్లు మీరు. అందుకనే మీవంటి వాళ్ళ వెనుక నడిచే ప్రజాసమూహం అనేక చిక్కుల్లో పడి ఉక్కిరిబిక్కిరి కావలసి వస్తోంది.

వెంకయ్య :—యీవేళ నీ యింటి పరిస్థితి మారిపోయిందని, సమ్మెను భగ్నం చేస్తున్నావా?

రామయ్య :—ఇంతకాలమూ ఓపిక పట్టేను మీరు చేస్తున్న నటన మోసం—అంతా ఎప్పుడో కళ్ళతో గమనించాను మీ స్వార్థం కోసం—మీ పదవులకోసం, కార్మిక ప్రాణాల్ని అడ్డు పెట్టుకొని, వారి కష్టాల్ని మీ వినోదంగా చూస్తూ నడిపించే మీ నాయకత్వాన్ని బహిరంగపర్చి సర్వ నాశనం చేయదలచుకున్నాను మీ నాయకత్వ ఫలితంగా నా భార్య పిచ్చిదై పోయింది పిల్లలకు కన్నతల్లి దూరమై పోయింది. కొంత మంది తల్లులకు కన్న బిడ్డలే శాశ్వతంగా దూరమై పోయేరు. ఇక మీ ఆటలు సాగవు సమ్మెను భగ్నం చేసి కార్మికులను స్వేచ్ఛగా పనిలోకి పొమ్మని ప్రచారం చేస్తాను అందరం కలిసి ఇప్పుడే పనిలో ప్రవేశిస్తాము చూస్తూండండి!

కిష్టయ్య :—(కోపంగా లేచి) ఇంతకాలమూ మా పార్టీలో వుండి, లోగుట్టు అంతా తీసుకొని, యీ నాడు నువ్వు మేనేజిమెంటుతో చేతులు కలిపి సమ్మెను భగ్నం చేయాలని చూస్తున్నావా? సరే—నీ సంగతి ఏమిటో మేం చూచుకుంటాము.

(మూర్తి ప్రవేశించగానే అతని చెవిలో ఏదో చెబుతాడు)

మూర్తి :—(ఆఫీసు వెలుపలికిపోయి అక్కడ మూగిన కార్మికులతో) రామయ్య కంపెనీతో కలిసిపోయి, సమ్మెను వెడగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు అని బిగ్గరగ రెండు మూడు సార్లు అరుస్తాడు)

రామయ్య :—కార్మికుడు కష్టజీవి కష్టజీవుల రక్తాన్ని పిండి బ్రతికే రాబందులు—బంధువులుగా మీవంటి నాయకులు తయారవుతారు. కాని మేం ఎన్నటికీకాము ఏ లాలూచి పడినా మీరు మీరు ఒకటై—మా కార్మికుల కంఠాలు కోయవలసిందే కాని మేం మాత్రం కోయలేము. అది మాత్రం గమనించండి. కార్మిక శక్తిని మీరు నీచ పరుస్తే దాని ఫలితం మీరే అనుభవిస్తారు. సమ్మె విరమించి, సంతోషంగా పనులకు వెళ్ళండి అని చెప్తాను (అనుకుంటూ నిష్క్రమించగానే బైటవున్న కార్మికులు అతని పెల బ్రిద్దలు కొడతారు. రామయ్య తల పగిలి పడిపోతాడు. కొందరు కార్మికులు అతనిని యింటికి మోసుకొని వెళ్ళి ఒప్పగిస్తారు.)

రాజాచౌదరి :—దామిట్—కథ అడ్డం తిరిగింది.

శ్యామలరావు :—వాడికి తగిన ప్రాయశ్చిత్తం జరిగింది

కిష్టయ్య :—ఆలస్యం చేస్తే మనం చచ్చేవాళ్లము.

వెంకయ్య :—అవునవును...పళ్ళీ చెట్నీ రుచి చూడ్డం కష్టమయ్యేది.

(తెరపడుతుంది)

నాల్గవ రంగము

(తెరలేచేటప్పటికి సర్వసభ్య సమావేశం. మేనేజ్మెంటు గది మధ్యగా టేబిలు. దానిమీద ఖరీదైన క్లాత్. చుట్టూ కుర్చీలు. కూర్చున్న ప్రతి ఒక్కరి ముందు ఫైల్సు. కూర్చున్న వారు

1. కన్సీలియేషన్ ఆఫీసరు
2. పర్సనల్ మేనేజరు
3. శ్యామలరావు.
4 కిష్టయ్య
5 కాంగ్రెసు లీడరు.
6 లేబరు కమీషనర్
7. ఐ. జి. పి.
8. కలెక్టరు.

పర్సనల్ మేనేజరు:– (కుర్చీలో నుండి లేచి) ట్రేడుయూనియన్ యాక్టు ప్రకారము (1) బ్యాలట్ తీయక పోవడము (2) ముందుగా 21 రోజు నోటీసు ఇవ్వకుండ సమ్మె చేయడము జరిపేరు కనుక, ఇది ఇల్లీగల్ స్ట్రైక్‌గా రుజువయింది. అంతేకాకుడా యీ విధానముకోడ్ ఆఫ్ కాండక్టుకు కూడా విరుద్ధము కనుక నాయకత్వం యీపొరపాట్లను గుర్తించి సమ్మెను విరమించుకొని, పని నడిపించిన తరువాత మాట్లాడాలి అంతవరకు సమ్మెనాయకులదే తప్పని మేనేజ్ మెంటు నిర్నయించు కున్నది. దాని పర్యవసానముగా కార్మికులు బోనసు కోల్పోతారని తెలియ జేస్తున్నాం.

శ్యామలరావు:–ఇపుడు జరుగుతున్న సమ్మె మాయూనియన్ కమిటి విర్నయం ప్రకారము జరుపబడ్డది కాదు. మేనేజ్ మెంటు యొక్క మొండి పట్టుదలను ఆధారం చేసుకొని, కార్మికులే తమంత తాము అకస్మాత్తుగా సమ్మెను జరిపారు. మేనేజ్ మెంటు ఈ విషయములో మరోసారి న్యాయాన్ని పరిశీలించ వలసి వుంటుంది.

లేబరు కమీషనర్:–ఐతే–ఇప్పుడు జరుగు తున్న సమ్మెకు–మీ యూనియన్‌కు యెట్టి సంబంధము లేదన్న మాటేనా?

శ్యామలరావు:–కార్మికులకు, యూనియన్‌కు ఎప్పుడూ సంబంధం వుంది గనుక వారి పక్షాన మేము (కన్సీలియేషన్ ఆఫీసరును చూపిస్తూ) యీకన్సీలియేషన్ ఆఫీసరు గారు ఏర్పాటు చేయించిన యీ సర్వసభ్య సమావేశములో, మాట్లాడడానికి రాగలిగాము. సమ్మె మాత్రము మా యూనియన్ నిర్ణయం కాదు.

లేబరు కమీషనర్:– అలాంటప్పుడు కన్సీలియేషన్ అర్బిట్రేషన్ మొదలగు అవకాశాలెన్నో ఉన్నాయి. ఆర్డినెన్సులు, లేబరుకోడ్‌లు యింకా ఇతరమైన అవకాశాలెన్నో కల్పించబడాయి. అది సాధ్యం కానప్పుడు తిన్నగా మంత్రులను కలిసే అవకాశాలు ఉండి కూడా, మీరు వాటిని వినియోగించుకొనక సమ్మె జరిపించి, యిన్ని రోజులుగా కార్మికులను యిబ్బంది పెట్టి, తీరని నష్టం కలిగించారు. ఇదేనా దేశభక్తి? పైగా ప్రపంచ కార్మికులు అంతా ఒకటే అని కేకలు పెట్టే మీరు యిప్పుడు మీచర్యవల్ల ఇతర పరిశ్రమలన్నీ మూత పడ్డాయి. ఆ కార్మికులకు వేతనాలు లేక అనేక బాధలు పడుతూన్నారు. రవాణా సౌకర్యాలు స్థంభించాయి, ఆహారధాన్యాల సరఫరాలు ఆగి పోయేయి. తిండి గింజలు, దొరక్క ప్రజలు బాధపడుతూ వున్నారు. ఒక చెంపన వుత్పత్తి పెంచి, దేశ సౌభాగ్యానికి పాటు పడాలని, కొలది కాలము క్రితమే జరిగిన సమావేశములో గొంతు చిరిగే లాగ వాదించి, కోడ్ఆఫ్ కాండక్టు పై సంతకాలు చేసిన మీరే యీపనికి తలపడ్డారంటే, మీదేశభక్తి యిదేనా అనే అనుమానానికి మార్గం కల్పించారన్న మాట?

శ్యామలరావు:–మీరు సెలవిచ్చినట్లు కన్సీలియేషన్, ఆర్బిట్రేషన్ అన్నీ వున్నాయి. అంటే "అంగటిలో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని ఉంది" అన్నట్లున్నది మన ప్రభుత్వ విధానము. ఇప్పటికి రెండు సంవత్సరాలనుండి కేసులు కన్సీలియేషన్ లో ఉన్నాయి. అవి యింత వరకు ఎటూ తేలకుండా ఆకుటుంబాలు మాడుతున్నయి. ఇక పరిష్కారమైన కేసులు చుద్దామంటే, వాటిని మేనేజ్ మెంటు యింతవరకు అమలు జరుప లేదు. ఈ విషయము కన్సీలియేషన్ ఆఫీసరుకు, లేబరు కమీషనరుకు చివరకి మంత్రులకు కూడ వ్రాసి పంపాము మూడు మాసముల తరువాత, మీ ఉత్తరాలు అందేయి. వాటి గురించి ఆలోచిస్తామని సమాధానాలు వచ్చేయి. ఈ విధంగా ఎంత కాలము అవస్థపడాలి కార్మికులు? ఎంత కాలము మీచుట్టూ తిరగాలి ఈ నాయకత్వము? పైగా యీ యాజమాన్యం చెబుతుంది గదా, మనం వారాని కొక పర్యాయము కూర్చుని, ముఖాముఖి చర్చలు జరిపి పరిష్కారము చేసుకుందామని, అందుకు కూడా సరే నన్నాము వారాని కొకసారి కాదు గదా మూడు మాసములకైనా వారి దర్శనము లభించడం లేదు

లేబరు కమీషనరు:–అయితే మీప్రోత్సాహము తోనే యీసమ్మె జరిగిందన్న మాట?

శ్యామలరావు:–అందుకు కారకులము మా యునియన్ కమిటీ కాదని ముందే మనవి చేశాను.

పర్సనల్ మేనేజరు:–మీరన్న మాటే యదార్థమైతే (ఫైలునుండి కరపత్రాన్ని తీసి) ఈ కరపత్రము మీకమిటీ నిర్నయం ప్రకారము పంచి పెట్టబడింది కాదని మీరు రుజువు చేయగలరా? (ఆ కరపత్రాన్ని లేబర్ కమీషనర్ కిస్తాడు.)

కిష్టయ్య:–(లేచి) మేనేజ్ మెంటుతో ఎన్ని సార్లు సంప్రదించినా తగిన ఫలితం పొందలేక పోవడంచేత ఈ కరపత్రం వేయవలసివచ్చింది (కూర్చుంటాడు.)

పర్సనల్ మేనేజరు:–కరపత్రం మీరు వేసిందే కాని–సమ్మెమీరు చేయించిది కాదని చెబుతున్నారు. అంతేగా? [కన్సీలియేషన్ ఆఫీసరు తలవూపుతూంటాడు.]

కాంగ్రెసు లీడరు:–వ్రాతపూర్వకముగా హెచ్చరించి నడుపు తున్న సమ్మెగురించి, ఇప్పుడు సమ్మె జరుపు తున్నది. మీరు కాదనే స్థితికి దిగజారిపోయి కార్మికులదే తప్పని. వారిమీద త్రోసివేస్తారెందుకు?

పర్సనల్ మేనేజరు:– ఈ సమ్మెకు కారకులు యూనియన్ వాళ్లేనని రుజువు చేయడానికి ఇంకా అనేక ఆధారాలున్నాయి.

యిప్పటికైనా సమ్మె విరమింపజేసి శాంతి పరిస్థితులు కల్పించి పనిలోకి వెళ్ళేలాగ చేయడానికి ఒప్పుకుంటారా?

శ్యామలరావు: సమ్మె మా చేతిలో నుండి జారిపోయింది. మా మాటలు వినే పరిస్థితులలో కార్మికులు లేరు

కాంగ్రెసు లీడరు: అమాయక ప్రజల్ని ఆవేశ పూరితుల్ని జేసి రెచ్చగొట్ట డంచేతనైనది కాని, శాంతి వైపునడపించటం మాత్రం చేయలేమంటారు. సమ్మె కూడదని చెప్పిన వారిని దేశ ద్రోహులు గాను కార్మిక ద్రోహులు గాను చిత్రించి వాళ్ళను కొట్టించడము చేతనౌతుంది? మేనేజ్‌మెంటుతో పాటుగా అగ్రిమెంట్లు చేసుకోవడం చేతనౌతుందా? ఇదేనా మీ కార్మిక జనోద్ధరణ?

కన్సిలియేషన్ ఆఫీసరు: (సంబంధిత ఫైల్సులోని కాగితాలు ఒకసారి చూచి) యింత వరకు జరిగిన వాదనలను బట్టి ఇప్పుడు జరుగుతున్న సమ్మె ఇల్లీగల్ స్ట్రైకు అని నా నిర్ణయాన్ని తెలియ జేస్తున్నాను.

(S. I. హడావిడిగా ప్రవేశించి I. G. P. కి శాల్యూట్ చేసి)

S. I.: కార్మికులు దాడి చేయడం కోసం ఆఫీసు ముట్టడిస్తున్నారు సార్!

I. G. P.: (తెల్లకాగితం తీసి) కలెక్టరు గారూ............

కలెక్టరు: (ఆ కాగితాన్ని తీసుకొని, జేబులో నుండి పెన్ను తీసి వ్రాస్తాడు. (తరువాత పైకి చదివి వినిపించి సంతకం చేసి I. G. P. కి ఇస్తాడు.) శాంతి భద్రతలకోసం 144వ సెక్షన్ వుపయోగించి, గుంపును చెదరగొట్టుటకు రక్షణ శాఖకు అధికార మిస్తున్నాను. I. G. P. అది తీసికొని బైటకు వెళ్తుండగా వెనుకనే S.I కూడా నిష్క్రమిస్తుండగా లైట్లు ఆరిపోతాయి. బయట విజిల్ S.I ఊదుతుంటాడు. ప్రజలగోల, నినాదాలు, భయంకరమైన అరుపులు, తలుపులు బద్దలుకొడుతున్నట్టు వినిపిస్తుంటాయి.

I. G. P.:– డిస్పర్సు–డిస్పర్సు డిస్పర్సు (కల కలం మరింత యెక్కువ అవుతుంది పోలీసులు విజిల్సు. ప్రజలగోల. భయంకరంగా వినిపిస్తుంటాయి. ఇంతలో ఆవేశ పూరితంగా పిచ్చిది రాగడాతో అగదిలోకి ప్రవేశిస్తుంది. అప్పటికే భయ భ్రాంతులై చెంపర వంపరగా నిలబడిన ఆఫీసర్లంతా పిచ్చిదాన్ని చూస్తుంటారు.)

పిచ్చిది:– (రాగడా ముందుకుచూపి) ఈ అశాంతికి కారకు లెవరు? చెప్పండి? చెప్పండి? ఇప్పుడు చెప్పండి. భయంకరమైన యీ విప్లవ విషమ పరిణామానికి గురి అవుతున్న కార్మికులకు రక్షణ ఏది? శాంతి ఏది? లాఠీ దెబ్బలకు తలలు పగిలి, కాళ్ళు చేతులు విరిగి అంగ విహీనులైన వారికి ముందు ముందు వారి శాంతికి, రక్షణకు ఎవరు కర్తలవుతారు? నాయకత్వాల పేటకోసం. పార్టీల ఆకర్షణ కోసం ఈ కార్మికులను వుపయోగించుకొని బతుకుతున్న మీ పంథాలో సత్యం ఎక్కడుంది? రక్తాన్ని కళ్ళచూచేది ఎవరు? యాజమాన్యానికి కష్ట జీవికి మధ్య ఎల్లప్పుడు ఘర్షణ జరగడంలో గల మూలకారణం ఎక్కడుంది? తమదెమటతో వుత్పత్తి చేసే వుత్పత్తి సస్యవు తనదేననే శక్తిపంచ మైన నమ్మకం కార్మికులకి కలగక పోవడం, ఉత్పత్తి అవుతున్న ప్రతి వస్తువూ రక్షజీవుల మీదనే ఆధారపడి వుందనే నిశ్చయము యజమానులకు లేక పోవడమే యీ అశాంతికి కారణం (భయంకరంగా నవ్వి) తెలిసిందా? తెలిసిందా? (ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తు టూ) ఇప్పటికైనా నాయకు ల్లారా! కళ్ళుతెరవండి యాజమాన్యం నిర్వహిస్తున్న పెద్ద ల్లారా మేల్కొండి. మీరంతా మేలు కోవడమే ప్రగతికి క్షేమం. అప్పుడే కార్మిక శక్తికి శాంతి సౌఖ్యం లభిస్తాయి. అంతవరకు ఈ ఘర్షణ తప్పదు యీ సమ్మెలు తప్పవు. ఈ అశాంతి తప్పదు కార్మికుల కడ గండ్లు ఇప్పుడైనా గమనించి యాజమాన్యంలో కార్మికునికి భాగ స్వామ్యం యివ్వండి. అంత వరకు శాంతిలేదు సమ్మెలు తప్పవు. ఆకలి తప్పదు ఉద్రేకం తప్పదు ఈర్ష్యా అసూయలు అడుగంటి పోవు (ఒక్కొక్క అడుగు వెనక్కు వేస్తూ.) దెబ్బలు తిన్న నా కార్మిక సోదరులందరిని రక్షించాలి. నేనుపోయి (ఏడుస్తూ) వాళ్ళరక్తపు మరకల్ని నా పమిట కొంగుతో తుడవాలి. ఆ కార్మికులంతా 'నా బిడ్డలు' ఆ గాయ పడిన వాళ్ళందరికి నేను ఉపచర్యచేయాలి, చేయాలి (అంటూ నిష్క్రమిస్తుంది హడావిడిగ) లైట్లు వెలుగుతాయి. గొడవ అణుగుతుంది, ఒరిగి అంతా ఎవరిస్థానాలలో వారు కూర్చుంటారు. ఆఫీసుప్యూను కాగితం పట్టుకొనివచ్చి శ్యామలరావుచేతి కిస్తాడు. దాన్ని చించి మనసులో చదువుకొని.)

శ్యామలరావు–:(కుర్చీలో నుండి చటుక్కున లేచి) మిగిలిన సమ్మె నాయకు లందర్నీ అరెస్టు చేశారా (క్షణం ఆలోచనలో మునిగి ఉంటాడు).

పర్సనల్ మేనేజరు.– ఇంతవరకు జరిగిన అపార్థమైనసష్టాన్ని దృష్టిలో వుంచుకొని, సమ్మె విరమించడం మంచిదని మేనేజ్‌మెంటు అభిప్రాయ పడుతున్నది. ఏమంటారు? (శ్యామలరావు వైపుతిరిగి)

శ్యామలరావు:— ముందు అరెస్టయిన నాయకుల్ని విడిచిపెట్టే వరకూ సమ్మెమాత్రం కొనసాగుతూంటే వలసిందే. హక్కులమాట అటుంచండి. అరెస్టయిన కార్మిక సోదరులు వెంటనే విడుదల అవ్వాలి. అదే ఇప్పుడు మా ఆశయం.

కన్సిలియేషన్ ఆఫీసరు:—ముందు మీ సమ్మెను విరమించండి తరువాత దాని విషయం ఆలోచిద్దాం.

శ్యామలరావు, కిష్టయ్య: –సరే, సమ్మె విరమింపజేస్తాము.

కన్సిలియేషన్ ఆఫీసరు: –ఆ విధంగా మేనేజ్‌మెంటూ, మీరూ అగ్రిమెంట్లు వ్రాసుకోండి.

పెర్సనల్ మేనేజరు:–కాగితంమీద అగ్రిమెంటు వ్రాసి శ్యామల రావుకు ఇస్తాడు.

శ్యామలరావు:– మంచిది. [క్షణం చదివి సంతకం పెడతాడు. మిగిలినవారు కూడా వరుసగా సంతకాలు పెడుతూండగా తెరపడుతుంది.]

(సశేషం)




తుంగభద్రా తీరంలో నెహ్రూ




గోదావరి తీరంలో నెహ్రూ చితాభస్మం

సోషలిజం ప్రవక్త నెహ్రూ



ఆచరణ కార్యశీలి ఇందిరాగాంధీ

విశాఖపట్నంలో
ఢాకాలో



స్వాతంత్ర్యోద్యమము
తెలుగు నవలా వికాసము

పుల్లాభొట్ల
వెంకటేశ్వర్లు

ఈనాడు విశ్వసాహిత్యమందు వివిధసాహిత్య ప్రక్రియలలో అగ్రాసనాధిపత్యం వహించి అందరి మన్ననలను పొందుతూవున్న ఏకైక సాహిత్య ప్రక్రియ 'నవల' అన్న సత్యం అందరికి తెలిసిందే. ఈ నవలకు వివిధ సంఘాలలో, జాతులలో, దేశాలలో నేడున్న విలువ, పలుకుబడి, ఆదరణ అభిమానం, ప్రచారం, వైవిధ్యసంపద మరియే యితర సాహిత్యప్రక్రియకు లేదని చెపితే అది స్వభావోక్తి అగునేగాని అత్యుక్తి ఎంతమాత్రం కాజాలదు. ఈ విశాల దృక్పథంతో ఈ విషయాన్ని పరామర్శిస్తూ మన భారతీయ భాషలపైన వివిధ ప్రపంచ భాషల ప్రభావం ఎల్లా ప్రసరించిందో క్లుప్తంగా వివరిస్తూ, ఆ దృక్పథంతో మన తెలుగునవల పొందిన క్రమవికాసాన్ని తెలుపుతూ, అది మన జాతీయతను తీర్చిదిద్దటంలో ప్రజా హృదయాలను కదిలించటంలో ప్రవర్తించిన ఉజ్జ్వల పాత్రను పరిశీలిద్దాం.

పారిశ్రామిక విప్లవం విజయవంతమై ప్రపంచమంతా ఏక కుటుంబం అనే భావన, విశ్వాసం ప్రజలలో పాతుకొని పోయింది. పాలకులమధ్య, పాలితులమధ్య గల అంతరం క్రమంగా క్షీణించి పోసాగింది. అన్ని దేశాలలో నిరంకుశ ప్రభుత్వ విధానాలను, పీడిత ప్రజల కష్టనిష్ఠూరాలను ఎదిరిస్తూ ప్రజా ఉద్యమాలు బయలుదేరి ఘనవిజయాలను సాధించ మొదలిడినాయి. తత్ఫలితంగా 1857వ సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగింది. అది విజయవంతం కాకపోయినా దేశ ప్రజలలో జాతీయతాభావం పెంపొంది స్వాతంత్ర్యేచ్ఛ ప్రబలింది. దానితో ఆసేతుశీతనగం జాగృతమైంది. 1885వ సంవత్సరంలో భారతజాతీయ కాంగ్రెసు మహాసంస్థ స్థాపింపబడింది. అంతకు పూర్వమే తెల్లదొరలు ఈ దేశంలో ఆంగ్ల పాఠశాలలను విశ్వవిద్యాలయాలను స్థాపించి ఆంగ్ల విద్యను ప్రజలలో విరివిగా ప్రచారంచేస్తూ తమ ప్రభుత్వాన్ని సుస్థిరం చేసుకోవటానికి బహుముఖాలుగా కృషిచేయ నారంభించారు.

రాజారామ మోహనరాయలు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, సర్ సయ్యద్ అహమ్మద్, కందుకూరి వీరేశలింగం వంటి ప్రగతి గాములు, సంస్కర్తలు ప్రజలలో ప్రబలివున్న దురాచారాలను మాన్పడానికి ప్రయత్నం చేయబోదగారు వారికృషి కొంతవరకు ఫలించింది. అంతేగాక ఆంగ్లవిద్యా ప్రభావంగూడ మనపైన ప్రసరించి, వారివలె మనంకూడ సర్వ స్వతంత్రులం కావాలనే ఆకాంక్ష, జాతీయతాభావం ప్రబల సాగింది. ఎన్నో విధాలైన నూతన సాహిత్య ప్రక్రియలు ఫ్రెంచి, జర్మని, అమెరికా రష్యా, జపాను బ్రిటన్ మొదలైన దేశాలనుండి దిగుమతియై, మనదేశీయ సాహిత్యంలో ప్రవేశించి బహువిధమైన నూతన సంచలనాన్ని కలిగించటానికి దోహదం చేశాయి.

నూతన భావ విలసితులైన కవులు, రచయితలు నవల, కథ, కథానిక, నాటిక, నాటకం, ఖండకావ్యం మొదలైన నూతన సాహిత్య ప్రక్రియలు చేపట్టి మన సాంఘిక, సాంస్కృతిక



గిడుగు

వైజ్ఞానిక, ఆర్థిక, రాజనైతిక, పరిస్థితులకు మన జాతీయ సమస్యలకు అధిక ప్రాధాన్యత నిస్తూ తదనుగుణమైన ఇతివృత్తాల్ని కల్పించి, మృదు మధురమైన రీతిలో సర్వప్రజలకు అందు బాటులో వుండేట్లు రచనలు చేస్తూ, ప్రజలలో దేశభక్తిని, జాతీయతను రేకెత్తించే విధంగా ఉత్తమ రచనలు చేయసాగారు.

భారతదేశంలోని ఇతర ప్రాంతాలన్నింటికన్నా ముందు జాగృతమై అన్నిరంగాలలోను తదితర ప్రాంతాలకు నాయకత్వం వహించి, మార్గ దర్శకత్వం నెరపినది వంగరాష్ట్రం. అక్కడ బంకించంద్రుడు, విశ్వకవి ఠాకూర్, శరత్‌బాబు మొదలైన ప్రముఖ జాతీయ రచయితలంతా ప్రజలలో నూతనంగా వెల్లివిరసిపోతున్న జాతీయ భావాలకు, స్వాతంత్ర్యపిపాసకు దర్పణంగా భాసించేట్లు నూతన పద్ధతుల్లో మన జాతీయ జీవనానికి అనుగుణంగా కథలు, నవలలు, నాటకాలు, నాటికలు, ఖండకావ్యాలు విరివిగా వ్రాసి ప్రజలను ఉత్తేజ పరచ సాగారు.

వంగరచయితలు 'నవల' ముఖ్యంగా జాతీయ జీవనాన్ని, జాతీయసమస్యలను, సంప్రదాయాలను, నాగరికతా వైభవాన్ని, కార్మిక కర్షకోద్యమాలను, రాజకీయ, సాంఘిక పరిస్థితులను, యథాతథంగా చిత్రించి చూపటానికి తగిన సాహిత్య ప్రక్రియ అని గ్రహించుటే గాక, అది అంతకుముందే ప్రపంచ సాహిత్యంలో ఘన విజయాన్ని సాధించి ప్రజాహృదయాలలో ఉన్నత స్థానాన్ని ఆక్రమించి ఉన్న దనే మహత్తర సత్యాన్ని గ్రహించి, ఆ ప్రక్రియనే చేపట్టి గొప్ప రచనలు చేయసాగారు. వారి మహత్తర కృషి ఫలించింది. బంకిం చంద్రుడు ఆనందమఠం, దేవిచౌధురాణి, సీతారాం; ఠాగూరు గోరా, నౌకాభంగం, శరత్‌బాబు శ్రీకాంత్, శేషప్రశ్న, గృహదహనాలు వంటి ప్రముఖ నవలలు ప్రజలను అధికంగా ఆకర్షించి ఉత్తేజ



కొమర్రాజు

పరచ సాగాయి. ఆ మూర్తిత్రయం మన జాతీయ భావాలకు, అక్షర రూపంలో నివాళులర్పించి ప్రజా ఉద్యమాలకు, దేశభక్తికి అధిక ప్రాధాన్యత నిస్తూ రచనలు చేసి తదితర దేశీయ భాష రచయితలకు మార్గదర్శకులైనారు.

అలాగే హిందీ భాషలో భారతేందుహరిశ్చంద్ర, ప్రేంచంద్; ఉరుదూ సాహిత్యంలో నజీర్ అహమ్మద్; మరాఠీలో హరినారాయణ ఆప్టే; ఓఢ్రసాహిత్యంలో ఫకీర్ మోహన్, గోపీనాథ్ మహంతి కామాచరణ మహంతి; మళయాళంలో కేరళవర్మ, సి.వి రామన్ పిళ్లె, కెయం ఫణిక్కర్, తమిళంలో వేదనాయకం పిళ్లె, పి. ఆర్. రాజమయ్యర్, సుబ్రహ్మణ్య భారతి; తెలుగు సాహిత్యంలో వీరేశలింగం, చిలక మర్తి మొదలైన మహా మహులంతా ఈ నూతన సాహిత్య ప్రక్రియల ద్వారా ప్రజాసమస్యలను ఇతివృత్తాలుగా స్వీకరించి, వాటికి అధిక ప్రాధాన్యతనిస్తూ, వాటిని హృదయంగమంగా చిత్రిస్తూ గొప్పనవలలు సృష్టించారు.

మన తెలుగు నవలలపైన పాశ్చాత్య రచయితల రచనల ప్రభావమేగాక, వంగ, మహారాష్ట్ర, కన్నడ, తమిళ, ఉరుదూ రచయితల ప్రభావంగూడ కొంత ప్రసరించింది గనుక ఆ విషయాన్ని కొంత తెలిపాను. అలాగే మన సాహిత్యం గూడ ఇతర సాహిత్య ప్రక్రియల పైన ఎంతో ప్రభావాన్ని కలిగించింది.

ప్రతి నూతన సాహిత్య ప్రక్రియ పైన, ఇతర భాషా సాహిత్య ప్రభావం ఉండటం సహజమనే సంగతి అందరికీ తెలిసిందే గనుక, ఆ యా భాషల రచనల ప్రభావంతో, మన తెలుగు నవల పొందిన క్రమవికాసం ముందు తెలుసు కోవటం అవసరమని భావించి ఆ విషయాన్ని క్లుప్తంగా మీముందుంచాను.

''నవల' అనేది 'మనోరంజిత అతి విచిత్ర, వాస్తవికత,' అను త్రిగుణాలను కలిగివుండి యథార్థజీవిత చిత్రణం మనమనో నేత్రాలకు గోచరించేట్లు భాసింపజేయగల మహత్తర గద్యకావ్య ఖండిక గనుక ఇది సర్వ ప్రజలను వయోభేదం, ప్రాంతీయభేదం లేకుండ ఆకర్షించగలిగి, అందరికి ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ప్రసాదించ గలిగింది. ఈ నవలా సాహిత్య ప్రక్రియ ప్రధానాశయం, దాని పరమావధి "సమగ్ర మానవజీవిత చిత్రణమే" గనుక అది సర్వులను అచిరకాలంలోనే ఆకర్షించి, ఉత్తేజపరచ గలిగింది. కనుకనే ఈ నవలా రచయితలు, ఈ నూతన సాహిత్య ప్రక్రియద్వారా మంచి ఫలసాయాన్ని తీసి అందరికీ పంచిపెట్టి, అందరి మెప్పు పొంద గలిగారు. ఈ దృష్టితో, ఈ దృక్పథంతో తెలుగు నవల పొందిన క్రమవికాసాన్ని చర్చించటానికి, యింత వరకు వెలువడిన నవలలను ఈ క్రింది విధంగా వర్గీకరించి, అసలు విషయాన్ని వివరిస్తాను.

వస్తువు లేక ఇతివృత్తాన్ననుసరించి నవలలు :

(1) అపరాధ పరిశోధక నవలలు (2) సాంఘికనవలలు (3) రాజకీయ నవలలు (4) చారిత్రాత్మక నవలలు (5) పౌరాణిక నవలలు

రచనా ప్రక్రియ ననుసరించి నవలలు :

(1) ఘటనా ప్రధానాలు (2) కౌతూహలం ప్రధానాలు (3) శీల ప్రధానాలు (4) సంఘ చిత్రణ ప్రధానాలు (5) ఐతిహాసిక ప్రధానాలు (6) మనః ప్రవృత్తి నిరూపణ ప్రధానాలు (7) నిర్దుష్ట ప్రయోజనాన్ననుసరించిన నవలలు (8) పౌరాణిక సంబంధాలు (9) ప్రబంధ నవలలు (10) చలనచిత్ర సంభాషణలతో నిండిన నవలలు (11) లేఖా రూపక నవలలు (12) డైరీల పద్ధతిలో నడచిన నవలలు (13) పరిస్థితుల ప్రభావాన్ని చిత్రించే నవలలు.

వస్తు పోషణ ననుసరించి నవలలు :—

(1) ఐతిహాసిక పద్ధతి (2) ఉత్తమ పురుషలో నడిపే పద్ధతి (3) లేఖా పద్ధతి.

పైన వివరించిన వర్గీకరణ ననుసరించి మన నవలలన్నీ ఏదో ఒక రూపంలో వ్రాయబడుతున్నాయి.

నవలా కారుడు ఎక్కువ అప్రమత్తతతో ప్రవర్తించి, రచనా వ్యాసంగం సాగించవలసి ఉంటుంది. అతడు తన రచనా సంవిధానంలో చూపే శ్రద్ధను బట్టి, ప్రదర్శించే విజ్ఞతను బట్టి విజయం సమకూరుతుంది. గనుక అతని బాధ్యతలు, విధులు అనన్య సామాన్యమైనవని మనం అంగీకరించక తప్పదు.

నవల పెక్కు విషయాలతో నిండిన సమాహారమనే సంగతి సర్వులకు విదితమైన సంగతే. దాని పరిధి విశాలం—అతి గంభీరం.

ఇట్టి విశాల పరిధితో నిండిన నవలను రచియించేప్పుడు నవలాకారుడు ఎక్కువ అప్రమత్తుడై తన బాధ్యతలను గమనించి మెలగవలసి వుంటుంది. అతడు తన బాధ్యతలు, విధులు గుర్తెరిగి రచన చేయవలసి వుంటుంది. చిత్రకారుడు చిత్రాలను చిత్రించేప్పుడు ఎలాంటి శ్రద్ధను దూరదృష్టిని, కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడో, అట్టిదానినే, అంతకన్నా నేర్పుతో, ఓర్పుతో యీ నవలా రచయిత చూపినప్పుడే ఆ రచన సర్వకాలీనమై, సర్వజనామోదమై భాసించి, అందరి మెప్పులను అందుకోగలుగుతుంది. ఈ విశాల దృక్పథంతో తెలుగు నవల నడచిన తీరు తెన్నులను నిరూపిస్తూ మన జాతీయతను అది ప్రతిబింబింపజేయటానికి తోడ్పడిన విధానాన్ని నిరూపిస్తూ, స్థాలీపులాక న్యాయంగా, మన తెలుగు నవల ఈ గడ్డపైన అవిర్భవించిన నాటి నుండి, నేటి వరకు పొందిన క్రమ వికాసాన్ని, అది మన జాతీయత జీవన వికాసానికి, స్వాతంత్ర్య సిద్ధికి తోడ్పడిన పద్ధతిని నిరూపిస్తూ దాని క్రమ వికాస చరిత్రను కొంత సంగ్రహంగా వివరిస్తాను.

తెలుగు దేశంలో ఈ నవలా సాహిత్య రచనా ప్రక్రియకు బీజావాపం చేసి దాని విస్తృతికి, వికాసానికి, అది బహుజనాదరణ పొందటానికి అవిరళంగా కృషిచేసి దాని ప్రగతికి తోడ్పడిన మహాపురుషుడు, నవ యుగాంధ్ర సాహిత్య నిర్మాత, గద్య తిక్కన బిరుదాంకితుడైన వీరేశలింగం పంతులు.



చిలకమర్తి

వీరేశలింగం తెనుగు నాట ఆనాడు నాటిన చిన్న మొక్క దినదినాభివృద్ధినంది నేడు మహావృక్షమై, పుష్పించి, ఫలించి సర్వాంధ్ర ప్రజల మన్ననలకు పాత్రమై అందరిని ఆనంద సముద్రంలో ఓలలాడించింది. ఆ దివ్య సౌరభపు గుబాళింపు యావదాంధ్రులను తన్మయత్వంలో ముంచెత్తుతూ, మహదానందాన్ని ప్రసాదిస్తోంది.

వీరేశలింగం కన్న ముందే 1867వ సంవత్సరంలో కొక్కొండ వెంకటరత్నం 'మహాశ్వేత' అను నవలను రచించినట్లు ఆయన జీవిత చరిత్రవల్ల మనకు విశదమౌతుంది. అలాగే 1872వ సంవత్సరంలో నరహరి గోపాలకృష్ణమ్మచెట్టి 'శ్రీ రంగరాజ చరిత' అనే నవలను వ్రాసేడు. ఈ నవలాద్వయం నామ మాత్రావశిష్టంగానే మిగిలిపోయాయి. మహాప్రతిభా సంపన్నుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన వీరేశలింగం వ్రాసిన 'రాజశేఖర చరిత్ర' కు ప్రథమ నవలా గౌరవం, ఆయనకు ప్రథమ నవలా రచయితగా అగ్రతాంబూలం దక్కింది. ఈ రాజశేఖర చరిత్ర పంధొమ్మిదవ శతాబ్దపు ఆంధ్ర సమాజ ప్రతిబింబమై వర్ధిల్లింది. ఈ నవల యందలి నీలాద్రిరావు, బైరాగి సుబ్రహ్మణ్యం, కృష్ణ గజపతి మొదలైన వారంతా నాటి తెలుగు కుటుంబాలలో అందరికి సుపరిచితులై, సర్వసాధారణంగా అందరికి కనిపించే వ్యక్తులే. ఇట్టి భిన్న ప్రవృత్తులతో నిండిన వ్యక్తులను, వారి జీవితవిశేషాలను వివరించే నవలే ఈ రాజశేఖర చరిత్ర.

పంతులుగారు ఈ రాజశేఖర చరిత్ర వ్రాయుటే గాక, తెలుగు నాట నవలా రచన విరివిగా సాగాలనే తలంపుతో 1893 వ సంవత్సరంలో 'చింతామణి' అనే మాస పత్రికను స్థాపించి, ఆ పత్రిక ద్వారా ఉత్తమ తెలుగు నవలలకు బహుమతులను ప్రసాదిస్తూ, రచయితలను ప్రోత్సాహించటమేగాక తెనుగునాట ఆ నూతన సాహిత్య ప్రక్రియ వికాసానికి ఎంతో తోడ్పడ్డారు. ఆ పోటీలలో పెక్కు బహుమతులను పొంది, ఎన్నో నవలలు వ్రాసినఘనుడు చిలకమర్తి లక్ష్మీనరసింహం. ఈయన వ్రాసిన రామచంద్ర విజయం, అహల్యాబాయి, కర్పూరమంజరి మొదలైన నవల లన్నీ పైన నిర్వహింపబడిన పోటీలలో ప్రథమ, ద్వితీయ బహుమతులను

పొంది బహు జనాదరణలను పొందినవే. ఈయనతో పాటు పోటీలలో పాల్గొని బహుమతులను సంపాదించిన ప్రముఖులు గోటేటి కనకరాజు, ఉేకుమళ్ల రాజగోపాలరావు, ఖండవల్లి రామచంద్రుడు, కూనపులి లక్ష్మీనరసయ్య మొదలైన వారు గలరు వీరంతా తొలిదశలోవున్న మన తెలుగు నవలా వికాసానికి, ఎన్నో విధాలుగా తోడ్పడి, ఆ నూతన సాహిత్య ప్రగతికి ఎంతో కృషి సలిపివున్నారు.

చిలకమర్తి 'రామచంద్ర విజయం' ఆ నాటి సాంఘిక నవలలకు మకుటం. హేమలత, అద్వితీయమైన చారిత్రిక నవల ఈ నవలాద్వయం ఆంధ్ర నవలా సాహిత్యానికి మణిపూసల వంటి. ఉత్తమ రచనలు. అవి రెండూ తెనుగు జీవితానికి సన్నిహితంగా వుండి, అందరి మన్ననలను పొందిన ఉత్తమ రచనలు.

మొత్తంమీద కందుకూరి రాజశేఖర చరిత్ర, చిలకమర్తి రామచంద్ర విజయం రెండున్నూ పంధొమ్మిదవ శతాబ్దమందలి ఆంధ్రదేశపు ప్రజాజీవితాన్ని, ఆచార వ్యవహారాలను, నాగరికతా వైభవాల్ని, మూఢనమ్మకాల్ని విద్యావైదుష్యాల్ని తేటతెల్లం చేస్తున్నాయి.

కందుకూరి, చిలకమర్తి ఇరువురు పందొమ్మిదవ శతాబ్దపు నవలా సాహిత్య చరిత్రలో నవయుగోదయసృష్టికి నాందీ ప్రస్తావన సలిపి, మార్గదర్శకులై ప్రవర్తిల్లేరు. ఆ ఇరువురు ఈ నూతన సాహిత్య ప్రక్రియలో పసిడి పంటలను పండించి, ఆంధ్రమహాజనుల భాగ్యోదయానికి, సుప్రభాత గీతికలను పాడిన దివ్య పురుషులని, తేజోమూర్తులని చరిత్రకారుల నిర్ణయం.

ఈ శతాబ్దంలో సాంఘిక, చారిత్రిక నవలలతోపాటు, కొన్ని అపరాధపరిశోధక నవలలుగూడ వెలువడ్డాయి. అవన్నీ ప్రత్యక్షంగానో,


బుచ్చిబాబు

పరోక్షంగానో, ఇరువదవ శతాబ్దపు మన తెలుగు నవలా వికాస ప్రగతికి జాతీయ భావనా సుస్థిరతకు, దేశ భక్తికి ఎంతగానో తోడ్పడి, మన నవలా చరిత్రలో ఒక స్వర్ణయుగాన్ని నిర్మించటానికి హేతుభూతములై వర్ధిల్లాయి.

మహారాష్ట్ర, వంగసాహిత్యాలతో ప్రభావితుడైన కొమర్రాజు లక్ష్మణరావు 1906 వ. సంవత్సరంలో విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను స్థాపించి, ఆంధ్రదేశం నాలుగు చెరగుల్లోను విజ్ఞాన చంద్రికలను వెదజల్లాడు-ఆంధ్ర గ్రంథమాల పక్షాన వెలువడిన ఉత్తమ నవలలకు ఐదువందల రూపాయల బహుమతిని ప్రసాదిస్తూ, తెలుగు నవలా ప్రగతికి ఆయన ఎంతో దోహదం చేశారు. ఈ గ్రంథమాల పక్షాన భోగరాజు నారాయణ మూర్తి 'విమలాదేవి' ఆంధ్ర రాష్ట్రం, అల్లాహో అక్బర్; దుగ్గిరాల రాఘవ చంద్ర సచ్ఛాస్త్రి 'విజయ నగరసామ్రాజ్యం; ఏ. వి. నరసింహం పంతులు 'పాతాళ భైరవి' వంటి ప్రథమ శ్రేణి నవలలెన్నో వెలువడ్డాయి.

అద్దేపల్లి లక్ష్మణస్వామి రాజమహేంద్రవరంలో 'సరస్వతీ' గ్రంథమాలను స్థాపించి నవలా ప్రచారానికెంతో కృషి సలిపారు. దీని పక్షాన ఇతర భాషల నుంచి అసంఖ్యాకంగా అనువాద నవలలు వెలువడ్డాయి స్వతంత్ర రచనలు స్వల్పంగా వచ్చాయి. జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తిఎన్నో అపరాధ పరిశోధక నవలలు బెంగాలీనుండి అనువాదం చేశాడు; ప్రభాతకుమార్ ముఖోపాధ్యాయ్ రచించిన 'కుంకుమ భరణి' అనే నవలను స్వామీ శివశంకర స్వామి వాడుక భాషలోకి అనువాదం చేసి ఆంధ్ర భారతికి చిరస్మరణీయమైన సేవ చేశారు.

అలాగే దేవేంద్రనాథ్‌పాల్ వంగభాషలో వెలువరించిన 'మొగలాయి దర్బార్' అనే నవల నాలుగు భాగాలను, మొసలికంటి సంజీవరావు తెనుగు చేశారు. ఇది జహంగీర్ పాదుషా కాలపు రాజనీతి చరిత్రతో నిండిన నవల.

చిత్రాడలో చెలికాని సుబ్బారావు 'రామవిలాస' గ్రంథమాల అనే పేరుతో ఒక సంస్థను నెలకొలిపి కొన్ని నవలలు ప్రకటించి, ఈ నూతన సాహిత్య ప్రక్రియ ప్రగతికి, తోడ్పడిన మూల స్తంభాలలో ఒకడై వెలుగొందాడు వంగూరి సుబ్బారావు "ప్రభాతం" గ్రంథమాల పక్షాన వెలువడ్డ వాటిలోకెల్ల శ్రేష్ఠమైంది. ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రసాహిత్య చరిత్ర ఇందలి ప్రధాన ఇతివృత్తం. ఇది ఆనాటి ఉత్తమోత్తమ నవలల్లో ఒకటై రాణించింది.

ఆంధ్ర విశారద తాపీ ధర్మారావు బరంపురం నుండి 'వేగుచుక్క' గ్రంథమాల పక్షాన 'కాంగ్రెస్సు రాణి' 'పొద్దుపొడుపు' వంటి ఉత్తమ శ్రేణి నవలలను ప్రకటించి, ఈ భాషావాఙ్మయానికి ఎనలేని సేవలను గావించారు.

1908వ సంవత్సరంలో ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఉద్యమం బయలుదేరింది. ప్రతి సంవత్సరం కాంగ్రెసు వార్షిక సమావేశాలు ఏర్పాటుచేసి, దాని ప్రాధాన్యతను వివరిస్తూ ఉపన్యా

సాలు చేయసాగేరు. తెలుగు రచయితలు ఆంధ్రత్వాన్ని ప్రతిబింబింప జేస్తూ రచనలు చేసేరు.

1914_1918 సంవత్సరాల మధ్య ప్రపంచ ప్రథమ సంగ్రామం జరిగింది. 1919లో జరిగిన జలియన్ వాలాబాగ్ దురంతాలు చౌరాచౌరా-చంపారన్ సత్యాగ్రహోద్యమం అశేష భారత ప్రజానీకాన్ని ఆకర్షించి దేశంలో ఒక విధమైన సంచలనాన్ని కలుగజేశాయి.

1920 వ సంవత్సరంలో మహాత్మా గాంధీ భారత స్వాతంత్ర్య మహోద్యమానికి సారధ్యం వహించి, సత్యాహింసలనే నూతనాస్త్రాలతో ప్రజా ఉద్యమాన్ని విజృంభింప జేశారు. ఆయన ఈ నూతనాయుధాలతో స్వాతంత్ర్య పాంచజన్యాన్ని పూరించి, జాతీయోద్యమానికి, నూతన స్వరూపాన్ని ప్రసాదించారు. మానవసేవయే మాధవసేవని, పీడిత ప్రజలకు, సమాజంలో వెనుకబడ్డ వారికి యధోచితంగా ప్రతి వ్యక్తి తోడ్పడాలని ప్రబోధం చేయసాగారు. హరిజనులను, గిరిజనులను, స్త్రీలను ఉద్ధరించినప్పుడే మన సమాజం బాగుపడుతుందని అపుడే మనం పర ప్రభుత్వాన్ని ఎదిరించగలమని ఆయన నొక్కి వక్కాణించారు. మహాత్ముడు సత్యాగ్రహోద్యమాన్ని, సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించి ప్రజలలో నూతన చైతన్యాన్ని కలిగించి, పాలకులకు ప్రక్కలో బల్లెం అయినాడు. దాంతో ప్రజలు తండోపతండాలుగా, స్వాతంత్ర్యసంగ్రామంలో ప్రవేశించి, తమ సర్వస్వాన్ని దేశమాత దాస్యశృంఖలాల విచ్ఛేదనకై తృణప్రాయంగా వెచ్చించ సాగారు.

మన ఆంధ్రులంతా ఆ మహానాయకుని అడుగుజాడలలో నడచి స్వాతంత్ర్యసముపార్జనలో అగ్రగాములై నిలచి, తమ అపార ధైర్యసాహసాలను, శక్తిసామర్థ్యాలను ప్రదర్శించి, దేశమాత దాస్యశృంఖలావిచ్ఛేదనకు తోడ్పడ్డారు.

''మాలపల్లి''

ప్రముఖ దేశభక్తుడు, సుప్రసిద్ధ ఆంధ్రనాయక శిఖామణి గాంధేయపథగామి అయిన శ్రీ ఉన్నవ లక్ష్మినారాయణ ఆనాడు ఆంధ్రులు నెరపిన మహోద్యమాలను ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను యధాతథంగా చిత్రిస్తూ 'మాలపల్లి' అనే గొప్ప నవలను వ్రాశాడు ఈ నవలా ప్రాదుర్భావంతో, ఆంధ్రనవలా సాహిత్యానికి, యావద్భారత కీర్తి లభించింది. ఈ నవల గాంధీమహాత్ముడు నడిపిన స్వాతంత్ర్యోద్యమానికి, ఆయన పవిత్ర ఆశయాలకు పతాక. ఇది ఆనాటి గ్రామజీవితానికి, ఆ జీవితంలో సంభవించే ఒడుదుడుకులకు దర్పణమై వెలుగొందింది. దీనికి 'సంగ' విజయం అనే వేరొక పేరుగూడ ఉంది. ఈ నవల పంతులు గారు సంకల్పించిన, నవజీవన నిర్మాణ విధానంతోపాటు ఆంధ్రసాహిత్య సంస్కారరంగంలో నూతనాధ్యాయాన్ని నెలకొల్పుతోంది.

'మాలపల్లి' నవలలోని 'మంగళాపురం' మానవధర్మాన్ని, నైజప్రవృత్తిని ప్రతిపాదించే మంగళాపురం మాత్రమేనని చెపితే సమంజసంగా ఉంటుంది అందలి రామదాసు మహాలక్ష్మమ్మ, రామానాయడు సంగదాసు, జ్యోతి, చౌదరయ్య, కమల, పౌలు, పాదరీలు మొదలైన వారంతా మానవధర్మ నిర్వాహకులే. ఆ ధర్మ పరిరక్షకులే.

ఈ నవలయందు వర్ణింపబడిన సాంఘిక రాజకీయాది పరిస్థితులు సమయోచితంగాను, రసవంతగాను చిత్రితమై ఉండటమేగాక అది నవరసభరితమై ఆంధ్ర నవలా సాహిత్య క్షేత్రంలో ప్రముఖస్థానాన్ని ఆక్రమిస్తోంది. నేటి తెలుగు వారికి నాటి తెలుగు జీవిత విధానాన్ని సంపూర్ణంగాను సాకల్యంగాను ప్రదర్శిస్తూ నిరుపమానమైవున్న నవల అది. ఆంధ్ర భాషలో అజరామరమైన కీర్తితో ప్రకాశించే ఉత్తమశ్రేణి రచన అది. ఈ నవల తెలుగు నవలారచనలో క్రొంగ్రొత్త రీతులలో వెలుగొందుతూ ఒక అపూర్వమైన సంచలనాన్ని దేశంలో కలిగించి ఎందరో నవరచయితల్ని ఉత్తేజపరచి నవలారచనను మరోమలుపుకు మళ్లించింది. దీని ప్రభావం ఆ పిమ్మట వచ్చిన నవలలపైన ఎంతో పడింది.

(సశేషం)

ఈ సంచిక ఎలా వుంది ?

ఇంకా ఎలా ఎలా వుంటే బాగుండేది ?

సూచనలకు సుస్వాగతం

కొండపల్లి కోట చారిత్రిక ప్రాధాన్యం

"మహేష్"

శిథిలమై, ఒరిగిపోయి, ముక్కలై కుప్పలుగా కూలిపోయిన కట్టడాలతో, బ్రాలి వీగిపోయిన ప్రాకారాలతో నేడు కొండపల్లి గిరి దుర్గం అత్యంత దీనావస్థలో వున్నా, ఒకనాడు దక్షిణ దేశ చరిత్రలో పొందిన ఔన్నత్యాన్ని, ముఖ్యంగా తెలుగు దేశ చరిత్రలో వహించిన ప్రాముఖ్యాన్ని నిండుగా బయల్పరుస్తుంది. శీతాకాలంలో ఏపుగా పెరిగి ఫలించిన పండ్ల బరువుకు వంగే సీతాఫల వృక్షాలతో, యితర వన సంపదలతో దోబూచులాడు కొండ కణుజులు, చిరుతపులులు మొదలైన వన్య మృగాలకు ఆశ్రయమిస్తూ, వన ఛాయల్లో కొండపల్లి వాసులకు గత దీప్తుల్ని కలల ఊహల్లో చెబుతూ, కొండపల్లి కొయ్య బొమ్మల ఉత్పత్తిని ఉత్సాహపరుస్తున్న ఈ దుర్గం చూడ ముచ్చటగా వుంటుంది.

ఈ గిరి దుర్గం విజయవాడ–హైదరాబాదు రైలుమార్గంలో విజయవాడ నుండి సుమారు 16 కిలోమీటర్ల దూరంలో వుంది. విహార యాత్రికులు బస్సుమీద కూడా తిరువూరు మార్గంలో ప్రయాణం చేయవచ్చు. ఇప్పటికి సుమారు 18 సంవత్సరాల క్రితం ప్రథమంగా కొండపల్లి దుర్గాన్ని నేను చూడటం జరిగింది. పునర్దర్శనం అనుకోకుండా ఈ మధ్యనే జరిగింది. దుర్గస్థితిలో అప్పటికి, యిప్పటికి ఎంతో తేడా వుంది. కర్కశ కాల పురుషుని హస్తాల్లో సంవత్సరాలు మారుతున్నకొద్దీ పోషణలేని నిర్మాణాలు మరీ శిథిలమవడం సహజమే! కాని మానవ లోపాలు, స్వార్థాలు కూడా చారిత్రిక రూపాల్ని మాపుచేయగలవు. మొదటిగా చూసినప్పుడు పర్వతపాదంవద్ద ప్రవేశ మహా ద్వారం రూపంతో వుంది. కాని ప్రస్తుతం ఉత్తర భాగమే నిల్చింది. దీనికి కారణం ద్వారంలోని శిలలు రుబ్బురాళ్ళకు చక్కగా పనికొస్తాయని యిచ్చట ప్రజలు తరలించారట. అంటే చారిత్రిక కట్టడాలపై మనకున్న శ్రద్ధ ఎంతో తెలుస్తుంది. శేషభాగాన్ని ఎందుకు మిగిల్చారని ప్రశ్నిస్తే, భాగాగ్రంపై శ్రీకృష్ణదేవరాయలు చేసిన శాసనముందని, అది పతనమవుతుందనే భావనతో కూల్చలేదని ప్రాంతీయుల సమాధానం. ఇంతకైనా అదృష్టవంతులం. గత కాలపు గీతలపై ఆమాత్రమైనా భక్తి వున్నందుకు!

రెడ్డిరాజుల, గజపతుల, విజయనగర రాజుల, కుతుబ్ షాహీల, మొగలాయీల ఆంగ్లేయుల కాలంలో కొండపల్లి కోట అత్యంత ప్రాధాన్యాన్ని పొందింది. ఉత్తర సర్కారు జిల్లాలలోని ఒక జిల్లాకు ఒకప్పుడు రాజధానిగా అలరింది. ఈ దుర్గ నిర్మాణ కాలం నుండి పతనం వరకుగల విపులమైన చరిత్ర మనల్ని ఉద్వేగ, ఆశ్చర్య మనస్కులను చేస్తుంది.

కాకతీయుల తర్వాత

క్రీ. శ. 1323లో ఆంధ్ర దేశంలో కాకతీయుల పాలన అస్తమించిన అనంతరం ఢిల్లీ సుల్తానులు ప్రభువులయ్యారు. వారి అధికారాన్ని అధిగమించి, వారి పాలనను పారద్రోలి స్వతంత్ర రాజ్యాలను స్థాపించిన ధీమంతులు, కీర్తిమంతులైన స్వదేశీ పాలకుల్లో ముఖ్యులు రెడ్డి రాజులు. నేటి కృష్ణా జిల్లా ఆనాడు రెడ్డి రాజుల రాజ్యభాగమై వుండేది. కొండపల్లి కొండపై కొండవీటి రాజ్యస్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి క్రీ శ. 1360 లో ఒక రక్షణ దుర్గాన్ని నిర్మించాడు. అప్పటినుండి విభిన్న కాలాల్లో విభిన్న పాలకులచే అనేకానేకంగా అది పెంపు గాంచింది. నూతన కట్టడాలెన్నో ఈ దుర్గాన్ని అలంకరిస్తూ వచ్చాయి. పెక్కు రాజులకు జరిగిన పోరులకు కేంద్రంగా కూడా ఘనత గాంచింది. శత్రు దుర్భేద్యమై సైనిక నిర్మాణ కౌశలంతో వెలుగొందిన కొండపల్లికోట ప్రపంచ ప్రతిష్ఠా దుర్గాలలో ఒకటని చెప్పుట అతిశయోక్తి కానేరదు.

వైశాల్యంలో కొండపల్లి గిరి దుర్గం ఏ యితర ముఖ్య దుర్గాలకు తీసిపోదు. శిథిలమైన ప్రాకారాలు కొన్ని కిలోమీటర్ల పరిధిని కలిగి వుంటాయి. ప్రస్తుతం నిర్మాణమంతా అరణ్య సంపదతో ఆవరించుకొనిపోయినా పర్వతాగ్రంపై రాజభవనం, సింహాసన స్థానం గంభీరంగా కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. ద్వితీయ తృతీయ ప్రాకారాలమధ్య దారిలో మొక్కపోయిన ప్రాచీన ఆంజనేయస్వామి విగ్రహం చూపరుల మనస్సులను ఆకట్టుకొంటుంది. ఇది ఆనాటి తెలుగు శిల్పుల మేధాప్రతిభ ప్రతిబింబిస్తూ వుంది. మహమ్మదీయ దండయాత్రలలో యీ విగ్రహం దెబ్బతింది. ఇప్పటికీ చెప్పుకోదగ్గది కుతుబ్‌షాహీల నాటి ఉద్యానవనం. ఇది తరుగుల్మాలతో పెరిగిపోయింది. కాని ఆ కాలంలో ఉద్యానవనానికి నీటిని సరఫరాచేయు పద్ధతిలో అందం గోచరిస్తుంది. అందు వ్యాఘ్రముఖరూపం నుండి జలాన్ని పంపించిన ప్రదేశం నేటికి వివరంగా కన్పడుతుంది. ఇది శిలా నిర్మాణం. శిల్పి చాతుర్యం చూడముచ్చటగా యిందు పొందుపబడింది. నీటిని మట్టి గొట్టాల ద్వారా వివిధ ప్రదేశాలకు సరఫరాచేసే సౌకర్యం ఆనాడు యీ దుర్గంలో కూడా వుందనుటకు నిదర్శనంగా వాటి శిథిలాల్నీ నేటికి మనం అనేకంగా చూడవచ్చు.

దుర్గంలో వాసయోగ్య సదుపాయాలెన్నో ఆనాడు కల్పించుకున్నారు. జలాశయాలు, పూజామందిర చిహ్నాలు పెక్కు కన్పిస్తాయి. భవనాలు బలిష్ఠమైనవైనవేకాకుండా, అన్ని హంగులను పొందివున్నాయి. నగిషీ పనితనం చెప్పుకోదగ్గది. బండలను అనువుగా మలచి భారీ నిర్మాణాల్ని బహుముఖంగా కావించారిక్కడ.

గజపతి రాజులు

కదలిపోయే కాల ప్రవాహంలో, దొర్లిపోయే రాజకీయ రథచక్రాల కదలికలో రెడ్డిరాజుల ప్రతిభ సన్నగిల్లడంతో ఒరిస్సా గజపతులు ఆంధ్ర దేశం మీద. విజృంభించారు. కొండపల్లి దుర్గం గజపతుల హస్తగతమైంది. మరల తెలుగు దేశానికి, ముఖ్యంగా కృష్ణాతీర ప్రాంతానికి బహమనీ

సుల్తానుల జెడద ప్రారంభమైంది. ఈ దుర్గం నెమ్మదిగా క్రీ.శ. 1471లో గజపతులనుండి బహమనీల కైవశమైంది.

భిన్న నమ్మకాలు భిన్న మతాలుగల పాలకుల సంఘర్షణలో కొండపల్లి దుర్గం వేలకువేల సైనికుల రక్తాన్ని త్రాగింది. తిరిగి బహమనీలనుండి గజపతులు దుర్గాన్ని లాక్కొన్నారు. ఆనాటి నుండి గజపతులు కొండపల్లి కోటను తమ సామ్రాజ్యపు దక్షిణ సరిహద్దు దుర్గంగా నిర్ణయించుకొని పాలనను కొంతకాలం సాగించారు.

శ్రీకృష్ణదేవరాయలు

సంవత్సరాలు గతించి పోయాయి. దక్షిణభారత దేశంలో స్వర్ణదీపుల నందుకొన్న విజయనగర రాజులచరిత్ర యుగం ఉన్నత చరమ శిఖరాలను చేరుకొంది. రణరంగ ప్రతిభాశాలి. శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సింహాసన మధిష్ఠించి, క్రీ.శ. 1515లో ఉత్తరాంధ్రదేశ దిగ్విజయయాత్రకు బయలుదేరాడు. గజపతులను కృష్ణాతీరమున ఓడించి, విజయవాడలో ప్రాచీన దేవాలయాలగు కనకదుర్గ, మల్లేశ్వరస్వామి దేవాలయాలకు దానాలొసంగి ముందుకు సాగాడు. కొండపల్లి కోటను ముట్టడించాడు. కాంక్షతో, పటుదలతో, అమోఘ యుద్ధతంత్రంతో. రెండునెలల భీకర సంగ్రామంతోగాని కొండపల్లిదుర్గం రాయల స్వాధీనంకాలేదు. దీనినిబట్టిచూస్తే ఈ దుర్గంయొక్క పటిమ ఎంతో విశదంకాగలదు.

ప్రపంచమందెక్కడలేని పెద్దబండల యంత్రం ఈ దుర్గంలో ఉండేదని ప్రాంతీయ చరిత్రవలన తెలుస్తుంది. దుర్గసామీప్యానికి శత్రుసైన్యం రాకుండునట్లు ఆ యంత్రంద్వారా పెద్దపెద్ద కొండరాళ్ళను దొర్లించే వారట అది దుర్గరక్షణకు మూలమై వుండేది.

కుతుబ్ షాహీ రాజులు

ఈ దుర్గ నిర్మాణవేళా విశేషమెట్టిదోగాని, స్థలప్రాధాన్య మెట్టిదోగాని ఆనాడు దక్షిణదేశంలో దీనిపై కన్నువేయని రాజు అంటూలేడు రక్తం చిందించని దశాబ్దమంటూలేదు రాయల అనంతరం క్రీ.శ. 1531లో ఈ దుర్గం తిరిగి గోలకొండ కుతుబ్ షాహీల వశమైంది. తర్వాత ఆంధ్రదేశంలో క్షణకాలం రేగిన రాజకీయకల్లోలం అళియ రామరాయలకాలంలో సద్దుమణిగింది. విజయనగరం శక్తిని పుంజుకొంది. మరల కొండపల్లి దుర్గం ఆంధ్రుల ఒడిలో శాంతిని పొందింది.

కాని ఏమిలాభం? కొండపల్లిదుర్గ చరిత్ర నిర్దయగా పునరావృత్తమయింది. సుల్తానులకు, రామరాయలకు జరిగిన తళ్ళికోట యుద్ధంలో క్రీ.శ. 1565లో రామరాయలు మరణించాడు. తెలుగుదేశ వైభవానికి, ముఖ్యంగా దక్షిణదేశంలో దేశీయ సంస్కృతికి వజ్రఘాతం తగిలింది. ఆంధ్రదేశానికి మణిపూసయై ముఖ్య కేంద్ర దుర్గంగా వదలిన కొండపల్లికోట తెలుగువారి చేతినుండి జారిపోయి గోలకొండ నవాబుల చేతికందింది.

తెలుగువారి అనైక్యంవల్ల...

పోయిన కొండపల్లికోసం మరల ప్రాంతీయ పాలకులు ప్రయత్నించారు. కోస్తాప్రాంతంలో ఆనాడు బలవంతుడైన సీతాపతిరాజు కొండపల్లిప్రాంత పాలకుడైన రామచంద్ర గజపతిని కులీకుతుబ్‌షాపైకి వుసికొల్పాడు. పెనుగంచిప్రోలువద్ద జరిగిన పోరులో, తెలుగువారి అనైక్యంవల్ల సుల్తాను విజయంపొందాడు. ఆనాటినుండి కొండపల్లి దుర్గం దక్కనులోని ఒక సర్కారుకు ప్రధాన కార్యకలాపాలకు స్థావరమైంది. దీనిని "కొండపల్లి సర్కారు"గాపిల్చేవారు ఈ దుర్గాన్ని సంపూర్ణంగా పట్టుకోవడానికి గోలకొండ సుల్తానులకు సుమారు 70 సంవత్సరాల కాలంపట్టింది.

క్రీ.శ. 1687లో మొగలాయీ పాలకుడు ఔరంగజేబు గోలకొండరాజ్యాన్ని వశపరచుకొని, తెలుగుదేశపాలన కొండపల్లి దుర్గ సంరక్షణ సుబేదారునకు అప్పజెప్పాడు. ఔరంగజేబు మరణానంతరం మొగలు సామ్రాజ్యం క్షీణస్థితిని పొందింది

దక్కను పాలనకు నియమించ బడ్డ సుబేదారుడైన నిజాం ఉల్‌ముల్క్ క్రీ.శ. 1748లో స్వతంత్రుడై అసఫ్‌జా వంశాన్ని స్థాపించాడు. కొండపల్లి సర్కారు నామం "ముస్తాఫా నగర్ సర్కారు" గా మార్చబడింది. నేటి కృష్ణాజిల్లా అంతా ఈ సర్కారు క్రిందనే ఆనాడు వుండేది.

నైజాంనవాబుల పాలన ప్రారంభమైంది. వారి ఫౌజుదార్లు అప్పటినుండి కొంత మంది కొండపల్లి దుర్గంలో వుండేవారు. కుతుబ్ షాహీల కాలంలో దుర్గంలో మొదలు పెట్టిన మహమ్మదీయ కట్టడాలు, ఈకాలంలో అభివృద్ధిపొందాయి. మసీదులు వెలిశాయి. దుర్గభవనాల్లో మహమ్మదీయ శైలి చోటుచేసుకుంది ఇప్పటికి ఆనాటి మహమ్మదీయ నిర్మాణాలను ఈ కోటలో చూడవచ్చు. నిజాం రాజ్యానికి ఈకోట మంచి రక్షణ దుర్గంగా ఆనాడు ఖ్యాతిగాంచింది. ఆంగ్లేయుల రాజ్యవిస్తరణ ఫలితంగా క్రీ.శ 1766 లో సర్కారు జిల్లాలన్నీ ఆంగ్లుల వశమయ్యాయి. జనరల్ కైలాడకు కొండపల్లి దుర్గాధికారం వచ్చింది. అప్పటినుండి కొండపల్లి దుర్గ ప్రాముఖ్యం తగ్గు మొగం పట్టింది. 1859 వరకు ఆంగ్ల సైన్యం కొద్దిగా ఈ దుర్గంలో విడిది వుండేది. వారి ఆరాధనకు అనువుగా ఒక చర్చిని ఒకపెద్ద శిలను మలచి కట్టారు. దీనిని నేటికీ మనం చూడవచ్చు. తర్వాత ఆంగ్లేయుల ప్రధాన కార్యాలయాన్ని ఈ ప్రాంతంలో మచిలీ పట్టణానికి మార్చుటవలన, కొండపల్లి వైభవం పూర్తిగా క్షీణించింది.

నేడు ఈ కొండమీద మిగిలి పోయిన శిథిలాలు, పాచి పట్టిన కోనేర్లు అక్కచెల్లెళ్ళ పేర తటాకాలు, గుర్రపు కోనేర్లు, బీటలు వారి శోభలు తరగిపోయిన రాయల భోగవనిత భవనం అశ్వశాలలు, గజశాలలు మొదలుగాగల కట్టడాలు శేష చిహ్నాలుగా వున్నాయి. అయినా ఒంటిమన్నె బురుజు, ఎర్రబురుజు, ఎండ్ల కొండ బురుజు, హనుమంతుని కొండబురుజు, గోలకొండ ద్వారము చెక్కుచెదరక ఆనాటి తెలుగువారి నిర్మాణప్రతిభను తెల్పుతున్నాయి.

కేంద్ర సాహిత్య అకాడమీ కార్యకలాపాలు

చల్లా రాధాకృష్ణ శర్మ

'అకాడమీ అధ్యక్షుడనయిన నా కార్యకలాపాలలో భారత ప్రధాని జోక్యం చేసుకోవడం నేను సహించను'.

ఈ మాటలు భారతరత్న బిరుదాంకితుడు, ప్రముఖ సాహితీవేత్త, మన ప్రియతమ నాయకుడు అయిన జవహర్‌లాల్ నెహ్రూ పండితునివి. ఆ మహనీయుడే సాహిత్య అకాడమీ స్థాపక అధ్యక్షుడు.

1954లో మార్చి 12న అకాడమీని ప్రారంభిస్తూ మరొక మహనీయుడూ ప్రపంచ ప్రసిద్ధిగన్న తత్త్వవేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు ఇలా పేర్కొన్నారు: 'సాహిత్యఅకాడమీ అన్న పదబంధం రెండు మాటల సమాహారం. సాహిత్య సంస్కృత శబ్దం. అకాడమీ గ్రీకు మాట. ఈ పేరు మన సార్వజనీనమైన దృష్టినీ ఆశయాన్నీ సూచిస్తోంది... కాగా సాహిత్య అకాడమీ సృజనాత్మకమూ విమర్శనాత్మకమూ అయిన సాహిత్య సృష్టిలో ఆసక్తిగల ప్రముఖుల సంస్థ...'

భారతీయ భాషలలోని సాహిత్య కార్యక్రమాలను ప్రోత్సహించి సమన్వయపరచడం తద్వారా మనదేశపు సాంస్కృతిక సమైక్యమునకు దోహదం చేయడం మొదలైనవి అకాడమీ లక్ష్యాలు. భారత ప్రభుత్వం వారిచే స్థాపింపబడినా, అకాడమీ పాలనా స్వేచ్ఛగల జాతీయ సంస్థ. వివిధ భారతీయ భాషలకూ, రాష్ట్రాలకూ, విశ్వవిద్యాలయాలకూ చెందిన ప్రతినిధులు గల జనరల్ కౌన్సిల్ ఈ సంస్థ విధానాలను రూపొందిస్తుంది.

భాషలు వేరయినా, భారతీయ సాహిత్యం ఒక్కటే అన్న సత్యాన్ని గుర్తించిన అకాడెమీ అనువాద కార్యక్రమాన్ని చేపట్టడమే కాక, వివిధభాషా సాహిత్య చరిత్రల రచనను కూడా పూనుకున్నది. ఇంతవరకూ సుమారు 700 పుస్తకాలు ప్రకటించింది.

అకాడమీ గుర్తించిన యీ క్రింది భాషలను గనుక పరిశీలిస్తే, యీ సంస్థ చేపట్టిన కార్యక్రమం ఎంత బృహత్తరమైనదో స్పష్టమవుతుంది.

అస్సామ్, బెంగాలీ, డోగ్రి, ఇంగ్లీషు, గుజరాతీ, హిందీ కన్నడ, కాశ్మీరీ, మైథిలీ మలయాళం, మణిపూరీ, మరాఠీ, ఒరియా, పంజాబీ, రాజస్థానీ, సంస్కృతం, సింధీ, తమిళం, తెలుగు, ఉర్దూ.

ఒక్కొక్క భాషకూ ఒక్కొక్క సలహా సంఘం ఉన్నది. ఇందులో పదిమంది సభ్యులు. వీరి ఆదేశముల ననుసరించి ఆయా భాషలలోని కార్యక్రమాలు నిర్వర్తింపబడుతూ వుంటాయి. ప్రస్తుతం తెలుగు సలహా సంఘమునకు శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు కన్వీనరు. ఈ సలహా సంఘాలు ప్రతి అయిదేళ్ళ కొకసారి మారుతూ వుంటాయి.

ఇవి కాక పాలీ నేపాలీ మొదలైన టిబెటన్ భాషలలో కూడా కొన్ని పుస్తకాలు ప్రకటించడం జరిగింది. రష్యన్ - హిందీ శబ్దకోశం ఒకదాన్ని అకాడమీ వెలుగులోకి తెచ్చింది. అయితే ఈ అనువాద కార్యక్రమం సాధించిందేమిటి? అనే ప్రశ్న సహజంగా ఉత్పన్న మవుతుంది.

మనదేశంలో ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. ఆంగ్ల భాషాసాహిత్యాలతో పరిచయం గల రచయితలకు పాశ్చాత్య సాహిత్యం గురించి పాశ్చాత్య కవులను గురించీ కొద్ది గానో గొప్పగానో తెలుసు. కాని గురజాడ అప్పారావు గారి సాహిత్య సేవ మలయాళీలకు తెలియదు. అలాగే మలయాళ మహాకవి కుమారన్ ఆశాన్ గురించి మహారాష్ట్రులకు తెలియదు. అనగా మన దేశంలో ఒక భాష వారికి మరోభాషకు చెందిన ప్రముఖ రచయితలను గురించి కాని ఆయా భాషల సాహిత్యాలలో వస్తున్న మార్పులను గురించికాని మనలో చాలా మందికి తెలియదనే చెప్పవచ్చు. కనుక ప్రస్తుత పరిస్థితులలో, బహుభాషా నిలయమైన మనదేశంలో అనువాదాలే శరణ్యమనక తప్పదు. అయితే యీ అనువాదాలు ప్రశస్తములై ఉండాలి.

అనువాదాలు

ఈ అనువాద కార్యక్రమంవల్ల కలిగిన మరొక ఫలితం ఏమిటంటే, ప్రాంతీయ



డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

భాషా రచయిత అఖిలభారత రచయితగా పేరు పెంపులు గడించ గలుగుతున్నాడు ఉదాహరణానికి, సుప్రసిద్ధ రచయిత శ్రీ అడివి బాపిరాజుగారి నారాయణరావు నవల నేడు హిందీ, తమిళం, మలయాళం మొదలైన భాషలలో లభ్యం కావడం వల్ల, ఆయన తెలుగులో వ్రాసినా ఆయన రచన తెలియని వారికి కూడా పరిచితమయింది. ఈ సందర్భంలో అకాడమీ ద్వారా ఇతర భాషలలోకి అనూదితములైన తెలుగు పుస్తకాలు పేర్కొనడం సముచిత మని భావిస్తున్నాను.

1. నారాయణరావు— హిందీ, తమిళం, (శ్రీ అడివి బాపిరాజు) కన్నడం, మలయాళం,
2. ఆంధ్రుల సాంఘిక చరిత్ర (శ్రీ సురవరం ప్రతాపరెడ్డి) — హిందీ.
3. ఆంధ్ర కథా మంజూష — కన్నడం, (16 కథానికలు,సంపాదకులు— తమిళం, శ్రీ శివశంకరస్వామి) — హిందీ.
4. రుద్రమదేవి - హిందీ, (శ్రీ నోరి నరసింహశాస్త్రి) —కన్నడం.
5. నాటికలు (10 నాటికలు :సంపాదకులు శ్రీ ముద్దుకృష్ణ) - కన్నడం
6. అల్పజీవి (శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి)—హిందీ (వీటిలో కొన్ని మరికొన్ని భాషలలోకి కూడా అనువదింపబడుతున్నవి)

ఇవికాక శ్రీ త్రిపురనేని గోపీచంద్‌గారి పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా మొదలైనవి కూడా అనువాద కార్యక్రమంలో చేర్చబడినవి.

ఇంతవరకూ తెలుగులో అచ్చుపడిన పుస్తకాల సంఖ్య 56. వీటిలో కవిత, కథానిక, నవల, వ్యాసం మొదలైన వివిధ సాహిత్య ప్రక్రియలకూ చెందిన రచనలు ఉన్నవి. బెంగాలీ, హిందీ, మలయాళం మొదలైన భారతీయ భాషలనుంచే కాక జర్మన్ వంటి పాశ్చాత్య భాషలనుంచి కూడా అనూదితములైన రచనలు తెలుగులో కనిపించడం గమనింపదగిన విషయం. శ్రీయుతులు బెజవాడ గోపాలరెడ్డి, రాయప్రోలు సుబ్బారావు, శివశంకరస్వామి, అబ్బూరి రామకృష్ణరావు, వేదుల సత్యనారాయణశాస్త్రి, మల్లవరపు విశ్వేశ్వరరావు (బెంగాలీ నుంచి), గన్నవరపు సుబ్బరామయ్య (మలయాళం నుంచి), పి.వి. నరసింహారావు (మరాఠీనుంచి) వేమూరి ఆంజనేయశర్మ (గుజరాతీనుంచి), తిరుమల రామచంద్ర, గడియారం రామకృష్ణశర్మ (కన్నడం నుంచి), దేవులపల్లి రామానుజరావు, దాశరథి రంగాచార్య (ఉర్దూనుంచి), పురిపండా అప్పలస్వామి (ఒరియా నుంచి), పింగళి లక్ష్మీకాంతం, యం.ఆర్. అప్పారావు, జి.వి. కృష్ణరావు, అమరేంద్ర, మరుపూరు కోదండరామరెడ్డి (ఇంగ్లీషు నుంచి), వి.యన్. శర్మ (జర్మన్ నుంచి) వంటి ప్రముఖ రచయితల సహకారం అకాడమీకి లభించిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను.

ఈ అనువాదాల వల్ల రవికవీంద్రులు, హరినారాయణ ఆప్టే, మౌలానా అబుల్ కలాం ఆజాద్, బాబు రాజేంద్రప్రసాద్, ఉ.వే. స్వామినాథ అయ్యర్, తగళి శివశంకర్, మహమ్మద్ బషీర్, రాజేందర్‌సింగ్ బేదీ మొదలైన భారతీయభాషా రచయితలవేకాక, పాశ్చాత్య రచయితలైన ప్లేటో, గోథే, కన్‌ఫ్యూషియస్, షేక్‌స్పియర్ ప్రభృతుల రచనలు కూడా తెలుగు పాఠక లోకమునకు పరిచితములైనవి.

తెలుగు కావ్యమాల

ఈ సందర్భంలో శ్రీ కాటూరి వేంకటేశ్వరావు గారు కూర్చిన తెలుగు కావ్యమాలను (1959లో ముద్రితం) గురించి రెండు మాటలు చెప్పడం సమంజసం. మూడు పేటలుగా కూర్చబడిన యీ కావ్యమాలలో 72 మంది అధునిక కవుల రచనలు అందాలు దిద్దుకున్నవి. తెలుగు సాహిత్యం ఎప్పటికప్పుడు సంతరించు కుంటున్న కొత్తకైసేతల తీరులను ఈ కావ్యమాల నుంచి గ్రహించ వచ్చు.

డాక్టర్ జి.వి. సీతాపతిగారు ఆంగ్లంలో వ్రాసిన తెలుగు సాహిత్య చరిత్రను కూడా అకాడమి ప్రకటించింది.

ఇలా ఒక భాషనుంచి మరొకభాషలోకి అనువాదలూ, సాహిత్య చరిత్రలూ మొదలైన వాటినేకాక రెఫరెన్సు పుస్తకాలను కూడా తెలుగులోకి తీసుకురావాలని అకాడమీ సంకల్పించింది. భారతీయ రచయితలు ఎవరెవరు, భారతీయ వాఙ్మయ సూచిక (1901—1953) మొదలైనవి యీ కోవకు చెందిన ఉత్తమ గ్రంథములు. వాఙ్మయ సూచిక తాలూకు మొదటి మూడు సంపుటాలు వెలువడినవి. సింధీ, తమిళం, తెలుగు, ఉర్దూ, పుస్తకాలకు సంబంధించిన నాలుగవ సంపుటం త్వరలో వెలువడుతుంది. ఈ వాఙ్మయ సూచిక రచయితలకూ పరిశోధనలకూ కొంగు బంగారమన్నా సాహసం కాదను కుంటాను.

సంస్కృత సాహిత్యం

సువిశాలమైన సంస్కృత సాహిత్యాన్ని ఏడు సంకలనాలలో పాఠకులకు అందచేయడానికి సాహిత్య అకాడమీ కృషి చేస్తున్నది. వేదశాస్త్ర సంగ్రహం, పురాణేతిహాస సంగ్రహం, బౌద్ధసంగ్రహం, అభిలేఖ సంగ్రహం మొదలైన సంకలనాలు వెలువడినవి. ఇవి కాక మహాకవి కాళిదాసు రచించిన మేఘదూతం, విక్రమోర్వశీయం, కుమార సంభవం మొదలైన వాటిని సుప్రసిద్ధ పండితుల పీఠికలతో ప్రచురించింది.

అలాగే మౌలానా అబుల్‌కలాం అజాద్ ఉర్దూ రచనలను కూడా కొన్ని సంపుటాలలో ప్రచురించాలని అకాడమీ నిర్ణయించడం గమనింపదగిన అంశం. కొన్ని సంపుటాలు వెలువడినవి కూడా. అకాడమీ ప్రచురణలు ముఖ్యంగా భారతీయ భాషలకే పరిమితమయినా, భారతీయ రచయితలకూ వారి రచనలకూ సంబంధించిన మౌలిక విషయాలను తెలియజేసేందుకు గాను భారతీయ సాహిత్య నిర్మాతలు అనే శీర్షిక క్రింద ఆంగ్లంలో అకాడెమీ 19 పుస్తకాలు ప్రచురించింది. శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు వీరేశలింగం, వేమనలను గురించి వ్రాశారు. ఈ రెండు పుస్తకాలూ హిందీ, మలయాళం మొదలైన భాషలలోకి అనువదించబడినవి.

పుస్తక ప్రచురణతో పాటు, అకాడెమీ రెండు పత్రికలు కూడా నిర్వహిస్తున్నది.

ఒకటి సంస్కృతంలో (సంస్కృత ప్రతిభ) రెండవది ఆంగ్లంలో (ఇండియన్ లిటరేచర్).

బహుమతులు

సాహిత్య అకాడెమీ కార్యకలాపాలలో పేర్కొనదగిన మరొక అంశం, ఏటేటా భారతీయ భాషలలోని ఉత్తమ రచనలకు అయిదువేల రూపాయల చొప్పున బహుమతులివ్వడం. ఈ క్రింది తెలుగు పుస్తకాలకు అకాడమీ బహుమతి లభించింది.

1955 ఆంధ్రుల సాంఘిక చరిత్ర
శ్రీ సురవరం ప్రతాపరెడ్డి

1956 భారతీయ తత్వశాస్త్రము
శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

1957 శ్రీ రామకృష్ణుని జీవిత చరిత్ర
శ్రీ చిరంతనానందస్వామి

1960 నాట్యశాస్త్రము
శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు

1961 ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము
శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు

1962 విశ్వనాథ మధ్యాక్కరలు
శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

1963 పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా
శ్రీ త్రిపురనేని గోపీచంద్

1964 క్రీస్తు చరిత్ర
శ్రీ జి. జాషువా

1965 మిశ్రమంజరి
శ్రీ రాయప్రోలు సుబ్బారావు

1969 మహాత్మకథ
శ్రీ తుమ్మల సీతారామమూర్తి

1970 అమృతం కురిసిన రాత్రి
శ్రీ డి. బాలగంగాధర తిలక్

1971 విజయ విలాసము
హృదయోల్లాస వ్యాఖ్య
శ్రీ తాపీ ధర్మారావు

మహాపురుషుల శతజయంతులను అకాడమీ సముచిత రీతిని జరుపుతున్న విషయం సాహితీవేత్తలకు తెలిసిందే. ఇంతవరకూ రవీంద్రనాథ ఠాకూర్, వివేకానంద, షేక్స్పియర్ (4వ శతజయంతి), రోమా రోలా, మహాత్మాగాంధీ, గాలిబ్, గురునానక్ పంచశత) లెనిన్, నామదేవ్, శ్రీ అరవింద మొదలైన మహనీయుల శతజయంతులు అకాడమీ ఆధ్వర్యంలో జరిగినవి. రవీంద్రుని శతజయంతి సందర్భంగా అకాడెమీ ప్రచురించిన ప్రత్యేక సంపుటం ముఖ్యంగా పేర్కొనదగింది. ఇది సుమారు అరవై వ్యాసముల సంపుటం. దీనికి నెహ్రూ పండితుడు చక్కని పీఠిక వ్రాశారు. ఇతర శతజయంతుల సందర్భంగా చదివిన వ్యాసాలను కూడా ప్రచురించాలని అకాడమీ ఆశిస్తోంది.

మొత్తం మీద సాహిత్య అకాడమీ తలపెట్టిన కార్యక్రమం బృహత్తరమైనదని చెప్పవచ్చు. మనదేశపు సాంస్కృతిక సమైక్యానికి అకాడమీ ప్రచురణలు బహుధా తోడ్పడగలవని పేర్కొనవచ్చు. ఇంతకూ పండిత జవాహర్లాల్ నెహ్రూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ జాకిర్ హుసేన్ వంటి ప్రముఖులు అకాడెమీకి అధ్యక్షులుగా ఉండడం, సాహిత్య అకాడమీ చేసుకున్న భాగ్య మనవచ్చు.



జాషువా



సురవరం ప్రతాపరెడ్డి

“మీకు సంతానము లేదయ్యెనే దత్తు చేసికొందురా?”

“ఇంత గ్రంథ సంతతియుండ వేరే దత్తు చేసి కొన వలసిన పని యేమి?”

“మీరు ఐశ్వర్య సంపన్నులు కదా! మీ గ్రంథముల నేల అచ్చు వేయింపరు?”

“నా గ్రంథాలకు మనవలసిన యోగ్యత యున్నచో ఎన్నటికైన అవియే ముద్రింపబడును” ఇవి కవీంద్రుల ప్రత్యుత్తరములు

అపకళంక[illegible]ప్రసిద్ధిగాంచిన శ్రీ బెల్లంకొండ రామరాయ కవీంద్రుని జన్మ భూమి గుంటూరు మండలములోని నరసరావుపేట తాలుకా పమిడిపాడు అను అగ్రహారము. ఋక్శాఖీయులు నియోగి బ్రాహ్మణులైన హనుమాంబా, మోహనరాయలు గార్లు వీరి తల్లి దండ్రులు. క్రీ. శ. 1875 సం॥కు సరియైన యువ సంవత్సరాశ్వయుజ అమావాస్య వీరి జన్మ తిథి. బెల్లంకొండ వారు ఇటు బుద్ధి బలమున, అటు శరీరబలమునను వన్నె కెక్కిన వారు. వీరి పూర్వులలో నొకరు సభా భవనములోని స్తంభము క్రిందికి రత్న కంబళమును దూర్చెనట. ఈ బలసంపదకు మెచ్చిన నరసరావుపేట జమీందారు పమిడిపాటిని సర్వాగ్రహారముగ నిచ్చిరని కొందరందురు. శ్రీ రామరాయ కవీంద్రుడు అగ్రహారికులలో నొక భాగస్వామి వీరి కారవయేటనే తండ్రియస్తమింప పిన తండ్రియైన కేశవరాయనింగారిచే అష్ట వర్షోపనీతుడై సంధ్యాద్యనుష్ఠానమును సక్రమముగ నెఱవేర్చిన సనాతన ధార్మికుడు. సర్వ విద్యాధారమైన హయగ్రీవ మూర్తి మన కవీంద్రునకు ఉపాస్యదైవము. ఏతదుపాసనా పద్ధతిని గూర్చి వీరు జిజ్ఞాసితులై యుండ నొక రాత్రి వచ్చిన స్వప్నము ననుసరించి తమ యూరికి నాలు మైళ్ళ దూరముగా నుత్తర దిశనున్న దమ్మాల పాడు (పూర్వపు పేరు ధర్మపురి) గ్రామమునకువెళ్ళి వేదాంతం రత్నమాచార్యులనెడి పూజారి వలన హయగ్రీవోపాసన పద్ధతిని సాకల్యముగ గ్రహించి తదుపాసనావ్యగ్రులయ్యెను. మన్త్రసిద్ధికై పుణ్యక్షేత్ర నివాసము శీఘ్రఫలదాయకమని యెంచి కృష్ణా నదీ తటమున వెలసిన వేదాద్రి యనెడి క్షేత్రరాజమున కొంతకాలము తపమొనర్చి మన్త్రసిద్ధిని బడసి తద్భాన్తి కలాపము యథావిధి నెరవేర్చి యింటికి వచ్చిరి.

శ్రీరామరాయ కవి హయాననప్రసాదలబ్ధ పాండిత్య, కవితా వైభవులు. ఐనను లోకాచారము ననుసరించి బెల్లంకొండ రాఘవరావుగారి తండ్రి యగు సీతారామయ్యగారి వద్ద ఆరు నెలల్లో పంచ కావ్యముల జదివిరి. బాలుని ప్రతిభా వైభవమును జూచి గురువుగారు నైషధాది సాహిత్య గ్రంథములను స్వయముగనే చూచుకొమ్మనిరి. అంత సాహిత్య సేవ జేయుచు గ్రంథ రచనకు పూనుకొనిరి. వీరి రచనలలో నొక విలక్షణత కన్పట్టును. సాహిత్య గ్రంథములలో కఠిన పాకము. వేదాన్త గ్రంథములలో సులభశైలి. ఒక ప్రబుద్ధుడు దీనికి కారణమేమని కవీంద్రుల నడిగెనట. అందుకు “కఠినపాకము చదివిననే గాని సాహిత్యము వృద్ధిచెందదు. కఠినశైలిలో నుండినచో వేదాన్తమును చదువు వారుండరు” అని జవాబు చెప్పినారట.

రచనా వ్యాసంగము

వీరి రచనలు చిన్నవి పెద్దవి కలిపి 143 గ్రంథములు. అన్నియు సంస్కృత రచనలే లిపి మాత్రము ముత్యాల సరముల వంటి తెలుగక్షరములు. “శరద్రాత్రి” యను సిద్ధాంత కౌముదీ వ్యాఖ్యానము, రుక్మిణీ పరిణయాదులు మూడు సాహిత్య గ్రంథములు. కొన్ని స్తోత్రములు తప్ప తక్కినవన్నియు అద్వైత గ్రంథములే. అన్నిటికిని తలమానికమై వెలయునది “భగవద్గీతా భాష్యార్క ప్రకాశము.” ఇది భగవద్గీత యొక్క శంకర భాష్యమునకు విపులమై, సరళమైన వ్యాఖ్యానరాజము. ఆసేతు సీతాచలము పండిత ప్రశంసల నందినది. సుమారు 1,500 రాయల్ సైజు పుటల గ్రంథము.

వీరు ప్రసన్న సరస్వతు లనుటకు తార్కాణమేమన—దశావతారముల కష్టోత్తర శతముల రచించుచు ఆ యా దేవతల పేరు యొక్క మొదటి యక్షరమునే అన్ని నామములకు విన్యసించిరి. అనగా—మత్స్యావతార నామములు మకారాదిగ, కూర్మావతార నామములు కకారాదిగ. ఇవి గాక “వి” వర్ణాదివిష్ణు సహస్ర నామములను, “హ” కారాది హయగ్రీవ సహస్రనామములను రచించిరి. వానికి స్వయఙ్కృత వ్యాఖ్యము కలదు. దశోప

శతాధిక గ్రంథకర్త బెల్లంకొండ రామరాయ కవీంద్రుడు

దమ్మాలపాటి శేషగిరిశర్మ

నిషత్తులను "వేదాన్త ముక్తావళి" యను పేరిట మన్దాక్రాన్తాది వృత్తములుగ వ్రాసి వానికి వ్యాఖ్యయు రచించిరి.

కవీన్ద్రుల జీవితము 38 సం॥లు. ఆఱవయేటనే పితృవియోగము కలిగినది. తల్లి పుత్రవియోగ సంతప్తమైనది. సతీ



మణి ఆదిలక్ష్మమ్మగారు ఐదారేండ్ల క్రిందట కన్నుమూసినది. ఆమె యేటేట గుంటూరులో ఏకా ఆంజనేయులుగారి యింటికిని, బాపట్లలోని తమబంధువుల యిండ్లకును వెళ్లుచు నరసరావుపేటలో నాలుగు రోజులపాటుండెడిది. అప్పుడు మాయింటికిని వచ్చుచుండెడిది. నేనడుగగా ఆమె హయగ్రీవసిద్ధిని గూర్చి యిట్లు చెప్పెడిది. "వారు జీవించియున్నంతవఱకు ఒకయెత్తైన తెల్లగుఱ్ఱము రాత్రులందు నురుగులు గ్రక్కుచు ఇంటిలో అటు నిటు పరుగెత్తుచుండెడిది" అని. కవీన్ద్రుల యవసానకాలమున రాచకురుపు లేచెనట. పల్లమంత కురుపుతో బాధచెందుచును బోరగిల పరుండి గ్రంథములు వ్రాయుచునే యుండెడి వారట. కొంచెము విశ్రాంతి తీసికొనరాదా? ఇంత శ్రమయేల చేసెదరని తాను ప్రశ్నింపగా ఎవరేపనికి వచ్చిరో దానిని పూర్తి చేసిపోవలెను గదాయని సమాధానించు చుండిరట.

మూఢాచార ఖండనము

వీరిపూర్వులు వైష్ణవ మతానుయాయులు. గురువునొద్ద సమాశ్రయణమొంది ఊర్ధ్వ పుండ్రముల ధరించుచుండిరి. ఏటేట వైష్ణవ గురువులు కుటుంబ సమేతముగ ఎద్దుబండిలో వచ్చి నాలుగు రోజులుండుట క్రొత్తవారికి తప్తచక్రాంకన (సమాశ్రయణ) మొనర్చుట, తెరచాటునుండి ప్రసాదముల తెచ్చి యిచ్చుట, శిష్యులవలన మోయినలు వార్షికములు స్వీకరించి ప్రక్కయూరికి బాకాలతో వెళ్ళటము పరిపాటి. మన కవీన్ద్రులు విద్యాబుద్ధులు గఱచి గ్రంథరచనలో చేవలుదేలియున్న రోజులవి. వైష్ణవగురులు పూర్వమువలె మకాము చేసిరి. మోయినలు నడచుచుండెను. ప్రపన్నుల శరణాగతి తప్తచక్రాంకన చర్యయు సాగుచుండెను. అట్టియెడల రామరాయ కవీన్ద్రులు రాకుండుట గమనించి గురువుగారు కబురంపిరి. కవీన్ద్రులు ప్రాతరాహ్నికములననుష్ఠించి తిర్యక్పుండ్రధారులై మూర్తీభవించిన స్మృతి ధర్మమోయన గురుసన్నిధి కేతెంచిరి. బ్రహ్మతేజో విరాజమానులగు రామరాయ కవీన్ద్రులఁజూచి వైష్ణవ గురువు లోలోన జంకియు పీర మర్యాదను నిల్పుకొనుటకై యిటుల ప్రశ్నించెను,

గు: రామారావుగారూ తాముకూడ తప్త చక్రాంకనము పొంది సద్గతి జెందుట కర్తవ్యము, ఏమందురు?

రా: తప్త చక్రాంకనము నరక హేతువు కాదని నిరూపింతురేని వెంటనే చేసికొందును.

గు! మీ వంశస్థులెల్లరు బహుకాలముగ ననుష్ఠించు పద్ధతిని మీరనుసరించుట కర్తవ్యము కాదా?

రా: "శతాన్ధాః కూపం ప్రవిశన్తి" అనునటుల బహుజనానుష్ఠానము ప్రమాణము కాదు. ఒక్క యగ్ని కణము శుష్కేంధన రాశిని కాల్చునటుల ఒక్క ప్రమాణము దురాచార శతమును కూలద్రోయును. తాము ప్రమాణము చూపినచో విధేయుడనయ్యెదను.

గు: దేహమున వైష్ణవ చిహ్నములులేనిదే వైకుంఠ ప్రవేశము లభింపదు.

(అని చెప్పి దానిని సమర్థించు శ్లోకమును వల్లించెను)

రా: తప్తచక్రాంకితమైన భౌతిక దేహము మనయెదుట భస్మమగుచుండ ఈ చిహ్నములు సూక్ష్మదేహమున కెట్లు సంక్ర

మించును ? మీరు పఠించినవి ఆగమ సంబంధములు. స్మృతి వచనములచే నవి వ్యాహతమగును.

అని కవీన్ద్రులు తప్తచక్రాఙ్కనమును ఖండించు పెక్కు స్మృతి వచనములు పేర్కొనెను. గురువు నిరుత్తరుడయ్యె గ్రంథావలోకనమునకు ఒక దినము సమయము కోరెను. సభ ముగిసెను. తెల్లవారుజాముననే గంటల సవ్వడి లేని యెద్దు బండి పొలిమేర దాటెను.

గురువు కావాలి

శ్రీ కవీన్ద్రులు సంప్రదాయసిద్ధమగు తర్క వ్యాకరణాది శాస్త్ర జ్ఞానమునుగోరి ఆచార్యులకై ప్రతీక్షించుచుండిరి ఆ రోజులలో గద్వాల పరీక్షకువెళ్లు పండితులు కొందరును పోవుచు వచ్చుచు పమిడిపాటిలో నొక దినము మకాముచేసి ఆతిథ్య సత్కారముల నందుచుండిరి. ఆ కాలమున పమిడిపాడు సంస్కృత విద్యార్థుల కాటపట్టు. అగ్రహారికులు విద్యార్థులకు ముష్టాన్నమిడి చదువు చెప్పెడివారు. సాహిత్యపాఠములు సీతారామయ్యగారును శాస్త్ర పాఠములు కవీన్ద్రులును బోధించెడివారు. విద్యార్థులు జట్లు జట్లుగ వీధి యరుగులపై గూర్చొని కావ్య శాస్త్రార్థములు ప్రసంగించుచుండుట కనుల పండువుగా నుండెడిది. శ్రీ రామరాయ కవీన్ద్రులు తన శాస్త్రాధ్యయనాభిలాషనుగూర్చి ఏ పండితునడిగిను ఏదియో వ్యాజమును జెప్పుకొనుచుండెను. ఇట్టుండ గోదావరీ మండలమునుండి గద్వాల పరీక్షకు పోవుచున్న శ్రీ పురిఘళ్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, రామశాస్త్రి అను నిద్దరు సోదరులు అచటికి వచ్చిరి. మొదటివారు తర్కమునను, రెండవవారు వ్యాకరణమునను నిష్ణాతులు, పూర్వవయస్కులు. అంతకుపూర్వమే విద్య ముగించి చేవలు దీరియున్నవారు. శ్రీ రామరావుగారు వారికి తన మనోరథమును విన్నవించెను "మీ వంటివారికి చెప్పినప్పుడే మా విద్యకు సాఫల్యము" అని సంతోషముతో నంగీకరించిరి. తాము గద్వాల నుండి తిరిగి వచ్చి ప్రారంభింతుమని చెప్పి వెడలిరి. అనతి కాలముననే గద్వాల పరీక్షయందు విజయ పట్టముపొంది వచ్చిరి. కవీన్ద్రుల యానందమునకు మేర లేదు. వారిలో రామశాస్త్రిగారు సిద్ధాంత కౌముదిని ప్రారంభించిరి. శిష్యుని గ్రహణ శక్తి ననుసరించి మనోరమ శేఖరము మహాభాష్యమువరకుగలవిశేషములతో ప్రవచనము సాగుచుండెను. శిష్యుడుచెప్పినదంతయు అగస్త్యుని వలె ఆపోశనము చేయుచుండెను శిష్యుడేకసన్ధాగ్రాహి. మూడు నెలలలో పూర్వార్థము ముగిసెను శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కూడ తర్క సంగ్రహమారంభించిరి. పూర్వవాదాన్తముగల సకల విశేషముల బోధించుచు మూడు నెలలో ముగించిరి. అప్పుడు గురు సోదరులకు ఇంటినుండి పిలుపు వచ్చెను. శిష్యుని ప్రతిభా విశేషమునకచ్చెరువొందిన గురులు తర్క వ్యాకరణముల వ్యాఖ్యా గ్రంథములను శిష్యున కప్పగించి తిరిగి వత్తుమని స్వదేశమునకు వెడలిరి. శ్రీ రామరాయ కవీన్ద్రులు మహా భాష్యాన్త వ్యాకరణ గ్రంథములను స్వయముగ జదివి సిద్ధాన్త కౌముదికి శరచ్చన్ద్రాత్రి యను వ్యాఖ్యానము రచించిరి తరువాత కొలది కాలమునకు గురుసోదరులు వచ్చిరి. శరదాత్రిని చూచి విస్మయానంద పరవశులైరి. "కవీన్ద్రా! శ్రీకృష్ణునకు సాందీపునివలె నీకు మేము నిమిత్తమాత్ర గురువుల"మని గద్గద స్వరముతో బలికిరి. హాయా ననడే లోకానుగ్రహ కాంక్షచే ఈ రూపమున [illegible] దాయుచుండెనని తలంచిరి. ఇక తాము చెప్పదగినది యేమియు లేదనిరి. శ్రీ రామరావు గారు వారిని గురుదక్షిణ స్వీకరింప బ్రార్థించెను. అందు రామ శాస్త్రిగారు "నాకు నశ్వరమైన యే దక్షిణయు వలదు. నీ కృతులలో నన్ను గురునిగ పేర్కొనుటయే నేను కోరెడి గురుదక్షిణ" యనిరి. శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారును ద్రవ్య దక్షిణను వలదని "అభినవ కాళిదాస విరచితమైన భా. పరిచంపువు ప్రౌఢమై ధ్వనిపూర్ణమైయున్నది దానికి సరియగు వ్యాఖ్యానమొనర్చుటే గురుదక్షిణగ భావింతు" ననెను కవీన్ద్రులుభయుల మనోరథముల నంగీకరించిరి. గురుసోదరులను గంధమాల్య వస్త్రాభరణములతో సత్కరించి పంపెను. గుర్వాజ్ఞననుసరించి శరదాత్రియందు గురుయుగళమును వర్ణించి భాగవత చంపువునకు వ్యాఖ్యార్థావిష్కరణచణమైన విస్తారమైన వ్యాఖ్యను రచించెను. పిమ్మట మురారి నాటకమునకు వ్యాఖ్యానమును సముద్రమథన చంపువు శ్రీకృష్ణ లీలా తరంగిణి మొదలగు గ్రంథముల వ్రాసెను.

ఒకనాడు మల్లాది రామకృష్ణ చయనులుగారి యొద్ద చదివితినని యొక పండితుడు రాగా ఆతని యొద్ద వేదాన్త పంచదశిని తీసికొని రెండు దినములలో దానినంతయు అవగాహనము చేసికొని ప్రత్యక్తత్త్వ ప్రకరణములోని "వికల్పోవినిర్వికల్పస్య సవికల్పస్య వాభవేత్" అను ఘట్టముపై విపుల వ్యాసమునువ్రాసి ఆతనికిచ్చెను. ఆ వచ్చిన రాళ్ళబండి నరసింహశాస్త్రి గీతాభాష్యమును శ్రీ రామరాయ కవీంద్రుల వలన విని తిరిగి శ్రీ చయనుల గారియొద్ద వ్రస్థాన త్రియము చదివి వచ్చెను. వారు తెచ్చిన గ్రంథములను శ్రీ రామరావుగారు పది దినములలో జదివి శ్రీ నరసింహశాస్త్రిగారి సంశయముల బాపెను పిమ్మట రామానుజ భాష్యమును చదివెను అటుపై భగవద్గీతా భాష్యార్కప్రకాశమును రచించిరి తన రచన సాంప్రదాయికమా కాదా ? యను శంక కలిగెను. వెంటనే దస్తరము కట్టుకొని రాజమహేంద్రవరము బయలుదేరిరి. అచట తర్క వేదాన్త మహోదధియని ప్రఖ్యాతిగాంచిన శ్రీ వడిభట్ల రామమూర్తి శాస్త్రిగారికి "మనసతో విన్యతేభావః" మొదలైన ప్రధాన ఘట్టముల వినిపించిరి వారు మహానందమొంది అపరశంకరులో. అపర వ్యాసులోయని తలంచిరి పిమ్మట వేదాన్తముక్తావళి, సిద్ధాన్తసిన్ధువు, అద్వైత విజయము వేదాన్త సంగ్రహము, వేదాన్త నిశ్చయము, నైయాయికాది మోహాన్త మత ఖండనము మొదలగు వేదాన్త గ్రంథములను రచించిరి. గ్రంథ రచనతో నాటు 38 ఏండ్ల జీవితము సమాప్తి చెందెను. గ్రంథముల కాద్యన్తములలో హయవదన స్మరణము, తచ్ఛ్రీసాన లబ్ధపాండితీ వైభవోల్లేఖనము కావచ్చును.

డా. సయ్యద్ అబ్దుల్ లతీఫ్

— హుస్సాముద్దీన్ అహ్మద్

"కీర్తిశేషులైన శ్రీ సయ్యద్ షా హుసేన్‌గారి కుమారుడు, 480, ఆగాపురా హైదరాబాదు నివాసి. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంగ్లభాషా శాఖా మాజీ ప్రొఫెసరు, 80 సంవత్సరాల వయస్సు గల డా॥ సయ్యద్ అబ్దుల్ లతీఫ్ అను నేను ఖురాను ప్రవచనాల పట్ల నాకు గల అభిమానాన్ని పురస్కరించుకొని, అందునిమిత్తము ఖురానీ ట్రస్టును ఏర్పాటు చేస్తున్నాను. నేను రచించిన గ్రంథాల స్వామ్యం (కాపీరైటు) ఈ ట్రస్టుకు సంక్రమింపచేస్తున్నాను"

ఖురానీ ట్రస్టును ఏర్పాటు చేస్తూ డా. అబ్దుల్ లతీఫ్, ట్రస్టు పత్రంలో పైన తెలిపిన విధంగా చిరస్మరణీయమైన వాక్యాలలో వ్రాశారు. ఈ ట్రస్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణమైనదే కాకుండా చారిత్రక ప్రాముఖ్యాన్ని సంతరింప జేసుకున్నది.

ఇది ఒక మహా విద్వాంసుని జీవిత చరిత్ర. మత పరమైన సాహిత్యాన్నంతా ఆపోశనం పట్టిన ప్రతిభాన్వితుడు ఆయన. 80 ఏళ్ళ నిండు జీవితంలో ఉర్దూ సాహిత్యానికి ఎనలేని సేవచేశారాయన. ఆయన జీవిత చరిత్ర అసక్తిదాయకమైనది. ఆదర్శవంతమైనది.

డా. సయ్యద్ అబ్దుల్ లతీఫ్ 11–9–1891వ తేదీ శుక్రవారం నాడు కర్నూలు పట్టణంలో జన్మించారు. వీరి ప్రపితామహుడైన శ్రీ సయ్యద్‌షా అబ్దుల్ లతీఫ్ ఖాదిరీ గారు హజ్రత్ యాహో బాదుషాగా సుప్రసిద్ధులు. సాధుపుంగవుడైన యాహో బాదుషా దక్షిణ భారత దేశపు "ఖుతుబుల్ అఖ్తాబ్" అని పిలువబడేవారు. లతీఫ్ వంశపు మూల పురుషుడు హజ్రత్ ఇమామ్ నఖీ అలైఉస్సలాం'' ఈ వంశపరంపరలో హజ్రత్ మఖ్దూమ్ జహానియాం జహాంగష్త అను నతడు ముఖ్యుడు. హజ్రత్ యాహో బాదుషా సమాధి కర్నూలులో ఉన్నది. సంపన్నులు, నిరుపేదలు అనే భేదం లేకుండా సర్వులూ ఆ సమాధి దగ్గరకు వెళ్ళి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఉంటారు.

లతీఫ్ 12 ఏళ్ళ వయస్సు వచ్చేవరకు తమ తండ్రిగారి వద్దనే అరబీ, ఫారశీ భాషలు నేర్చుకున్నారు. ఆ తరువాత స్థానిక ఉన్నత పాఠశాలలో చేరి విద్యాభ్యాసం గావించారు. ఇరవయ్యో శతాబ్ది తొలి దశాబ్దంలో భారత దేశంలోని ముసల్మాను పండితులు ఆంగ్లభాషపట్ల విముఖత్వం ప్రదర్శిస్తూ ఉద్యమం సాగించారు. సర్ సయ్యదు గారి కృషి ఫలితంగా ఉత్తర భారత దేశంలో విముఖత్వం క్రమంగా తగ్గనారంభించింది. లతీఫ్ తమ తండ్రి గారికి తెలుపకుండానే ఇంగ్లీషు బోధనా భాషగా వుండే పాఠశాలలో చేరారు. ఆంగ్లభాష నేర్చుకోరాదని ప్రచారం చేస్తూ ఉద్యమం సాగిస్తున్న తండ్రి గారికి ఈ సంగతి తెలిసిన వెంటనే ఆయన ఆగ్రహానికి అంతులేక పోయింది. కొడుకును పిలిచి "ఆంగ్లభాష చదువుకొని ఏం చేస్తావు?" అని ప్రశ్నించారు. పొట్టిగా, బక్క పలుచగా వున్న ఆ కుర్రాడు తడుముకోకుండా "ఇంగ్లీషు భాష నేర్చుకొని ఖురాను పవిత్ర గ్రంథాన్ని ఆభాషలోకి అనువదిస్తాను" అని సమాధానం చెప్పాడు.

ఆయన 1910 లో మెట్రికు పరీక్ష, 1915 లో బి.ఏ. పరీక్ష ప్రథమ శ్రేణిలో ప్యాసయ్యారు. బెగన్‌పల్లి నవాబు సోదరుడు, శాసన పరిషత్తు సభ్యుడు అయిన మీర్ అసద్ అలీ ఖాన్ ద్వారా సయ్యద్ నవాబు అలీ చౌదరీ (పాకిస్తాను మాజీ ప్రధాన మంత్రి మహమ్మద్ అలీ బోగ్రా తాత) వద్ద ప్రైవేటు సెక్రెటరీగా చేరారు. ఢాకా నుండి తిరిగివచ్చిన పిమ్మట ఆయన సర్ అఫ్సరుల్ ముల్క్ వద్ద పనిచేశారు.

లతీఫ్ ఆంగ్లభాషా వైదుష్యాన్ని సయ్యద్ ఇబ్రాహీం రహమతులా ప్రశంసించారు. పంచ్ గనీలో స్థాపించిన పాఠశాలలో ఆయనను ప్రధానాచార్యులుగా నియమించారు. రెండు సంవత్సరాల వరకు ఆయన ఈ పదవీ బాధ్యతను నిర్వర్తించారు.



1920 లో ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆంగ్లభాషా శాఖలో, ఆయన అసిస్టెంటు ప్రొఫెసరుగా నియమితులయ్యారు. వివిధ శాఖలలో పని చేస్తున్న నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం యూరపుకు పంపించాలని 1922 లో విశ్వ విద్యాలయం నిర్ణయించింది. వీరిలో డాక్టర్ అబ్దుల్ లతీఫ్ ఖలీఫా అబ్దుల్ హకీమ్, ప్రొఫెసర్ వహీదుల్లా రహమాన్ ఉన్నారు. ఈ నలుగురి ఉన్నత విద్యాభ్యాసానికయ్యే వ్యయం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేకుండా 30 వేల పౌండ్ల రుణాన్ని మంజూరు చేసింది. ఇంగ్లాండులోని కింగ్స్ కాలేజీ ఆంగ్లభాషా శాఖ ఆచార్యుడు, తదితర అధ్యాపకులు లతీఫ్ ప్రతిభా వ్యుత్పత్తులకు ఎంతో ముగ్ధులయ్యారు. బి.ఏ., ఎం.ఏ. పరీక్షలు పూర్తి చేయాలనే నిబంధన నుండి మినహాయిస్తూ నేరుగా పి.హెచ్.డి. చేయడానికి అనుమతి ఇచ్చారు. "ఉర్దూపై ఆంగ్లభాషా ప్రభావం" అనే విషయాన్ని గురించి పరిశోధనా గ్రంథం మూడు సంవత్సరాలలో పూర్తి చేయాలని నిర్ణయించ బడింది.

1923 జూన్ మాసంలో ఆంగ్లభాషా శాఖ ప్రొఫెసర్లు ప్రప్రథమంగా ఆంగ్లో–అమెరికన్ కాన్ఫరెన్స్ ఒకటి ఏర్పాటు చేశారు. ఈ కాన్ఫరెన్సులో కళాశాల అధికార వర్గం వారు లతీఫ్ గారికి డాక్టరేటు ప్రదానం చేశారు. అందుచేత నిర్ణయించిన గడువుకు ఒక సంవత్సరము ముందే ఆయన హైదరాబాదుకు తిరిగి వచ్చారు. విశ్వవిద్యాలయ ప్రొఫెసరుగా నియమితులయ్యారు.

సాహిత్య పరిశోధన, రచనా వ్యాసంగం కోసం ఎక్కువ సమయాన్ని వినియోగించాలనే ఉద్దేశంతో ఆయన సర్వీసు పింఛను తీసుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బయటికి వచ్చేశారు. క్లారియన్ (CLARION) అనే ఆంగ్లపత్రికను నడపాలని కూడా ఆయన సంకల్పించారు. ఈ విషయంలో ఖలీఫా అబ్దుల్ హకీమ్ ఆయనకు చేయూతనిచ్చారు. నియమావళి ననుసరించి పూర్తి పింఛను ఇవ్వడానికి వీలులేదు. అయినప్పటికీ విశ్వవిద్యాలయ అధికారులు తమకుగల విశేషాధికారాలను పురస్కరించుకొని ఆయనకు పూర్తి పింఛను ఇవ్వవలసినదిగా సిఫార్సు చేశారు ఆమోదం నిమిత్తం ఆ ఫైలు నిజాం ప్రభుత్వం వద్దకు పంపబడింది. ఉర్దూ భాషా వికాసం పట్ల తమకు గల అభిమానానికి తార్కాణంగా నిజాం ప్రభుత్వం పూర్తి పింఛను మంజూరు చేసింది

సాంస్కృతీ వికాసానికి ముసల్మానులు చేసిన సేవను గురించి డా॥ లతీఫ్ ఎంతో పరిశోధన చేసి అనేక వ్యాసాలు వ్రాశారు. ఇందు నిమిత్తం ఆయన రాజకీయ రంగంలో కూడ ప్రవేశించవలసివచ్చింది. "భారత దేశంలో ముసల్మానుల సంస్కృతి", "భారత దేశ సాంస్కృతిక ప్రాంతాలు" అనే పరిశోధనా వ్యాసాలు ఆయన పరిశోధనా పాటవానికి, స్వాయత్తమైన శైలికి రచనా ప్రౌఢిమకు నిదర్శనాల వంటివి. పరిశోధనాత్మకమైన ఈ రచనలు దేశం నలుమూలలా ముసల్మానులను ఉత్తేజితులను చేశాయి. ముసల్మానులకు ప్రత్యేక సంస్కృతి ఒకటి వున్నదనే సంగతి అప్పటివరకు తెలియదు. ఈ అంశాన్ని కూలంకషంగా చర్చించడంగాని, రచనల రూపంలో వెలువరించడంగాని జరిగియుండలేదు ముస్లిం ప్రజల భావాలను, అనుభూతులను సక్రమమైన రీతిలో ప్రతిబింబింప జేసే సాహిత్యం వెలువడలేదు అబ్దుల్ లతీఫ్ పండితుని ప్రశంసనీయమైన పరిశోధన కృషి ఫలితంగా ముస్లిం సంస్కృతికి సంబంధించిన విషయాలు సాహిత్యరూపంలో వెలువడ్డాయి. అవి గ్రంథ రూపంలో ప్రచురించబడిన తరువాత ఖాయదె ఆజం మహమ్మద్ అలీ జిన్నాతో ఆయనకు సన్నిహిత సంబంధం ఏర్పడింది. జిన్నా హైదరాబాదుకు వచ్చినప్పుడు లతీఫ్‌గారి ఇంట్లో బస చేశారు వారిద్దరు ప్రతిరోజు గంటల తరబడి చర్చిస్తూవుండేవారు. డా॥ లతీఫ్ అహర్నిశలు పరిశోధన, రచనా వ్యాసంగంలో నిమగ్నులవుతూ వుండేవారు. కాబట్టి రాజకీయాల పట్ల ఆసక్తి కనపర్చేవారు కాదు. రాజకీయరంగానికి తగినవాణ్ణి కానని భావించేవారు. అయినప్పటికి విభిన్న సిద్ధాంతాలకు కట్టుబడివున్న రాజకీయ నాయకులకు ఆయా సమస్యల వాస్తవ స్వరూపాన్ని వివరించిచెప్పి, వారిమధ్య సాన్నిహిత్యం పెంపొందింపజేయడానికి ఎట్టి ఆడంబరం లేకుండా గుప్తంగా కృషిచేస్తూ వుండేవారు. గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీ జిన్నా, మౌలానా ఆజాద్‌వంటి ప్రముఖ నాయకులకు అతి సన్నిహితంగా వుంటూ జటిలమైన పెక్కు రాజకీయ సమస్యల విషయంలో వారికి తగు సలహాలు ఇస్తూవుండేవారు. అవి చరిత్రాత్మకమైనవి. డా॥ లతీఫ్ జీవిత చరిత్రను వ్రాయదలచిన రచయిత ఆయా సందర్భాలలో ఆయన ప్రదర్శించిన రాజనీతి కౌశల్యాన్ని గురించి సవివరంగా తెలియజేయవలసి వుంటుంది భారతదేశం కోసం సమాఖ్య వ్యవస్థతో కూడిన రాజ్యాంగం ఒకటి రచించారాయన. పాకిస్తాన్ ఏర్పాటు విషయంలో అనేక పథకాలు ప్రతిపాదించబడినాయి, అందులో 'సాంస్కృతిక ప్రాంతాలు' అనే పథకంకూడ ఒకటి వున్నది. దాన్ని ఆయనే రచించి ప్రతిపాదించారు.

ముసల్మానులు ఎదుర్కొంటున్న సమస్యల వాస్తవ స్వరూపాన్ని ఒక పత్రికద్వారా అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో ఆయన "క్లారియన్" అనే ఆంగ్లవార పత్రికను నడపడం ప్రారంభించారు.

స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగుతున్న రోజులవి. పోరాటం ప్రాబల్యం పొందకుండా చూసే ఉద్దేశంతో విదేశీ ప్రభుత్వం దేశంలో ఇరు వర్గాల మధ్య కలహాలు రేపి అనైక్యతకు కారణభూతమైంది. ఈ దారుణ మారణ హోమాన్నిచూసి సర్ సయ్యద్ హృదయం నిరాశా నిస్పృహలకు లోనైంది. ఏదైనా ముస్లిం దేశానికి వెళ్ళి అక్కడ నివాసం ఏర్పాటు చేసికోవాలని నిర్ణయించుకున్నారాయన. అయితే ఆయన తమ నిర్ణయాన్ని మార్చుకొని తిరిగి జాతీయ సంగ్రామ రంగంలో దూకవలసివచ్చింది. అదే మాదిరిగా డా॥ లతీఫ్ "పోలీసు చర్య" అనంతరం మదీనాకు వెళ్ళి అక్కడ నివసించాలని కృతనిశ్చయులయ్యారు. అయితే ఆ నిర్ణయాన్ని ఎలా మార్చుకొన్నదీ ఆయన స్వయంగా చెబుతూ వున్నవుడు నేను వినడం తటస్థించింది.

"ఒక రోజున నేను సుషుప్త్యావస్థ, జాగ్రదావస్థకు అతీతమైనటువంటి ఒక అనిర్వచనీయమైన సమాధ్యవస్థలో లీనమై వున్నాను. నేను మహమ్మదు ప్రవక్త సమాధి ముందర కూర్చొని వున్నట్లు, వెంటనే ఒక సాధుపుంగవుడు నాయెదుట సాక్షాత్కరించినట్లు అనుభూతి పొందాను. ఆ సాధుపుంగవుడు మహమ్మదు ప్రవక్తేనని నేను భావించాను. నేను వినమ్రుడనై అతి మంద్ర స్వరంలో ఇలా విన్నవించుకొన్నాను "కరుణామూర్తీ! నన్ను మీ దగ్గరకు రప్పించుకోండి". అందుకు ఈ విధంగా సమాధానం లభించింది. "నీవొక పవిత్రమైన కర్తవ్యాన్ని నిర్వర్తించవలసి వున్నది. ఆ కరవ్య సిద్ధి కోసం ఇదివరకే కొంతకృషి సల్పినావు. కనుక ఇక్కడకు వచ్చి నీవు చేసేదేమున్నది?". అప్పటి నుంచి మదీనాకు వెళ్ళాలనే నిర్ణయాన్ని మార్చుకున్నాడాయన. ధర్మ ప్రచారమే తమ పవిత్ర లక్ష్యమని ఎంచి తదాశయసిద్ధికై చివరి ఘడియ వరకు అవిరళమైన కృషిసల్పి కృతార్థుడైన ధన్యజీవి ఆయన

పోలీసుచర్య అనంతరం డాక్టరుగారు పంచ్‌గనీకి వెళ్ళి మూడు నెలలపాటు అక్కడ వున్నారు. అక్కడనుంచి తిరిగివచ్చి 1950లో కర్నూలు ఉస్మానియా కళాశాలలో ప్రధానాచార్యులుగా

చేరారు. 1952 వరకు ఆయన ఈ పదవీబాధ్యతలను నిర్వహించారు. ఆ సంవత్సరంలోనే మౌలానా ఆజాద్‌గారి సహాయ సహకారాలతో ఆయన "ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండో-మిడిల్ ఈస్ట్ కల్చరల్ స్టడీస్" అనే సంస్థను నెలకొల్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇందునిమిత్తం ఆర్థిక సహాయం అందజేశాయి. ఈ సంస్థతరఫున దాదాపు 40 రచనలు ప్రచురించబడ్డాయి. "ఖురానుచే ఉత్తేజితమైన మేధస్సు" అనే ఉద్గ్రంథం 1952లో ప్రకాశితమైనది. ఆ ఆంగ్ల గ్రంథం ఆయన రచనలన్నిటిలోకి మకుటాయమానమైనది. అది ఇస్లాం ధార్మిక గ్రంథాలలో ఉత్కృష్టమైన స్థానాన్ని ఆక్రమించింది. ఆ గ్రంథం ప్రాగ్దేశీయుల భావనా వైఖరిలో విశేషమైన మార్పు తీసుకు వచ్చింది. క్రైస్తవ మిషనరీలు ఇస్లాం మతాన్ని అతి తీవ్రంగా విమర్శిస్తూ వుండేవారు. ఆ గ్రంథ వెలువడిన తర్వాత విమర్శనలు చాలా వరకు తగ్గినాయి. ఇస్లాం మత ప్రవచనములు అతి సరళమైన శైలిలో అనువదించబడ్డాయి. అత్యుత్తమమైన ఆ అనువాద విధానం పాశ్చాత్య దేశాల యందలి పలువురు విద్వాంసుల ప్రశంస లనందుకున్నది.

ఇండో-మిడిల్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా జరిగిన సాహితీ కృషిఫలితంగా డాక్టరుగారు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు సన్నిహితులు, ప్రీతి పాత్రులయ్యారు. సుప్రసిద్ధమైన "తర్జుమానుల్ ఖురాన్" అనే తమ గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించవలసిందిగా 1951లో మౌలానా ఆజాద్ డాక్టరుగారిని కోరారు. ఆ గ్రంథం దీర్ఘ సమాన భూయిష్ఠమైనది. రచనా శైలి అతిప్రౌఢమైనది. విద్వదౌషధం వంటి ఆ మహాగ్రంథాన్ని అనువదించే బ్రహ్మాండమైన కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. వాస్తవానికి ఆ గ్రంథానువాదం ఆయన విద్వత్తుకు పరీక్షవంటిదని చెప్పవచ్చు. ఇతరులెవ్వరు సాహసించలేని బ్రహ్మాండమైన కృషికి పూనుకున్నారాయన. డాక్టరుగారు నాలుగు సంవత్సరాల వరకు అనగా మౌలానా ఆజాద్ మరణించేంత వరకు ఎన్నో పర్యాయాలు ఆయన వద్దకు వెళ్ళి అనువాదాన్ని గురించి చర్చించారు. మౌలానా ఆజాద్ అవసాన సమయంలోకూడా డాక్టరుగారు ఆయన చెంతనే ఉన్నారు. ఆ విధంగా డాక్టరుగారు దీక్షాబద్ధులై ఎంతో దుస్సాధ్యమైనప్పటికీ అతి ప్రధానమైన ఆ అనువాద కార్యాన్ని జయప్రదంగా పూర్తిచేశారు. బొంబాయిలోని ఏషియా పబ్లిషింగ్ హౌస్‌వారు ఆ గ్రంథం తాలూకు రెండు భాగాలను ముద్రించారు. మూడవ భాగాన్ని ఇంకా ముద్రించలేదు. ఈ విషయంలో అవసరమైన జాప్యం చేస్తున్నారని, జాప్యం చేయకుండా వెంటనే మూడవ భాగాన్ని ముద్రించేటట్లు చూడాలని డాక్టరుగారు అనేక మార్లు ప్రచురణ కర్తలను కోరారు.

తర్జుమానుల్ ఖురానుకు అనువాద సాహిత్యంలో అత్యున్నతమైన స్థానం లభించింది. డాక్టరుగారి ఆంగ్లభాషా వైదుష్యం అనుపమానమైనది. ఆంగ్లభాషతో ఆయనకుగల ప్రజ్ఞా ప్రాభవాలు ఆ గ్రంథంలో సర్వత్రా గోచరమౌతూ ఉంటాయి. అది అనువాద గ్రంథమైనప్పటికీ ఒక స్వతంత్ర రచనగా దానిని తీర్చిదిద్దారు. అది ఇస్లాం సాహిత్య ప్రపంచానికే గర్వకారణమైనది.

డాక్టర్ లతీఫ్ తమ జీవిత పర్యంతం సాగించిన సంతత సాహితీ కృషిలో ఖురాను అనువాదం అతి ప్రధానమైనది. ప్రపంచ భాషలన్నిటిలో మిక్కిలి ప్రసిద్ధివహించిన ఆంగ్లభాష యందు ఆ గ్రంథం అనువదించబడింది. ఆ భాగవతోత్తముని జీవితమంతా ఆ మహత్తర కార్యాన్ని పూర్తిచేయడంలోనే గడచి పోయిందని చెప్పవచ్చు.

భగవంతుని సృష్టి అతి విచిత్రమైనది. తన భక్తి శిఖామణులను అడుగడుగునా పరీక్షించి వారికి అత్యున్నతమైన స్థానాలను ప్రసాదిస్తాడు. ఖురాను పవిత్ర గ్రంథాన్ని ఆంగ్లంలో అనువదించడానికి ప్రారంభించకముందే డాక్టర్ లతీఫ్‌కు భగవంతుడు ఆంగ్లభాషలో అప్రతిమానమైన పాండిత్యాన్ని ప్రసాదించాడు. భగవద్దత్తమైన ఈ పాండిత్య ప్రకర్ష మూలంగా ఖురానును ఆంగ్లంలోకి అనువదించి ఆయన అజరామరమైన కీర్తిగడించారు. భగవంతుడు ఆయనచేత అనేక గ్రంథాలు వ్రాయించి ఇస్లాం సాహిత్య ప్రపంచంలో "నభూతో నభవిష్యతి" అనదగిన స్థానాన్ని ప్రసాదించాడు. అది మక్కీకి మక్కీ అనువాదం కాదు. ఖురాను ప్రవచనాలలో ప్రపంచితమైన ఆధ్యాత్మిక సారాన్ని సులభగ్రాహ్యమైన శైలిలో ఆంగ్లంలోకి అనువదించారు.

డాక్టరు లతీఫ్‌కు డాక్టర్ సర్ మహమ్మదు ఇక్బాల్‌తో కూడా సన్నిహిత సంబంధం ఉన్నది. వారిద్దరు అత్యున్నత సాహిత్య సరళిలో చర్చలు జరిపేవారు. డాక్టర్ ఇక్బాల్ స్వయంగా వ్రాసిన ఉత్తరాలను నేను లతీఫ్‌గారివద్ద చూశాను. వారి మధ్య జరిగిన సాహిత్య చర్చలు గురించి నేను ఆ ఉత్తరాలలో చదివాను. డాక్టర్ లతీఫ్ నిరాడంబరుడు. కీర్తి కాంక్ష ఎంతమాత్రమూ లేదు. అందుచేత సాహితీ పరంగా ప్రధానమైన ఆ లేఖావళిని అచ్చువేయించటానికి ఆయన సమ్మతించలేదు.

డాక్టరు ఇక్బాల్ మరణానంతరం ఆయన అంతరంగిక కార్యదర్శి అయిన శ్రీ మహమ్మదు షఫీ, డాక్టరు లతీఫ్‌కు ఒక ఉత్తరం వ్రాస్తూ ఇలా పేర్కొన్నారు.

కీర్తిశేషులైన డాక్టర్ ఇక్బాల్ మీపట్ల ఎంతో పూజ్య భావం కలిగి వుండేవారు. మీ ఇరువురి మధ్యగల సాన్నిహిత్యం, ప్రగాఢమైన స్నేహం, ఆత్మీయత మరువరానిది. ప్రసక్తి వచ్చినపుడు ఆయన మిమ్మల్ని విశాలహృదయులైన సాహితీవేత్తగా, మేధావిగా, అభివర్ణించేవారు ఇస్లామ్ ప్రవచనాల అధ్యయనం కోసం ఒక విద్యాపీఠాన్ని స్థాపించాలని, మిమ్మల్ని ఇక్కడికి రప్పించి ఆ విద్యా పీఠానికి అధ్యక్షులుగా నియమించాలని ఆయన సంకల్పించారు. వాస్తవానికి మీరు ఒక ఆప్తమిత్రుణ్ణి కోల్పోయారు మీకు వ్యక్తిగతంగా తీరని నష్టం వాటిల్లింది. అందుకు నేనెంతో విచారిస్తున్నాను.

అదే మాదిరిగా హైదరాబాదులోని ప్రముఖ సూఫీ తత్వవేత్త, పండితుడు అయిన మౌలానా అబ్దుల్ ఖదీర్ సిద్దిఖీ హస్రత్ కూడ డా. లతీఫ్ యొక్క ముఖ్య స్నేహితులలో ఒకరు. 1920 సంవత్సరము నుండి అనగా డా లతీఫ్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరినప్పటినుండి వారిరువురి మధ్య స్నేహం

పెంపొందింది. మౌలానా అబ్దుల్ ఖదీర్ ఉస్మానియా విశ్వవిద్యాలయ తత్వశాస్త్ర శాఖలో అధ్యాపకులుగా పని చేస్తూ ఉండేవారు. డాక్టర్ లతీఫ్‌కు నిశ్చితమైన అభిప్రాయాలు కొన్ని వుండేవని వాటిని సాధించడానికి త్రికరణ శుద్ధిగా కృషిచేశారని గొప్ప భావుకులని మౌలానా అబ్దుల్ ఖదీర్ ఒక సందర్భంలో పేర్కొన్నారు. వారి మైత్రి ఇస్లాం సాహితీ చరిత్రలో ప్రధాన స్థానం వహిస్తుంది.

డా॥ లతీఫ్‌కు సమకాలికులైన ఇస్లాం విద్యావేత్తలను రెండు వర్గాలుగా విభజించవచ్చును. ఒక వర్గం వారు సంప్రదాయ వాదులు, అనుసరణవాదులు సనాతన సంప్రదాయాలను, ఆచారాలను యధాతధంగా పాటించాలంటారు ఈ వర్గం వారు. రెండవ వర్గం వారు హేతువాదులు. మార్పును అభిలషిస్తారు. ప్రతి విషయాన్నీ ఒక నూతన దృక్కోణంతో విమర్శిస్తారు. సంప్రదాయ వాదుల మూఢ విశ్వాసాలను ప్రతిఘటిస్తూ డా. లతీఫ్ ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. సంప్రదాయ వర్గంవారు డా. లతీఫ్‌ను కాఫిరు అని ప్రకటించారు. అయినప్పటికి డా. లతీఫ్ పరివర్తనాత్మకము, నవీన భావ విలసితము అయిన ఉద్యమాన్ని విడనాడలేదు.

ఈ ఉద్యమానికి మౌలానా అబ్దుల్ ఖదీర్ సిద్దీఖీవంటి ప్రముఖ ఇస్లాం తత్వవేత్తల అండదండలు కూడా లభించాయి.

ఆరోజుల్లో నిభిన్నమైన సిద్ధాంతాలకు కట్టుబడివున్న వర్గాలు రెండు వుండేవని ఇంతకుముందే తెలియజేశాను. ఈ ఇరు వర్గాల సిద్ధాంతాలు పరస్పర విరుద్ధమైనవి. ఈ రెండు వర్గాల వారిని ఒక వేదికపై సమావేశపరచి వారి మధ్య అవగాహన, సామరస్యం పెంపొందింప జేయవలసిన అవసరం ఏర్పడింది. ఈ మహత్తర కార్య నిర్వహణకై సారధ్యం వహించి, ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన మార్గదర్శకమైన సూత్రాలను అన్వేషించే భారం డా॥ లతీఫ్ మీద మోపబడింది.

డా॥ లతీఫ్ బహుముఖ ప్రజ్ఞాశాలి గానే కాకుండా ఒక సంస్థగా విలసిల్లారు ఆయన ఇంటో ఎల్లప్పుడు విద్వజ్జన గోష్ఠులు జరుగుతూ వుండేవి. శిష్యులను ఎంతో ఆప్యాయంగా చూసుకునేవారు. ప్రతి ఒక్కరిని ప్రోత్సహిస్తూ వుండే వారు. కొన్ని సందర్భాలలో శిష్యులను మందలించేవారు కూడా. నా ప్రసంగం ఒకటి ఇటీవల రేడియోలో ప్రసారమైంది. ఆ ప్రసంగంలో నేనీ విధంగా పేర్కొన్నాను. పగలంతా నేను రెవిన్యూ బోర్డు కార్యాలయంలో పనిచేస్తూ వుండేవాణ్ణి. సాయంత్రం కార్యాలయంలో పని ముగించుకొని 480, ఆగాపురా ఇంటికి వెళ్ళుతుండేవాణ్ణి. అప్పుడు నేను ఒక ప్రభుత్వ అధికారిగా కాకుండా ఒక విద్యార్థిగా భావించుకునే వాణ్ణి. డా. లతీఫ్ అతి గంభీరంగా ఉపన్యసించేవారు. ఆ ఉపన్యాసాలలో ఆయన పాండిత్య ప్రకర్ష, తత్వశాస్త్ర అభినివేశం వెల్లడవుతూ వుండేవి. సమావిష్టులైన వారిలో వివిధ రంగాలకు చెందిన వారు, డాక్టర్లు, అధికారులు, అధ్యాపకులు, ఆచార్యులు, మతగురువులు ఉండేవారు అందరమూ ఆయన ఉపన్యాసాలను మిక్కిలి శ్రద్ధాసక్తులతో వింటూ వుండేవాళ్ళం. అతి నిగూఢమైన తాత్వికవిషయాలను గురించి, సాహిత్యాంశాలను గురించి మహోపన్యాసం గావించేవారు ఆయన. ఆ వాగ్ఝరి అబిసీనా, ఇబక్‌రషద్, ఇమామ్ గిజాలి, మౌలానా రోమ్ జమాలుద్దీన్ ఆఫ్ఘానీ, డా. ఇక్బాల్, వంటి మహాపురుషులు ఉపన్యసిస్తుంటే వింటూవున్నట్లుగా అనుభూతి పొందుతూవుండేవాళ్లం.'

డా॥ లతీఫ్ తమ జీవితంలో ఎన్నో మహత్తర కార్యాలు సాధించినప్పటికీ గౌరవ ప్రతిష్ఠలు లభించినప్పటికి గర్వం ప్రకటించలేదు. ఆయన పేరు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడలేదు. తాను నిమిత్తమాత్రుడనని ఈశ్వర దేశానుసారం నడచు కోవడమే తన పవిత్ర కర్తవ్యమని డా॥ లతీఫ్ వ్రాకుర్చేవారు. ఆయన ఐహిక వాంఛలకు లోనుకాలేదు.

డా॥ లతీఫ్ ఆదర్శ పురుషుడు మహా మనీషి. జీవిత పథంలో ఎన్నో పర్యాయాలు ఇక్కట్లు ఎదురైనప్పటికీ వాటిని పట్టుదలతోను, మొక్కవోని ధైర్యంతోను ఎదుర్కొని ఆదర్శ ప్రాయమైన లక్ష్యాలను సాధించారు. చివరి రోజుల్లో తీవ్రమైన అస్వస్థతకు గురైనప్పటికి ఎంతో సహనంతో బాధను భరించారు. ఒకనాటి రాత్రి ఆయన అపరిమితమైన బాధను, దుస్సహమైన ఆవేదనను అనుభవించారు. మరుసటి ఉదయం తనను కలుసుకోవడానికి వచ్చిన వారితో గడచిన రాత్రి తాను పొందిన అనుభూతిని గురించి ఇలా చెప్పారు. జీవితంలో అడుగడుగునా పెట్టిన విషమ పరీక్షలు చాలవా? ఇంకా ఎన్నాళ్ళు నన్ను పరీక్షిస్తారు? అని నిన్న రాత్రి భగవంతుణ్ణి ప్రశ్నించాను. ప్రాపంచిక జీవితమే ఒక విషమ పరీక్ష అనే పరమ సత్యాన్ని తన జీవితం పర్యంతమూ చాటి చెప్పుతూ వచ్చిన ఒక మనీషి మాత్రమే అలా భగంతుణ్ణి ప్రశ్నించగలడు.

ఆయన చివరి క్షణం వరకూ నిర్విరామంగా కృషిచేస్తూనే వచ్చారు. ప్రవక్త ప్రవచనానుసారం అటువంటి నిర్విరామమైన కృషే ఆదర్శ పురుష జీవితానికి చిహ్నంగా భాసిస్తుంది.

ఒక వ్యక్తి తన జీవితంలో చివరి ఘడియ వరకు ఏ లక్ష్యం కోసం అహర్నిశలులూ పాటుబడతాడో వాటినిబట్టి ఆయన గుణగణాలను నిర్ధారించడం జరుగుతుంది. డాక్టర్ లతీఫ్ ఏ లక్ష్యం కోసం తమ జీవితాన్ని అంకితం చేశారో వాటికోసం ఆఖరు క్షణం వరకు కృషి సల్పుతూనే వచ్చారు. విజయం సాధించి యశస్సునార్జించారు.

ఔదార్యం, సర్వమత సమన్వయ దృష్టి, ఇతరుల భావాలను, ఆలోచనలను గౌరవించడం మొదలైన విశిష్ట లక్షణాలు ఆయన వ్యక్తిత్వంలో మనకు ప్రస్ఫుటంగా ద్యోతకమౌతాయి.

ఆయన గొప్ప భావుకుడు, విపశ్చితుడు, మేధావి, స్వేచ్ఛాజీవి, సత్య సంధత, సౌజన్యం, సౌభ్రాతృత్వం, సాధు హృదయం మొదలైన సద్గుణాలు మూర్తీభవించిన మహామనీషి. సాహిత్య సేవయే ఆయన ఊపిరి.

ఖురాను ప్రవచనాలలో ప్రపంచితమైన ధార్మిక ప్రబోధ ప్రచారాలకోసం ఆయన ఖురాను ట్రస్టు ఒకటి ఏర్పాటు చేశారు. వ్యాసం ఆరంభంలోనే ఈ సంగతి ప్రస్తావించబడింది. కొన్నాళ్ళ క్రితం ఆయన ఈ ట్రస్టుకు 20 వేల రూపాయల ద్రవ్యాన్ని ఇచ్చి ట్రస్టును పటిష్ఠం చేశారు.

1971 నవంబరు 4వ తేదీ ఉదయం 5. 30 గంటల సమయంలో ఆ మహాసాహితీవేత్త దైవసాయుజ్యం పొందారు. ★

తెలుగుసాహిత్య సమీక్ష 1971

తిరుమల రామచంద్ర

"మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాంతానిహి ప్రథంతే కావ్యాని"—కావ్యాలు శుభంతో ప్రారంభమై, శుభం మధ్యమధ్యన చెబుతూ, శుభంతో అంత మవుతాయి—అని మన ప్రాచీనాలంకారికులన్నారు. దీనికి అనుగుణంగానో అన్నట్టు తెలుగు సాహిత్య ప్రస్థానంలో 1971 వ సంవత్సరం శుభంతో అంతమయింది. ఈ శుభమనేది ఎవరు ఏమన్నా, ఎవరు కాదన్నా, ఎందరు వద్దన్నా సంభవించింది; ఇదొక మహాసంఘటన ఇది భారత దేశంలోని ఉత్తమోత్తమ వర్ణనాత్మక రచనకు ఇవ్వబడే భారతీయజ్ఞానపీఠ్ బహుమతి శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి "శ్రీరామాయణ కల్పవృక్షము"నకు లభించడం. ఇంత మాత్రాన 1971లో తెలుగు సాహిత్యంలోని కవిత తదితర ప్రక్రియలతో పాటు చతురస్రంగా తీర్చిదిద్దినట్టు పెంపొందిందనీ, మూడు పూవూలు ఆరవై కాయలుగా పండిందనీ అనలేము. జ్ఞానపీఠ్ బహుమతి ఈ సంవత్సరాంతంలో సంభవించిన, పూర్వతర సంవత్సరఫలితమైన యాదృచ్ఛికసంఘటన.

అయినా, 1971 తెలుగు సాహిత్యాభిమానులకు నిరాశ కలుగ జేయలేదనే చెప్పాలి. ప్రతి సాహిత్య ప్రక్రియా రంగంలోను హర్షదాయకమైన పైఖరులు, ఉత్తమ పరిణామానికి ఆస్కారమిచ్చే రీతులు పొడసూపి, పొడిగిల్లినవనే అనవచ్చు.

ఆదిమ మానవజాతిని మొదలు నేటి యాంత్రిక మానవుని సైతం అలరింపజేసే కవితలో సచ్ఛంద, అచ్ఛంద, విచ్ఛంద, స్వచ్ఛంద రీతులన్నీ బరాబరుగా వినిపించాయి అన్నిటా నిరసనతో నిరసన కవిత (Poetry of Protest) అని అనిపించుకొన్నది దిగంబరుల కవిత వినబడడం దూరమయింది; వారిగొంతుకూడ బావిలోని గొంతుకలాగ మారింది. ప్రాచీనఖండకావ్య ప్రతి ప్రత్తిని అందుకొన్న కథానిక ప్రమాణం కొంచెం దిగబడింది. కాని, కథానికల సంఖ్య పెరిగింది. విఖ్యాత కథకులు పలువురు మరుగయి పోతున్నారేమో ననే అనుమానం కలిగింది కాని కొందరు కొట్టవచ్చినట్టు ముందే వున్నారు. కొత్తవారు పెరిగారు. నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు కథానికల సంపుటిని ప్రచురించడం ఒక విశేషం. దీనివల్ల ఇతర భాషలవారికీ, ఖండాంతరాలకు ఒకప్పుడు పాకిన తెలుగు కథానికా ప్రతిష్ఠ తెలుస్తుంది. మహాకావ్య స్థాయిని అందుకొన్న నవల ఇటీవల నూరేళ్ల పుట్టినరోజు పండుగ చేసుకొన్నప్పటికీ, చెప్పుకోదగిన ప్రగతిని సాధించలేదనవచ్చు. కాని, చౌక నవలల సంఖ్య పెరిగింది చౌకగా లభించడమూ జరిగింది. నేషనల్ బుక్ ట్రస్ట్‌వారు శ్రీమతి ముప్పాళ్ల రంగనాయకమ్మగారి పేకమేడలను బలివాడ కాంతారావుగారి తమసోమాను. కొమ్మూరి వేణుగోపాలరావు గారి హౌస్ సర్జన్‌ను తక్కిన భారతీయ భాషలలోకి అనువదింప జేయడం చెప్పుకోదగిన విషయం మరొక ప్రశంసనీయమయిన సంగతి వేయిపడగల హిందీ అనువాదం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు గారు రచించినది—సహస్రఫణ్' ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ బహుమతి పొందడం. ఈ సంవత్సరం పెక్కు నవలలు వెండితెర యెక్కాయి. వాటిలో శ్రీమతి కె. విజయలక్ష్మి గారి నవల విధి విన్యాసాలు తాసీల్దారుగారి అమ్మాయి అన్న పేరుతో జనప్రియమయింది; విజయవంతమయింది.

విమర్శన సాహిత్యం పెరిగింది. విమర్శను సహించే గుణం తెలుగు రచయితలు కొంచెం కొంచెం అలవరచుకొంటున్నారు. ఇది నిజంగా మంచికే.

రివైవలిజం కొంత వచ్చింది. ప్రాచీన సాహిత్యంపై మమకారం, పఠనాసక్తి పెరిగాయి. ప్రచురణలోను కొత్త పద్ధతులు తలెత్తాయి. కొందరు చేరి పుస్తకాలు ప్రచురించుకోవడం ఎక్కువయింది. ప్రచురణ పరిశ్రమా పెరిగింది.

ఇతర భాషా సాహిత్యాల పట్ల ఆసక్తి పెరిగింది. సాహిత్య అకాడెమీల వంటి సంస్థలు ఈ విషయంలో చాలాకృషి చేస్తున్నాయి. స్థూలంగా ఈ అంశాలు దృష్టిలో పెట్టుకొని ప్రతిసాహిత్య ప్రక్రియా 1971లో ఎంతవరకు ముందంజ వేసిందో చూడడం వల్ల స్పష్టమయిన ప్రగతి మనకు అవగతమవుతుంది.

వచనకవితకు గుర్తింపు

ఈ సంవత్సరం వచన కవిత తెలుగు కవితా రంగాన్ని ఏలిందనవచ్చు. 1969 నుంచే సాహిత్య అకాడెమీ వచన కవితను (free verse) గుర్తించింది; మాత్రా ప్రధానమైన ఛందస్సును దేనినో అనుసరించిన గేయ కవితను ఇదివరకే గుర్తించింది. దీనికి తార్కాణం బహుమతులివ్వడం. కేంద్ర సాహిత్య అకాడెమీ శ్రీ బాలగంగాధరతిలక్ "అమృతం కురిసిన రాత్రి"కి బహుమతి యివ్వగా, 1970లోనే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ శ్రీకుందుర్తి ఆంజనేయులుగారి "నగరంలో వాన" అనే వచన కవితా సంపుటికి, 1971 లో శ్రీ బాపురెడ్డి గారి "బాపురెడ్డి గేయాలు" అనే మాత్రాచ్ఛంద గేయ కావ్య సంపుటికి బహుమతులిచ్చింది. దీనితో సాహిత్య అకాడెమీలు ఆధునిక కవితా ప్రక్రియలను ఆదరించడం లేదనే అపవాదు తొలగిపోయింది.

దిగంబరులు

వచన కవిత అన్నప్పుడు దిగంబరకవుల అభ్యుత్థాన పతనాలు చెప్పక తప్పదు. తెలుగునాడులోనే కాక భారత దేశంలోనే రచనలలో నూతనత్వానికి కారణమయిన సిద్ధాంతాలు మూడు–గాంధీజం, మార్క్సిజం ఫ్రాయిడిజం. ఈ మూడింటిలోని రెండవ దాన్ని అనుసరించిన వారు దిగంబరులు. వీరిలో కొందరు గిరిజన విప్లవం సమర్థించినవారు. వీరు మొదట్లో ఆరుగురు–నిఖిలేశ్వర్ నగ్నముని, చెరబండరాజు, జ్వాలాముఖి, భైరవయ్య, మహాస్వప్న. వీరి రచనలు కలిపి ఈ సంవత్సరం "దిగంబర కవులు" అనే పేర ఒక సంపుటిగా ప్రచురించారు, శేషాచలం అండ్ కంపెనీ వారు. ఒక పుస్తక ప్రచురణ సంస్థ ఈ కొత్త వైఖరిని గుర్తించి దాని ప్రచురణకు సిద్ధపడిందంటే, ఆ కవుల ప్రభావం ఎంతో అర్థమవుతుంది.

దిగంబరులది ప్రధానంగా నిరసన కవిత– Poetry of Protest. వీరు individualists గా ప్రారంభమయ్యారు, కవితవిలువలకు అపవ్యాఖ్యానాలు, అపార్థాలు కల్పించడం పనిగా పెట్టుకొన్నారేమోననిపిస్తుంది.

1970 లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం విచ్ఛిన్నమయి, ఆ సంవత్సరమే జులై నెలలో విప్లవ రచయితల సంఘం– రివెల్యూషనరీ రైటర్స్ అసోసియేషన్ ఆవిర్భవించింది. దీనికి కారకులు దిగంబర కవులు.

ఈ దిగంబర కవిత అనేది తెలుగు సాహిత్యంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. స్తబ్ధంగా ఉన్న సాహిత్య రంగంలో విమర్శనాత్మకమైన అలజడిని కలిగించింది. దిగంబర కవులు తమ కవితలలో అశ్లీల పదజాలాన్ని వాడి కొంత పాఠకుల వ్యతిరేకతకూ పాల్పడారు. అయినా, వారు వ్యక్తులలోని హిపోక్రసీని బయట పెట్టడమనే ఉద్దేశంతో బయలుదేరారు. ఈ వ్యక్తిగతమయిన హిపోక్రసీకి సంఘం ఎంతవరకు బాధ్యమో వారికి మొదట్లో తెలియలేదు అది గ్రహించిన మీదట మార్క్సిస్టులయ్యారు.

అయితే వీరి వచన కవితాప్రక్రియ (free verse) అంతటితో ఆగలేదు. వీరు ముక్త ఛందస్సు నుంచి జానపద సాహిత్యంవైపు మొగ్గి జానపద గేయాల రీతిలో వ్రాస్తున్నారు. కవిత ప్రజలలోకి చొచ్చుకపోవాలనే అభ్యుదయవాదుల వాదాన్ని నిజంచేయడానికి నూటికి నూరుపాళ్లు ఈ పక్కిలో వ్రాస్తున్నామంటున్నారు. దీనికి వీరిలో ఒకరు వ్రాసిన పోలీసును సంబోధించే గేయాన్ని పేర్కొనవచ్చు.

ఈ ముక్తచ్ఛందస్సు పద్ధతిలోనే శ్రీరంధి సోమరాజు కేవలపామరభాషలో "ఎదగండి" అనేవచన కవిత వ్రాశాడు ఇతడు మార్క్సిజం ప్రతికూలుడు. ఇలా అంటాడు; 'బూర్జువా పెళ్ళి కూతురులో'

" పోకండొరే పోకండి
ఎట్టా తోతే అట్టా పోకండి,
ఈగల కైనా ఓ దారుంది,
దోమలకైనా ఓ దారుంది,
ఆటికి తెలీదేటి
ఏడుందో బెల్లము, సెర్మము. "

ప్రొలెటేరియట్‌కు హెచ్చరిక చేస్తున్నాడు. ఈయన, ఇతరుల మాటలు విని మోసపోకండని, దేనిని గుడ్డిగా అనుసరించవద్దని, ఆలోచించి ముందుకు పొమ్మనిన్నీ దిగంబరుల ఆయుధంతోనే కొడుతున్నాడు. వారిని ఈయన.

'విరసం' కవుల సభలు ఈ సంవత్సరం సెప్టెంబరు నెలలో ఖమ్మంలో జరిగాయి

వచన కవితలో సెటైర్, భంగ్యంతరంగా చెప్పేపద్ధతిలో శ్రీ ఎ. సూర్యప్రకాశ్ (నిజామాబాదు) " సంస్పందన " ను పేర్కొనాలి,

'' అగ్నిని ఆర్పేయకండి
అగ్నికి వాయువు తోడయి,
లోకాన్ని శ్మశానం చేయగలదు
అప్రమత్తంగా గమనించండి, చాలు
అంతేకాని,
అసలు అగ్ని వద్దే వద్దని
వాదించకండి. "

అంటాడు, విప్లవం వద్దన్నవారిని, మరొక వ్యంగ్య కవిత " అభ్యుదయం '' ఉదహరిస్తున్నాను.

" మా అమ్మకు మీ యిల్లు నచ్చింది.
మా నాన్నకు మీ తోట నచ్చింది.

మీ అమ్మాయి కళ్ళజత నాకు నచ్చింది.

నాకు కట్నం వద్దు.

పూవులా సున్నితమైన మీ అమ్మాయిని నా పక్కన సుఖంగా కూర్చోబెట్టుకొని ఊరంతా తిప్పటానికి సరికొత్త ఫియట్ కారు మాకు కానుకగా ఇవ్వాలని పెద్దలు మీకు మాత్రం తెలియదటండీ ! "

ఈ సంవత్సరం కొందరు ఆధునిక కవులు భావంలోను, భాషలోను అస్పష్టత నుంచి స్పష్టతవైపు వస్తుండగా కొందరు

అస్పష్టత

మార్మిక వాదం గ్రహించి అస్పష్టతవైపు వెళ్ళుతున్నారు. ఈ ధోరణి 1969 లోనే శ్రీ వేగుంట మోహన్‌ప్రసాద్ " చితీ–చింత " కవితా సంకలనంలో కని

పించింది. అది ఈ సంవత్సరం శ్రీ మాదిరాజు రంగారావుగారి రచనలలో మరీ ఎక్కువయిందంటే ఎవరూ కాదనరు.

శ్రీ మాదిరాజు రంగారావుగారి "మానవీయం" అనే వచన కవితాకావ్యంలో మానవుడు ఆదినుంచి నేటివరకు గడపిన వివిధ జీవిత గతులు, కాలగతులు చిత్రించబడ్డాయి. ఉదయం, ఉదయం తర్వాత, జీవిక కోసం, బ్రతుకువంతెన-అశాంతి, యుగ దర్శనం అనే విభాగాలతో సాంకేతికంగా (సింబాలిక్‌గా) మానవజీవితం వ్రాశాడు. ఈయన చాలా హెచ్చుగా వ్రాసేవాడు. శాస్త్ర పద్ధతిలో వ్రాస్తాడు; కాని, సాంకేతికతవల్ల స్పష్టత దెబ్బతింటున్నదని నేను అనుమానిస్తున్నాను. "వయోలిన్‌పై రాగం" అనే ఇటీవలి కావ్యంలోను సింబాలిజం హెచ్చు:—

"గాలీ వెలుతురు ఆడని
నిశ్శబ్దం గడ్డకట్టిన గదిలో
రాతి పలకవలె నిలువకరా
తలుపులు తెరుచుకొని బయటికి"

అంటాడు.

అందువల్లనే మార్క్సిజంను అనుసరిస్తున్న మరికొందరు ఈ ముక్తచ్ఛందోవాదులపై చేసే విమర్శ ఇక్కడ ఉటంకించడం ఉచితమనుకుంటాను. "కవిత్వానికి ప్రధానమైన లక్షణాలు రెండు; ఒకటి గానయోగ్యత్వం; రెండవది ధారణాయోగ్యత్వం. నేడు జనంలో 80 శాతం నిరక్షరాస్యులు. వారికి అచ్ఛందంగా, స్వచ్ఛందంగా, సింబాలిజంతో సాంకేతికంగా వ్రాసే కవితలు ఎలా జ్ఞాపకం ఉంటాయి? ఎలా అర్థమవుతాయి? వీరు జనం కోసం వ్రాస్తామంటున్నారు. ప్రజలకు వీరు కళాశాల విజ్ఞానంతో వ్రాస్తున్న, సాంకేతికతాపూర్ణ కవితలు ఎలా అర్థమవుతాయి? ఇది మార్క్సిజం సూత్రాలకే విరుద్ధం. నేడు కావలసింది డెమోక్రటైజేషన్ ఆఫ్ ప్రొడక్షన్ కాదు, అది పూరిగా ప్రిమిటివ్. ఇప్పుడు కావలసింది డెమోక్రటైజేషన్ ఆఫ్ కంజంప్షన్. వీరు ప్రజల నుండి విడిపోయారు గనుకనే సింబాలిజం వెంట పడ్డారు." అని. ఈ విమర్శ సంగతి ఎలావున్నా కొందరు వర్తమాన కవులలో అస్పష్టత పాతుకొనడం మాత్రం నిజం.

వచన కవితలో కథా కావ్యాలు అనే నవ్య పద్ధతి శ్రీ కుందుర్తి ఆంజనేయులుగారి "తెలంగాణా" కావ్యంతో (1956) ప్రారంభమైందనవచ్చు. ఇది శ్రీ శీలా వీర్రాజు రచనలలో పుంజుకొని ఎదుగుతున్నది. దీర్ఘ ఖండికలు. దీర్ఘేతి వృత్తాల మీద ప్రాధాన్యం ఎక్కువయింది. కథానికలలో ఏ విధమైన ఇతి వృత్తాలు వస్తున్నాయో, అలాటి వాటికి కథాకావ్య రూపమిస్తున్నారు, కొందరు దీనికి శ్రీ శీలా వీర్రాజు కొడిగట్టిన సూర్యుడు, హృదయం దొరికింది శ్రీ కె. ఎస్. కె వెంకటేశ్వరుల శాలువోపాఖ్యానం ఉదాహరణాలు.

కథలే కాక తత్త్వచింతననూ. మరి కొన్నిటినీ కొందరు ఈ ముక్తచ్ఛందంలో ప్రయోగాత్మకంగా వ్రాశారు. తత్త్వ చింతనను మొదటి నుంచి చివరి వరకు సమతూకంతో కొనసాగేట్టు చేయడం కష్టం ఆలాటి ప్రయోగానికి ఉదాహరణ శ్రీ కొలిపాక మధు సూదనరావు గారి "అంతర్వీక్ష,"

"ఇంద్రధనుస్సు విరిసినపుడు
సాంద్ర తమస్సు విచ్చినపుడు
సెలయేటి గానం విన్నపుడు
జలజాత కుసుమం నవ్వినపుడు
చిరుగాలి తురంగలించినపుడు
వనరాశి తలలూచినపుడు
నేను కన్నపుడు, విన్నపుడు
అనుభవించినపుడు
ఇప్పటి నా అంచనాలను దాటి
ఆలోచనల అంచలాలను దాటి
అనుభూతి పొరలలో
ఎక్కడో లీలగా డోలగా నీవు.
మాటకు, పాటకు, ఆటకు
అలసటకు, అవధికి
లోబడని ఆనందస్వరూపిగా సువ్యక్తం"

ఇలా చివరి వరకూ భాష భావం తులితంగా (balanced) ప్రవహిస్తాయి.

కథా కావ్యాలు, కవితా సంకలనాలు

గణనీయమైన మరొక వచన కవితా కథాకావ్యం డాక్టర్ అరిపిరాల విశ్వంగారి "హడేబీకు" హొయ్సళ విష్ణువర్ధనుని కాలపు శిల్పుల ఉలుల మెలకువలకు జాగృతమై, రూపుదాల్చిన గండశిలల సోయగానికి విస్తుపోయి నిస్తుల నాట్యం చేసింది అరిపిరాల వారి లేఖిని వచన కవితలో. ఈ సంవత్సరానికే కాక గత దశాబ్దికి, భావి దశాబ్దికి కూడ ఇది గొప్ప వచన కవితా కథా కావ్య మనడంలో అతిశయోక్తి లేదు.

ప్రచురణ కర్తలు దొరకక, దొరికినా అతని వెంట తిరగలేక నలుగురైదుగురు కవులే కలిసి తమ కవితల సంకలనం ముద్రించుకోడ మనే పద్ధతికి (trend) దిగంబర కవులు దారి చూపగా ఆ దారినే "చేతనా వర్తం కవులు," మరికొందరు ఈ సంవత్సరం నడిచారు. చేతనా వర్తం కవులు సంపత్కుమార, సుప్రసన్న, వి. నరసింహారెడ్డి, పేర్వారం జగన్నాథం, ఈ నలుగురు. పేర్వారం జగన్నాథం సోషల్ సెటైర్ వ్రాస్తాడు సుప్రసన్న ఎక్కువగా అరవిందో తత్త్వం వ్రాస్తాడు. నరసింహారెడ్డి ఆధునికుడు. social consciousness కలవి వ్రాస్తాడు. సంపత్కుమార సంప్రదాయవాది. సుప్రసన్న, సంపత్కుమార సంప్రదాయ బద్ధంగా కవిత్వం చెబుతూ ఆధునికత వైపు మొగ్గినవారు. వీరంతా వరంగల్లు వారు. వీరి కవితా సంకలనం "చేతనా వర్తం."

"పారిజాతాలు" అన్నది వచన కవితలో సంపూర్ణ శృంగారం. ముగ్గురు కవులు ధైర్యం చేసి శృంగారం వ్రాశారు. భావ కవుల తర్వాత ఎవరూ ధైర్యంగా వ్రాసేవారు కారు, ఎక్కడ తాము అభ్యుదయ వాదులు కాక పోతామోనని. వీరు వ్రాశారు. హైదరాబాదు వారు.

"ఋతచేతన" మరొక సంకలనం. సాంఘికేతి వృత్తాలు తీసుకొని యు. పద్మనాభశర్మ, ఆర్ కృష్ణమూర్తి, జె చంద్రారెడ్డి, వి. శ్రీకాంతశర్మ వ్రాశారు. ఏది ఎవరి కవితో తెలియదు. ముఖపత్రంపై అందరిపేర్లూ ఉంటాయి. సిద్ధిపేటవారు. దీనిలో ఖండికలు రెండు ఉదాహరించడం

అవసరం—ఒక రచయిత "మనిషీ" అనే ఖండికలో

" చచ్చిన రోజుల సమాధుల దగ్గర
పుచ్చు చరిత్రకారులు పాడే
విషాద గీతంకాదు నేనురాసేది.
మనిషీ నీవెన్నడో చచ్చిపోయావు
నేనువ్రాసేది విన్నుపీడిన

అన్యాయం జరిగినా గొంతెత్తి నిరసించే తెలుగు కవీ రచయితా, నియంతల దౌర్జన్యాన్ని ఏకకంఠంతో నిరసించి బాంగా ప్రజలకు బాసటగా నిలబడ్డాడు; ఎక్కడన్న సాటి కవి, రచయితల గొంతుతో గొంతు కలిపాడు; సత్యాగ్రహకాలపు ఓజస్సు ప్రతిధ్వనిగానం చేశాడు ఛోటా కవులూ, బడా కవులూ బాంగ్లాదేశ్ వీర సమరాన్ని సమర్థిస్తూ కవితా సంపుటాలు ప్రచురించారు.

బంగ్లాదేశ్ కు జోహార్లు

చైతన్యాన్ని గురించి " అని వ్రాస్తాడు. రెండవ ఖండిక "కనబడుట లేదు." దీనిలో వ్యంగ్యంగా దేవుని లక్షణాలను విమర్శించాడు. వీరిలో ఒక కవి.

"ఆకారంలేదు. వయస్సులేదు,
మనస్సు ఉందోలేదో తెలియదు,
గుర్తులేమీ లేవు
మీకు కనబడితే ప్లీజ్
నాకు తెలియ జేయండి
మంచి బహుమానమిస్తాను."

భారత దేశం ఆర్తత్రాణ పరాయణత్వానికి పేరు పొందినట్టిది. శరణన్న వారిని కరుణించినట్టిది. అలాంటప్పుడు పొరుగునవున్న తూర్పు పాకిస్తాన్ ప్రజలు పశ్చిమ పాకిస్తాన్ నియంతృత్వం కిందనలిగి ఇక సహించలేక ఎదురుతిరగగా, నియంతృత్వం రాక్షసత్వంగా పరిణమించి వికటాట్టహాసం చేసినప్పుడు, ప్రజలు కష్టాలు భరించలేక, రాక్షసత్వాన్ని ఎదిరించలేక కాందిశీకులై భారత దేశానికి రాగా, భారత ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ, మానవత్వ దృష్టితో వారిని ఆదుకొని ఆశ్రయమిచ్చింది; రాక్షసత్వాన్ని ఎదుర్కొన్న వీరులకు, గత్యంతరం లేకి తోడ్పడి, వారి బంధనాలను తొలగించి స్వతంత్ర బంగ్లాదేశ్ అవతరించేటట్టు చేసింది. ఈ సమయంలో భారత దేశమంతటా మూడుదశాబ్దాలనాటి స్వాతంత్ర్య సమరావేశం వ్యాపించింది. ప్రతి పౌరుడు శ్రీమతి గాంధీ మానవతను ప్రశంసించాడు, ఆమె పనులను సమర్థించారు.

ప్రపంచంలో ఏ మూల ఎలాటి

వాటిలో పేర్కొనదగినవి ' సమర్ పథే బాంగ్లా ', " బాంగ్లాదేశ్ గీతాంజలి. " మొదటిదానిని వే. నరసింహారెడ్డి వరంగల్ నుంచి ప్రచురించారు. జనసంఘ్ మనస్తత్వంగలవారి మౌలికమైన కృషి యిది. దీనిలో దాశరథి డాక్టర్ సి నారాయణరెడ్డి, కాళోజీ. సుప్రసన్న మొదలైనవారి రచనలు ఉన్నాయి రెండవది వికాససాహితి, (మద్రాసు) ప్రచురించినట్టిది. దీనిలోని

"క్రొవ్వొత్తి లాగ కాలి
ప్రదీపించు వారికి
కైమోడ్చి లాల్ సలాం
సమర్పించుతూ పద"

అని "లాల్ సలామ్" శీర్షిక కింద శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి వ్రాసిన గేయం విశిష్టం. ఈయనే యాహ్యాఖాన్ సహాయంకోసం అమెరికా సప్తమనౌకాదళం బయలుదేరినప్పుడు వ్రాసిన మరొక గేయం "సెవెంత్ ఫ్లీట్" వ్యంగ్యంతో శత్రువునూ కవ్వించేట్టుంది.

"ప్రాణాలు లేనట్టి ఖాను నూరేగించ
ఏడుకట్ల సవారి ఎత్తుకొస్తున్నారు
తొలగండి తొలగండి దొరలు వస్తున్నారు
ఏడు కొయ్యల నావ
ఎక్కి వస్తున్నారు
గూని వీపున చీని
బీనాంబరాల్ చుట్టి
పరమీని అమ్మోరి గరగతెస్తున్నారు."

కృష్ణమూర్తి రచన ప్రతిదానిలోను, ప్రాచీన సంప్రదాయానికి చెందిన అపూర్వ విషయాలు చాల ఉంటాయి. ఏడుకట్ల సవారి. ఏడుకొయ్యలనావ, అమ్మోరి గరగ తెలుగు ప్రజల జీవన సంప్రదాయాలు. నెత్తిన దేవతలను పెట్టుకొని ఊరేగించే బుట్ట. మందపాకారమైన గంప. ఈ గొరగలు పూర్వం ఎన్నో అద్భుతాలు చేసే వారు నేటి బొమ్మరల్లలాగ. శ్రీనాథుడు క్రీడాభిరామంలో గరగ పడుచును వర్ణించాడు. ఆ గొరగె ఈ గరగ.

ఆధునిక కవితకు మొదటి ముగ్గురిలో ఒకడైన శ్రీ శ్రీరంగం నారాయణ బాబు కవితల సంకలనం 'రుధిర జ్యోతి' అనే పేరుతో ఈ సంవత్సరం చివర ప్రచురిత మయింది ఈ ముగురిలో తక్కిన ఇద్దరు శిష్ట్లా ఉమా మహేశ్వరరావు, శ్రీ రంగం శ్రీనివాసరావు 1930—40లలో యువకులను చాల ప్రభావితం చేసినవాడు, నారాయణ బాబు. ఈయన రచనలలో, సర్రియలిస్టిక్ ప్రభావం హెచ్చు.

మరొక విశిష్టమైన కవితావైఖరి సమైక్యాంధ్ర ప్రబోధం. మూడు ముక్కలుగా చెదరిన తెలుగు మాగాణం ఏకమయింది. ఎంతో త్యాగంతో దానిని మరికొన్ని ముక్కలు చేయడానికి కల్లోలం జరిగింది. ఆ వెర్రి ఆవేశంలో తెలుగునాడుకు తెలుగు ప్రజకు జరిగిన నష్టకష్టాలు ఇంతంత అనరానివి. కాని, రాష్ట్ర సమైక్య రక్షణలో కవులు, రచయితలు ఏకకంఠంతో పనిచేశారు. ఇలాటి సమైక్య సాధన గేయాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచారశాఖ వారు ప్రచురించి ఎంతో సేవ చేయడం విశేషం. ఈ సంపుటి పేరు " గీతావళి. "

సమైక్యత

దీనిలో పదిమంది ప్రముఖ కవుల రచనలున్నాయి, పాత కొత్త రీతులవి.

" సుందోపసుందులు కాకండర్రా.
ఓ తెలుగు యువకుల్లారా !
మిమ్మల్ని భ్రమింప జేస్తున్నరంభ
వట్టి పయోముఖ విషకుంభ "

అని శ్రీ బోయిభీమన్న హెచ్చరిస్తే, శ్రీ కుందుర్తి

"అవును ప్రజలు నిజంగా
నిద్రపోతున్నారు,
చైతన్యం చంద్రమండలానికి
వలసపోయింది
మనిషిశక్తికి పదునుపోయింది
చరిత్ర పొలంలో నాటదలచుకొన్న
పైరుకు అదునుపోయింది."

అన్నారు, ఆవేదనతో. "మనసులు మారాలి" అన్న ఖండికలో. శ్రీ కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి "ఆంధ్రప్రదేశప్రశస్తి" "సురభారతి" లో గానంచేశారు. "త్రైలింగో దేశ విషయ్రో విలసతు సదా సంపదుద్దామకోశ:" అంటూ. సంపదలకు మహాగారమైన విశాల ఆంధ్రప్రదేశ్ నిరంతరం జేగీయమానంగా ఉండనీ అని దీని అర్థం.

విచిత్రమేమిటంటే, ఇంతటి విప్లవ పరిస్థితిలోను, కష్టాలలోను శృంగారమే ప్రధానంగా పాడుకొనే శ్రీ బోయి భీమన్న వంటి వారూ ఉండడం. ప్రపంచం ఎక్కడ ఎంతగా పరితపిస్తున్నా ఆయన రసరాజమైన శృంగారానికి పట్టంకట్టి హాయిగా తన "రాళీలు" ఉమర్ ఖయ్యాం సాకీలు పాడినట్టు పాడారు. ఈయన దృష్టిలో స్త్రీ పురుషుల మధ్య ప్రేమ తప్ప మరొకటి ప్రధానంకాదు. అదే ప్రపంచాన్ని నడిపిస్తున్నదని ఈయన దృక్పథం. సృష్టికే మూలం కదా శృంగార రసం. ఆయన సిద్ధాంతం ఎందుకు కాగూడదు? అనిపిస్తుంది.

ఛందోబద్ధ కవిత

వచన కవిత, గేయకవిత, స్వచ్ఛంద, అచ్ఛంద కవిత ఇంతగా ఈ సంవత్సరం సామ్రాజ్యమేలినా, పధ్నాలుగు శతాబ్దాల పంట అయిన సాంప్రదాయిక ఛందోబద్ధ కవిత తన బలమైన గొంతును దిగంతాలు చీల్చుకొని వినిపించకపోలేదు ఈ గొంతుకు తార్కాణంగా రెండుకావ్యాలను పేర్కొన వచ్చు.

మొదటిది శ్రీఉత్పల సత్యనారాయణాచార్యుల "ఈ జంటనగరాలు హేమంత శిశిరాలు." ఇది వ్యంగ్య ప్రధానమైన కావ్యం ఇందులోని హేమంత శిశిరాలు దీన జనావళి వేదనకు ప్రతీకలు కవి కాంక్షించే వసంతం ప్రజామోదాన్ని సాధించే ఉజ్జ్వల భవిష్యత్తు. ఆర్థిక వ్యత్యాసాలు అంతరించిన సమాజ వసంతోదయానికై కవి ఎదురు చూచారు.


శ్రమవడినట్టి దొక్క తరు
జాలమెకాదు, చరాచర ప్రపం
చము శిశిరమ్మనందు నగ
చాటులు పడది, రమ్మహో వసం
తమ, సుమనోమనోజ్ఞహారి
దంతమ చెట్ల మొగాలపైని ము
చ్చెమటలు వోని యీ యివము
చెమ్మల నద్ది సమాశ్వసింపుమా.

అంటాడు షెల్లీకవి అన్నట్టు "If Winter comes can Spring be far behind?". వసంతం తప్పదు గదా:

క్రీడాభిరామం విశ్వగుణాదర్శం పట్టణ, విశ్వ విశేషాలను యిద్దరితో చెప్పించగా, ఈయన 'సంప్రదాయ భావాభ్యుదయ విప్లవ కవుల నెల్లర శాఘించి, సంభావించి, యాదరించి, యభినందించి హాస్యరిత ప్రాయంబును, నగర విశేష వర్ణనా వర్ణ నీయంబును సత్యపూర్వకంబగు నితి వృత్తంబు గల్పించుకొని యాత్మాశ్రయంబుగా' ఈ కావ్యం చెప్పారు

రెండవది "చక్రార పంక్తిరివ" దీని రచయిత శ్రీ ఆచార్య తిరుమల, కాశా లో ఉపన్యాసకులు. బండి చక్రంలోని ఆకులు చక్రం తిరుగుతూన్నప్పుడు కిందమీదయినట్టు భాగ్యం కూడ "చక్రార పంక్తిరివ గచ్ఛతి భాగ్యపంక్తి:" అని భాసుడు స్వప్నవాసవదత్తలో యౌగంధరాయణునితో పలికిస్తాడు. ఈ భావాన్నే కాళిదాసు మేఘసందేశంలో యక్షునితో "చక్రనేమిక్రమేణ" అనిపించాడు. భాసుని మాటను తన కావ్యానికి ఆచార్య తిరుమల శీర్షికచేసి చక్రారపంక్తివలె సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకు జరిగే దైనందిన సంఘటనలను, కోపంతో, ఆవేశంతో, ప్రేమతో, పరితాపంతో, వాత్సల్యంతో వర్ణించారు. సంస్కృతాను వాదాలలో శ్రీ వేదుల సూర్యనారాయణ శర్మ "లక్ష్మీసహస్రం" ఎన్నదగింది.

(సశేషం)



తెలుగు భాష ప్రత్యేకత అవధానములు

కోట వీరాంజనేయ శర్మ

"చిత్తైకాగ్ర్యమవధానం" అని, అవధానశబ్దానికి ప్రాచీనులు నిర్వచనం చేశారు. అంటే చిత్తం బహు విషయాలల్లో సంచరిస్తున్నా వానిలో సంలీనం కాకుండా యథావిధంగా స్మృతి పథంలో నిల్పుకోవటమన్నమాట. ఇంకా సులభముగా చెప్పాలంటే కంటితో చూచినదీ, చెవితో విన్నదీ, వాక్కుతో చెప్పినదీ మార్పులేకుండా తిరిగి వల్లించటం. దీనినే జ్ఞాపకమనీ ధారణ అనీ పర్యాయంగా వాడతారు. ఈ లక్షణం ప్రథమంలో వేదపండితులకే పరిమితమైంది. ఎందుకంటే ఉదాత్తానుదాత్త స్వరితములతో గురుముఖోద్గతమైన వేదము శ్రవణద్వారమున గ్రహించి తు-చ- తప్పకుండా చెప్పడం జరిగేది. అందులకే వారిని అవధానులని పిలిచేవారు. రాను రాను వేద పరీక్షలు కూడా జరగటం మొదలైంది. తర్వాత క్రమంగా సాహిత్య ప్రపంచములో అడుగు పెట్టింది. మహా మేధావులైన పండితులు ధారణా శక్తికీ, పాండిత్యానికీ కలిపి కవిత్వరూపంలో క్రొత్త ప్రక్రియ కనుగొన్నారు.

అదే ఆశువు, ఈ ఆశువు ఏశుభముహూర్తంలో సాహిత్యంలో ప్రవేశించినదో కాని బహుముఖ విన్యాసాలకు ఆటపట్టైంది. ఎలాగంటే వేదపరీక్షలు జరిపేవారు ఎక్కడో మారుమూలలో ఉన్న ఒక పన్నంలో ఏదో ఒకచోట అల్పభాగం చదివి ఆ తర్వాత మంత్రం పూర్తిగా చదివి అది యేపన్నంలోదో చెప్పమనే వారు. కాదా కొన్ని విడి విడి వాక్యాలు చెప్పి ఇవి ఎందులో ఉన్నవో చెప్పమనేవారు. అది కాకపోతే ఫలాన మంత్రంలోనో. పన్నంలోనో ఈ భాగం చదివి మంత్రార్థం చెప్పమనేవారు, ఇదికాకపోతే శరీరం ఏ మాత్రం ఎక్కడా కదలకుండా వేదం ఘన, జటలతో అపస్వరం లేకుండా అపశ్రుతి లేకుండా నిండు సభలో మహాపండిత పరీక్షాధికారుల సమక్షంలో నదురూ బెదురూ లేకుండా వల్లించమనేవారు. ఇదంతా ఎందుకంటే గ్రంథ సహాయం లేకుండా స్వయంస్ఫురణలో చదివిన చదువు చేసిన పరిశ్రమ ప్రతిఫలించటానికి అంతటి శ్రద్ధాసక్తి భక్తి గౌరవాదరములావిద్యయం దాయభ్యాసకునికి కలిగి ఉండేవన్న మాట, నియమ సంయ్యమనిష్ఠా పరిశ్రమలలో వదిలోపించినా ఈ వేదవిద్య లభించేదికాదు. ఆ మాటకు ఒకటే ఒక ప్రబల నిదర్శనం, యుగయుగాలుగా, మన్వంతరాలుగా ఏ నాడు ఏ ఋషి ముఖోద్గతమై ఏ అంతేవాసికి ఏ క్రమంలో పాఠం చెప్పబడిందో అదే యీనాటి వేదవిద్యార్థికి కూడా మార్పులేకుండా సంక్రమించటం. ఈ అనుస్యూత కర్మే వేదమాతకు రక్షకవచమైంది. ఈ వేద శాఖతో పాటే సాహిత్యశాఖ కూడా పోటీపడి తన అస్తిత్వాన్ని తత్తుల్యంగా పెంచుకుంటూ వచ్చి ఆశుకవితారూపంలో కొత్తపుంత త్రొక్కి, ఒకశ్లోక పాదమిస్తే మిగిలిన మూడు పాదాలూ పూరించటం ఒక క్లిష్టమైన శ్లోకం చదివి దండాన్వయఖండాన్వయములు చెప్పడం: కొన్ని పదములిచ్చి విషయమిచ్చి ఆ పదములను కోరిన స్థానాలల్లోనిల్పి కోరిన శ్లోకంలో ఆ విషయం పూర్ణంగా వచ్చునట్లు చెప్పటం, అనర్థశబ్దాలు, లేక అసభ్యశబ్దాలు కల్పించి ఒక పాదంగా చేసిఇచ్చి సభ్యంగా, అర్థయుక్తంగా పుష్టిగా తుష్టిగా పూరించటం, అనుష్టుప్ శ్లోకాన్ని వ్రాసి, క్రమసంఖ్యలు అక్షరముల శిరస్సుపై వేసి, చించి, అక్రమవిధంగా అంటే స్వేచ్ఛా రూపంలో విడివిడిగా అప్పుడప్పుడు ఇచ్చి కొంత కాలం గడిచిన తర్వాత ఇచ్చిన సంఖ్యాక్షర స్ఫురణతో క్రమబద్ధంచేసి ఆ శ్లోకాన్ని యథాతథంగా చదవటంవంటి కొన్ని విలక్షణ ప్రక్రియల సృష్టించుకుంటూ, మానవ మేధా చరమస్థాయికి పయనించింది. ఈ విధంగా భిన్న పద్ధతులతో, భిన్నభిన్న కాలాల్లో అభివృద్ధి చెందుతూ వస్తున్న ఈ ప్రక్రియల పరిశీలించి, పరిశోధించి ఇవి అన్నీ ఏకకాల ప్రదర్శనకెట్లు సాధింపవచ్చునన్న ఆలోచన ప్రారంభమై మొదట గ్రహణ ధారణశక్తిని పట్టుకున్నారు. కాని, అనుకున్నంత పని సాధించలేకపోయినారు. అందులకు కారణం, మనస్సు అనుక్షణం చంచలమైంది కనుక. మనస్సును నిరోధించాలంటే : యోగం కావాలి. అది గృహస్థులకు సాధారణ కర్మ కాదు. అందుకని ఉపాసనా మార్గంలో ప్రవేశించారు. ఈ సారి సహజ మేధా సంపదకు దైవీ సంపద తోడైంది. లక్ష్యం సిద్ధించింది. ఆ మహాశక్తికీ విశ్వంలో సాధింపలేనిదంటూ లేదని నమ్మకం కలిగి గడియ కాలంలో నూరు పద్యాలు చెప్పగలిగారు పిమ్మట నూరుగురికి వారు కోరిన రీతిలో పద్యాలు చెప్పారు. చెప్పినవన్నీ తిరిగి వల్లించారు. ఈ విధానమే కొంచెం మార్పులతో నేడు శతావధానం అంటున్న రూపంలో దర్శనమిచ్చింది. సారాంశమేమంటే : శతావధాన ప్రక్రియ సాహిత్య రంగంలో మానవ మేధాయవనిక తొలగించుకొని ప్రత్యక్ష మయిందన్నమాట. ఎప్పుడైతే మసక మసక తనం వదలి ఈ ప్రక్రియ ఆకృతి దాల్చిందో అప్పటి నుంచీ చిలవలూ, పలవలూ సంతరించుకుంటూ శోభాయ

మానంగా పెరిగింది. బహుకాలంగా గొడ్రాలుగా సంఘంలో నిర సింపబడుతూన్న ఇల్లాలు ఒక శుభసమయంలో పుత్రవంతురాలైతే ఆ యమ్మ ఆ చిన్నారి బిడ్డపై ఎంత వాత్సల్యం కురిపిస్తుందో, ఎంత మమకారం పెంచుకుంటుందో, ఎంత అనురాగం ఒలకబోస్తుందో అనుక్షణం ఎంత శ్రద్ధాసక్తులు కనపరుస్తుందో తెలియని విషయమేమీకాదు. ఆ విధంగానే సారస్వత లోకం ఆ

అష్టావధానం హృదయ భృంగాలను ఆకర్షించే అష్టదళపద్మం

శతావధాన బీజాన్ని నాటి, నిరంతర బహుముఖ పరిశ్రమ జల సేచనంతో దోహద క్రియలాచరించి మహా శాఖిగా చేసింది. అందుకే భట్టుమూర్తి తన కావ్యాల్లో ఒక చోట "శతలేఖినీ పద్యసంధాన ధౌరేయుడ" నని, "నను శ్రీరామ పదారవింద భజనా నందున్, జగత్ప్రాణ నందన కారుణ్య కటాక్షలబ్ధ కవితాధారా సుధారాశి, సంజనితైకైక దినప్రబంధఘటనా సద్యశ్శత గ్రంథకల్పనుని" అని చెప్పుకున్నాడు. తరువాత "అష్టావధానము" అనేనామంతో ప్రక్రియ అవతరించింది. శతావధానంవలె అష్టావధానంచేస్తే విషయగౌరవం ఉండదు కదా అందుకని శతావధానంలోని రెండు మూడు విషయాలు తీసుకొని తక్కిన సంఖ్యా పూర్తికి ఇటు పాండిత్యానికీ అటు లోకజ్ఞానానికీ, అతి ధారణకూ నికషంగా ఉండే విషయాలు అనుసంధించారు. ప్రథమ రూపంలో అష్టసంఖ్యా విషయాలు ఈ క్రిందివిధంగా ఉండేవి. 1 చతురంగము 2 పుష్పగణనము 3 దత్తపది 4 నిషేధాక్షరి 5 పురాణవ్యాఖ్యానము 6 సమస్యాపూరణము 7 అధిక ప్రసంగము 8 వర్ణన.

అవధాన విషయాలు

పై క్రమంలో 1,2,7 సాహిత్య పరమైన విషయాలు కావు. కావని తెలిసి కూడా ఇందులో చేర్చారు. దానికి ప్రబల కారణం ఉంది. చదరంగం: రాజనీతికి సంబంధించినది. అదీకాక అరవై నాలుగు గళ్ళల్లో దృష్టి ఉండాలి. ఎదిరి ఎత్తు గ్రహించే సూక్ష్మ బుద్ధి ఉండాలి. మనసు చంచలం కాకుండా ఉండాలి పుష్పగణనం: గణితశాస్త్రానికి సంకేతం. జీవితములో లెక్కలకు ప్రాముఖ్యం ఉన్నది. కనీసం ఇచ్చిపుచ్చుకునే సందర్భము లేకుండా మానవుడు జీవించలేడు. ప్రమత్తత ఉంటే నష్టపడక తప్పదు. అధిక ప్రసంగం: సంఘములో వ్యవహరించే దెట్లాగో నేర్పుతుంది. సంఘజీవికి మితభాషిత్వం అవసరం అమితభాషణం అపాయకరం. అధిక శబ్దం అదే తెల్పుతుంది ఆకాలంలో కళాపోషకులు రాజులు మహారాజులు కావటంచేత, వారికి ప్రీతికరమైన చతురంగం గణనం, ప్రసంగం, ఈలౌకిక భాగంలో అంతర్గతంగా ఇమిడించారు. పోతే మిగిలిన అయిదూ సాహిత్య పరమైనవి. ధారణకూ, పాండిత్యానికీ, సమయస్ఫూర్తికీ, పరిశ్రమకూ, సంబంధించినవి. కాగా, లౌకికాలౌకికముల సమన్వయంగా, మూడుగంటల కాలంలో ప్రేక్షకుల హృదయభృంగాలనాకర్షించే అష్టదళపద్మంగా తీర్చిదిద్దారు క్రమంగా ఈ అష్టశతావధానాలకు కొన్నిమర్యాదలు, కట్టుబాట్లు కూడా కల్పించారు సత్తాన్ని అవలోకనంచేస్తే అష్టావధానాన్ని గురించి సమగ్రమైన ప్రస్తావనగానీ, కవిగౌరవంగా చెప్పుకోవటం గానీ కనిపించటంలేదు. ఏమయినా ఈ అష్టశతావధానాల పూర్ణ స్వరూపం తెలుగుజాతికి కీర్తిశేషులు శ్రీ తిరుపతి వెంకటేశ్వర కవియుగళంతో సాక్షాత్కరించింది వారి ద్వివిధ ప్రక్రియల్లో ప్రదర్శించిన శక్తిసామర్థ్యములు ఆంధ్రజాతి మరువలేదు చరిత్ర చెరిపివేయలేదు. నేటి అవధాని అనేవానికి మార్గం వేసింది. వారే. వారిని అవధానయుగ ప్రవర్తకులని ఆ విద్యలోనున్న కష్టసుఖాలు వచ్చినవారు మాత్రమే గుర్తించగలరు. మొదటపుట్టి కవుల ప్రతిభలో భాగంఅయి అధిక గౌరవం పొందిన శతావధానాన్నీ అప్రస్తుతంగా ఉండి ఆధారాలులేకుండా వ్యవహార మాత్రంగాఉన్న అష్టావధానాన్నీ త్రాసులోతూచి జ్యేష్ఠునికంటె కనిష్ఠుడే శ్రేష్ఠుడని నిరూపించిన యశస్సుకూడా ఆ జంటదే. ఒక మహాసభలో అన్నారు కూడా

> "శతఘంటక విద్యమ్ము చెప్పబూనుటయన్న
> నల్లేరుపై బండినడక మాకు.
> అష్టావధాన కష్టావలంబన మన్న
> సంచికొండయ చెండనమ్ము మాకు" అని

ఈ యవధానద్వయము మదిరాసు మొదలు మారుమూల పల్లెవరకు ప్రవర్తించినదంటే సాహిత్యంలో ప్రవేశించినవాడల్లా అవధానికావలెనని ఉవ్విళ్ళూరినాడంటే ఆ మహామూర్తుల అప్రతిహతకామేశ్వరీ దత్తకవితా మేధాసంపత్తియే కదా కారణం

శతావధానంలో ముఖ్యంగా ధారా, సమయస్ఫూర్తులు కావాలి. ధారణకు చాలా వ్యవధానం ఉంటుంది. అంటే రెండు మూడు దినములు పడుతుంది కాబట్టి పదిదాటిన ఏ సంఖ్యయైనా శతంగా పరిగణించటం జరుగుతూ వచ్చింది. నిక్కచ్చిగా నూరు

"అష్టావధాన కష్టావలంబనం"

సంఖ్యయైనప్పటికీ మొదటిరోజు ఒకపాదం మాత్రమే పూర్తి అవుతుంది. ఆ నూరుపాదాలు పద్యరూపంగా ధారణ చేస్తే ఇరవై అయిదు పద్యాలవుతవి. ఆ తర్వాత ధారణ సుగమం అవుతుంది. అందుకే సత్యవచనులైన శ్రీ తిరుపతికవులు అష్టావధానానికి కష్టావలంబనము అనే విశేషణాన్ని వాడారు అష్టావధానానికున్న విధినిషేధాలూ, నియమనిబంధనలూ శతావధానానికి లేవు. ఇక అష్టావధాన విషయం పరికిస్తే, మూడుగంటల్లో, ఎనిమిది భిన్న విషయాలు, పృచ్ఛకులు నిర్ణయించిన మార్గాల్లో పూర్తి చేసి ధారణ చేయడం ఎంతకష్టమో చూచి గ్రహించవలసిందే. కాని చెప్పటం సాధ్యంకాదు. ఈ రెండు ప్రక్రియలూ శారదా నేత్రద్వయంగా భావించవచ్చు. ఆ రెండు నేత్రాలూ శ్రీ తిరుపతి వెంకటేశ్వర కవులనవచ్చు. మహాసభా మధ్యంలో నిల్చి

"గములై పండితులెల్ల వహ్వాయనంగా, సత్కవుల్ మెచ్చ దు
ర్గమదుర్గా కరుణాకటాక్ష విసరప్రాప్తాశుధాటీ విశే
షమెలర్పంగ శతావధాన కవితాసామ్రాజ్య పట్టాభిషే
కము వొంగను మాకు దక్కగలదే. గద్వాల భూపాలకా!"

అని ఢంకా మోగించి చెప్పగలిగిన కీర్తి ప్రతిష్ఠలు వారికే దక్కినై. వీరు గద్వాల సంస్థాన ప్రవేశంలో ప్రథమ పరీక్ష ఎంత దుష్కరమైందో చూడండి ఇది త్రిపాద సమస్య. ఓ పాదం ఇచ్చి మూడు పాదాలు పూరించమంటేనే తల తిరుగుతుంది ఇక మూడు పాదాలూ ముక్క చెక్కలుగా ఇచ్చి సమన్వయం నాల్గవ పాదంలో సాధించమంటే సాధ్యమా? ఐనా వారు సాధించారు.

ఇచ్చిన త్రిపాద సమస్య

"రామాయ రామభద్రాయ, తపస్స్వాధ్యాయనిరతం, వేణీ సంహార నాటకం."

పూరించిన విధం

"తపస్స్వాధ్యాయ నిరతం, గురుం సత్వా కరోత్కవిః,
రామాయ రామభద్రాయ వేణీ సంహార నాటకం"

మరియొక సందర్భంలో ఇచ్చిన

సమస్య: జనయామాస నపుంసకస్తనూజం.

దీనిఅర్థం. 'నపుంసకుడు పుత్రుని కన్నాడు' అని

పూరణం: భూషణ ముత్తమాంగ భాస్వత్
శశిఖండంచ దిగంబరం శ్వవాహం
యువతీ యుగ సంగమాత్ ప్రభూతో
జనయామాస నపుంసక స్తనూజం.

ఇక్కడ నపుంసక శబ్దానికి ఈశ్వరుడనే అర్థం కల్పించి గంగాపార్వతీ సంగమంతో పుత్రునికన్నాడని అసాధ్యాన్ని సాధ్యం చేశారు శివ పార్వతులు కలిసిన మూర్తి అర్ధనారీశ్వరుడు. అందు వల్ల కేవలం పురుషుడూ కాదు. కేవలం స్త్రీ కూడా కాదు. కాబట్టి నపుంసకః అంటే అర్ధనారీశ్వరుడని కవి తన ప్రతిభావిశేషంతో ధ్వనించాడు.

వీరి అవధానసార గ్రంథంలో చాలావరకు సమస్యలే లిఖించారు కాని తనక్కాన వాటిని వివరించలేదు. అందుకని వారి శిష్య పరం పరలో ప్రజ్ఞావంతులైన వారి రచనలు ఉదాహరిస్తాను. ఒకసభలో అష్టావధానాన్ని పద్యంలో చెప్పమంటే ఒకరు ఈ విధంగా చెప్పారు.

"ఒకట నాశుకవిత్వ మొప్పుచు గణయతి
ప్రాసలధారను భంగపెట్టు,

ఒకట ఘంటనాదమూసిరాడగనీక
కర్ణరంధ్రంబుల కలచుచుండు,

ఒకట దత్త పదంబు దికమక పెట్టుచు
మాటికిం దలంపును మార్చ జూచు

ఒకట వ్యస్తాక్షరి ప్రకటించి తనశక్తి
దృష్టిని పరము వేధింపుచుండు

ఒక్కట సమస్య బుద్ధినే యూపివేయు,
ఒకట నప్రస్తుతంబు వేరొక్కచో ని
షిద్ధ మెదురౌచు నవధాని శిరముదన్ను.
ఒకట వర్ణన ముండనే యున్నదింక,
నన్నియుంగూడి ధారణ నపహరించుం,
దాల్మి వినరయ్య! యష్టావధాన గాధం
దాల్మి గనరయ్య యష్టావధాని బాధ.

వీరి యవధాన విశేషాలు కొన్ని వివరిస్తాను.

సమస్య: విధవా! నీమగండు నిండు వేకటి గదవే.

అర్థం: "మగడు చచ్చినదానా! నీమగడు నిండుకడుపుతో నున్నాడు." అని. పృచ్ఛకుని కల్పన అసాధ్యం, అనిదం పూర్వం. అయినా,

పూరణం: అధమాధమ పద్ధతినీ
విధమునను గొట్టితిట్టి వెడల నడపంగా,
విధవల కంటెను యిక్కలి
విధవా! నీమగడు? నిండు వేకటిగదవే.

దత్తపది: నాలుగు పాదములకు నాలుగు పదములు సమానంగా ఉన్నవి ఇచ్చి విషయం చెబుతారు. పద్యం కూడా నిర్ణయించ వచ్చు.

"మాకుడు, దోకుడు, పీకుడు, చీకుడు," ఇవి ఇచ్చిన పదములు. విషయం రామాయణార్థం.

పూరణం: మాకుడు వీధి యందు చను
మంత్రము లేశము రాద యింతయే
దోకుడువంగ నేర్చెదము
తోయధి దాటెడి శక్తి లేదు, పం
పీకుడు, తోక మూకి యిట
నెంతగ నుండిననేమి? స్వామి! చీ
చీ, కుడువంగ బెద్దలెటు
సేతురు పావని కాక కార్యమున్.

నాయకుడైన అంగదునితో కపులకు ప్రతినిధిగా జాంబవంతుడు వారిధి ఎవరు దాటుతారన్న సందర్భంలో చెప్పినట్లు కథ కల్పించబడింది. పంపు + ఈకుడు — ఆజ్ఞ ఈయవలదు. చీకుడు = చీ - అనిష్టానికి సూచన. కుడు—తదుపరి వ్యాక్యానికి సంధానం.

ఇంకొకటి: " వేటపాలెము, పందిళ్ళపల్లె, కుందేరు, రావూరు ఇందలి మూడు ఊరి పేర్లు. ఒకటి వాగు పేరు.

విషయం వ్యవహారార్థం వదలి అన్యార్థ ప్రధానంగా నాలుగు
పాదాలలో నాలుగు మాటలుంచి మార్పు చూపించాలి.

పూరణం: ప్రభువు సలుపం దలంచి వేట, పాలెమునకుం
బంప వెంటనే వందిళ్ళ పల్లె పిలిపి
తృప్తి పతికి గలుగుటకుం, దేహనెక్క
యుబ్బుదెందాన సుబ్బరా పూరు వెడలె

వర్ణనం లక్ష్మీగౌరీ సంవాద రూపమైన శివకేశవుల యాశీ
ర్వచనం. చంప మాలా వృత్తం.

పూరణం ఉరమున నెక్కనాకగునెయో సిరిమా! యన,
నర్ధ దేహమున్
దిరముగ నాక్రమించుకొనం జేలిక
యౌనటెయోసి పార్వతీ!
తిరిగెద వెల్ల కొండలకు దిండికిలేవి
విధానంబు జలా!
సరిగత లేదె చండి! యన,
సతతమందిన భర్తలోముతన్.

నిషేధాక్షరి: హనుమత్స్తుతి నాల్గు పాదములు నిషేధం
రారా! మీరీ! నీ
సా స్ఫుట వజ్రకాయ సముపేక్ష శక్తిన్.
ఈ నేడీవ కర్తు
జేరన్ రారా! స్థిరాజ శ్రీశపదరతా!

ఆంధ్ర గీర్వాణభాషల్లో, అష్టశతావధాన ప్రక్రియల్లో సవ్యసాచులై, ఆంధ్రులకు తమ యశః కర్పూర పేటిక తెఱచి అవధానపరిమళాన్ని పారంపర్యంగా పంచిపెట్టినకీర్తి శేషులు
శ్రీ తిరుపతి వేంకటకవులు

ఈ సంచికలోని రచయితలు

శ్రీ పి. వి. నరసింహారావు, ముఖ్యమంత్రి
శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, మారుతీనగర్, విజయవాడ
శ్రీ చలసాని సుబ్బారావు, హిందూకాలేజి, మచిలీపట్టణం
శ్రీ మాదల వీరభద్రరావు, సబ్ఎడిటర్, ఆంధ్రప్రభ, బెంగుళూరు
శ్రీ వై. కె. రామబ్రహ్మం, ఎడ్యుకేషన్ ఆఫీసర్, మారిషస్
శ్రీ కర్లపాలెం కుటుంబశాస్త్రి, రామచంద్రపురం, హైదరాబాదు
శ్రీ కూరెళ్ళ రామనరసింగరావు, కృష్ణనగరం, విశాఖపట్టణం
శ్రీ కంచి వాసుదేవరావు, సబ్ఎడిటర్, కృష్ణాపత్రిక, తెనాలి
శ్రీ టి. ప్రకాశరావు, డి. పి. ఆర్. ఒ. శ్రీకాకుళం
శ్రీ ఎఱ్ఱమిల్లి చలపతిరావు శ్రీవత్సన్. చౌడువాడ, విశాఖపట్టణం జిల్లా
శ్రీ వి. ఎల్. సుందరరావు, బాపట్ల
శ్రీమతి కె. రామలక్ష్మి, మద్రాసు
శ్రీ పి. రాజగోపాలనాయుడు, ఎం. ఎల్. సి. చిత్తూరు
శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి, హైదరాబాదు
శ్రీమతి జొన్నవాడ రాఘవమ్మ, మహబూబ్‌నగర్
శ్రీ దివాకర్ల వేంకటావధాని, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు
శ్రీ గొల్లపూడి మారుతీరావు, ఆకాశవాణి, సంబల్‌పూర్, ఒరిస్సా
శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, హైదరాబాదు
శ్రీ జె. వీరాస్వామి, న్యాయశాఖ కార్యదర్శి, హైదరాబాదు
శ్రీ పువ్వుల చలపతిరావు, రాయవరం, సింగరేణికాలరీస్
శ్రీ పుల్లాభట్ల వెంకటేశ్వర్లు, ఖమ్మం ఉన్నతపాఠశాల, ఖమ్మం
శ్రీ "మహేశ్", ఎల్. ఐ.సి. హైదరాబాదు
శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ, సాహిత్య అకాడమీ ప్రాంతీయ కార్యాలయం, మద్రాసు
శ్రీ దమ్మాలపాటి శేషగిరిశర్మ, నర్సారావుపేట
శ్రీ హస్సొద్దీన్ అహ్మద్, జాయింట్ కార్యదర్శి, రెవిన్యూబోర్డు, హైదరాబాదు
శ్రీ తిరుమల రామచంద్ర, ఆదర్శనగర్, హైదరాబాదు
శ్రీ కోటవీరాంజనేయశర్మ, అష్టావధాని, హైదరాబాదు.

మహాభారతము

తెప్పగంతుల లక్ష్మణశాస్త్రి

59

వ్యా:— ధర్మజ్ఞుల ఉపదేశమును పాలించుచు స్వధర్మాచరణము చేయువారికి ధర్మ సాంకర్యము కలుగదు. బుద్ధిమంతుడు లోకములో ధర్మమే ఆనందమని దానినాశ్రయించి జీవితమును నిర్వహించుచు తద్ద్వారా ప్రాప్తించిన ధనమునే యనుభవించును. అట్టివాని మనస్సు శాంతముగానుండి మిత్రులతోను బంధువులతోను సుఖమనుభవించి పుణ్యలోకమును గూడ పొందగలడు. అట్టిధర్మపరుడు శబ్ద స్పర్శాదులగు నింద్రియ విషయములను సుఖముగా ననుభవించుచు నీ లోకమునందు ప్రభుత్వమును గూడా సంపాదించ గలడు. ధర్మముద్వారా కలిగిన సుఖమువలన గూడ సంతుష్టులు కానట్టి జ్ఞానులు సమ్యగ్దృష్టిచే వైరాగ్యము గలవారై రాగ—ద్వేషాదులను విడిచి చివరకు శాశ్వతమోక్షము ననుభవింతురు. దానికి మూలము మనోనిగ్రహము, బహిరింద్రియ నిగ్రహము. తలచిన వస్తువులన్నియు మానవుడు తపస్సుద్వారా సంపాదించ గలడు. బ్రాహ్మణోత్తమా! మానవుడు శమ-దమ-సత్యాదులచేతనే బ్రహ్మ పదమును పొందును. దానికి మించి వేరొకటి లేదు.

కౌశి:— ఇంద్రియములెవ్వి ? వానిని నిగ్రహించు నుపాయములేవి ? నిగ్రహమువలన కలుగు ఫలమేమి ? అది యెట్లులభించును? ఈ తాత్త్విక విషయముల గూర్చి చెప్పుము.

విషయోపభోగము వలన హాని

వ్యా:— బ్రాహ్మణోత్తమా! మనసు మొదట ఒక వస్తువును తెలిసికొనుటకు ఇంద్రియములద్వారా విషయములందు ప్రసరించును తరువాత వస్తువునందు రాగము—ద్వేషము కలుగును. దానిని సంపాదించుటకు ప్రయత్నించును. దానినిపొంది శబ్దరూపాదులను అనుభవించుటకుగాను వాటిని సేవించును. వాటియందు లోభము—మోహముకలుగును. ఇవియన్నియు కలిగిన తరువాత ధర్మమునందు వానిబుద్ధి ప్రసరించదు. కాని కపటముగా మాత్రము ధర్మాచరణమును అభినయించును. అట్లు నలుగురు చూచుటకు ఆచరించిన ధర్మమును సాకుగా పెట్టుకొని దానికిగాను ధనము నారించును. ఆ ధనమునందే బుద్ధిని రమింప జేయుచు పాపము లాచరించును మిత్రులు పండితులు బోధించినప్పుడు వారికి అశాస్త్రీయమగు నుత్తరమును, అది శాస్త్రోక్తమని చెప్పును, ఇచ్చును రాగాదిదోషముల వలన నేర్పడిన యతని యధర్మము, 'పాపమును తలచుట చెప్పుట—చేయుట,' అని మూడు విధములుగా నుండును. అధర్మప్రవృత్తిగల యతని పూర్వపు సద్గుణములన్నియు నశించును. తనవంటి దుష్టస్వభావము గలవారితోనే స్నేహము చేయుచు దానివలన దుఃఖమును పొందును. ఆ దుఃఖము అతనిని పరలోకములో గూడ బాధించును. పాపాత్ముడనగా నిట్టివాడు. ఇక ధర్మాత్ములను గూర్చి వినుము: ఎవడు ఈ దోషములనన్నిటిని పూర్వమే తన ప్రజ్ఞా బలముచేత సుఖమేది? దుఃఖమేది? అని తెలిసికొని కుశలుడై పెద్దలసేవ చేయుచు నుండునో అట్టివాని బుద్ధి ధర్మమునందే ప్రవర్తిల్లును.

కౌశి:— సత్పురుషుడా! ధర్మము గూర్చి నీవు అతిమధురముగా నుపన్యసించితివి. నీవంటి ధర్మజ్ఞులు ఎవరును లేరనుకొందును నీవు దివ్యప్రభావ సంపన్నుడవగు మహర్షివని తలచెదను

బ్రాహ్మీవిద్య

వ్యా:— బుద్ధిమంతులు తొలుత బ్రాహ్మణులకు, పితృదేవతలకు ప్రీతి కలిగించవలెనని చెప్పుదురు. కనుక బ్రాహ్మణులకు నమస్కరించి 'బ్రాహ్మీ' విద్యను ఉపదేశించెదను వినుము పంచభూతాత్మకమగు ఈ చరాచర ప్రపంచ మంతయు బ్రహ్మ స్వరూపమే యగును. బ్రహ్మముకన్న ఉత్కృష్టమగు వస్తువు మరియొకటి లేదు 'పృథివీ-జల-వాయు-అగ్ని-ఆకాశ' ములనబడు పంచమహా భూతములు, వాని గుణములు వరుసగా, 'గంధ-రస-స్పర్శ-రూప-శబ్ద'ములు

ఉన్నవి. ఈ గుణములకు గూడ ననేక గుణ భేదము లున్నవి ఎట్లనగా, అగ్ని–జలము–పృధివి, ఈ మూడింటికి నితర భూతముల గుణములు సంక్రమించును అగ్నిలో–'శబ్ద–స్పర్శ–రూప'ములు; జలములో శబ్ద స్పర్శ రూప–రసములు; పృధివిలో 'శబ్ద–స్పర్శ–రూప–రస–గంధ' ములు గోచరించును. ఈ యైదు భూతములకన్నను వేరైన 'మనస్సు' అను నారవ తత్త్వమున్నది, ఏడవ తత్త్వము 'బుద్ధి'. ఎనిమిదవది 'అహంకార' మనబడును. ఇవిగాక 'కన్ను ముక్కు–చెవి–నాలుక–చర్మము' అను నైదు జ్ఞానేంద్రియములున్నవి ఇవిగాక, 'ప్రాణము–సత్త్వము–రజస్సు–తపస్సు' అనునవియున్నవి. ఈ పదియేడింటి సముదాయమునకు 'అవ్యక్తము' అని పేరు. ఇవిగాక వ్యక్తావ్యక్త స్వరూపములో ఉండి బుద్ధియను గుహలో దాగియున్న 'యైదు జ్ఞానేంద్రియములు, మనస్సు బుద్ధి' అను నీ యేడింటిని పై వానితో కలిపినచో వెరసి యిరువదినాల్గు తత్త్వములగును ఈ తత్త్వముల సముదాయము వ్యక్తావ్యక్త స్వరూపము గలదై యుండును. ఇవన్నియు పరబ్రహ్మస్వరూపమే. బ్రాహ్మణోత్తమా! ఈ విషయములన్నియు నీకు చెప్పితిని ఇంకను నేమి వినదలచుచున్నావో అడుగుము.

కౌశి:– ధర్మాత్మా! పంచమహాభూతములలో నొక్కొక్కదానికి ప్రత్యేకముగా నున్న గుణములను వర్ణించి నాకు చెప్పుము.

పంచభూతముల స్వరూపము

వ్యా – 'పృధివి–జల–అగ్ని వాయు–ఆకాశము' లనెడు పంచమహాభూతములలో క్రమముగా మొదటివి తరవాతి తత్వముల గుణములతో కలిసియుండును. అనగా, భూమిలో 'గంధ–రస–రూప–స్పర్శ–శబ్దము' లనెడు నైదు గుణము లుండును ఇట్లే జలమునందు నాలుగు, అగ్నియందు మూడు, వాయువునందు రెండు ఆకాశమునందు నొకటి వరుసగా గుణములుండును అన్నిటికన్నను గుణవత్తరమైనది భూమి. వెరసి యీ గుణములన్నియు పదునైదు. ఇవి పంచభూతములందు నున్నవి. వీనియందే లోకము ప్రతిష్ఠితమైయున్నది. ఈ యైదును నొకదానిని విడిచి మరియొకటి యుండజాలదు. ఒండొంటిని కలిసికొని ప్రకాశించుచుండును. ఇవి విషమ భావమును చెందినప్పుడు జీవుడు కాలముయొక్క ప్రేరణచేత తన సంకల్పానుసారముగా దేహాంతరమును పొందును దానినే మరణమందురు. భూతములు మృత్యుకాలములో విషమములుగాను, జననకాలమునందు సమములుగా నుండును. శరీరములలో కనపడు భిన్నభిన్న రక్త–ధాతువులు పంచభూతముల పరిణామమే యగును. ఇంద్రియ గోచరములగు వస్తువులు 'వ్యక్తము' లనియు, కేవలము ఊహచేత తెలియదగునవి అవ్యక్తము లనియు చెప్పబడినది పంచేంద్రియములను వశములో నుంచుకొనుటయే 'తపస్సు' అనబడును. అట్టి తపస్సు చేయువాడు 'తాను సర్వలోకములలో వ్యాప్తుడుగాను. సర్వలోకములు తనలో వ్యాప్తములుగాను భావించును. ఈ విధముగా నిర్గుణ బ్రహ్మ సాక్షాత్కారము గలవాడు చరాచర భూతములన్నిటిని ఆత్మ స్వరూపములుగానే భావించును. అట్లు బ్రహ్మస్వరూపుడగు జ్ఞానికి ఎప్పుడుగూడ అశుభకర్మల సంపర్కము ఉండదు. అట్టి మహాపురుషుడు జ్ఞాన మార్గములోనే సర్వదా సంచరించుచుండును అట్టి ముక్తజీవుడే, 'ఆద్యంతరహితుడు, స్వయంభువు, అవికారుడు, అతుల్యుడు, నిరాకారుడు' నని వేదములలో చెప్పబడినది. బ్రాహ్మణా! నీవడిగిన విషయములన్నియు తపస్సుద్వారా సిద్ధించునవియే యగును ఆ తపస్సు ఇంద్రియ నిగ్రహము లేకుండ సాధ్యముకాదు. ఇంద్రియములే స్వర్గ–నరక ప్రాప్తి హేతువులు. అవి నిగ్రహింపబడినచో స్వర్గము లభించును స్వేచ్ఛగా విడువబడినచో నవి నరకమును కలిగించును పరిపూర్ణమగు యోగానుష్ఠానమనగా పంచేంద్రియములను మనస్సును వశమునందు ఉంచుకొనుటయేయగును ఇంద్రియ నిగ్రహమే తపస్సునకు మూలము; ఇంద్రియ సంసర్గముచేతనే దుర్గుణ–దురాచారాది దోషములు ప్రాప్తించును. ఇంద్రియ నిగ్రహము వలన సిద్ధి కలుగును పాపము కలుగదు. పాపమువలన గలుగు నరకములు కలుగవనుమాట చెప్ప నక్కరయేలేదు. ఈ శరీరము రథము, బుద్ధి సారధి, ఇంద్రియములు అశ్వములని చెప్పబడినవి. మంచి రథికుడు జాగ్రత్తతో నశ్వములను వశపరచుకొని నడపుచు మంచి మార్గమునుబట్టి పోవునట్లే ధీరుడగు తపస్విగూడ నింద్రియములను వశపరచుకొని సుఖముగా జీవనయాత్ర సాగించును. అట్టి అశ్వముల పగ్గములను గట్టిగా పట్టుకొనువాడే మంచి సారధియగును, దానికి ధైర్యముతో ప్రయత్నము చేయవలెను అప్పుడు తప్పక వాటిపైన విజయము సాధించును. ఇంద్రియములను వాటి ఇష్టప్రకారము విడిచి మనస్సును గూడ వాటిలో లగ్నముచేసినచో, జలములోపోవు నావను వాయువు ఈడ్చుకొని పోవునట్లే ఇంద్రియములు గూడ అట్టివానిని తమవైపునకు ఈడ్చుకొని పోవును కనుక వైరాగ్య వంతులు ఇంద్రియములను నిగ్రహించి ధ్యానానందమును అనుభవించెదరు.

కౌశి:– సత్పురుషుడా! 'సత్వ–రజస్–తమస్' అను నీమూడు గుణముల స్వరూపమును గూర్చి కూడ తెల్పుము.

గుణత్రయ స్వరూపము

వ్యా:– బ్రాహ్మణోత్తమా! తమోగుణము మోహము గలిగించునది. రజోగుణము కర్మలయందు ప్రవర్తింపజేయు స్వభావము గలది. మూడింటిలో సత్వగుణమొక్కటే ప్రకాశ స్వరూపము గలది. కనుక అది శ్రేష్ఠమైనది. అజ్ఞానము–మోహము–నిద్ర–ఇంద్రియములు వశములోలేకుండుట–అవివేకము–క్రోధము–సోమరితనము' ఈ గుణములు గలవాడు

తమోగుణ దూషితుడని తెలియవలెను. 'ప్రవృత్తి మార్గపు మాటలనే మాట్లాడుట–సలహానిచ్చుటలో నేర్పు–ఇతరుల గుణములందు దోషారోపణము చేయకుండుట–ఎల్లప్పుడు ఏదోపని చేయవలెనను నిచ్ఛ–కారిన్యము–అభిమానము' ఈ గుణముల గలవాడు రజోగుణయుక్తుడని గ్రహించవలెను. 'అధిక ప్రకాశమనగా జ్ఞానము – ధైర్యము – నవీన కార్యములు చేయుటయందు ఉత్సుకత లేకుండుట– అక్రోధము – బుద్ధిశాలితనము – ఇంద్రియ జయము' ఈ గుణములు గలవాడు సత్వగుణ భూషితుడు అనగా సాత్వికుడని చెప్పబడును. తెలియవలసిన బ్రహ్మతత్త్వమును తెలిసికొనిన తర్వాత సాత్వికుడు లౌకిక విషయములను అసహ్య భావముతో చూచును అతనియందు వైరాగ్యము ప్రవర్తిల్లును. మృదుస్వభావము గలిగి, అహంకారము నశించి, ఋజువర్తనము వానియందు పెరుగును తరువాత అతని యందు 'సుఖ–దుఃఖ; శీత–ఉష్ణ' ఇత్యాది ద్వంద్వములు శమించును అతనికి సంశయమే కలుగదు. శూద్ర యోనిలో పుట్టినవానికి ఇటి సత్వగుణ సంపత్తియున్నచో నతనికి వైశ్యత్వము–క్షత్రియత్వము ప్రాప్తించును సరళత్వగుణశోభితుడగువాడు బ్రాహ్మణత్వమును పొందును

కౌశి:– వ్యాధుడా! శరీరమునందుండు నగ్నిస్వరూపమగు ప్రాణము భూమియొక్క ధాతువును అవలంబించి యెట్లు ఉండ గలుగును? నాడీల మార్గములలో ప్రాణవాయువు ఏ విధముగా చలించుచుండును?

ప్రాణవాయుస్థితి–బ్రహ్మసాక్షాత్కారోపాయము

వ్యా:– కౌశికా! అగ్నిస్వరూపమగు 'ఉదాన' వాయువు మస్తకమును ఆశ్రయించి యుండును అది శరీరమును సురక్షితముగా నుంచును ముఖ్యమగు ప్రాణవాయువు శిరస్సు ఉదాన వాయువు ఈ రెంటియందుండి సమస్త శరీరమునందు జీవనమును సంచరింపజేయుచుండును భూత–భవిష్యత్తు–వర్తమానములన్నియు ప్రాణము నాశ్రయించియుండును అన్నిభూతములలోను ప్రాణమే శ్రేష్ఠమైనది కనుక పర బ్రహ్మమునుండి ఉత్పన్నమగు ప్రాణమును మనమందరము ఉపాసించుచుండెదము ఈ ప్రాణమే జీవుడు అతడే సమస్త ప్రాణులకు ఆత్మయగును. అతడే సనాతన పురుషుడు ఆ జీవుడే మహత్తత్త్వము, బుద్ధి, అహంకారము, పృథివ్యాది పంచమహాభూతముల కార్యస్వరూపములగు నింద్రియములస్వరూపుడు ఇంద్రియముల గుణములగు శబ్ద స్పర్శాది స్వరూపుడుగూడ నతడే ఎందుకనగా, ఈశరీరములో నన్నియు ప్రాణమును నాశ్రయించియుండును. భవిష్యత్తులో పొందబోవు శరీరమునందు సంచరించుట గూడ ప్రాణాశ్రితమే యగును ఈకారణముచేత ప్రాణము స్తుతింపబడినది ప్రాణమే 'జాగ్రత్–స్వప్న–సుషుప్తి' అవస్థలలో జాగరూకమైయుండి ఆ యా యవస్థలందలి కార్యములను చేయించుచుండును గనుక ప్రాణము నిరోధింపబడుటనే మరణమందురు. అది 'భూతాత్మ' గనుక ఒక శరీరము విడిచి వేరొక శరీరమునందు ప్రవేశించును.

సర్వజగత్తునందు ప్రాణము యొక్క స్థితి యిట్టిదే, దాని వలననే సమస్త పాలనము జరుగును. ఆ ప్రాణవాయువే 'సమాన' వాయుస్వరూపమును పొందినప్పుడు వేర్వేరు గతులను ఆశ్రయించును. సమాన వాయురూపముతో జఠరాగ్నిని ఆశ్రయించియున్న ప్రాణవాయువు మూత్రాశయములోను, గుదస్థానమందును చేరియున్నప్పుడు అది మలమూత్రముల భారమును వహించుచున్నందు చేత 'అపాన' వాయువు అను పేరుతో సంచరించుచుండును. ఆప్రాణమే పనిచేయుటకు ప్రయత్నించుట, గమనాది కర్మములు చేయుట, భారమును మోయుట ఈ మూడు విషయములలో ప్రవర్తిల్లినపుడు ఉదాన వాయువని బ్రహ్మవేత్తలు చెప్పెదరు ఆ వాయువే శరీరములోని అన్ని సంధుల(కీళ్ళ)లో వ్యాపించుచున్నపుడు 'వ్యాన' మనబడును. జఠరానలము శరీరమునందలి చర్మము మొదలగు ధాతువులలో వ్యాపించియుండును. ఆ జఠరాగ్ని ప్రాణాది వాయువులచేత ప్రేరితమై అన్నము మొదలగు రసములను చర్మము మున్నగు ధాతువులను, పిత్తాదిదోషములను పరిపక్వము చేయుచు సమస్త శరీరమునందును పరుగెత్తుచుండును ప్రాణాదివాయువుల పరస్పర మేళనము వలన గలుగు సంఘర్షణము వలన ప్రకటితమగు తాపమునే జఠరాగ్నియని తెలియవలెను ఆ యగ్నియే జంతువులు తినిన ఆహారమును జీర్ణము చేయుచుండును. 'సమాన–ఉదాన' వాయులనడుమ 'ప్రాణ–అపాన' వాయువులుండును వాటి సంఘర్షణము చేత కలిగనజఠరాగ్ని కారణముగా జీర్ణమగు నాహారము శరీరమునకు బలమునిచ్చును

(ఇందలి తాత్పర్యమేమనగా, హృదయమునందున్న 'ప్రాణ వాయువు నాభియందున్న 'సమాన' వాయువుతో కలియును. గుద స్థానమందున్న 'అపాన' వాయువు కంఠమునందున్న 'ఉదాన' వాయువుతో కలియును. ఇట్టి కలయికలో 'ప్రాణ–అపాన–సమాన' వాయువుకు నాభిస్థానమునందు సంఘర్షణము ఒత్తిడి ఒరపిడి) కలుగుటచేత ఉత్పన్నమగు నగ్నియే 'జఠరాగ్ని' యనబడును. అది అన్నమును జీర్ణముచేసి తద్రసముచే దేహమును పరిపుష్టము చేయును)

ఈ జఠరాగ్ని నాభినుండి గుదస్థానము వరకు వ్యాపించి యుండును. గుదస్థానము నుండియే జంతువుల సర్వప్రాణముల యందు నాడులు (గొట్టములు) ఏర్పడియుండును. ప్రాణవాయువు గుదస్థానము నుండి అగ్నితో కలిసిపోయి గుదస్థానపు చివరకు కొట్టుకొని తిరిగి పైకి లేచుచు జఠరాగ్నినిగూడ తనతో పాటు పైకి లేపును. బొడ్డు క్రింది భాగము (పొత్తికడుపు) నందు 'పక్వాశయము' (జీర్ణమైన యహారము నిలిచి యుండుచోటు) ఉండును నాభికి పై భాగము (కడుపు) 'ఆమాశయము' జీర్ణము కాని వస్తువులుండుచోటు, ఉండును. శరీరమునందలి సమస్త

ప్రాణములు నాభియందే నిలిచియుండును. అదియే వాటికి కేంద్ర స్థానము. నాడులు హృదయమునుండి క్రిందికి మీదికి ప్రక్కలకు శరీరమంతటను వ్యాపించియుండును. అవి పది ప్రాణవాయువులచేత ప్రేరితములై అన్నరసములను శరీరములోని యన్ని భాగములకు చేర్చుచుండును. సమస్త క్లేశములను జయించి, సమదృష్టి, ధైర్యముగలిగి 'సుషుమ్నా' నాడిద్వారా తమ ప్రాణమయమగు నాత్మను మస్తకమునందుగల సహస్రార చక్రమునకు తీసికొని పోయి స్థాపించిన యోగులు మాత్రము మస్తకము నుండి గుదస్థానము వరకు ఉన్న సుషుమ్నామార్గము గుండా పరబ్రహ్మమును పొందెదరు. ఈ విధముగా సర్వ జీవాత్మల శరీరములలో 'ప్రాణ–అపాన' వాయువులు వ్యాపించి యున్నవి. ఈ రెండు వాయువులు జఠరాగ్నితో కలిసియుండు ననుమాట మరవకుము. ప్రాణము ఆత్మలో నుండునని తెలిసికొనుము. ఆ యాత్మ, పదకొండు ఇంద్రియములనెడు వికారములతో కూడుకొని, పదియారు కళలతో సంపన్నమై, శరీరమును ధరించుచు నిత్యమై యుండును. (పదియారు కళలు ఏవనగా, 'ప్రాణ–శ్రద్ధా–ఆకాశ–వాయు–అగ్ని–జల–పృథివీ–ఇంద్రియ–మనస్–అన్న–వీర్య–తపస్–మంత్ర–కర్మ–లోక–నామ' ములు. అట్టి యాత్మ, యోగబలముచేత మనస్సును, బుద్ధిని తన అధీనములో నుంచుకొన్నది. బ్రాహ్మణోత్తమా! ఈ విధముగా ఆత్మను గూర్చి నీవు తెలిసికొనవలెను.

ఆత్మసాక్షాత్కారము

"పళ్ళెరములో నగ్ని ఉంచబడినట్లు కళాసమూహరూప శరీరమునందు ఆత్మ సర్వదా ప్రకాశించుచునుండును. దానిని తెలిసికొనుము. ఆ శరీరమునందు ఆత్మ తామరాకుపైన జలబిందువువలె నిర్లిప్తుడై, సంగరహితుడై యుండును. ఆ యాత్మయే 'క్షేత్రజ్ఞ' నామముగలవాడు. అట్టి క్షేత్రజ్ఞుని తెలిసికొనుము. 'సత్వ (ప్రకాశము)–రజస్ (ప్రవృత్తి)–తమస్ (మోహము)' అను నీ మూడును జీవాత్మయొక్క అంతఃకరణ వికారములు. జీవాత్మ ఆత్మకు గుణస్వరూపుడు. అనగా అధీనుడు. ఆత్మయే 'పరమాత్మ' స్వరూపుడు. అచేతనములగు ఈ శరీరేంద్రియాదులు జీవునకు భోగ్యములు–అనగా అతని సుఖదుఃఖానుభవమునకు సాధనములు. జీవుడు శరీరమునందుచేరి క్రియాశీలుడగును. శరీరేంద్రియాదులచేతగూడ పనులు చేయించును. ఈ జీవాత్మకంటే పరమాత్మ ఉత్కృష్టుడని జ్ఞానులు చెప్పెదరు.


"ఈ విధముగా సర్వభూతములకు ఆత్మ స్వరూపుడగు పరమేశ్వరుడు సర్వజంతువులలోను ప్రకాశమానుడై యున్నాడు. జ్ఞానులు మాత్రమే సూక్ష్మమగు తమ యోగదృష్టితో పరమాత్మను చూడగలరు. మనుష్యుడు తన చిత్తముయొక్క పవిత్రత ద్వారా సమస్త శుభాశుభ కర్మములను, ఫలితమునిచ్చుటలో నసమర్థములనుగా చేయును. ప్రసన్నమగు నంతఃకరణముగలవాడు తనలోనే యుండి అక్షయ సుఖస్వరూపమగు మోక్షమును చూడగొనగలడు. ప్రసన్నమగు చిత్తముయొక్క లక్షణమేమనగా, భోజనాదులచేత తృప్తిచెందిన మనుష్యుడు సుఖముగా నిద్రించునట్లును, వాయురహిత స్థానములందు దీపము నిశ్చలముగా ప్రకాశించునట్లును, చిత్తము అచంచలముగా శాంతితో నిలిచియుండుటయే చిత్తప్రసన్నత యనబడును.

"మనుష్యుడు తక్కువ భుజించి, అంతఃకరణమును పరిశుద్ధముగా నుంచుకొని, రాత్రి మొదటి జాములోను, చివరి జాములోను ప్రతి దినము పరమాత్మ ధ్యానము చేయుచు నుండవలెను. నిరంతరము తన హృదయమునందు పరమాత్మ సాక్షాత్కారము నభ్యసించువాడు జ్వలించు దీపమువలె ప్రకాశించు తన మనోమయ ప్రదీపము ద్వారా, నిరాకారుడగు పరమాత్మ సాక్షాత్కారమును పొంది వెంటనే ముక్తిని పొందును.

"సర్వోపాయములచేత క్రోధ–లోభములను అణచవలెను. ఇదియే మనుష్యుడీలోకమునందు చేయవలసిన పవిత్ర తపస్సు. సంసార సాగరమును తరింపజేయు సేతువుగాను భావించవలెను. తపస్సును క్రోధమునుండి, ధర్మమును మత్సరమునుండి, విద్యను మానావమానములనుండి, తనను తాను ప్రమాదము (పొరపాట్లు)ల నుండి సర్వదా రక్షించుచుండవలెను. దయయే పరమ ధర్మము, క్షమ (ఓర్పు)యే పెద్ద బలము. సత్యమే అన్నిటికన్న నుత్తమమగు వ్రతము. పరమాత్మ తత్త్వజ్ఞానమే సర్వోత్తమమగు జ్ఞానముగా తెలియవలయును. సత్యము పలుకుట సర్వదా శ్రేయస్కరము. సత్యమగు జ్ఞానమే హితము చేకూర్చును. ప్రాణులకు హితమును కూర్చు సత్యమే ఉత్తమ సత్యమనబడును. సమస్త కర్మలు కామరహితములుగానుండి త్యాగమనెడు అగ్నిలో సర్వస్వమును హోమముచేసిన సత్పురుషుడే 'త్యాగి' యనబడును. కనుక సంసారము నుండి వియోగమును సంపాదింపజేయు ఈ 'పరమాత్మయోగ'మును స్వయముగా తెలిసికొని సంపాదించవలెను. అయోగ్యుడగు శిష్యునకీ పరమాత్మయోగమును గురువు ఉపదేశించగూడదు.

"దుర్లభమగు మనుష్యత్వమును పొంది అందరియెడల మిత్రభావముతో మెలగుచు నెవరిని గూడ ద్వేషించగూడదు. ప్రాణిహింస చేయగూడదు. వస్తువులను కూర్చుకొనక, యెట్టి యవస్థలలోను సంతుష్టి చెందుచు, కామమును–లోభమును విడుచుటయే సత్యస్వరూపమగు ఆత్మజ్ఞానము. ఇట్టి త్యాగబుద్ధిచేత శోకరహితుడైన పరమాత్మను నిశ్చలముగా లక్ష్యమునందు ఉంచుకొనవలెను. ఇట్టి ఉత్కృష్ట స్థానమును పొందుటకు మునియై, అనాసక్తుడుగా నున్న వానికే సాధ్యమగును. పరబ్రహ్మముయొక్క శాశ్వతమగు స్థానమును, ప్రాపంచిక గుణములతో సంబంధము గలిగియు నిర్లిప్తుడుగా నుండువాడు, అజ్ఞానము (అవిద్య) ను చీల్చి, అంతరాత్మ ద్వారా మాత్రమే సాధించగలడు. ఆ స్థానము అతిశయ సుఖసంపాదకము. సుఖ–దుఃఖములను త్యజించినవాడు మాత్రమే ఆ పరమ పదమును చేరుకోగలడు. విషయాసక్తి లేనివాడుగూడ ఈ స్థానమును పొందగలడు. బ్రాహ్మణోత్తమా! నేను పెద్దలవలన విన్న సంగతియంతయు నీకు తెలిపితిని. ఇంకను నేమి వినదలచితివి?

[సశేషము]



1



జిల్లా వార్తా చిత్రాలు


1. జూన్ 21వ తేదీన అప్పటి యూనియన్ రైల్వే మంత్రి శ్రీ హనుమంతయ్య, విజయవాడ–మద్రాసు రైలు మార్గం విద్యుద్దీకరణ పథకం పనికి ప్రారంభోత్సవం చేశారు.

2. జూన్ 30వ తేదీన ముఖ్యమంత్రి వరంగల్లులో కొత్తగా నిర్మించిన పోలీసు గృహాలకు ప్రారంభోత్సవం చేశారు.


3. ముఖ్యమంత్రి జూన్ 21వ తేదీన విజయవాడలో ప్రభుత్వ ఆస్పత్రిలో పిల్లల వార్డుకు ప్రారంభోత్సవం చేశారు.


4. బన్స్వాడాలో జూన్ 19వ తేదీన నిజామాబాద్ జిల్లా కలెక్టరు శ్రీ ఎన్. కె. సురయా, భూములు లేనివారికి పట్టాల పంపిణీ చేశారు.

5 నల్లగొండ జిల్లా కలెక్టరు శ్రీ కె ఓబయ్య, తమ్మరబండ పాలెంలో హరిజన కాలనీకి ప్రారంభోత్సవం చేశారు.



2






5



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి శ్రీ వై. బి. చవాన్ జూన్ 23న ఎగ్జిబిషన్ మైదానంలో "నిరుద్యోగ నివారణ" పథకానికి ప్రారంభోత్సవం చేశారు.

నగరంలో వార్తా చిత్రాలు



జూన్ 25వ తేదీన అంబర్ పేటలో గురు హరగోవింద్ సాహిబ్‌జీ జయంత్యుత్సవంలో ముఖ్య మంత్రి ప్రసంగించారు.



కేంద్ర సమాచార, ప్రసారశాఖ ఉపమంత్రి శ్రీ ధర్మవీర సిన్హా జూలై 1 వ తేదీన ముఖ్యమంత్రిని కలుసుకున్నారు.

PUBLIC APPOINTMENT

Applications are invited for the following appointments in the Andhra Pradesh State Higher Judicial Service to be made by direct recruitment. This recruitment would be subject to such directions as may be given by the Supreme Court on the appeal preferred by the State Government against the judgment of the Andhra Pradesh High Court holding the Mulki Rules invalid:—

Name of Post: District & Sessions Judge, Grade II.

No. of Posts: Six.

2. An applicant for the above post should be an Advocate or a Pleader of not less than 7 years standing at the Bar. He must not have completed 45 years of age on the first day of July, 1972 and shall be of sound health and active habits and free from any bodily defect or infirmity which renders him unfit for such appointment.

3. The selected candidate will be appointed on probation for one year on an initial pay of Rs. 1,150 p.m. in the scale of Rs. 1,150—50—1,550—70—1,900.

4. Applications with copies of *testimonials and certificates* addressed to the Chief Secretary to Government of Andhra Pradesh, General Administration (Special) Department, Hyderabad-22 should reach him *not later than* 5-00 *p.m. on the* 1*st September,* 1972 with the covers superscribed "*APPLICATIONS FOR APPOINTMENT AS DISTRICT and SESSIONS JUDGE IN THE STATE HIGHER JUDICIAL SERVICE*".

5. T.A. will not be paid either for appearing for interview or for joining the post.

(Sd.),
Chief Secretary to Government,
Genl. Admn. (Spl.) Dept. Hyd.-22.

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISM, ANDHRA PRADESH HYDERABAD.
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD



